కవులు

ఆచార్యులు-రచనలు,జీవిత చరిత్ర

ఆంధ్ర కవి తరంగిణి-2



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 5010010033136


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

ఆంధ్ర కవి తరంగిణి

రెండవ సంపుటము

శ్రీ చాగంటి శేషయ్య
విరచితము

హిందూ ధర్మ శాస్త్ర గ్రంథ నిలయము
కపిలేశ్వరపురము (తూర్పు గోదావరి జిల్లా)

ఈగ్రంథమునుగూర్చిన కొన్ని అభిప్రాయములు:

SIR C. RAMALINGAREDDY Kt.
M. A. (Cantab), Hon. D. Litt.,
Vice-Chancellor.

WALTAIR,
21-2-47.

I have read with much pleasure and appreciation Chaganty Seshayya's "Andhra Kavi Tarangini". It is a remarkably fine contribution to the History of our literature and our country. He has taken trouble to study the latest archaeological material available and make his treatment of the different Poets as scientifically accurate as possible.

.........Sri Seshayya seems to be fitted both by his knowledge of the subject and his scientific spirit to present the Andhra world with an authoritative "Lives of Andhra Poets."

He does not mix up Puranas with history and legend with truth and that is a rare and refreshing feature.

Dr. M. H. Krishna, M. A., D. Litt. (Lond.) Director of Archaeology, Government of Mysore.

".........I find that it gives us a vast amount of information. I am sure that a copy of your entire work should be in our library......".

The Hindu :

Research into the records of the past brings forth continually new facts on the history of literature and the present book is the first of many volumes which the author proposes to bring out in an attempt to write a new history of telugu poets. According to earlier historians of Telugu literature, the maximum number of Telugu poets worth the name did not exceed three hundred and fifty. But the author includes many more whose names have hitherto lain hidden in the unfathomed caves of time. The author has unearthed considerable interesting material by an intensive study of inscriptions................

శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు (ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రధాన పండితులు) :

"మీ గ్రంథము, మీరు చేసిన కూలంకషపరిశ్రమకు ఫలము. కవి జీవిత కవి చరిత్రకారులు అడుగుపెట్టలేని గహనములలో మీరు రాచబాటలు వైచితిరి."

శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు (ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రధాన పండితులు) :

"......మీ కవితరంగిణి కల్హణుని రాజతరంగిణివలె సారస్వతములో ముఖతిలకంగా ప్రకాశింప కలదు......ఆధారవస్తు వివేచనలో మీ సమగ్ర విజ్ఞానము ప్రమాణీకరణదృష్టియు ద్యోతమగుచున్నది..."

ఆంధ్రపత్రిక "......శేషయ్యగారు నిష్పక్షపాత బుద్ధితో యదార్థ మెంతవరో గ్రహించడానికి అత్యధికంగా శ్రమపడ్డారు. అనుమాన ప్రమాణంతో కూడుకొన్న చరిత్రకు యిదమిద్ధమన్న నిర్ణయాలు మొండిగా చేసి చరిత్రకు అపకారం చేయకుండా చారిత్రక వస్తువులనందించి సూచనమాత్రం తన ఊహను చెప్పి పాఠకులకు నిర్ణయాలకు సదవకాశమిచ్చారు. వీరి ప్రయత్నం ప్రశంసనీయమే."

ఆంధ్రప్రభ : "ఆంధ్రులకు సమగ్రమైన కవులచరిత్ర గ్రంథము లేని లోటు దీనితో తీరినట్లయింది. తక్కిన సంపుటములను కూడ త్వరలో వెలువరించడానికి తగిన ప్రోత్సాహం యివ్వవలసినభారం ఆంధ్రులపై నున్నది."

శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు (ఆంధ్ర విశ్వవిద్యాలయము రిసర్చి పండితులు) :

"......తమ గ్రంథమువలన పూర్వవిమర్శకుల రచనలకు వెదకి చూడవలసిన యావశ్యకత లేకపోయినది. ఆంధ్రకవితరంగిణి యందు తామవలంబించిన పద్ధతి యాధునాతన చరిత్ర రచనాపద్ధతి వంటిది. మీ యత్నము కడు ప్రశంసనీయము.

శ్రీ గంటి జోగిసోమయాజులుగారు, ఆంధ్రవిశ్వవిద్యాలయపండితులు:

"..... చాల మనోహరముగా ననేక విషయముల గూర్చి వ్రాసితిరి. ఇంత గొప్పపని చేయుటకు పూనుకొని వ్యయమును ప్రయాసమును లెక్కింపక సాధించుట మిక్కిలి కొనియాడ తగినది......"

Etc.

విజ్ఞాపనము

కాగితము లభింపకపోవుటచే నీ రెండవసంపుటమును ప్రకటించుటలోఁ గాలవిలంబనమైనది. మూఁడవసంపుటము ముద్రితమగుచున్నది. ఇఁక ముందు కాగితముకఱవుండదని యాశించుచున్నాఁడను. మన దేశపు కాగితముకంటె విదేశ కాగితము ధర రెట్టింపుగానున్నది. మన దేశపు కాగితము లభింపనందున, రెండవ మూఁడవసంపుటములకు ధనవ్యయము రెండింతలైనది. అయినను సరియేయని, భాషాభిమానుల యాదరాభిమానములచే విదేశపు కాగితమునే కొని యీసంపుటమును బ్రకటింపఁగలిగితిని. కేవలభాషాభిమానముచే నాయుద్యమమునకుఁ దోడుపడఁదలంచి ద్రవ్యసాహాయ్యమొనర్చిన యుదారాశయులకుఁ గృతజ్ఞుడనై యున్నాఁడను.

సర్వవిధముల నాయుద్యమమునకుఁ జేయూతనొసంగుచున్న మదరాసు హైకోర్టు అడ్వకేటులగు శ్రీ పప్పు సోమసుందరముగారికిని, శ్రీ పప్పు సూర్యనారాయణగారికిని, శ్రీ బలుసు ప్రభాకరపట్టాభిరామారావుగారికిని నాధన్యవాదములు.

నేనడిగినవెంటనే కొన్నిశాసనముల ప్రతులను వ్రాయించి పంపించిన యుదకమండలమునందలి గవర్నమెంటు ఎపిగ్రాఫిస్టుగారికిఁ గృతజ్ఞుఁడను.

నాప్రయత్నమందలి వ్యయప్రయాసముల నెఱింగి, తమ యాదరాభిమానములను విశేషముగాఁజూప భాషాభిమానులఁ బ్రార్థించుచున్నాఁడను.

పండితులలో భిన్నాభిప్రాయములున్నట్టియు, విశేషచరిత్రాంశములు గలిగినట్టియు కొందఱు మహాకవులచరిత్రముల నొక్కింత

విపులముగా వ్రాయవలసివచ్చుచున్నది. అట్టివారిసంఖ్య స్వల్పము. తక్కినవారి చరిత్రములంతగా విపులముగా నుండవు. ఎట్లయినను, మొదటి సంపుటమునందలి విజ్ఞాపనములోఁ దెలిపినపుటలకంటె గ్రంథ మెక్కువకాదని మనవిచేయుచున్నాఁడను.

చాగంటి శేషయ్య

కపిలేశ్వరపురము,
సర్వజిన్నామసంవత్సర
పుష్యపూర్ణిమ.

విషయసూచిక

శ్రీ రామ చం

ఆంధ్ర కవి తరంగిణి

రెండవ భాగము

9. జయదేవకవి

ఈ కవినిగూర్చినచారిత్రాంశము లేమియుఁ దెలియవు. లక్షణవేత్తలు కొందఱు జయదేవఛందమను ఛందోగ్రంథమునుండి తమ లక్షణగ్రంథములలోఁ గొన్ని యాంధ్రపద్యముల నుదాహరించియుండుటచే నీతని పేరు తెలియవచ్చినది. కవిజనాశ్రయమునం దీతని పేరుదాహరింపఁబడియుండుటచే నీతఁడు పదమూఁడవశతాబ్దికి పూర్వుఁడని యూహింప నగుచున్నది. ఈ క్రిందిపద్యము జయదేవఛందము లోనిదని యానందరంగరాట్ఛందమునందు కస్తూరిరంగకవి యుదాహరించి యున్నాఁడు:

గీ. రహిఁగ లళలకు లడలకు బ్రాసమతము లో
నరుప నవి యభేదప్రాసవిరతు లగును
గళల విలసిల్లు నీసింధునెల యఁగ
జాడ నేసె రాముఁడు సప్తశాఖనాలన.

అప్పకవి యీ జయదేవఛందమును బేర్కొన లేదు.

కవిజనాశ్రయమున

క. జయదేవాదిచ్ఛందో
నయమున సంక్షేపరూపునం జెలువుగ ను
ల్లియ రేచన సుకవిజనా
శ్రయుఁ డీ ఛందంబుఁ జెప్పె జనులకుఁ దెలియన్.

అని చెప్పియుండుటచే నీతఁడు కవిజనాశ్రయకర్తకుఁ బూర్వుఁ డనుటకు సంశయము లేదు. ఈ జయదేవుఁ డెవ్వరో, యెచ్చటి వాఁడో తెలియలేదు. సంస్కృతభాషలోఁ గృతులను రచించిన జయదేవులు మువ్వురున్నారు.

౧. ప్రసన్నరాఘవ మను నాటకమును చంద్రాలోక మను నలంకార శాస్త్రమును సంస్కృతభాషలో రచించిన యాతఁడొక జయదేవుఁడు. ఇతఁడు వంగదేశీయుఁడగు బ్రాహ్మణుఁడు; కౌండిన్య గోత్రుఁడు. సుమిత్రామహాదేవుల తనయుఁడు. ఇతఁడు పదునాఱవ శతాబ్దివాఁ డని శివరామ్మహాదేవపరంగిపాయి బి. ఏ. గారును, అక్కిరాజు ఉమాకాన్తముగారును వ్రాసియున్నారు. క్రీ. శ. ౧౩౦౦ ప్రాంతమువాఁ డని మల్లాది సూర్యనారాయణశాస్త్రిగా రభిప్రాయ పడియుండిరి.

౨. సంస్కృతమున గీతగోవిందమును రచించినదింకొక జయదేవుఁడు. ఇతఁ డుత్కలదేశీయుఁడు; భోజదేవునకును రాధాదేవికిని జనియించినవాఁడు. క్రీ. శ. ౧౦౮౦-౧౧౪౦ సంవత్సరములనాఁటి వాఁడు.

3. రాధామాధవ మనుసంస్కృతకావ్యమును రచించిన జయదేవుఁడు మఱియొకఁడు. ఇతనిని, చింతలపూడియెల్లయకవి తన యాంధ్రరాధామాధవమున నిట్లు నుతించియున్నాఁడు.

క. నతియింతు వాగ్విశేష
స్థితి రాధామాధవంబు చెప్పినవిద్యా
చతురాననుఁ నీలాచల
పతిహితు జయదేవు సుకవి పంచపదగున్.

రాధామాధవకర్తయు గీతగోవిందకర్తయు నొక్కఁడే యని కోరాడ రామకృష్ణయ్యగారును, వీరిద్దరును భిన్నులని, నడకుదుటి వీరరాజుపంతులుగారును, అక్కిరాజు ఉమాకాన్తముగారును వ్రాసియున్నారు.

ఛందోగ్రంథమును వ్రాసిన జయదేవుఁ డీమువ్వురిలో నొక్కఁడో, వేఱొక్కఁడో చెప్పఁజాలము. ఉత్కలవంగదేశీయు

లాంధ్రమున ఛందస్సును వ్రాసిరని తగినయాధారము లుండినఁగాని విశ్వసింపఁజాలము. రాధామాధవకర్త యైనజయదేవుఁ డెప్పటివాఁడో ఎచ్చటివాఁడో తెలియరాదు. ఈతఁడే ఛందోగ్రంథమును రచించినవాఁడని తోఁచుచున్నది. శృంగారమాధవీయమను సంస్కృత కావ్యమును రచించిన జయదేవుఁ డింకొకఁ డుండెనని కొంద ఱనుచున్నారు. శృంగారమాధవీయమే, రాధామాధవ మని కొందఱి యభిప్రాయము.

గంగేశపండితుని తత్త్వచింతామణి యను తర్కశాస్త్రమున కాలోకమును రచించినజయదేవుఁడు పైఁ బేర్కొనబడినవారిలో నొకఁడో, భిన్నుఁడో తెలియదు.

ఎట్లయినను, నాంధ్రమునఁ ఛందస్సును రచియించిన జయదేవుని గూర్చి యింకను దెలిసికొనవలసియున్నది.

10. వాదీంద్రచూడామణి

ఇతఁడు జైనసమయాచార్యుఁడు. కవిజనాశ్రయకర్త యని యనుకొనఁచున్న రేచనకు గురువు. ఇతనినామము వాగీంద్రచూడామణి యని కొంద ఱనుచున్నారు. ఇతఁ డాంధ్రమున నొకలక్షణ గ్రంథమును రచించె నని చెప్పుదురు. ఆ గ్రంథనామమును కవి నామము నొక్కటియే. అప్పకవి యీపేరును దశగ్రంథాదిని ఆంధ్రలక్షణగ్రంథములలోఁ జేర్చియున్నాఁడు. కాని యందలిపద్య ముల నుదాహరించియుండ లేదు. కస్తూరిరంగకవి తన యానందరంగ రాట్ఛందమున "మల్లనపాదాంగచూడామణి" యని యొకలక్షణ గ్రంథమును బేర్కొని యందలిపద్యములను లక్ష్యములుగాఁ జూపి యున్నాఁడు. అదియు నీ వాదీంద్రచూడామణియు నొక్కటిగా దను కొనియెదను. ఈతనినిగూర్చి యింక నేమియుఁ దెలియదు. ఇతనిని, రేచనకాలమువారిలో జేర్చుట సమంజస మని యట్లు చేయు చున్నాఁడను.

కవికర్పటిక యనునొకచిత్రకావ్యమును సంస్కృతభాషలో రచియించిన వాదీంద్రచూడామణి యొకఁడు కలఁడు. ఆతఁడే యీతఁడేమో! అతనినిగూర్చి సంస్కృతవాఙ్మయచరిత్రమునం దిట్లు వ్రాసియున్నారు.

"కవికర్పటిక—అనునొక చిత్రకావ్యము కలదు. దీనికర్త వాదీంద్రకవి. దీని దేశకాలములు తెలియవు కాని, ఇది యర్వాచీనమే. దీని ప్రయోజనము కవి యిట్లు తెలిపియున్నాఁడు.

శ్లో. యత్నాదిమాం కంఠగతాం విధాయ
శ్రుతోపదేశా ద్విదితోపదేశః।
అజ్ఞాతశబ్దార్థవినిశ్చయోఽపి
శ్లోకం కరో త్యేవ సభాసు శీఘ్రమ్.

ఈ గ్రంథములోఁ జూపినపదవాక్యములను వల్లించియున్నచో ఆయా ఛందస్సులలో శ్లోకము చెప్పవచ్చును. ఆ పదవాక్యముల

క్రమము జ్ఞప్తియందుంచుకొనఁజాలును. ఇందుకుఁ జంద్రోదయ వర్ణనకు వల్లించవలసినవి - ఏకాక్షరము లగు పదములు. కర్పూరపూర - డిండీరపిండ - రజతకర - ఇత్యాదులు. వీనికరువాతఁ జేర్పఁదగినట్లు వల్లించవలసిన మూఁడక్షరము లగు పదములు - సంకాశమ్ - సంకాశమ్ - ఇత్యాదులు. ఇపుడు, కర్పూరపూరసంకాశమ్ - అని యనుష్టుప్ఛంద స్సులో నొక పాదము వచ్చినది. ఇట్లే నాలుగు పాదములకుఁ దగిన పదములపట్టిక లిందుఁ గలవు ఈ విధముగా శార్దూల విక్రీడితాది వృత్తములకును గలవు. "శిఖ్యాతో గుణశాలినాం విద్వానయం రాజతే" ఇత్యాదులు.

వాగీంద్రచూడామణికవి, ఛందోగ్రంథమునే కాకుండ ఆది పురాణమును గూడ నాంధ్రమున రచియించెనని, శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు వ్రాసియున్నారు. అప్పకవి వికల్పయతి కుదా హరణముగా నాదిపురాణములోనిదని "ఒకనాఁడింద్రుఁడు సుధర్మయందు" అనుపద్యము నిచ్చియున్నాఁడు. ఆపద్యము నాచనసోముని యుత్తర హరివంశములోనిది. ఈ పద్య మాదిపురాణము లోనిది కాకపోయి నను అప్పకవి యాదిపురాణ మొకటిగలదని యెఱింగియున్నాఁ డనుట నిశ్చయము. కాని యాతఁ డెఱిఁగినయాదిపురాణము వాగీంద్రచూడామణి దగునో కాదో చెప్పుట కవకాశము లేదు. తెనాలిరామకృష్ణకవి ఆదిపురా ణమును రచించె ననియొకప్రతీతి కలదు. ఏ యాదిపురాణమును నిప్పుడు కన్పించుట లేదు. వాగీంద్రచూడామణి యనుఛందో గ్రంథమును నిపుడు కన్పడకపోవుటచే నీకవినిగూర్చి వ్రాయుట కింక నేమియులేదు. ఈ కవినిగూర్చి తెలిసికొనుట కింకను ప్రయత్నము జరుగవలసియున్నది. ఇతనికాలము వేఱువిధమున స్థిరపడువఱకును పంద్రెండవశతాబ్ది ప్రథమార్థమని యనుకొందము.

కస్తూరిరంగకవి యుదాహరించిన పాదాంగచూడామణియు నీ వాదీంద్రచూడామణియు నొకటి కాదనితోఁచినను భావిపరిశోధ కులకొఱకు రంగకవి యుదాహరించిన మొనిమిదిపద్యముల నీ క్రింద నిచ్చుచున్నాఁడను.

చ. పరగ ధరాధిదైవతము పచ్చనికాంతియు శూద్రజాతియా
నరయ బుధుండు తద్గ్రహము హాటకవర్ణమతండు తత్ఫలం
బురుశుభ మెన్నఁగా హరిణయోనియు వృశ్చికరాశి నిర్జరే
శ్వరవరతారదైత్యగణసంగత(మున్) మానుగణంబు శంకరా !

చ. జల మధిదైవమున్ రజితసన్నిభకాంతి కులంబు విప్రుఁడుం
ఫలము ధనంబు తద్గ్రహము భార్గవుఁ డాతనివర్ణ మెన్నఁగాఁ
దెలుపు జలంబు తారకము తెల్లమిగా ధనురాశి యోనియున్
(తారయును దెల్లమిగా ధనురాశి రాశియున్)
బలిముఖ మాగణంబు నృగణంబునున్ యగణాన కీశ్వరా
(బలిముఖయోనియున్ నరగణం బగు నయ్యగణంబు శంకరా)

చ. జ్వలనుఁ డధీశుఁడున్ గులము క్షత్రియమున్ బవడంపుఁగాంతి పెం
పలరు గ్రహంబు భూతనయుఁ డాతఁడు రక్తపువన్నె పావకా
ఖ్యలలితతారదైత్యగణ మయ్యజయోనియు మేషరాశియున్
ఫలము భయప్రదంబు రగణంబునకున్ ద్రిదశేంద్రవందితా !

చ. అనిలుఁ డధీశుఁడున్ గువలయంబులకాంతి కులంబు హీనమున్
జనుగ్రహ మాశనైశ్చరుఁడు చాలఁగ నల్పగువన్నె తౌలయాఁ
దనరఁగ రాశి స్వాతి యగుఁ దారఫలంబు క్షయంబు దానవం
బొనర గణంబు నామహిషయోనియగున్ సగణాన కీశ్వరా !

చ. నెఱయ నభంబు దైవతము నీలపుఁగాంతియు విప్రజాతి గీ
ర్వారుఁడు గ్రహంబుఁ గాంచనపువన్నె మతంబు ఫలంబు చెప్పనై
శ్వరమును వారపుష్యమియు వాలిసకర్కటరాశి మేషమా
నిరవగుయోని దేవగణ మోతగణంబున కిందుశేఖరా !

చ. రవి యధిదైవమున్ బరఁగ రాట్టులమున్ గురువిందకాంతియున్
రవిగ్రహ మెన్నఁగా నతఁడు రక్తపువర్ణము సింహరాశియు
ద్భవ మగు రోగమా ఫలము తారకయుత్తరధేనుయోని మా
నవగణమున్ దలంప జగణంబునకున్ ద్రిదశేంద్రవందితా !

ఉ. చంద్రుఁ డధీశ్వరుం డమృతసారము కాంతియు విట్కులంబు త
చ్చంద్రముఁడే గ్రహంబతనిచాయయుఁ దెల్పు వృషంబురాశి భో
గీంద్రసుయోని దేవగణ మీప్సితసౌఖ్యము తత్ఫలం బిలన్
జంద్రునితార యెన్నఁగను జంద్రధరా భగణాన కెన్నఁగన్ !

చ. గుణముల కెల్ల నాకరము కోరి కృతీంద్రునిడాసి యున్నదు
ర్గుణగణదోషముల్ చెఱచుఁ గోరినవస్తువి నూత్నరత్నభూ
షణముల నిచ్చుఁ గావున లసత్కవిశేఖరు లెంచు సర్వసు
గుణములు గల్గియొప్పు బుధసన్నుతమై నగణంబు శంకరా !

11. రేచన

కవిజనాశ్రయ మనియు, భీమచ్ఛందస్సు, అనియు పిలువఁబడి యొడి లక్షణగ్రంథమును రేచన యనియెడుకవి రచియించె నని గ్రంథాంతపద్యగద్యాదులవలనఁ దెలియవచ్చుచున్నది. కాని యిది వేములవాడభీమకవి కృతమని ప్రతీతి యుండుటచే నావిషయమును గూర్చి భీమకవిచారిత్రమున విపులముగాఁ జర్చించి యీ గ్రంథము వేములవాడభీమకవికృతము కా దని నిర్ణయించియుంటిని. వేములవాడ భీమకవి గాక మఱియొకభీమన దీనిని రచియించియుండవచ్చు నని యూహ కలుగుచున్నది. కాని యాభీమన యెవ్వరో తెలియక పోవుటచేఁ బ్రణీతకవి యైనను, రేచనను గూర్చి వ్రాసినచో భావి పరిశోధకుల కనుకూలముగ నుండునని యీ చరిత్ర వ్రాసితిని. భీమకవిచారిత్రమున నుదాహరించిన పద్యగద్యములనుబట్టి యితఁడు జైనవైశ్యుఁ డనియు, వాదీంద్రచూడామణిశిష్యుఁ డనియు, కవిజనాశ్రయ శ్రావకాభరణాంకబిరుదములను వహించినవాఁ డనియుఁ దెలియుచున్నది. ఇతని నివాసము, నిజామురాష్ట్రము.

శ్రీ చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు కాకతీయాంధ్ర రాజయుగచరిత్రములో "భీమనసోదరుఁడైనగోకర్ణుఁడు వాగీంద్ర చూడామణి యనుజైనసముద్రాచార్యుని శిష్యుఁడు. వర్ధమానపురాధీశ్వరుఁడు. ఇతఁడు భీమకవిచేఁ గర్తృత్వ మారోపింపఁబడినకవిజనాశ్రయ మను ఛందోగ్రంథమును రచించి, కళ్యాణపురాధీశ్వరుం డైన చాళుక్యజగదేకమల్లునకు సేనాపతి యగురేచభూపాలున కంకితము చేసెను. ఈ రేచనికిఁ గవిజనాశ్రయుఁ డనియు, గోకర్ణునకు శ్రావకాభరణాంకుఁ డనియు బిరుదనామములు కలవు. కవిజనాశ్రయము లో నాలుగాశ్వాసములును జైనకావ్యధర్మముల ననుసరించి వాగ్దేవతాస్తుతితోఁ బ్రారంభింపఁబడినవి. వేములవాడభీమకవి రచించినది నృసింహపురాణము గానికవిజనాశ్రయము కాదు" అని వ్రాసియున్నారు. వీరభద్రరావుగారి యభిప్రాయము ననుసరించి కవిజనాశ్రయకర్త గోకర్ణుఁ డనియు, రేచన కృతిపతి యనియుఁ దేలుచున్నది. దీనినిబట్టి రేచన, కృతిపతియేగాని ప్రణేతకవి కాఁ డనియు, రేచనరచించినట్లు కన్పట్టుచున్న గద్యపద్యము లన్నియుఁ బ్రక్షిప్తము లని వీరభద్రరావుగా రూహించినట్లు తోచుచున్నది. గద్యయందలి శ్రావకాభరణాంకబిరుదము గోకర్ణునిదని వారియూహ. కాని యది సత్యము కాదు. కవిజనాశ్రయశ్రావకాభరణాంకబిరుదము లొక్కవ్యక్తికే సంబంధించినట్లు గన్పడుపద్యము లనేకము లున్నవి. అందుచే వీరభద్రరావుగారియూహలు సరియైనవి కావు. ఈ రేచన జగదేకమల్లుని సేనాపతి యనుట కాయన కెట్టియాధారము లభించెనో తెలియదు. కవిజనాశ్రయమున రేచనను సంబోధించిన విశేషణము లలో సేనాధిపతి యనియర్థమిచ్చు పద మొక్కటియును లేదు. కావున నీతనిని సేనాధిపతియని చెప్పరాదు. సేనాధిపతి రేచన, యీ రేచనకంటె భిన్నుఁడై యుండును. కవిజనాశ్రయకర్త గోకర్ణుఁ డనుటయు వాస్తవము కాదు. కస్తూరి రంగకవి గోకర్ణునిచంద స్సనియు, భీమునచందస్సనియు, వేఱువేఱుగా వ్రాసి, వేఱువేఱు పద్యముల నుదాహరించియున్నాఁడు. అప్పకవికూడ గోకర్ణఛందంబును, కవిజనాశ్రయంబునని వేఱువేఱుగా నుదాహరించి

యున్నాఁడు. గోకర్ణుఁడు రెండు ఛందోగ్రంథములను వ్రాయుట యసంభవము. కావున కవిజనాశ్రయకర్త గోకర్ణుఁడు గాఁ డనుట నిశ్చయము.

కవిజనాశ్రయరచనా కాలమును నిర్ణయించుట కాధారములు లేవు. కవిజనాశ్రయకర్త వేములవాడ భీమకవి కాఁ డనియు, రేచన జగదేకమల్లుని సేనాపతి కాఁ డనియు నిర్ణయించినప్పు డీ కవి రేచన కాలమును జెప్పుట దుస్సాధ్యమైనది. అయినను సాధనాంతరము లభించువఱకును, రేచనను భీమకవి కాలమువాఁ డని ప్రస్తుత మూహించుట మంచి దని యట్లు చేయుచున్నాఁడను.

బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పట్టాభిషేక సంచికయందు "నన్నయకుఁ బూర్వముఛందస్సు" అను వ్యాసమున నిట్లు వ్రాసియున్నారు.

"ద్రావిడభాషలో "యాప్పిరంగలమ్'' అను ఛందోగ్రంథము పదునొకొండవ శతాబ్దిది కలదు. అందు సంస్కృత కర్ణాటాంధ్ర చ్ఛందస్సుల ప్రస్తావన మున్నది. "వాంచియార్ శెయిదవడఘుచం దవుం'' అని యందున్నది. అనఁగా వాంచియ రచించిన తెలుఁగు ఛందమును జూచి తా నాగ్రంథమును రచించినట్లు గ్రంథకర్త చెప్పు కొనుటలోఁ గలదు. ద్రావిడనిఘంటు కార్యాలయమున విద్వాంసు లుగా నున్న శ్రీ మూ. రాఘవయ్యంగా రిది గుర్తించిరి. శ్రీరంగసామి సరస్వతిగారివలన నిది విని శ్రీ రాఘవయ్యంగారిని గలిసికొని సరిగా విచారించితిని. వాంచియ యను నాంధ్రచ్ఛందఃప్రణేత మనకుఁ దెలియరాకున్నాఁడు. ప్రాచీనప్రతుల లిపిరీతిని బరిశీలించినవారు "వాంచియార్''అను పదము "రేచియార్''గా నుండఁ దగు ననిరి. కొన్ని సంస్కృతశబ్దములు కూడ నం దిట్లే వికృతిని బొరసియున్నవి. రేచియార్ అని యగునేని యాగ్రంథము రేచియ (రేచన) రచి యించిన కవిజనాశ్రయ మగును. ఆ ద్రవిడ గ్రంథకర్త జైనుఁడు. ఈ రేచియయును జైనుఁడే. ఇది యొకపొందిక యగును. ఇట్లగు నేని కవిజనాశ్రయము పదునొకండవ శతాబ్దికిఁ దర్వాతది కాకపోవును..."

శ్రీ శాస్త్రిగారు వ్రాసిన పై విషయము ధృవపడునేని (రేచనకృతమగు) కవిజనాశ్రయము నన్నయకు మున్నె పుట్టినదే యగును.”

(భారతి సం ౧౧. భా౧. పుట ౩౪౬-౩౪౭)

ఈ విషయమున నింకను బరిశోధన మావశ్యకమై యున్నది. “యాప్పిరుంగలమ్” అను ద్రావిడ గ్రంథమును, ఆనాటి కర్ణాట గ్రంథమును కవిజనాశ్రయమును బరిశీలించి చూచినఁగాని యిదమిత్థమని నిర్ణయింప లేము.

కవిజనాశ్రయమున “మల్లియరేచా” యను సంబోధనము పలుతావుల నుండుటచే రేచనతండ్రి మల్లియ యనుట నిశ్చయము. కాని యీమల్లియ యుదంతమును దెలియలేదు. కవిజనాశ్రయము, విన్నకోట పెద్దనకృత కావ్యాలంకారచూడామణికిఁ దరువాతిది యనియు, దీనికర్త వేములవాడభీమకవియే యైయుండుననియు నిది పదునాల్గవ శతాబ్దియందు జన్మించియుండుననియు, బ్ర. వ. చినసీతారామశాస్త్రులుగారు భారతిపత్రికలో వ్రాసియున్నారు. కాని వారితో నే నేకీభవింపఁజాలకున్నాఁడను

కవిజనాశ్రయము పుట్టినదిపుట్టినట్లుగా లేదనియు, నందు తరువాతివారి పద్యములు కొన్ని కలసినవనియు, నప్పకవి చెప్పియున్నాఁడు. కొంతవఱ కీవిషయమున బ్ర. జయంతి రామయ్యపంతులుగారు పరిశోధించియున్నారు. వారి పరిశోధనాఫలితముగ నిప్పు డాంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించిన కవిజనాశ్రయము ఈ గ్రంథమును గూర్చియు నీ కవి రేచనను గూర్చియు నింకను బరిశోధన మావశ్యకమై యున్నది. ప్రస్తుతమున నీకవిని గూర్చి యింతకంటె నేమియు వ్రాయఁజాలను.

12. ఉదయాదిత్యుఁడు

ఇతఁ డుదయాదిత్యాలంకార—మను గ్రంథమును రచియించె నఁట. ఇది కన్నడగ్రంథమో, ఆంధ్రగ్రంథమో తెలియదని కొందఱు కవుల సంచికలో వ్రాసియున్నారు. గ్రంథము లభింపక పోవుటచే నితని యాదంత మేమియుఁ దెలియుట లేదు. ఇతఁడు నిజామురాష్ట్రమందలి వర్ధమానపురమును బరిపాలించిన రాజనియు, ఇతనికి భీమచోడుఁడు, గోకర్ణచోడుఁడు నను నిరువురు తనయులు గల రనియు నీ గోకర్ణుఁడే గోకర్ణఛందస్సు అను లక్షణగ్రంథమును రచియించెననియుఁ జరిత్రకారులు చెప్పుచున్నారు. గోకర్ణునిగూర్చి వేఱొకచో వ్రాసియుంటిని. ఉదయాదిత్యుఁ డను పేరుగలవా రిరువురో మువ్వురో యున్నారు. అందితఁ డెవ్వఁడో తెలిసికొనవలసి యున్నది. ఈతఁడు రచించిన దాంధ్రగ్రంథమో, కన్నడగ్రంథమో తెలియనందు నీతనిని గూర్చి పెంచి వ్రాయుటవలన నుపయోగ ముండ దని యింతటితో విడచిపెట్టితిని. ఉదయాదిత్యుఁడు భీమ, గోకర్ణుల కగ్రజుఁడనియు, మైలాంబకుమారుఁ డనియు నొక శాసనమునం దున్నది. (హై. శా. సం. సంఖ్య ౩౬)

---

13. గోకర్ణుఁడు

“గోకర్ణఛందస్సు” అని పిలువఁబడియెడి లక్షణగ్రంథమున కీతఁడు కర్త. ఆ గ్రంథ మిప్పు డెచ్చటను గన్పట్టుట లేదు. అప్పకవి తనయప్పకవీయమున, గోకర్ణఛందస్సును స్మరించియున్నాఁడు. కాని యందుండి పద్యములను లక్ష్యములుగా నీయలేదు. కస్తూరిరంగకవి తన యానందరంగరాట్ఛందమున గోకర్ణఛందస్సులోనివని కొన్ని పద్యములను లక్ష్యములుగాఁ జూపినాఁడు. గ్రంథము లభింపక పోవుటచే నితఁ డెప్పటివాఁడో, ఏకులమువాఁడో, ఎచ్చటివాఁడో, తెలుపుట కవకాశము లేదు. ఇతఁడు జైనుఁ డని కొందఱను చున్నారు. కొందఱితఁడు సూర్యవంశపుక్షత్రియుఁ డనుచున్నారు,

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారును చిలుకూరి వీరభద్రరావుగారును, వేములవాడ భీమకవి రచించి రేచనపేరు పెట్టెనని చెప్పఁబడియెడి కవిజనాశ్రయ మనులక్షణగ్రంథమే గోకర్ణఛందస్సని యు, దాని నీ గోకర్ణుఁడే రచియించె ననియు వ్రాసియున్నారు. కాని యది సత్యమైనట్లు కన్పట్టదు. ఈ విషయమును భీమకవిచారిత్రమునను, రేచనచారిత్రము నను విపులముగాఁ జర్చించియున్నాఁడను.

ఈ గోకర్ణుఁడు, నిజామురాష్ట్రమందలి వర్ధమానపురమును బరిపాలించినసూర్యవంశక్షత్రియుఁ డనియు, నితనికిఁ దండ్రి యుదయాదిత్యుఁ డనియు, భీమచోడుఁ డగ్రజుఁ డనియు, నితఁడు కాకతి రుద్రదేవునికాలములో నున్నవాఁ డనియు, చిలుకూరి వీరభద్రరావుగారు కాకతీయాంధ్రరాజయుగచరిత్రమున వ్రాసియున్నారు. శ్రీ రామకృష్ణకవిగారును అట్టే యభిప్రాయపడిరి. ఆ కాలమున గోకర్ణచోడుఁ డున్నమాటవాస్తవమే కాని, యాతఁడు ఛందోగ్రంథమును రచించె ననుట కాధారములను వారు చూపలేదు. అట్టియాధారములు లభించువఱకును గోకర్ణఛందస్సును రచించినవాఁడు, వర్ధమానపురపాలకుఁ డగుగోకర్ణుఁ డని తలంపవీలులేదు. ఈ క్షత్రియగోకర్ణుఁడు వాగీంద్రచూడామణి యను జైనసమయాచార్యునిశిష్యుఁ డని వీరభద్రరావుగారు వ్రాసియున్నారు. కాని యందులకును నాధారము లేదు. ఆధారరహితము లైన యిట్టి సిద్ధాంతములనుబట్టి ఛందస్సును రచించినగోకర్ణుని కులగోత్రకాలములు నిర్ణయింప వలనుకాదు. కాలము తెలియకపోయినను, రేచనతోను, వాగీంద్రచూడామణితోను సంబంధించినకథ యొకటి చెప్పఁబడియుండుటవలనను, గోకర్ణచోడుఁడు పండ్రెండవశతాబ్దివాఁ డగుటను నీతనిని పండ్రెండవశతాబ్దియందుఁ జేర్చితిని. ఆనందరంగరాట్ఛందమున నుదాహరింపఁబడిన గోకర్ణఛందస్సునందలిపద్యముల నీ క్రింద నుదాహరించుచున్నాఁడను.

రుద్రదేవుని హనుమకొండశాసనమున గోకర్ణచోడునిపే రుదాహరింపబడినది. కాని యాతఁడు పండితుఁడనిగాని కవియనిగాని

యందుఁ జెప్పఁబడ లేదు. గోకర్ణచోడుని తల్లి యైన మైలాంబ వ్రాయించిన పానగల్లు శాసనము (హై. శా. సం. నెం 36 రు) లో గోకర్ణచోడుని పేరు కలదు. ఇతఁడు కవి యని యూహించుటకుఁ దగినయాధారము లంతకును లేవు. గోకర్ణచోడుఁ డిరువురు బ్రాహ్మణులకు దానమొసంగి వ్రాయించిన శాసనము (హై. శా. సం. నెం 37 రు) లో గూడఁ దాను పండితుఁడ నని చెప్పుకొనలేదు. ఇతని కొడూరి శాసనము నందును నీ ప్రశంస లేదు. ఈ కారణములచే గోకర్ణఛందస్సును రచించిన కవి గోకర్ణచోడుఁ డని నిశ్చయింప లేకున్నాము. సుప్రసిద్ధ చరిత్రకారు లగు శ్రీ రామకృష్ణకవిగారును, వీరభద్రరావుగారును, ఛందస్సును రచియించిన దీగోకర్ణచోడుఁడే యని చెప్పియుండుటచే, వారి మాటలను కాదనరాదని తోఁచుచున్నను, దగినయాధారములు లభింపకుండుటచే, నాతఁడే యాతఁ డని నిర్ణయించుట కవకాశము లేకపోయినది. ఈ యిరువురు నొకవ్యక్తియే యని నిర్ణయ మగునెడల, నీతని చారిత్రమునను వ్రాయవలసినయంశము లింకను జాలగలవు. వీరిరువురును భిన్నవ్యక్తు లనునూహచే నా విషయముల నిటఁ బ్రస్తావింప లేదు.

క. [1]నయులం జెప్పిన శుభ మగు
జయులం జెప్పినను బతికి జయకీర్తులగున్
రయులం జెప్పిన నెంతయుఁ
బ్రియ మగు మఱి మయులఁ జెప్పఁ బెంపొనరించున్.

క. పతితారకుఁ బద్యము ఖ
స్థితతారకమునకుఁ జెలిమి తెలియక జముఁడై
కృతియొండెఁ బద్య మొండెను
విదితంబుగఁ జెప్పునతఁడు వీరిఁడి కాఁడే.

---

1. కవిజనాశ్రయమునందు 'నయులం జెప్పిన శుభమగు జయులం జెప్పినను బతికి జయకీర్తులగున్ మయులం జెప్పిన సౌఖ్యము రయులం జెప్పినను జెట్ట రయమున వచ్చున్' అని యున్నది.

గీ. తగ ఋకారాన్వితంబు ద్విత్వంబు గాఁగ
బరఁగు సప్పపుజడ్డతోఁ బ్రాసమైత్రి
యుక్తకృపాసిద్ధి హారిఁ గని ప్రముక్తి నసఁగ
సంభృతాశ్రితుఁ డతియశోజ్జృంభి యనఁగ.

గీ. [2]యరలవశషసహావర్ణము లాదిబిందు
యుతములై మువర్ణవిరామయుక్తి నలరు
మారుతాత్మజుఁ డరిది సంయమి యనంగ
మదనజనకుఁడు దితిజసంహారుఁ డనఁగ

క. తెలియఁగ వర్గ్వ్య శేషసు
గలసిన సరసవశి యంద్రు కవివరు లెల్లన్
కలికావర్గవు తూతోఁ
గలపం బగు పెళ్ళ కల్ల కందర్పనిభా!

క. [3]మొదల నడుమంట లఘువ్వలు
వదలవు యరతలను వానివడు నన భజనల్
విదితంబులు గురువ్రలు తుద
మొదల నడుమ పనల కెనఁగు మొగి గురులఘువుల్

వావిళ్ళవారు ప్రకటించినసులక్షణసారమున నీక్రిందిపద్యము గోకర్ణఛందములోని దని చెప్పఁబడినది.

క. క్రూరగ్రహముక్తము లగు
తారలు దగ్ధములు భూమితంబులు వానిన్
జేరి మొదు రెదుర నున్నవి
క్రూరగతంబు లని యొఱఁగికొను జ్వలితంబుల్

---

2. ఈ పద్యము అనంతునిఛందమున అనంతుని దనియున్నది. అప్పకవియు ననంతునిదే యన్నాడు. పెద్దిరాజు దని సులక్షణసారకర్తయనినాఁడు.

3. ఇది రంగయసర్వలక్షణసారములో నుదాహరింపఁబడినదని తంజావూరుసరస్వతీమహలు భాండాగారపట్టికలో నున్నది.

14 శ్రీపతిపండితుఁడు

శైవమతవ్యాప్తికొఱకు పాటుపడినపండితత్రయములో నీతఁడు మొదటివాఁడు. శైవమతమును బోధించుచు నీతఁడు సంస్కృతాంధ్రములయందుఁ గొన్నిగ్రంథములను రచించె నని ప్రతీతి కలదు. ఈతనియాంధ్రగ్రంథము లేవియు నిపుడు గాన్పించుట లేదు. కాని ముందెప్పుడైనను నీతనిగ్రంథములు బయలువడునేమో యనియు, భాషాభిమాను లీతనిగ్రంథములకై ప్రయత్నింతు రనియుఁ దలంచి యీతనిచరిత్రము నిందుఁ జేర్చితిని. ఇతఁ డారాధ్యనియోగి బ్రాహ్మణుఁడు. ఈతనినివాసము కృష్ణామండల మందలి బెజవాడ. ఇతఁడు వేదవేదాంగములను జదివి పండితుఁడై, తపశ్శాలియై, శైవమతాభిమానియై యుండెడివాఁడు. ఒకనాఁ డాయన కృష్ణానది కేగి స్నానము చేసివచ్చుచుండఁగా నొకయేనుఁగు గెదురయ్యెను. ఏనుఁగు వెడలిపోయినపిదపఁ బోవచ్చు నని యాయన యాప్రక్క నున్న యింటియరుగుపై కెక్కెను. ఆ యిల్లొకగొడగరిది (గొడగరి = గొడారి; మాదిగవాఁడు.) ఇంతలో నాగొడగరి లోపలనుండివచ్చి "అయ్యా! నేను ప్రతిదినము నార్గురు శివభక్తులకు భోజనమిడు వాఁడను, నేఁ డయిదుగురుమాత్రమే వచ్చియున్నారు. కావున మీ రీనాఁడు నాయింటఁ భుజించి, నావ్రతభంగము కాకుండఁ గాపాడ వలయును." అని ప్రార్థింప నట్లేయని యాపండితుఁడు వానియింట భుజించెను. అది చూచి బ్రాహ్మణులు శ్రీపతిపండితునిశిష్యుఁడైన యనంతపాలునియొద్ద కేగి యావృత్తాంతమును జెప్పి, బ్రాహ్మణు లాదఱును పండితుని వెలివైచి యాతనికి నగ్నినియమ్మైరి. పండితుఁ డూరవెలుపల నున్నకొయ్యగృహమున నొకపుట్టను గట్టివైచి బెజవాడ యంతయు నందుండు నట్లు శాసించెను. బెజవాడయుం దగిలి కరవయ్యెను. ఆతనిమాహాత్మ్యమున కచ్చెరువంది ప్రజ లనంతపాలసహితముగ వచ్చి యాతనిఁ బ్రార్థించి పినమిటులై క్షమాపణలు చెప్పుకొని యాపద్భ్రమమునుండి యగ్నినిగైకొని చనిరి. ఈకథను పాలకురికిసోమనాథుఁడును వచ్చికొనిన పండితారాధ్యులు నీక్రియావ్యుద్ధములలోఁ బ్రస్తరించి యున్నారు.

"భక్తుండు శ్రీపతిపండితుం డీశు
భక్తుని కిలఁ గోటిబ్రాహ్మణు లైన
నెనయన్న నాలుక నేఁ గోసివైతు
ననుచు ననంతపాలునిసభాస్థలి ని
నెక్కనఁగాఁ జంద్రునిప్పులు గాదె
చక్కన పొత్తిపచ్చడమున ముడిచె" బసవపురాణము.

క. ఒక్కఁడె దైవము శివుఁ డని
నిక్కము సేయుటకు ముడిచె నిప్పులు నీరన్
స్రుక్కక శ్రీపతిపండితుఁ
డక్కజముగ విజయవాడ నల జమ్మి శివా!

క. అతులిత శివభక్తునితోఁ
బ్రతి సేయఁగ రాదు కోటిబ్రాహ్మణులని శ్రీ
పతిపండితయ్య నిప్పులఁ
గుతుకమ్మతి మూటగట్టెఁ గొంగున నుశివా!

శివతత్త్వసారము

ఈ శ్రీపతిపండితవంశమున, కాశీనాథుఁ డను నొకమహా పురుషుఁడు జన్మించి ఖ్యాతిఁగాంచుటచే నప్పటినుండియు నీవంశము వారు కాశీనాథునివారైరి. ధర్మాభ్యుదయభద్రాయుశ్చరిత్రము లను రచించినకాశినాథునివీరారాధ్యుఁ డీశ్రీపతివంశము లోనివాఁడే. ఈ శ్రీపతిపండితునికథను వీరారాధ్యుఁడు తనధర్మగుప్తాభ్యుదయ మున నీ క్రిందిపద్యములలో వర్ణించియున్నాఁడు.

గీ. అరయఁ దత్పండితేంద్రనిజాంశభూతి
భవులు శ్రీపతి మంచెన పండితులును
మల్లికార్జునపండితుఁ డెల్లజనులు
వినుతులొనరింప వెలసి యుర్వీతలమున!

గీ. వారు భువి వీరశైవప్రవర్తనంబు
బ్రాహ్మణాచార మగునంచుఁ బత్యమూన
వేదవేదాంత సిద్ధాంతవిశ్రుతముగఁ
దెలియఁ జేయుచు విలసిల్లి రలఘుమహిమ!

క. ధీరుఁడు శ్రీపతిపండితుఁ
డారయఁ బ్రాచీనదేశికాహ్వయుఁడు మహో
దారశివాద్వయమార్గ
స్ఫారధురంధరుఁడు లోకపావనుఁ డెన్నన్.

క. ఆగురుఁడు విజయవాటిని
భోగోజ్జ్వలమందిరమున బుధయుతుఁడై శై
వాగమనైగమబోధా
యోగమునఁ జరింపుచుండి యొకనాఁ డనియెన్.

క. శివుఁడే దైవము ధరలో
శివభక్తులె సత్కులీనసిద్ధాంతపరుల్
శివమంత్రమె మనురాజము
శివునిప్రసాదంబె భోగశేఖర మరయన్.

వ. అని శపథంబుగాఁ బలుకుచు ననంతపాలదండనాయకమహీంద్ర
వాది శివవ్రతతిసేవాయత్తచిత్తంబులం బ్రవర్తింపుచుండఁ బర
వాది కోలాహలుండై జయవాటీపురంబున విజయధ్వజం బెత్తి
మహోత్తరశైవాచార్యుం డనఁ జెలంగుచుండి యొక్కనాఁడు.

సీ. నరవిఁ గృష్ణానదీస్నానంబు గావించి
నిత్యకృత్యంబులు నెఱయఁ దీర్చి
వచ్చుచోఁ బురవీథి వసుధేశమదగజం
బరుదేరఁ దొలఁగుచు నచట నొక్క
గొడగరివాకిలిఁ గడుఁ జొచ్చి నిలిచిన
నంతఁ దద్గృహమేధి యరుగుదెంచి
శరణార్థి గురురాయ! సతతంబు నా వ్రతం
బార్యు లయ్యలకు శివార్చనంబుఁ
దగ సలుపుచుంట నొకయయ్య తక్కువయ్యె
నేఁడు లింగైక్య మిఁక నాకు నిక్క మనిన
మంచి దని వానివ్రత మొనరించి వేడ్క
వచ్చు దేశికుఁ గని పరవాదులుదరి.

క. ఓహో, బ్రాహ్మణుఁ డఁట యితఁ
డోహో యగ్గొడగరింట నారోగిణ మి
ట్లీహి యొనరిచి వచ్చెను
ద్రోహం బని చుట్టుకొనిరి దుర్మతు లగుచున్.

గీ. పరగ నీరీతిఁ బరవాదు లురవడించు
గతికిఁ దా మున్ను జేసినకడుఁబ్రతిజ్ఞ
నిగమసమ్మతి యాఢిగా నెఱపఁ దలఁచి
వారు గొనిపోవ నృపసభఁ జేరె గురుఁడు.

వ. ఇట్లు పరవాదు లప్పండితేంద్రు ననంతపాలదండనాయకభూవరా
స్థానంబునకుఁ గొనిపోయి యిట్లనిరి.

క. గొడగరి మల్లయ యింటను
గడుపారఁగఁ గుడిచి రాఁగఁ గాంచితి మితఁడే
ర్పడ మీగురు వెట్లగు నని
కడుఁ దోఁచక యుంటి మిపుడు కలఁగుచు నధిపా!

సీ. అని యిట్లువిప్రులాడిన నలంకుచు సభ్యు
లా పండితునిఁ జూచి యనఘచరిత
యిది యెట్టి దగునని ముదలింపఁ జిఱునవ్వు
సెలవుల నైవాటి చెలువు దనర
నింతయు నిజము మే మొనయ ము న్నొనరించు
ప్రతిన యిట్టిది యసత్ప్రాజ్ఞులార
మొనసి యాత్మాద్వైతమునశివాద్వైతము
ననుఁ జెందువారలఁ గినిసి జాతి

భేద మెంచఁగరా దని పృథులశాస్త్ర
రీతులును మానివర్గంబు నీతి దెలియఁ
దరసి జాబాలశతరుద్రియాదులందుఁ
బలుకుపలుకులు వినుఁడు విభ్రమము మాని.

సీ. వేదవేదాంతార్థవిధులచే సాధింపఁ
గా లేక మూర్ఖులై కదిసి మీర
లగ్ని మీ కీడ మని యార్చుట లదిమీకుఁ
గలిగియుండినఁ గదా కడమమాట
అని కోపశిఖిపీతుఁ డాగ్రప్రచారియై
గరిగొని విస్ఫులింగములఁ దనప
బొమలు గంటిడ ధరాభ్రమణంబుచే దిశల్
కుమ్మరిసారె చందమ్ము నెఱప
గగనభాగంబు నం దిరుల్ గ్రమ్ముకొనఁగ
సర్వజీవౌఘమును సభాసదులు మూర్ఛ
నొంద నప్పండితేంద్రుఁ డత్యుగ్రవేగ
సరణి లంఘించెఁ దన్మహాస్థానవీథి.

వ. అప్పండితేంద్రుడు జయవాటికాపురమల్లికార్జునాగ్నేయభాగంబున నున్నశమీశాఖాసమీపంబునకు నరిగి యద్దేవుని కభివందనంబును బ్రమథగణస్తోత్రంబును గావించి వీతిహోత్రు నాకర్షింపుచుఁ దనమీఁదిపట్టుపచ్చడంబునం గట్టి యిట్లనియె.

మ. వినుమీ పావక! శైవగేహములలో విశ్రాంతిదక్కన్ బురం
బున నెందున్ వసియింపకీ కుజనవిస్ఫూర్జన్మదంబున్ హరిం
పు నగేంద్రాలయునాజ్ఞ దప్పి యనయంబున్ మీఱినన్ వీరభ
ద్రునిచే నీ కగుబన్నమున్ దెలియుఁగా దొడ్డాడ నింకేటికిన్.

ఏడుదినములు గడచినపిదప అనంతపాలాదిదండనాథులతోఁ గూడవచ్చి ప్రజలు శరణని వేఁడఁగాపండితుఁ డాయగ్నిని విడిచిపుచ్చెనఁట!

ఇతఁడు బ్రహ్మసూత్రములకు శివపరముగా నొకవ్యాఖ్యను వ్రాసి దానికి శ్రీకరభాష్యమని పేరిడియెను. ఈతఁ డింకను గొన్ని సంస్కృతగ్రంథములను రచించె నని చెప్పుదురు. శ్రీకరభాష్యమునకు శివదీపికయని పేరుపెట్టెననికొందఱందురు. శివదీపిక యనుగ్రంథము నాంధ్రమున వ్రాసె ననికొందఱనుచున్నారు. యుద్ధమల్లుని బెజవాడ

శాసనము నందున్న మధ్యాక్కరల నీతఁడే రచించె నని కొందఱు చెప్పుచున్నారు. ఆయక్కరలలోఁ గొన్నిటి నిట నుదాహరించు చున్నాఁడను.

౧. స్వస్తి నృపాంకుశాత్యంతవత్సల సత్యత్రినేత్ర
విస్తర శ్రీయుద్ధమల్లుఁ డనవద్యవిఖ్యాతకీర్తి
ప్రస్తుతరాజాశ్రయుండు త్రిభువనభరణుండు సకల
వస్తుసమేతుండు రాజసల్కిభూవల్లభుం డర్థి.

౨. పరగంగ బెజవాడ గొమరుస్వామికి భక్తుఁడై గుడియు
నిరుపమమతి నృపధాము డెత్తిచ్చె నెగి దీర్చె మఠము
గొరగ ల్గా కొరు లిందువిడిసి బ్బందంబు గొని యుండువారు
పరిగాక యబ్బారనాసి వచ్చిన పాపంబు గొండ్రు.

౩. వెలయంగ నియ్యోట్టు డస్సి మలినులై విడిసిన బ్రోల
గలతానపతులును రాజు పట్టముం గట్టినపతియు
నలయం బయ్యారల వెల్వరించిన నశ్వమేధంబు
ఫల ముపేక్షించి నాలింగబడసినపాపంబు దమకు.

౪. జననుత చేబ్రోలునుండి బెజవాడ జాత్రకు వచ్చి
త్రిణయనుసుతుఁ డొండుచోట మెచ్చక తివిరి యున్నెలవ
యనఘుండు చేకొని యుండు ప్రత్యక్షమై యున్న నచ్చ
గని మల్ల డెత్తించె గుడియు మఠమును గార్తికేయునకు.

౫. రమణతో బెజవాడ కెల్ల చెడగును రక్షయు గాను
దమతాత మల్లపరాజు వేర్వేఱు దాను గట్టించె
గ్రమమున దా నికకలశమిడ్డట్టుగా మొగమాడు
సమరంగ శ్రీయుద్ధమల్లుఁ డెత్తించె నమిత తేజుండు.

ఈయక్కరలు శ్రీపతిపండితకృతము లైనచోఁ, నీశాసనము పదియవశతాబ్దిలో వ్రాయఁబడినది. కావున నీపండితుఁడు నన్నయకుఁ బూర్వుఁ డని చెప్పవలసివచ్చును. కాని యిందు సత్యము లే దని తోఁచుచున్నది. పైనచెప్పిన యగ్నిహోత్రమును బట్టయందు కట్టిన

కథ సత్య మయ్యేనేని యాతఁ డనంతపాలుని కాలమువాఁ డగును. అనంతపాలుఁడు పశ్చిమచాళుక్య వంశములోనివాఁ డైనయాఱవవిక్రమాదిత్యునిదండాధిపతి యై కొండపల్లిరాజ్యమును పాలించినయుత్తమ బ్రాహ్మణుఁడు. ఆఱవవిక్రమాదిత్యుఁడు క్రీ. శ. ౧౦౭౬—౧౧౨౬ నడుమ రాజ్యముచేసినవాఁడు. అనంతపాలునిశాసనము చేబ్రోలులో నున్నది. అనంతపాలునియల్లుఁడు చక్రరాజదండనాయకుని శాసన మొకటిద్రాక్షారామయాలయమునం దున్నది. (ద. హిం. శా. సం. ౪ సంఖ్య ౧౨౫౯—౧౩౧౧) ఇది చాళుక్య విక్రమసంవత్సరములు ౪౮— క్రీ. శ. ౧౧౨౨ నాఁటిది. అనంతపాలుని కాలమును నిర్ణయించు శాసనము లింకను చాలఁ గలవు. (ద. హిం. శా. సం. ౯ భా౧.) వీనినిబట్టి శ్రీపతిపండితుఁడు క్రీస్తుశకమున పదునొకండవశతాబ్ది తుదిపాదమునను పండ్రెండవశతాబ్ది నాదిపాదమునను నున్నవాఁ డని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. కావునఁ బైనఁజెప్పినయుక్కరలీతనివి కావు.

పోచిరాజువీరనకవి తనవిభూతిరుద్రాక్షమాహాత్మ్యమును ఈ శ్రీపతిపండితున కంకితము చేసెను. కాని యందుమూలమున వీరిరువురును సమకాలికు లని తలంపరాదు. పండితునియందుఁ గలభక్తిచే వీరనకవి తనగ్రంథము నీతనికర్పించియుండె నని తలంపవలసియున్నది.

ఈశ్రీపతిపండితునివంశము తామరతంపరయై బహుముఖములవ్యాపించియున్నది. గ్రంథవిస్తరభీతిచే నావంశవృత్త మిట నీయలేదు.

15. దేసటిపండఁడు

ఇతనితండ్రి భీమనృపాలుఁడు. తల్లి ఎరియాంబ; తాతపండఁడు; బూరమ పితామహి; గండఁడు ప్రపితామహుఁడు; మేడమ ప్రపితామహి;

ఈ కవి గుంటూరుమండలములోని చేబ్రోలునం దున్న కుమారస్వామికి, అఖండదీపదానముచేసి యాంధ్రపద్యాత్మకమైన యొక శిలాశాసనమును వ్రాయించెను. దానినిబట్టి యీతఁడు కవిత్వము చెప్పఁగలవాఁ డని తెలియుచున్నది. ఈతఁడు రచియించిన గ్రంథము లేవియో తెలియుట లేదు. ఆ శాసనము నీక్రింద వ్రాయుచున్నాఁడను. ఇప్పటి పాఠకుల సౌకర్యముకొఱకు శాసనము నందలి యుచ్చారణను గొంత సవరించితిని.

శా. శ్రీనారీపతినాభిపంకజభవ శ్రీపాదజాతోత్తము
త్క్ష్మానాథాంబుజభాస్కరుండు నిజవంశం బెల్ల దీపింపఁగా
దీనానాథకవీంద్రగాయకులు గీర్తింపంగఁ గీర్తిస్థుఁడై
భూనాథాగ్రణి బుద్ధవర్మ ప్రభతోఁ బుట్టె న్మహాశౌర్యుఁడై ౧.

స్రగ్ధర. శ్రీరమ్యక్ష్మావధూకాం
చికి నెన యగుకాంచీపురీనాథు నుగ్రా
కారున్ లాలాటనేత్రున్
గవిజనహితు ముక్కంటికాడ్వెట్టెఁ బుణ్యా
చారున్ దద్బుద్ధవర్మే
శ్వరుఁడు గొలిచి మును శాసనం బొందఁ గర్ణో
దారుం డొంగేరుమార్గ
త్రయము వడసె నాతారచంద్రార్కలీలన్. ౨

ఉ. ఆవిభునన్వయంబున గుణౌఘ్యుఁడు గండఁడు పుట్టె వానికిన్
దేవమహీజదాని యగు దేసటిపండఁడు పుట్టె షట్సహా
స్రావని నేవెఁ దత్సుతుఁ డుదగ్రుఁడు విల్లమభీముఁ డంధ్రల
క్ష్మీవని తేశుచేఁ బడసెఁ జెల్వగుపంచినికుఱ్ఱు వృత్తిగాన్. 3

ఉ. ఆతని కుద్భవించె నధిపాగ్రణి గండఁడు వానికిన్ గుల
స్త్రీతిలకంబు మేడమకు ధీరుఁడు పండఁడు పుట్టెవానికిన్
శీతకరాస్య బూరమకు సింధురవైరిబలుండు రాజమాం
ధాతుఁడు పుట్టె భీముఁడు వదాన్యుఁడు ధన్యుఁడు పుణ్యమూర్తియై.

చ. ....
..............................దీధితిరేఖ వరేణ్యపుణ్యదో
హాలయనఁ బెంపుఁ గన్నయెఱియాంబకు నుద్భవ మయ్యె భారతీ
నిలయుఁ డనంగఁ బండధరణీపతి సర్వకలాప్రవీణుఁడై. ౫

చ. తలపు నదర్థభావమునఁ దగ్గతసూక్తులఁ గూడ వర్ణనల్
గొలుసుగొనంగఁ బ్రౌవడులు గోరినభంగిన వచ్చి ముట్టఁ గో
మలగతి దేసిమార్గములు మట్టుపడం గటనంబులొప్ప నా
ద్యులక్రియఁ జెప్పనేర్చె నృపధూర్జటి భీమయపండఁ డిమ్మహిన్. ౬

మ. స్వరతర్కాంబరచంద్రసంఖ్యఁ జనుతచ్ఛాకాబ్దచైత్రామలే
తరపంచాదశిసౌరివాసరసముద్యన్మేషసంక్రాంతి సు
స్థిరతం బొల్చుమయూరవాహనునకుం జేబ్రోలఁ బెట్టించె భా
స్వరదీపం బతిభక్తిఁ బండనృపుఁ డాచంద్రార్కతారంబుగాన్. ౭

స్వస్తిశకవర్షంబులు ౧౦౬౭గు నేటిచైత్రబహుళపంచాదశియు శనైశ్చరవారమున శ్రీకుమారస్వామిదేవరకు మహామండలేశ్వర పండయ దమతండ్రి భీమరాజునకు ధర్మార్థముగా నఖండదీపమున కిచ్చినఎడ్లు౨౫. వీనిం జేకొని నల్లంగాటయబోయనికొడుకు కొండబోయుండు దనపుత్రానుపౌత్రిక మాచంద్రార్కము మహాసేనమున నిత్యం మానెడునేయి వోయంగలవాఁడు. శ్రీ శ్రీ శ్రీ

ఈశాసనము ద. హి. శా. సం. ౬ సంఖ్య ౧౦౩౯గా ప్రకటింపఁబడినది. పైపద్యములలోని ౬వ పద్యమునుబట్టి యీకవి దేసిమార్గములు రెండింటియందును జక్కనికవిత్వము చెప్పఁగలవాఁ డని తెలియుచున్నది. ఇతఁ డాంధ్రమున నేమేని గ్రంథములు వ్రాసియుండు ననియూహింపనగును. పైపద్యము లితనివే యైయుండును.

రెండవపద్యములోని "దేసటి" యాతనియింటిపే రైనట్లూహించి యాతనిని దేసటిపండఁ డని పేర్కొన్నాఁడను. మొదటిపద్యమును బట్టి యితఁడు శూద్రుఁ డనుట నిశ్చయము. కొండవీటిరెడ్డిప్రభువుల యింటిపేరుకూడ దేసటివారే. కాని యంతమాత్రముచే నీతనిని రెడ్డికులజుఁడని నిశ్చయింపలేము. "దేసటి" యను గ్రామమునుబట్టి యీ యుభయులకునుగూడ "దేసటి" యను గృహనామ మేర్పడిన నేర్పడియుండును. పైశాసనమునుబట్టి యీ కవి క్రీ. శ. పండ్రెండవ శతాబ్దమధ్యభాగమువాఁ డని తెలియుచున్నది. ఈ కాలముననే వెలనాటిగొంకమహీపతికి మేనమామయగు పండఁడొకఁ డున్నాఁడు. అతఁ డితఁడేమో యని సంశయించితినిగాని విమర్శించినమీఁదట నీయిరువురు నొక్కరుగా రని తేలినది. ఆపండనినామ ముదాహరింపఁ బడినశాసనములు పెక్కు లున్నవి. వానియం దాతనిని కవియని చెప్పలేదు. అతనితల్లి మల్లాంబ. మనకవిపండనితల్లి యెరియాంబ.

ఈకవి పండనివంశమునకు మూలపురుషుఁడు బుద్ధవర్మయైనట్లును, ఆతఁడు ముక్కంటికాడ్వెట్టిని సేవించి, వంగేరుమార్గత్రయము నాతనివలనఁ బడసినట్లును పైపద్యములలోని మొదటిరెండు పద్యములవలనఁ దెలియుచున్నది. ఈముక్కంటికాడ్వెట్టి కాంచీపురనాథుడనియు లలాటమందు నేత్రము గలవాఁడనియు ౩వ పద్యములోనున్నది. కొందరుచరిత్రకారు లీముక్కంటికాడ్వెట్టియే త్రిలోచనపల్లవుఁ డని నిశ్చయించియున్నారు. త్రిలోచనపల్లవుఁ డాఱవ శతాబ్దివాఁ డనిచెప్పవచ్చును. కొండపడమటి రాజులమూలపురుషుఁడయినబుద్ధవర్మయొకఁ డున్నట్లును నతఁడు తూర్పుచాళుక్యులవంశకర్త యైనకుబ్జవిష్ణువర్ధనునికడ సేవకుఁడైనట్లును కొన్నిశాసనములవలనఁ దెలియుచున్నది. (ద. హిం. శా. సం. ౧సం ౬-౭-౩) ఈ బుద్ధవర్మకూడ శూద్రుఁడే. కవిపండనివంశకర్తయైనబుద్ధవర్మయు, కొండపడమటిరాజుల మూలపురుషుఁడైనబుద్ధవర్మయు నొక్కరుగాకపోయినను, నీవంశములో బుద్ధవర్మలు పెక్కు రుండుటచే, నీయిరువురివంశములు నొకబుద్ధవర్మనుండి యుత్పన్నము లైనశాఖ లేమో యని తోఁచుచున్నది.

మనకవిపండనికిఁ బితామహుఁ డైనపండని ప్రపితామహుఁడు “ఆఱువేలనాఁ” డను దేశమును బరిపాలించినట్లు ౩వ పద్యమువలనఁ దెలియుచున్నది. చరిత్రకారు లీతనినిగుర్తించినట్లగపడదు. ఇతని కాలము, క్రీ. శ. ౯౫౦—౯౬౦ ప్రాంతమగును. ఈవిషయమున నింకను బరిశోధనము కావలసియున్నది.

ఈపండనికుమారుఁడైన విల్లమభీముఁడు “పంచినికుఱ్ఱు” అను గ్రామము నాంధ్రదేశాధీశ్వరునిచేఁ బడసినట్లు పై పద్యములోనే యున్నది. ఈగ్రామ మెచ్చటిదో, ఈయాంధ్రధేశ్వరుఁ డెవ్వఁడోఁ తెలియలేదు. ఈవిల్లమభీముని కాలము క్రీ. శ. ౧౦౦౦ ప్రాంత మగును. ఆకాలమున నాంధ్రదేశాధీశ్వరు లనిచెప్పఁదగినవారు చాళుక్యులును గాకతీయులు నై యున్నారు. క్రీ. శ. ౧౦౦౦నాఁటికిఁ గాకతీయులు స్వతంత్రప్రభువులుగా లేరు. కావునఁ బశ్చిమచాళుక్యులుగాని తూర్పు చాళుక్యులుగాని పంచినకుఱ్ఱు నిచ్చి యుందురు. పంచినికుఱ్ఱును గుర్తింపఁగలిగినయెడల దాత యెవ్వరో తెలిసికొన వీలుగలుగును. ఈభీమునితండ్రి యైనపండఁడు, ఆఱువేలనాఁడునకుఁ బరిపాలకుఁడై యుండఁగా నీభీముఁ డాపాలకత్వమును బోఁగొట్టుకుని యొకగ్రామమును వృత్తిగాఁ బడయవలసినస్థితి లోనికేల వచ్చెనో తెలియకున్నది.

కవిపండనివంశమునకు మూలకర్త యైనబుద్ధవర్మ ముక్కంటి కాడ్వెట్టిచే ఒంగేరుమార్గత్రియమును బడసెనని పైసిద్ధరావృత్తమునం దున్నది. “ఒంగేరుమార్గ” శబ్దము మరికొన్ని శాసనములయందును గలదు. ఇది యొకదేశముయొక్కనామము.

పై శాసనమునుబట్టి యీకవిపండఁడు క్రీ. శ. ౧౧౪౫ వ సంవత్సరమున నున్నాఁడనుట స్పష్టము.

16. మల్లికార్జున పండితారాధ్యులు

శైవమతవ్యాప్తికై తమజీవితములను ధారవోసినపండితత్రయములో నీతఁ డొకఁడు. తక్కినవారు శ్రీపతిపండితుఁడును మంచనపండితుఁడును. ఈ శైవమత మనునది వీరితోఁ గ్రొత్తగా వచ్చినది కాదు. ఆర్యులీదక్షిణదేశమునకువచ్చినప్పు డనార్యులు శైవమతావిష్టులై యుండిరనియు, నెన్నివిధములఁ బ్రయత్నించినను వారామతమును విడనాడలే దనియు, నప్పు డార్యులు శైవమతము నొకమతముగా నంగీకరించి యనార్యులను దమలోఁ గలుపుకొనిరనియు నొకప్రతీతి కలదు. బసవనారాధ్యుఁడు శైవమతకర్త యని కొందఱందురు కాని యది వాస్తవము కాదు. శివుఁడు త్రిమూర్తులలో నొకఁడు. ఈశివునిఁగూర్చినవాక్యములు వేదము లందును గలవు. శైవవైష్ణవకథలు సస్మృతపురాణములలో ననేకము లున్నవి. వేదవిహితధర్మములను విడనాడకుండ శివుఁడే దైవ మని, శివుఁడే యైశ్వర్యప్రదుఁ డనినమ్మి ప్రత్యేకముగ శివు నారాధించినవారు శైవులు. అట్లే విష్ణు నారాధించినవారు వైష్ణవులు. ఈమతవిశ్వాసము హెచ్చినకొలఁదిని బరమతద్వేషమును బెరుగఁ జొచ్చినది. ఈ శైవులును వైష్ణవులును గొలఁదిగనే యుండురు. ప్రజాసామాన్యము శివకేశవులయందు సమానభక్తిగలవారై యున్నారు.

బహుదేవత్వమును విడచి బ్రహ్మమొక్కటియే సత్య మనియు జగత్తు మిథ్యయనియు, నా బ్రహ్మమే దా నని యనుకొనుట, ప్రతిమానవునకును విధ్యుక్త మనియు, బోధించు నుపనిషన్మతమును గౌరవించువా రనేకులున్నారు. యజ్ఞయాగాదివిహితకర్మల నాచరించుచు జన్మసాఫల్యము గావించుకొనుట ధర్మ మని వాదించు కర్మవాదులును గలరు. కాలక్రమమున నీమతము లన్నిటిలోను నంతర్భేదము లేర్పడినవి. శైవులలో, పాశుపతులు, కాలాముఖులు, కాపాలికులు, భైరవులు శాక్తేయులు ననుభేదము లేర్పడినవి. ఇట్లే వైష్ణవులలోను గొన్నియంతర్భేదములు వచ్చినవి. వీరు తమలోఁ దాము గలహించుచుండిరి. ఈమతవివాదము లిట్లుండఁగా నాకాలము

వనీదేశమున జైనబౌద్ధమతములు బయలువెడలినవి. ఇవి వేదమతము నకు విరుద్ధము లైనవి. జైనులును బౌద్ధులును నాస్తికులు: భగవంతునియునికి నంగీకరింపరు. వర్ణాశ్రమాచారధర్మముల నొప్పు కొనరు. సర్వజనసమానమును బోధించుచుండుటచే నీమతము లతిసులభ ముగాఁ బ్రజాసామాన్యమున నలముకొనసాగినవి. పరస్పరవైమనస్య ములతో నున్నశైవవైష్ణవాదిమతము లీకాలమునఁ దమప్రాబల్యమును గోల్పోయినవి. జైనబౌద్ధమతముల దాడినుండి సంరక్షించుకొనవలసిన భారము శైవవైష్ణవమతావలంబుల కావశ్యక మయ్యెను. అందులకుఁ గావలసినమహాపురుషు లప్పు డుద్భవించిరి. శైవమతోద్ధారమునకై బసవనారాధ్యుఁడును, పండితత్రయము నుద్భవించిరి. ఇందులోఁ బసవన మతసంస్కర్త. పండితులు ముగ్వురును మతవ్యాపకులు.

బసవన యాంధ్రభాషయందుఁ గావ్యరచనము చేయలేదు. అందుచే నాతనిచారిత్రమును వేఱుగా వ్రాయుటకు నాకావశ్యకము లేకపోయినది. కాని యాతనిచారిత్రముతో సంబంధించినగ్రంథములను రచియించినవారిలో నాంధ్రకవులు కొంద ఱుండుటచే నీ బసవఁ డెవ్వరో తెలిసినఁ గాని, యాకవులచరిత్రములలో నీతనిని గూర్చివ్రాసినవాక్య ములు సులభముగా బోధపడవు. అందుచే బసవనిచారిత్రమును క్లుప్త ముగా నిట వ్రాయుచున్నాఁడను. ఇతనినిగూర్చి విశేషముగాఁ దెలిసి కొనఁ దలఁచినవారు, పాలకురికిసోమనారాధ్యకృత బసవపురాణమును, శ్రీనాగేశ్వరరావుగారును శ్రీప్రభాకరశాస్త్రిగారును రచించినపీఠికలతో నున్నదానిని జూడవలయును.

బసవన మండగిమాదిరాజను బ్రాహ్మణుని కుమారుఁడు. ఇతనితల్లి మాదమ్మ. వీరి నివాసము కర్ణాటదేశ మందలి హింగుళేశ్వర భాగవాటి యనునగ్రహారము. ఇది శ్రీశైలమునకుఁ బశ్చిమభాగమున నున్నది. నందీశ్వరునియంశచే నీబసవన జనించె ననియప్పటివారివిశ్వా సము. కూడలిసంగమేశ్వరుఁ డీతనిజననకాలమునఁ దపసిరూపమున నాగ్రామమున వచ్చి యాశ్వరనివేదనము గానిపదార్థ మేమియు నాశిశు వున కీయరాదని తల్లితోఁ జెప్పెనఁట! తలిదండ్రు లాతనికి బసవేశ్వరుఁ

డని నామకరణము చేసిరి. గర్భాష్టమవత్సరమున నాతని కుపనయనము గావింపఁ దలిదండ్రులు ప్రయత్నించిరి. బసవన యందుల కంగీకరింప లేదు. శివునిపై భక్తి గలవానికిఁ గర్మలతోఁ బని లేదనియు, శివ భక్తియే మోక్షదాయక మనియుఁ జెప్పి యుపనయనము చేసికొన లేదు. సరికదా! వర్ణాశ్రమధర్మములను త్యజించి, వర్ణేతరులయిన శివ భక్తులతో సహభోజనాదులను జేయనారంభించి, తలిదండ్రులను విడి నాగాంబ యనుసహోదరీసహితుఁడై తనమేనమామ యున్నకల్యాణ కటకమునకు వచ్చెను. ఈ కల్యాణకటక మంతకుపూర్వము పశ్చిమ చాళుక్యుల రాజధాని. వారిని జయించి కాలచుర్యులు కల్యాణకటకము నాక్రమించుకొనిరి. బసవన యక్కడకు వచ్చినప్పటి కాపట్టణమును బరిపాలించుచున్నది కాలచుర్యవంశజుఁడగు బిజ్జలుఁడు. బసవన మేనమామ యగుబలదేవదండనాయకుఁడాబిజ్జలునికడ దండనాయకుఁడుగ నుండెను. ఈబలదేవుఁడు కూడ శివభక్తుఁడు. ఆతనికి గంగాంబ యనునొకతనయ కలదు. ఆమెను భవున కీయ నని యాతఁడు ప్రతిన పూనియుండెను. భవుఁ డనఁగా వీరశైవుఁడు కావలెను. ఇంతలోఁ దన మేనల్లుఁడే తనయొద్దకు రాఁగా వీరశైవుఁ డయిన యాతనికిఁ దన కుమార్తె నిచ్చి వివాహము చేసెను. తరువాతఁ గొన్నాళ్లకు బలదేవ దండనాయకుఁడు చనిపోయెను. బిజ్జలుఁడు బలదేవునిస్థానమును బసవన కొసంగెను. బసవన అధికారములోనికి వచ్చినపిదప శైవమతవ్యాప్తికై విశేషప్రయత్నములు చేయఁ జొచ్చెను. ఆరాజ్యమున నదివఱకు జైన మతవ్యాప్తి యధికముగ నుండెను. బసవన జైనులనందఱిని బాధ పెట్టుచుండెను. ఆబాధలకు భయపడి జైనమతమున నెవ్వరును జేర లేదు సరికదా! అదివఱకు జైనమతమును స్వీకరించినవారుకూడ లింగ ధారణ మొనర్చి వీరశైవమతమును గైకొన నారంభించిరి. రాజభాండా రము నందలిద్రవ్యమును యథేచ్ఛముగా జంగములకొసంగుచు నీతఁడు వీరశైవమతము నభివృద్ధి చేయుచుండెను. వీరశైవమతమునకు లింగ ధారణము ముఖ్యము. అదివఱ కున్నశైవమతమునకు లింగధారణ మావశ్యకము కాదు. బ్రాహ్మణధర్మమును విడువకుండగనే శైవులుగా నుండుట కర్హతను కలిగియుండెడిది. బసవన శైవమతమును సంస్కరించి

నూతన నియమముల నేర్పరచినాఁడు. ఆ నియమములలోఁ బ్రధానమయినవి రెండు. మొదటిది లింగధారణము. వీరశైవమతమును గైకొనినప్రతివ్యక్తియు లింగధారణ మొనర్చితీరవలయును. రెండవది వర్ణాశ్రమాచారపరిత్యాగము. లింగధారణ మొనర్చి వీరశైవమతమును గైకొన్నవాఁడు చండాలుఁడైనను బ్రాహ్మణునితో సహవాస సహపంక్తుల కర్హుఁడు. కర్ణాటదేశమున నసతికాలములోనే యీమతము విశేషముగా వ్యాప్తమయ్యెను. బసవనసాహాయ్య ముండుటచే మతము పేరిట నత్యాచారములు జరిగినను వినువారు లేకపోవుచుండిరి. బిజ్జలుఁడు శైవజైనమతములయందు సమానాదరము చూపువాఁడు. అతఁడు జైనుఁ డనికొంద ఱనుచున్నారు కాని, యతఁడు శివాలయముల కొసంగిన ధర్మము లనుబట్టి చూచినచో శివమతద్వేషి కాఁ డనియు, వీరశైవుఁడై జైనులను హింసించుస్వభావము కలవాఁడు కాఁ డనియుఁ దేలుచున్నది. శైవమతనింద యొనర్చువారిని వీరశైవులకు ద్రోహ మొనర్చువారిని జంపివేయుటకుఁ గూడ బసవన యంగీకార మొసంగి యుండెను. వీరశైవమతధర్మములలో నది యొకటిగా నాకాలమున బరిగణింపఁబడుచుండెను. ఇట్లుండగాఁ బిజ్జలుఁ డొకనాఁడు వీరశైవులును బసవనమతములోఁ జేరినవారు నగుయల్లయ్య మధువయ్య యనువారల కండ్లు కారణము తెలుపకుండగనే పెఱికించె నఁట! అందుపై బసవనకుఁ జాలఁగోపము వచ్చెను. శివద్రోహము పెరిగిపోవుచున్నయీకళ్యాణ పురమునం దుండనిష్టము లేనివాఁడై యనుచరులతోఁ గూడ నాగ్రామమును విడచి వెడలిపోవుచు బిజ్జలుని శిక్షించుటకుఁ దగిన యేర్పాటులను గావించి మఱిపోయెను. జగదేవుఁ డనుబిజ్జలునిదండనాయకుఁడు బసవనచేఁ బ్రేరితుఁ డయిబసవన యనుచరుల నిరువుర సాహాయ్యముగాఁ గొనియర్ధరాత్రమునఁ గోటలోని కేఁగి బిజ్జలుని పొడిచిచంపెను. బిజ్జలునికుమారులు పగఁ బూని బసవనారాధ్యుని నొకసంవత్సరము దాఁటకుండ వధించి రని కొంద ఱందురు. బిజ్జలుని కుమారులు వచ్చుచున్నా రనివిని యొకతటాకములోఁ బడి యాత్మహత్య గావించుకొనె నని కొందఱందురు. కొంద ఱాతఁడు స్వాభావికముగానే లింగైక్యముఁ జెందె నని చెప్పుచున్నారు. ఇంకఁ గొందఱు

క్రీ. శ. ౧౨౧౭ వఱకు జీవించియుండెనందురు. కాని యది విశ్వసింపఁ దగినది కాదు. బసవనజన్మస్థానము బొంబాయిరాష్ట్రమున బీజపూరు మండలమందలి మనగోలి గ్రామమైయుండుననియు నాగ్రామమందలి క్రీ. శ. ౧౧౬౧ నాఁటియొక శాసనములో బసవనయనునాతఁ డొక యాలయమును నిర్మించెననియు, హారితగోత్రుఁడై నమాదిరాజను నాతఁ డాగ్రామమునకుఁ బ్రభువనియు వ్రాసియున్నదనియు, ప్రభునామమును దరువాతివారు తండ్రినామముగా భావించి యుందురనియు డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు పండితారాధ్యచరిత్రపీఠికలో వ్రాసియున్నారు.

"దానిలో (ఆశాసనములో) ఆలయనిర్మాత అయినబసవని గురించి ఉన్నవృత్తాంత మిది :—మనిగవల్లి వేనూరిలో కశ్యపగోత్రాబ్ధి చంద్రుఁ డయినగోవర్ధనుఁ డుండేవాఁడు. అతనికొడుకు శేవదాసు శేవదాసుకు నలుగురు కొడుకులు. వారిలో కడపటివాఁడు మహాప్రఖ్యాతి వహించినచంద్రమనుఁడు. అతనికొడుకు బసవడు. అతడుసాటిలేని మహేశ్వరభక్తుఁడు. ఈబసవభాస్కరునివల్ల మనిగవల్లిలోని వేనూరు బ్రాహ్మణులహృదయాబ్జములునువికసించినవి. ప్రపంచ మంతా అతనికి తండ్రీ అని ఫాలములమీఁద దోసిలొగ్గి నమస్కరించడముచేత అతడు లోకపితయైనాడు. మూడువేదములపారమితడే. ఆద్యంతరహితుడితడే. జ్యోతిర్లింగస్వరూపుడితడే" అని అందరున్ను జయపెట్టుతూ ఉండగా మనిగవల్లికి కీర్తిప్రతిష్ఠలను తెచ్చినాడు"

పండితారాధ్య చరిత్రపీఠి కవులు ౬౪.

చరిత్రకారులు వ్రాసిన యంశములనుబట్టి బసవనారాధ్యుని కొల్లప్తచరిత్రమిది. "బండారుబసవన్న" యనిబసవపురాణాది గ్రంధముల యందీతని వాడియున్నారు. "బండారు" అనునది బసవన యింటిపేరు కాదు. బిజ్జలరాజునొద్దకోశాధ్యక్షుఁడుగా నుండుటచే నీతని నిట్లుపిలువఁ జొచ్చిరి. భాండాగారాధిపతిని 'బండారువు' అనిపిలచెడివారు. బండారువే క్రమముగా 'బండారు' అయినది. ఏదియెట్లున్నను బసవఁడు వీరశైవమత వ్యాప్తికై జీవితము నంతను ధారపోసినప్రతిభాశాలి. ఇతఁడు గొప్ప

సంస్కర్త. ఈతనిమూలమున, నిజాము రాష్ట్రము నందును, కర్ణాటకము నందును లింగాయతమతమేర్పడి యాకాలమునఁ గొంతయభివృద్ధిచెందినది. కాని తరువాత నది యంతగా వ్యాప్తము కాలేదు.

బసవనకాలములోనే మనమల్లికార్జునపండితారాధ్యుఁడును శైవమతవ్యాప్తికై తనజీవితమును ధారవోసినవాఁడు. కాని, బసవనారాధ్యునకును, మల్లికార్జునారాధ్యునకును, ఒక్కవిషయమున భిన్నాభిప్రాయము కలదు. బసవనారాధ్యుఁ డుపనయనముచేసికొనక బ్రాహ్మణత్వమును విడనాడి వర్ణాశ్రమాచారధర్మములను ద్యజించి వీరశైవమతమును గైకొనియుండెను. మల్లికార్జునారాధ్యుఁడు శైవమతమునం దెక్కువ నమ్మకము కలవాఁడై లోకమున శైవమతముదప్ప వేఱుమతముండరాదనునాస కలవాఁడే కాని వర్ణాశ్రమాచారధర్మములను ద్యజించుట కిష్టపడనివాఁడు. "భక్తిమీఁదివలపు బ్రాహ్మ్యంబుతోఁ బొత్తు, బాయలేను నేను బసవలింగ" యని యాతఁడు చెప్పెనని యందురు.

ఈతనిజన్మదేశకాలాదులను దెలుపునాధారములు లేవు కాని యొకచిన్నపుస్తకమున నీతఁడు గోదావరిమండల మందలిదక్షారామ వాసుఁ డనియు నందలి భీమేశ్వరస్వామిపూజారి యగుభీమన యీతని తండ్రియనియు, కోటిపల్లియారాధ్యునికీతఁడు శిష్యుఁడనియు వ్రాయఁబడి యున్నదఁట. పండితారాధ్యచరిత్రమునఁ గూడ నిట్లే యున్నది.

"నొసఁగెద వేంగిమహోర్వీస్థలమున
ససమానలీల దక్షారామ మొప్పు
నప్పురంబున సముద్యన్మహామహిమ
నొప్పు శ్రీభీమేశ్వరోరులింగంబు
రూఢిఁ దద్దేవపురోహితశ్రేష్ఠుఁ
డీడిత విద్వన్మహిష్ఠుండు వీర
భక్తిసత్తముఁడు సద్బ్రాహ్మణోత్తముఁడు
వ్యక్తవానసవంశవర్ధనకరుఁడు
వాత్రుండు భీమన పండితేంద్రుండు

పుత్రార్థియై మమ్ము భువి భజింపుచును
సన్నిధి నొకపురశ్చరణ గావింపు
చున్నవాఁ డతనికి నుదయింపు మనుఁడు
ననురక్తి సాష్టాంగుఁడై యేగుదెంచి
జనియించె భీమాఖ్య సాధ్వి గౌరాంబ
మల్లికార్జున దేవు మహనీయనామ
మగుటఁ బండితమల్లికార్జునుం డనఁగ
యనఘుఁడు గోటిపల్ల్యారాధ్య దేవ
దేవుని సత్కృపాదృగ్వీలోచనను
ధావార్ధి మధ్యగతక్రీడవలన"

ఈగ్రంథము పండితునితరువాతఁ గొలఁదికాలములోనే సోమనాథుఁడువ్రాసియుండుటచే నిందలివిషయములు సత్యములని తలంపవచ్చును. పూజారిని పురోహితుఁడుగా నిందుఁ జెప్పియుండవచ్చును. ఈదేశమున శివాలయములలో సామాన్యముగా "శివార్చకు" లను తెగవారు పూజారులుగా నుందురు. ద్రాక్షారామభీమేశ్వరస్వామికిఁ బూర్వమునుండియు వెలనాటిబ్రాహ్మణులు పూజారులుగా నున్నారు. కావున నీమల్లికార్జునారాధ్యులు వెలనాటిబ్రాహ్మణుఁడై యుండు నని యూహ కలుగుచున్నది. ఆంధ్రదేశమున వెలనాటిబ్రాహ్మణులలో శివభక్తికలవారు పెక్కురున్నారు కాని యారాధ్యుల మనిపించుకొని పరమద్వేషమును గలిగియున్నవారు గన్పడరు. అందుచే నీతఁ డేశాఖాబ్రాహ్మణుఁడో నిశ్చయింపలేము. ఈపండితారాధ్యునివంశములోనివార మని చెప్పుకొనెడివా రిప్పు డారాధ్యనియోగిబ్రాహ్మణులలో నున్నారు.

ఈ మల్లికార్జునారాధ్యు లాంధ్రమున "శివతత్త్వసార" మను నొకగ్రంథమును రచియించెను. గ్రంథమంతయుఁ గందపద్యములు. ఎన్నిపద్యముల నీతఁడు రచించెనో తెలియదు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించినప్రతిలో ౪౯౦ పద్యము లున్నవి. ఈపుస్తకమునకు బ్ర. శ్రీ. కొమఱ్ఱాజు లక్ష్మణరావుపంతులుగారు విపుల మగుపీఠికన్న

వ్రాసియున్నారు. ఈగ్రంథము నీతఁడు రచించె ననుట క్రిందిపద్య మాధారము.

క. ఒండేమి? మల్లికార్జున
పండితుఁ డన నుండు కంటెఁ బ్రమథులలో నె
న్నం డొకొ నీయాజ్ఞోన్నతి
నుండఁగఁ గాంతు నని కోరుచుండుదు రుద్రా!

ఈ కవిచారిత్రమునే, పాలకురికిసోమనాథుఁడు "పండితారాధ్య చరిత్ర" మను పేర ద్విపదకావ్యముగా రచియించెను. అం దీతఁడు శివతత్త్వసారమును రచియించె నని యీక్రింది ద్విపదలలోఁ జెప్పియున్నాఁడు.

ఈక్షితిఁ జనుపూర్వపక్షసిద్ధాంత
పక్షముల్ తత్కర్మభాగైకపూర్వ
పక్షేతరజ్ఞానపక్షసిద్ధాంత
పక్షవేదార్థోపపాదితపరమ
శైవాత్మకాచారసంసిద్ధిశుద్ధ
కేవలభక్తిసద్భావనోపేత
వీరమాహేశ్వరాచారమార్గాను
సారియైన "శివతత్త్వసారసత్కృతిని
గాదె కేవలభక్తిగతిఁ బ్రతిష్ఠించి
యాదటఁ దానును నట్లె వర్తించు
చున్నవాఁ డని వెండియుఁ బ్రశంసింప
మన్నన పేర్మిన మల్లికార్జునుఁడు

ఈ మల్లికార్జునపండితారాధ్యుని సామర్థ్యాదులను పాల్కురికి సోమనాథుఁడు క్రిందిపద్యములలో ననుభవసారమునఁ జెప్పియున్నాఁడు.

సీ. శ్రుతి నేక ఏవ రుద్రో నద్వితీయాయ
తస్థే యనుట యథార్థంబు దలఁప
నవల న ణోరణీయా న్మహతో మహీ
యా నన నదియె యనూనపదము
రహీ నయే వాగ్గోచరం బను అవ్యాప్త
మనసాసహ యన్నమాట నిజము
యేదియుఁ గా దని యెడిపర మేశుఁడే
యెంతయు నని యెఱ్ఱి యెఱుఁగ నసక
యెట్టు లనుచు సంశయింపక శివతత్త్వ
సారగద్యపద్యసమితి శివుని
మహిమఁ దెలిసినట్టిమల్లికార్జునపండి
తయ్యగారి దలంతు ననుదినంబు:

పండితయ్య రచించిన శివతత్త్వ సారముగద్య పద్యాత్మకమని యీ పద్యమునఁ జెప్పఁబడినది. కాని యాగ్రంథమున పద్యములేకాని గద్యలు లేవు.

సీ. వేదముల్ ధరసర్వ వేదేష్వధి ిభవ
యనఁగఁ బరగు లింగ మతిశయిల్లు
నెఱి శ్వపచోపి మునిశ్రేష్ఠ నమోస్తు లిం
గార్చనేరత యన నట్లు నమ్మి
ప్రీతి నరుద్రైనభూత లే యని తత్ర
సన్నిహి తశ్శివ యన్న యదియు
తగ నచప్రాజ్యో యథావ్యూహంబనె నని
నేత్రాంగవిక్రయాపాత్ర మగుచు
జంగమంబు గాంచి చని లింగపరవశ
భాతి నుభయలింగభక్తి యుక్తి
మహిమఁ దనరి నట్టిమల్లికార్జునపండి
తయ్యగారి దలఁతు ననుదినంబు.

సీ. ఆది రుద్రేశాత్తమశ్నంతి రుద్రేణ
పీతం పిబతి ప్రఖ్యాతిశ్రుతులు
తన్నిగమాంతార్థమతికిల్బిషంశ్యాద
నర్పితం బనియు సిద్ధాంతములను
అవికల సిద్ధాంత నివహోక్తిలోభాన్న
ధారయే త్తనుశివధర్మములను
శివధర్మశాస్త్రదృష్టిప్రసాద మేవభో
క్తవ్య మనుపురాణకాండములను
సిద్ధ మనుచు వేదసిద్ధాంతశాస్త్రపు
రాణతతుల మలహరప్రసాద
మహిమఁ దెలిపి నట్టిమల్లికార్జునపండి
తయ్యగారిఁ దలఁతు ననుదినంబు.

ఒకప్పుడు బ్రాహ్మ్యధర్మమును విడిచి వీరశైవమతమును గైకొనుమని మల్లికార్జునపండితునకు బసవన వర్తమాన మంపెనఁట! అందుపైని పండితుఁడు పైన వ్రాసినట్లు "భక్తిమీఁదివలపు బ్రాహ్మ్యంబుతోఁ బొత్తు బాయలేను నేను బసవలింగ" యని ప్రత్యుత్తర మంపి, బసవనతోఁ జర్చించి యాతని నెట్లయినను దనమార్గమునకుఁ ద్రిప్పవలయు నను నుద్దేశముతో బసవనను దర్శించుటకై పయనమై వెళ్లెనఁట. పండితారాధ్యుఁ డమరావతిలో నుండఁగా బసవేశ్వరుఁ డతనికి భస్మము నంపెను. అచ్చటనే యాతఁడు కర్ణాటమునఁ గవిత్వము చెప్ప మొదలిడెనఁట. పండితారాధ్యులవారిమాహాత్మ్యమును దెలుపు పెక్కుకథలను శైవులు చెప్పుచుందురు. వాని నిట చెప్పుటకు దొరకొంటినేని యది యెంతయో గ్రంథ మగును. అందులకు పండితారాధ్యచరిత్రము మొదలగుగ్రంథము లున్నవి. అందుచే నాకథలను విడిచి, శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుపంతులుగారు శివతత్త్వసార పీఠికలో వ్రాసిన యొకటిరెండుకథలను వారిమాటలలో నిట నుదాహరించెదను.

"సనదవ్రోలు (చందవోలు) అను గ్రామమునందు వెలనాటి చోడుఁ డనురాజు రాజ్యము చేయుచుండెను. చందవో లిప్పుడు గుంటూరుజిల్లా తెనాలితాలూకాలో నున్నది. పూర్వము వెలనాటి రాజులరాజధాని. ధనదపుర మని దానికి నామాంతరము. పండితారాధ్యుఁ డా గ్రామమునకుఁ బోయి తనమతమును బోధింపసాగెను. అచ్చటిరాజు గురువు బౌద్ధుఁడు. అతనిపేరు బౌద్ధపదవదాచార్యుఁడు. ఈతఁడు బ్రహ్మవంశజుఁడట! తాను రాజునకు గురువుగా నుండఁగా నన్యమతస్థుఁ డా రాజధానిలో మతబోధ చేయుట చూచి సహింపనోపక యా బౌద్ధుఁడు రాజుతోఁ జెప్పి యొకగొప్పసభ చేయించి మల్లికార్జునపండితారాధ్యు నాసభకు రప్పించెను. ఆసభకు నద్వైతులు జైనులు సాంఖ్యులు చార్వాకాది నానామతములవారు వచ్చియుండిరి. పండితుఁడు బౌద్ధమతము నితరమతములను దనపాండిత్యమహిమచే ఖండించి తనమతమును స్థాపించెను. ఇంతియకాక శివుఁడు శ్రేష్ఠుఁ డనుటకుఁ దనతల యిచ్చెద ననియు, మంటలో దుమికెద ననియుఁ జెప్పి శివునికంటె నెక్కుడు దైవము కలఁ డని యెవ రైనను జెప్పిన యెడల, వారితల తనకాలితోఁ దన్నెద నని ప్రతిజ్ఞచేసి తనసిద్ధాంతమును నిలుపుకొనుటకై "రుద్రమహిమ" యనుకృతిని రచించెను. అంత బౌద్ధుఁ డేమియుఁ బ్రత్యుత్తర మీయఁజాలక పండితుని నిందించెను అందఱును వెడలిపోయిరి.

కాని బౌద్ధుఁడు పండితుని నిందించినందున నాతనిశిష్యులకు మిక్కిలి కోపము వచ్చెను. 'అట్టినిందకుని జంప కున్నయెడల నతఁడు ద్రోహికాఁడు; తామే ద్రోహుల మగుదుమని వారు తలంచిరి. పండితునిశిష్యులలో కేమయ్య దేవయ్య లనువా రీపనికిఁ బూనుకొనిరి. సముద్రములోని యొకలంకలో (సముద్రము చందవోలునకుఁ దొమ్మిది మైళ్ల మీఁద నున్నది.) నొకబౌద్ధాలయ ముండెను. అచ్చటి కాబౌద్ధుఁడు ప్రతిదిన మొక్కఁడు వెళ్లివచ్చుచుండును. ఆసంగతి తెలిసినవారు గావున నొకనాఁ డుదయముననే కేమయ్యదేవయ్యలా లంకకు నెవరికిఁ దెలియకుండఁ బోయి దేవునిమఱుగున దాఁగియుండి

బౌద్ధుడు వచ్చి బుద్ధవిగ్రహమునకు జాఁగిలి మ్రొక్కుచున్నప్పుడు వానిని జంపి వికృతరూపునిఁ జేసి వెడలిపోయిరి. ఈ సంగతి తెలిసి రాజు మిక్కిలి కోపించి పండితయ్యను బిలిపించి యడుగఁగా నతఁడు. 'నేనే చేయించితిని; నేనేచంపించితి' నని దోషమంతయుఁ దనమీఁద మోపు కొనియెను. అంత రాజు పండితునికనులు తీయింపఁగా నతఁడు రాజు నకు శాపము పెట్టి యచ్చటనుండి శిష్యయుక్తముగా నమరావతికి వెడలిపోయెను.

చందవోలులో నున్నప్పుడే యీతఁడు "లింగోద్భవగద్య" యచ్చటిదేవునిపైఁ జెప్పెను. లింగోద్భవుని దేవాలయ మిప్పటికిని జందవోలులో నున్నది. 'చందవోలు కైఫీయతు' అనుపుస్తకము నందు నీకథయే యిట్లున్నది. పండితారాధ్యుఁడు శ్రీశైలమునకుఁ బోవుచు చందవోలునకు వెళ్లి పాండీశ్వరస్వామి గుడిలో దిగెను. కొండపడమటి బుద్ధరాజునకు గురువైనబౌద్ధుఁడు బుద్ధాం అనుగ్రామమం దుండెను. వాఁడు పండితునిమహిమను జూచి యోర్వలేకపోయెను. పండితుని ప్రతిదినశివపూజలోఁ గావలసినయొకపూజాపాత్రను బౌద్ధుని శిష్యుఁ డైన చెజుఁడనువాఁ డెత్తుకొనిపోయెను. పండితునిశిష్యులు వానిని బట్టుకొని చంపిరి. ఈసమాచారము వారు తమగురువునకుఁ జెప్పలేదు. అంత బుద్ధరాజు పండితునివద్దకు మనుష్యులను బంపి నర హంతకున కేమిశిక్ష శాస్త్రీయ మనియడుగఁగాఁ గనులుతీయుటయే తగినశిక్ష యని పండితుఁడు చెప్పె నఁట, దానిపై బుద్ధరాజు పండితుని కనులు తీయించెను. పండితుఁ డాతనికి శాప మిచ్చి యిఁకమీఁద శైవు లెవరును చందవోలులోఁ దీర్థము పుచ్చుకొనఁ గూడ దని నియమించి వెడలిపోయెను.

అమరావతి చేరగనే పండితుఁడు చోడునితో భాషించినపాపము పోవుటకును శివనింద విన్నపాపము పోవుటకును శివభక్తులసహస్ర నామగణమాలిక పఠించెను అమరేశ్వరాష్టకముఁ జెప్పెను.

కన్నడభాష తనకు రావలయు నన్న కోర్కెతో నీతఁడు కల్యాణమునకు బసవేశ్వరునియొద్దకు వర్తమాన మంపెను. అంత నాతఁడు భస్మ మంపెను దానిని ధరింపఁగనే పండితునకుఁ గన్నడభాష వచ్చెను. అతఁ డాభాషలోఁ గొన్నిగీతములను చెప్పెను. తరువాతఁ బండితుఁడు బసవేశ్వరుని జూడవలయునని కల్యాణపురమునకు బయలు దేరెను. త్రోవలో సారంగేశ్వరుఁడు దేవుఁడు గాఁగల నిడుగుమ లను చోట (1) తనముఖ్యశిష్యుఁ డగుదోనయ్యగారికి నన్న యైనవీరచాకి రాజయ్యగారిచే గౌరవింపఁబడి పానుగంటికిఁ (2) బోయెను. అచ్చట నుదయుఁ డనురాజు నొద్దనున్న పింగలి గోవిందప్రధాని పండితుని భక్తుఁడు. కావున నాతనిని మిక్కిలి మర్యాదతో నెదుర్కొని తన యింటికిఁ దోడ్కొనిపోయెను. అచ్చట ధవళేశునామయ్య యను భక్తుఁడు కలఁడు. ఇతఁడు రాజునొద్ద స్వాంతసేవకుఁడు (ఖాసా) పండితుఁ డాగ్రామమునకు వచ్చినప్పటినుండియు నాతనిభజనలోనుండి రాజుసేవ సరిగఁ జేయకుండెను. అంత రాజునకుఁ గోపము వచ్చి యాతనిని బిలిపించి కోపపడఁగా దేహము మాత్రము మీది గాని ఆత్మ మీది కాదు. మీ దేహమును మీరు తీసికొండని గుడిశిఖరము మీఁదికెక్కి యురిపెట్టుకొని చచ్చెను. అంతఁ బండితుఁ డారాజునకు శాపము పెట్టి వెడలిపోయెను.

---

(1) "నిడుగుడుములు అనునది యిప్పుడు కృష్ణాజిల్లా నందిగామతాలూకా మునగాల జమీందారీ లోని ముఖ్యగ్రామ మగు 'నడిగూడెము' అని నాతాత్పర్యము. ముదమున నిడుగుడుములకు నేతెంచి సదమలాత్ముఁడు వీరచాకిరాజయ్య ప్రవ్యక్తభక్తిసారంగేశునందు (మహిమ. పుట–౫౬౭) అని చెప్పఁబడి యున్నది. ఇప్పుడు నడిగూడెము అనఁబడుగ్రామమునకు 'నడిగుడుములు' అని పూర్వము లెక్కలలోఁ బేరుగలదు. ఇచ్చటిదేవుఁడు సారంగేశ్వరుఁడు: ఇది యమరావతినుండి పానుగంటికిఁ బోవుత్రోవలో నున్నది.

(2) నైజాము రాజ్యమునందు రెండుపానుగల్లు లున్నవి ఒకటి నల్లగొండ జిల్లాలోనను వేఱొకటి మహబూబ్‌నగరుజిల్లా నాగర్‌కర్నూలుతాలూకాలోను కలదు. ఉదయుచోడుని స్థలమునుబట్టి నాగర్‌కర్నూలుతాలూకాలోనిదే పండితుఁడు వెళ్లినపానుగల్లని నిశ్చయింపవచ్చును. ఇం కొకపానుగల్లు (హానుగల్లు) బొంబాయిరాజధానియందు ధార్వారుజిల్లాలో గలదు.

వసిపురములో శంకరయ్య యనుభక్తుని సపర్యలఁ గొనికల్యాణమునకుఁబయలుదేఱగా నంతకుఁ బూర్వ మెనిమిది దినములక్రింద బసవేశ్వరుఁడు లింగైక్యముఁ జెందె నన్నసమాచారము త్రోవలోఁ దెలిసి పండితున కమితఖేదము కలిగి యాతఁడు బసవనిఁ బొగడుచుఁ బ్రలాపించెను.

అంతఁ బండితుఁడు శ్రీశైలపర్వతమునకుఁ బోయెను. వెల్లటూరు (1) నొద్దకు వచ్చి తా నచటనే యుండి తనప్రియశిష్యుఁ డైన దోనయ్యను గిరిప్రదక్షిణముచేసి శివరాత్రివఱకు శ్రీశైలముపైకిఁ బోయి తనవ్రతమును బూర్తిచేయు మని చెప్పి యతనికి పర్వతవర్ణనము నుడివెను. అతఁడు గిరిప్రదక్షిణము చేసి వచ్చినతరువాతఁ బండితుఁడు తాను వచ్చినపని యైన దనియు; బసవేశ్వరుఁడును బోయెను గనుకఁ దా నుండనక్కఱ లే దనియు, నీశ్వరుని బ్రార్థన చేసి భార్యాపుత్రులతో వెల్లటూరులోనే లింగైక్యముఁ జెందెను.

పండితేంద్రుఁడు మరణసమయమునకు వృద్ధుఁ డైనట్లు మనము తలంపవచ్చును.......పండితునిమరణము బసవేశ్వరునితరువాతఁ ద్వరలోనే తటస్థించె నని మన మెంచినయెడల, క్రి. శ. ౧౧౯౦ ప్రాంతమతనిమరణకాల మని నిర్ణయించుకొనవచ్చును. అప్పటి కాతఁడు ౭౦ యేండ్లవాఁ డని యెంచినయెడల క్రి. శ. ౧౧౨౦ ప్రాంత మాతనిజన్మకాల మగును. ఇట్లీతఁడు మొదటివెలనాటిచోడుని కాలమునను, రెండవవెలనాటిచోడుని కాలమున నుండిన నుండవచ్చును.”

ఈమల్లికార్జునపండితు లాజన్మాంతమును బ్రాహ్మణుఁడుగనే యుండెను. కాని జంగముఁడు కాలేదు. శిఖాయజ్ఞోపవీతములను విసర్జింపలేదు. వానిని విసర్జించుట యాతని కిష్టము లే నట్లాతఁడు రచియించినశివతత్త్వసారమునందే యున్నది. పండితారాధ్యచరిత్రమును

---

(1) గుంటూరుజిల్లాలో రెండు వెల్లటూళ్ళు కలవు. ఒకటి రేపల్లెతాలూకాలోను, ఇంకొకటి వినుకొండ తాలూకాలోను, నైజాము రాజ్యమున నల్లగొండ జిల్లాలోఁగూడ నొకవెల్లటూరు కలదు కాని శ్రీశైలమునకు సంబంధించినది వినుకొండతాలూకాలోనిదియే ఇది వినుకొండనుండి శ్రీశైలమునకుఁబోవు త్రోవకు నాలుమైళ్ళ ప్రక్కగ నుండును.

గన్నడమున నీలకంఠకవియు, సంస్కృతమున గురురాజకవియురచియించియున్న వారఁట. శ్రీనాథమహాకవి పాల్కురికిసోమనాథునిద్విపద కావ్యమునుబట్టి యాంధ్రమునఁ బద్యకావ్యముగాఁ బండితారాధ్యచరిత్రమును రచియించెను. కాని యది యిప్పుడు లభ్య మగుటలేదు. మల్లికార్జునపండితుల వంశము లోని వా ర మని చెప్పుకొను వా రాంధ్ర దేశమునఁ గొంద ఱున్నారు. వా రిప్పుడారాధ్యనియోగిబ్రాహ్మణులని పిలువఁబడియెదరు. వారు లింగధారణ మొనర్చెదరు. పండితారాధ్యులు లింగధారణ మొనర్చి నట్లు కన్పట్టదు. ఈవంశీయులు శిఖాయజ్ఞోపవీతముల నుంచికొని వేదబాహ్యులుకాక బ్రాహ్మణులుగనే యుండి, శైవాచారముల ననుష్ఠింపుచు, లింగధారణ మొనర్చుచున్న వారు.

మల్లికార్జునపండితులు 'వాసస' గృహనామము వారనియు ఋగ్వేదు లనియు చందవోలు కైఫియ్యతునందున్నది. వీరిది గౌతమగోత్రమందురు. కాని నిశ్చయముగాఁ జెప్పలేము. ఈతనియింటిపేరు వాసన యనిపండితారాధ్యచరిత్రమునఁగలదు. మడికిసింగనకవికృత పద్మపురాణమును గృతినందిన కందనమంత్రి యింటిపేరుకూడ వాసన వారే. కాని వారిది కాశ్యపగోత్రము. రాజరాజుచేత నందంపూడి యగ్రహారమును బడసిన నారాయణభట్టుగృహనామముకూడ "వాసస" యే. ఆతనిది హారితసగోత్రము. వానసవారిలో వసిష్ఠగోత్రులుకూడఁ గలరు.

ఈమహాపండితుఁ డాంధ్రమునను, సంస్కృతమునను కన్నడమునునుగూడఁ గొన్నిగ్రంథములను రచియించెను. శ్రీముఖగద్యము, హారలీల, లింగోద్భవదేవుగద్యము, అమరేశ్వరాష్టకము, పర్వతవర్ణనము, గణసహస్రనమాల, రుద్రమహిమ, బసవమహిమ ప్రభులింగస్తోత్రము నను కృతులను రచియించినట్లు పండితారాధ్యచరిత్రమువలనఁ దెలియుచున్నది. ఇవి చిన్నచిన్నగ్రంథము లని తోఁచుచున్నది. ఈతనిరచనము లింకను గల వని కొంద ఱనుచున్నారు. కాని నా కవి లభింపలేదు. ఇందు బసవగీత ప్రభులింగస్తోత్రము కన్నడగ్రంథములు. శివతత్త్వసార శైలిచూపుటకై కొన్నిపద్యముల నిటవ్రాయుచున్నాఁడను.

క. వేదోక్తమార్గమున న
త్యాదరమున నిన్నుఁ గొలిచి యపశుపులు నీ
చే దేహపాశబంధ
చ్ఛేదంబున ముక్తు లగుట సిద్ధము రుద్రా!

క. జీవునకు బంధమోక్ష ద
శావస్థలు గలవు నీకు నవి లేవగుటన్
జీవునకు నీకు నైక్యము
భావించుట ముఖ్యవృత్తిబాధకము శివా.

క. అనయము రుద్రాక్షవిభూ
తినియుక్తులయిండ్లదిక్కు దెసఁ బోవకుఁ డో
యని చాటించును గాలుఁడు
తనపురి శివశాసనుండు ధన్యుండగుటన్.

మల్లికార్జునపండితారాధ్యులవలంబించిన శైవమతపద్ధతినిగూర్చి క్లుప్తముగాఁ బైన వ్రాసియుంటిని. ఆతనియభిప్రాయములను, ఆ కాలము నాఁటి యితరమతధర్మములనునందుపండితారాధ్యులు గావింపయత్నించిన సంస్కరణములను విపులముగాఁ దెలిసికొనఁ గోరువారు శివతత్త్వసారమును పరిశీలనాబుద్ధితోఁ జదువవలసియున్నది. పండితుని కాలమున జైనచార్వాకబౌద్ధమతములు ప్రబలియున్నట్లును వానిని ద్వేషించి యాతఁడు శైవమతమును జేపట్టెననియు క్రిందిపద్యము వలనఁ దెలియుచున్నది.

క. శ్రుతిబాహ్యంబులు కావున
సతతంబును జైనబౌద్ధచార్వాకులమ
ర్మతములు పట్టక పట్టితి
శ్రుతిసారభవన్మతంబు సుమతి మహేశా!

క. ప్రాజ్ఞులు దేవజ్ఞులు లో
కజ్ఞులు చేకొండ్రె గతశిఖాగాయత్రీ
యజ్ఞోపవీతనాస్తిక
లజ్జులు చేకొంద్రు గాక యద్వైతమజా!

పండితారాధ్యునకు జ్ఞానమార్గ మంగీకారమే కాని యద్వైత మంగీకరింపఁడు. జ్ఞానమార్గమునకంటె భక్తిమార్గమే శ్రేయస్కరమని యాతనియభిప్రాయము.

బసవనారాధ్యుఁడు క్రీ. శ. ౧౧౬౮ ప్రాంతమున లింగైక్యము నందెనని చరిత్రకారు లేకగ్రీవముగా నుడివియున్నారు. ఆతనియనంతరమున నీపండితారాధ్యులు ౨౨ సంవత్సరములు జీవించియుండి ౧౧౯౦ ప్రాంతమున మరణించియుండునని శ్రీ లక్ష్మణరావుపంతులు గారును ౧౧౭౦ ప్రాంతముననే లింగైక్యము నొందియుండునని మఱి కొందఱును వ్రాసియున్నారు. కాని యీతఁడు క్రీ.శ. ౧౧౮౦ వఱకును జీవించియుండునని నాయభిప్రాయము. అప్పటి కీతనికి ౭౦ సంవత్సరములవయ సుండునని చరిత్రకారులందఱు నంగీకరించుచున్నారు.

వెలనాఁటిచోడులలో మొదటియాతఁడు క్రీ. శ. ౧౧౧౫ మొదలు ౧౧౩౬ వఱకును రెండవయాతఁడు ౧౧౬౩ నుండి ౧౧౮౦ దనుకను రాజ్యము చేసియుండుటచే పండితారాధ్యులు వాదమున నోడించినది రెండవవెలనాఁటిచోడుని యాస్థానమున నున్నబౌద్ధులనే యని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

ఈతఁడు రచించినశివతత్త్వసారమును శతక మనియనియెదరు. కాని సామాన్యశతకలక్షణములిందు లేవు. శతకములయందు సామాన్యముగాఁ బ్రతిపద్యమునను నంత్యమున నొకపదమో కొన్నిపదములో నియమముగా వచ్చుచుండును. దానినా శతకమునకు మకుట మందురు. ఈశతకమున నట్టినియమము లేదు. అజా "శివా" ఇత్యాదిపదములలో శివునిసంబోధన ముండును. కొన్నిపద్యములలో నట్టిసంబోధనమును లేదు. అయినను దీనిని శతకమనియే పాల్కురికి సోమనారాధ్యుఁడు—

"శతకంబు శివతత్త్వసారంబు దీప
కళికమహానాటకము నుదాహరణ"

అని పండితారాధ్యచరిత్రమున వ్రాసియున్నాఁడు అని కొందఱను చున్నారు. కాని "శతకంబు" అనుపదమును శివతత్త్వసారమునకు విశేషణముగాఁ జేయరాదనియు మల్లికార్జునపండితారాధ్యులు శ్రీగిరి

మల్లికార్జునశతకము నొకదానిని వ్రాసియున్నారనియు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు భారతిలో వ్రాసియున్నారు. అదిసత్యమే. ఆశతక మిప్పుడెచ్చటను గానరాదు.

పండితారాధ్యులతనయులను గూర్చియు మనుమలనుగూర్చియు పాలకురికిసోమనారాధ్యునిచరిత్రమున వ్రాసెదను. పండితారాధ్యులకు విభూతిగౌరయ్యయనుశిష్యుఁడొకఁడుండెనఁట. అతనిశాసనములుకొన్నియున్నవి.

(A. R. 315 of 1930–31:–A. R. P. 116-117 (1925-26).

ఇతఁడువరంగల్లునకుసమీపమున నున్న మాచిరాజుపల్లెవాస్తవ్యుఁడు. పండితారాధ్యులవారియొద్ద శ్రీగిరిపర్వతముమీఁద వారియింటిసేవకుఁడుగానున్నట్లు, ఆశాసనమువలన దెలియుచున్నది. ఆశాసనములలోఁగాలమీయలేదు. దీనినిబట్టి యారాధ్యులవారు శ్రీశైలమునందేఁ గాపురముండినట్లు గన్పట్టుచున్నది.

17. రుద్రదేవ మహారాజు

ఆంధ్రదేశమును బరిపాలించినకాకతీయరాజులలో నితఁ డొకఁడు. ఈ కాకతీయులు సూర్యవంశక్షత్రియులమని చెప్పుకొనుచు వచ్చిరి. కొంతకాల మట్లు శాసనములలోఁ గూడ వ్రాసికొనియున్నారు. కాని చరిత్రకారులు పరిశోధనచేసి వీరు శూద్రులని యిప్పుడు నిశ్చయించిరి. కాకతియనుదేవతాప్రసాదముచే నీవంశమున మూలపురుషుఁ డొక గుమ్మడితీగెకు బుట్టినవాఁ డగుట వీరు కాకతీయులైరని యొకకథయు, శత్రురాజులభీతిచే నొకశిశువును గుమ్మడిపండులోఁ బెట్టి కోటదాటించి యావలకుఁ బంపుటమూలమున రక్షింపఁబడినవాఁడు మూలపురుషుఁ డగుటచే నీవంశమువారు కాకతీయులైరని యొకకథయు నిట్లే వేఱువేఱు కథలు వీరిపూర్వచారిత్రమును గూర్చి ప్రచారములో నున్నవి. వీరు మొట్టమొదట పశ్చిమచాళుక్యులకు సామంతులైనను, క్రమక్రమమున స్వతంత్రులై యించుమించుగ మూఁడువందలసంవత్సరములు క్రి. శ. ౧౦౦౦వ సంవత్సరము మొదలు ౧౩౩౦వ సంవత్సర ప్రాంతమువఱకును ఆంధ్రదేశమును బరిపాలించియున్నారు. అవక్రపరాక్రమముచే నాంధ్రదేశమునే కాకుండ కర్ణాట, కళింగ,

ద్రావిడాదిదేశములలోఁ గూడఁ గొంతకాలము కాకతీయులు తమరాజ్యము ను విస్తరింపఁజేసి యుండిరి. వారిచరిత్రలను వ్రాయుటకిట తావు లేదు. శ్రీ చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు కాకతీయాంధ్రరాజ యుగచరిత్రమును దాదాపు ౬౦౦ పేజీలగ్రంథముగా వ్రాసియున్నారు. ఈకాకతీయులనుగూర్చి యింక ననేక గ్రంథములున్నవి. వీరు మొదటి నుండియుఁ దా మాంధ్రుల మని చెప్పుకొనుచు వారిశాసనములలో నాంధ్రులమని యుదాహరించుకొని యున్నారు.

ఈ రుద్రదేవమహారాజు తండ్రి ప్రోలరాజు. తల్లి ముప్పమదేవి. ఇతఁడు నిజాంరాష్ట్రమునందలి యోరుగల్లు రాజధానిగా నాంధ్రరాష్ట్ర మును హూణశకము ౧౧౪౦ మొదలు ౧౧౯౬ వఱకును పరిపాలించుచు బలాక్రమవంతుఁడై రాజుల ననేకులను జయించి, కీర్తివడసినవాఁడు. ఇతనిని ప్రతాపరుద్రమహారాజనికూడ వాడుచుందురు. కాకతీయ ప్రభువులలో క్రీ. శ ౧౨౯౬ మొదలు ౧౩౨౬ వఱకు రాజ్యమును జేసిన యింకొక ప్రతాపరుద్రుఁ డుండుటచే నీరుద్రదేవమహారాజును మొదటిప్రతాపరుద్రుఁ డనియు నాప్రతాపరుద్రుని ద్వితీయప్రతాప రుద్రుఁ డనియుఁ జరిత్రకారులు వ్రాయుచున్నారు. ఈ మొదటిప్రతాప రుద్రమహారాజు కవిపండితపోషకుఁ డయి యశస్సు నార్జించుటయే గాక స్వయముగఁ గావ్యరచనము చేసినవాఁ డని చెప్పుదురు. ఇతఁడు సంస్కృతమున నీతిసార మను గ్రంథమును చేసినట్లీ క్రిందిపద్యము వలనఁ దెలియుచున్నది.

చ. పరువడి నాంధ్రభాషఁ గలబద్దెననీతియు సంస్కృతంబులోఁ
 బరఁగఁ బ్రతాపరుద్రనరపాలునిచే రచియింపఁబడ్డయా
 నరవరునీతిసారము వినం జదువం గడుమంచి దంచుఁజె
 చ్చెరఁ గవి నీతివద్ధతులు చేసె వినోదము బాలబోధకున్.

ఈ రుద్రదేవమహారాజు సంస్కృతముననే కాకుండ నాంధ్ర మునఁగూడ నీతిసారమును రచించె నని మానవల్లి రామకృష్ణకవిగారు బద్దెనకృతమైన నీతిశాస్త్రముక్తావళిపీఠికలో వ్రాసియున్నారు. మడికి సింగనకవి తనసకలనీతిసమ్మతమున నీతిసారములోని వని కొన్నిపద్య

ముల నుదాహరించియున్నాఁడు. కాని నీతిసారకృతికర్త యెవ్వరో యతఁడు చెప్పలేదు. ఆంధ్రకావ్యకర్త లెవరును నీరుద్రదేవుని దమ గ్రంథములలో స్మరించియుండలేదు. అయిన నాంధ్రనీతిసారకృతికర్త లెవరైన నేర్పడువఱకు నాకర్తృత్వ మీతనిపైన నుంచవచ్చును. ఈరుద్రదేవమహారాజు సంస్కృతమున మఱికొన్ని గ్రంథములను రచియించి యుండెనని చెప్పుదురు. అవి గన్పడుట లేదు. నీతిసారమునందలికొన్ని పద్యముల నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

గీ. ఆజ్ఞ లేనినృపుఁడు నరయఁ జిత్తరువులో
నున్నరాజుఁ జూడ నొక్కరూప
యానఁ ద్రోయు సుతుని నైనను దండింప
కున్న రాజ్య మేలనుండుఁ జెడక.

క. దండము లేకున్ననుఁ బ్రజ
లొం డొరువుల నాక్రమింతు రుచితస్థితిమై
నుండవు వర్ణాశ్రమములు
దండింపని భూమిపతికి ధర యేర్పడునే.

క. జనపతి పర్జన్యునిగతిఁ
దనభూప్రజఁ బ్రోవవలయుఁ దగఁ బ్రోవఁడయేఁ
దనుఁ బాసిపోవు నాప్రజ
ఘననీరసనరసిఁ బాయుఖగములభంగిన్.

క. ఆపదలఁ జెందుప్రజలను
భూపతి మొద లిచ్చి మగుడఁ బ్రోవఁగఁ జనుఁ దాఁ
జేపట్టి విడువవలవదు
భూపతికిఁ గుటుంబ మనఁగ భూమియ కాదే.

గీ. కీడు సేయువానికిని మేలు సేయుట
మునులగుణము గాక జనుల నెల్లఁ
బ్రోచువాఁడు కల్లరుల నాజ్ఞ వెట్టుట
యాగపశువిధంబు నట్ల కాదె.

గీ. ఎంత వాఁడలియున్న నేరండములు జీలు
గులును దారుకృత్యములకు నగునె

యితరు లెంద ఱైన నేలిక కధికులై
చేయుపనులు పూని చేయఁగలరె.

క. జూదమును బన్నిదంబును
వాదును బతితోడఁ దేఁడవలవదు కడుఁ బో
రా దయ్యోనేని భృత్యులు
భేదముగాకుండు గెలుపు పెనుపఁగవలయున్.

క. ధనమును భ్రాతశ్చాయయు
వనితాజనయౌవనంబు వండినయన్నం
బును గడుమూర్ఖస్నేహం
బును నిల నివి యల్పకాలభోగ్యము లరయన్.

క. దూరము వ్యవసాయకులకు
భారంబు సమర్థులకును భాసురవిద్యా
పారగులకును విదేశము
వైరము ప్రియవాదులకును వసుమతిఁ గలదే.

గీ. విమతు లా వెఱింగి వెర పేఁది తోడగుట
మిడుత లగ్గిమీఁదఁ బడినయట్లు
తోడు లేక యధికుఁ దొడరుట యంబుధిఁ
గలము లేక యీఁదఁ గడఁగినట్లు

ఉ. కొందఱ మేలమాడుటలుఁ గొందఱి వావులు దేర్చి పిల్చుటల్
కొందఱ ముద్దు సేయుటయుఁ గొందఱ నెయ్యఁపుఁజూపు సూచుటల్
కొందఱి నాత్మభావమునఁ గొందఱ మన్నన భృత్యులందు ని
ట్లందఱ నన్నిభంగు నృపాగ్రణి వశ్యులఁ జేయుఁగాఁ దగున్.

ఈ రుద్రదేవమహారాజునకుఁ బూర్వమందును బరమందును గూడ నీవంశీయులకు గాకతీయు లని పిలుచుచున్నారు. కాకతి యను పట్టణమునుబట్టి వీరి కీపేరు వచ్చెనని కొందఱును కాకతి యనుపర దేవతాప్రసాదమున నీవంశకర్త యుద్భవించుటచే వీరు కాకతీయులయి రని కొందఱును కాకతీయను దేవత నారాధించుటచేఁ గాకతీయు లైరని మఱికొందఱునిట్లు పలువురు పలువిధములుగాఁ దలంచుచున్నారు. ఆ వివాదములతో మన కిపుడు పనిలేదు. వంశనామ మైనను, గృహనామ

మైననూ, వీరిపేరులకు ముందు కాకతి శబ్దము చేర్పఁబడుచున్నది. వీరు దుర్జయునిసంతతివార మని కొన్ని శాసనములలోఁ జెప్పుకొని యున్నారు. కొన్నిటిలోఁ గరికాలచోళునికూడ వంశకర్తగాఁ జెప్పుకొనిరి. కాని యది గమనింపఁదగినది కాదు. ఈ వంశీయులలోఁ జరిత్ర కందిన మొదటిపురుషుఁడు బేతరాజు. ఆతఁడు మొదలుగా వీరి వంశవృక్షము నీక్రిందనిచ్చుచున్నాఁడను.

- బేతరాజు
  - (మొదటి) ప్రోలరాజు ౧౦౫౦—౧౦౭౫
    - (రెండవ) బేతరాజు ౧౦౭౫—౧౧౦౦
      - దుర్గరాజు త్రిభువనమల్లబిరుదాంకితుఁడు ౧౧౦౦—౧౧౧౦
        - (రెండవ) ప్రోలరాజు ౧౧౧౦—౧౧౫౮
          - రుద్రదేవమహారాజు ఇతఁడే నీతిసారకృతికర్త ౧౧౫౮—౧౧౯౫
          - మహాదేవరాజు ౧౧౯౫—౧౧౯౮ బయ్యాలదేవి
            - గణపతిదేవుఁడు ౧౧౯౯—౧౨౬౦ సోమమ్మ, నారమ్మ, పేరమ్మ,
              - కోటగణపాంబ (కుమార్తె) భర్త గణపతి
              - రుద్రాంబ, (కుమార్తె) ౧౨౬౦—౧౨౯౫ భర్త చాళుక్యవీరభద్రుఁడు
                - పెంపుడుకుమార్తె ముమ్మడాంబ భర్త మహాదేవరాజు
                  - ప్రతాపరుద్రమహారాజు ౧౨౯౫—౧౩౨౬
                - కుమార్తె రుయ్యాంబ ఈమెను ఇందులూరి అన్నయామాత్యుఁడు పరిణయ మయ్యెను.

కాకతీయుల శాసనములలో సామాన్యముగా మొదటి ప్రోలరాజు నుండియే వంశవర్ణనము చేయఁబడుచుండును. కాని ఖాజీపేటలో నున్న యొక శాసనమునందు, (కాకతీయసంచిక—శాసనబంధము ౫౬వ పేజీ). బేత రాజుకుమారుఁడు ప్రోలరాజనియు, నాతనితనయుఁడు బేతరాజనియుఁ జెప్పియుండుటచే నీవంశమునకు మూలపురుషుఁడు బేతరాజని నిశ్చయించి యిందాతనిని వంశకర్తగాఁ జూపితిని. ఈవంశవృక్షములోఁ జూపిన యంకెలాయారాజులపరిపాలనాకాలమును హూణశకములోఁ దెలుపును. మొదటి ప్రోలరాజు ౧౦౫౦వ సంవత్సరమున రాజ్యపాలనము ప్రారంభించినాఁ డనినచో నాతనిజననము ౧౦౧౦ ప్రాంతమగును. అట్లయినచో, మొదటి బేతరాజు జననము క్రీ. శ. ౯౭౫ ప్రాంతమయి యుండును.

౧. బేతరాజు:—ఇతనిమనుమఁడుకూడ బేతరాజగుటచే నితనిని మొదటి బేతరాజని యనుచున్నారు. ఇతఁడు క్రీ. శ. ౯౭౫–౧౦౩౦ కి నడుమనున్నవాఁ డని చరిత్రకారులయభిప్రాయము. ఈకాలము సరియైన దని నిర్ధారణముగాఁ జెప్పుటకుఁ దగినయాధారములు లభింపలేదు. శా. శ. ౧౦౦౧–౧౦౧౨ సంవత్సరములలో బేతరాజుపేరుననున్నవి రెండుశాసనములు గనపడుచున్నవి. కాని యవి రెండవబేతరాజువి. కావున వానినిబట్టి యీతనికాలనిర్ణయమును జేయ నగుపు కాదు. ఆశాసనములు రెండవబేతరాజు వని నిశ్చయమైనచో నవి క్రీ. శ. ౧౦౭౯–౧౦౯౦ సంవత్సరములవి కావునను మొదటిబేతరాజుజననమునకును, రెండవబేతరాజుజననమునకును దాదాపుడెబ్బదిసంవత్సరములు భేదముండును గావునను పైనఁజెప్పిన మొదటిబేతరాజుకాలము సరియైన దనియే తోఁచుచున్నది. పైనఁ గనుపఱచిన వంశవృక్షములోని యంకెలుకూడ నీయంశమును ధృవపఱచుచున్నవి.

విరియాలమెఱ్ఱ భూపతిపేరున గూడూరుశాసన మొకటి యున్నది. ఈశాసనమున నెవరికిని దాన మొసంగినట్లు లేదు. బేతరాజునాతనిని కొరవిదేశమునఁ బ్రతిష్ఠించినట్లును నాతనినే కాకతవిభునిగాఁ జేసినట్లును నందు వ్రాయఁబడియున్నది. ఇది యందుకొఱకే పుట్టినట్లు

గన్పట్టుచున్నది. ఈశాసనమునఁ గాలము లేదు. ఇది యాంధ్రభాషలోఁ జంపకోత్పలమాలలలోనున్నది. ఆపద్యముల నీక్రింద వ్రాయుచున్నాఁడను. (కాకతీయాంధ్రరాజయుగము సింపుటు)

చ. అనుపమదుర్జయాన్వయసుధాబ్ధి ననేకులు రాజనందనుల్
సనినఁబిఱుంద వెన్నఁడను సంభవుఁ డయ్యె నతిప్రసిద్ధుఁడై
వినుతవిరోధిమండలిక వెన్నుఁడు వెన్నఁడపోలె వానికిన్
ఘనుఁ డగునెఱ్ఱభూపతి జగద్వినుతుం డుదయించెఁ గీర్తితోన్. ౧

ఉ. భావితకీర్తి నాతనికిఁ బాండవమధ్యమభీముఁడో యనం
గా పిరియాలభీము నృపఘస్మరుఁడై యుదయించె వానికిన్
భూవినుతుండు మండలికభూషణుఁ డెఱ్ఱనరేంద్రుఁ డుత్తమ
శ్రీవినుతుండు బంధుజనసేవ్యుఁడు దా నుదయించె నున్నతిన్. ౨

చ. అతఁడని బొట్టబేతవసుధాధిపుఁ జేకొని వానివైరి ను
ద్ధితమునఁ జంపి యాశౌఅవి దేశమునందు ప్రతిష్ఠ చేసి త
త్తనయు సమేతుఁ డోడ గని...యము బిట్టర గద్యనంబు వ
ప్రతిముఁడు వాని దా మొగుడుపర్సియు పంద్రడదు నెఱ్ఱఁ డాప్తుడై. ౩

చ. అరు దగునట్టి ఎఱ్ఱనృపునంగన గామమసాని యాఁక మే
ల్గరదని బేతభూవిభుని గాకతివల్లభు సేసి వాని తా
బరగఁగఁ జేతఁబట్టి ఘను బల్లవరాయని యాఁగి జొచ్చె భా
స్కరవిభు చక్రవర్తిగని కాకతి నిల్పుట గోటిసేయదే. ౪

ఉ. కారక కాలుఁడై పడుసె గాడయనాయకుజంపి సూరడ
వ్వేలుపుకొండ రవ్వనృపు వేలుపుగొండన నిల్పి వానిచే
మేలుగ మూడముప్పయిని మేలుగ నేరెడు బోదిపాడునుం
మేలుగ టేకుమావిడులు మేలుగ రెండెయరాజునంగడై. ౫

సూత్రధారి కొమ్మోజనబరహా॥ శ్రీ శ్రీ శ్రీ

ఆడపగట్ట దేవరకు జేసు

పీనిలో మొదటిరెండుపద్యములును, మూఁడవపద్యములో రెండుపాదములును అర్థవంతములై యున్నవి. మిగిలినభాగమునఁ గొన్ని

యర్థములుకానిపదము లున్నవి. మూఁడవపద్యమునందలి మూఁడవ పాదమున ప్రాస తప్పినది. ఆపాదముననే పదునొకండవ యక్షరము లోపించినది. రెండవపద్యమందలి విరియాలభీమశబ్దమున కాంధ్రప్రత్యయము చేర్చకుండ భీమ యనియే యుపయోగింపఁబడినది. "భీమనృపఘస్మరుఁడై" యనిసమాసపదముగాఁ జెప్పినచో నన్వయము కుదరదు. అయిదవపద్యమున మొదటిపాదమునందు ప్రాస తప్పినది. లేఖకులు ప్రాస మైత్రిచేసియుండవచ్చును.

దుర్జయవంశమున ననేకులు రాజకుమారులు గలిగించినపిమ్మట ప్రసిద్ధుఁడైనవెన్నఁడనునాతఁడు జన్మించెననియు నతనికి యెఱ్ఱభూపతి పుట్టెననియు, నాతనికిఁ బాండవభీముఁడువంటి విరియాలభీముఁడు కలిగెననియు, నతని కెఱ్ఱభూపతి జనించెననియు నతఁడు బొట్టబేతనిని జేపట్టి వానిశత్రువులు జంపి కొఱవిదేశమునఁ బ్రతిష్ఠ చేసెననియుఁ బైమొదటిమూఁడుపద్యములవలన స్పష్టముగాఁ దెలియుచున్నది. ఆ యెఱ్ఱభూపతిభార్య యైనకామమసాని బేతరాజును కాకతికిఁ బ్రభువునుగాఁ జేసినట్లు నాల్గవపద్యమందున్నది. దీనినిబట్టి కాకతి యనుపట్టణ మొకటియుండెనని యూహింపవచ్చును. తనభర్త, కొఱవిదేశమునందు బేతనిఁ బ్రతిష్ఠింపఁగాఁ దాను కాకతియను పట్టణమురాజధానిగాఁగల దేశము నాతని కిచ్చినట్లు కన్పట్టుచున్నది. ఇప్పటియనుమకొండయే కాకతి యని కొందఱును ఓరుగల్లు పట్టణమే కాకతి యని కొందఱును దలంచుచున్నారు.

ఈపద్యార్థములనుగూర్చి విమర్శించుటకు ముందీశాసన మీవంశీయులలోని బేతరాజునుగూర్చి చెప్పఁబడినదేనా? అయినచో, నిందు మొదటిబేతరాజు చెప్పఁబడియెనా? రెండవబేతరాజు చెప్పఁబడియెనా? యనువిషయములను దేల్చవలసియున్నది. ఈశాసన మీవంశీయులతోసంబంధించినదే యని చరిత్రకారు లందఱు నంగీకరించినారు. కాని కొందఱు దీనియందలి బేతరాజు మొదటిబేతరాజనియుఁ గొందఱు రెండవబేతరాజనియు నభిప్రాయపడిరి.

ఈశాసనము మొదటిబేతరాజుతో సంబంధించినదియే యని నాయభిప్రాయము. ఈశాసనములో, బేతరాజును కాకతివల్లభునిగాఁ గామసానమ్మ చేసినట్లు చెప్పఁబడియున్నది. పైఁ జెప్పినఖాజీపేటశాసనములో (ఇదిరెండవబేతరాజు వ్రాయించినది.) "శ్రీమాన్ కాకతి పురాధినాథో బేతః చోడక్ష్మాపాళచమూవార్ధిప్రమథన మూర్జితోర్జిత లక్ష్మీః" అని తనపితామహుని కాకతిపురాధినాథుఁ డని వర్ణించి యున్నాఁడు. మఱియుఁ దనతండ్రి యైనప్రోలరాజు, త్రైలోక్యమల్లుని వలన అనుమకొండను బడసినట్లును, తాను, అనుమకొండలో శివాలయమును దనపేరుతో నిర్మించినట్లును జెప్పియున్నాఁడు. కాకతినగరమును గూర్చి తానేమియును జెప్పకొనుచుండలేదు. మొదటిప్రోలరాజు త్రైలోక్యమల్లునివలన ననుమకొండవిషయమును గ్రహించినపిమ్మట రాజధానీనగరమును 'కాకతి' నుండి యనుమకొండకు మార్చుకొని యుండును. అందువలనఁ బైనఁ జెప్పిన గూడూరిశాసనములోని బేతరాజు మొదటిబేతరాజనియే నిశ్చయింపవలసియున్నది. కాకతీయాంధ్రరాజయుగచరిత్రమును రచియించిన శ్రీ చిలుకూరివీరభద్రరావుగారును నిట్లే తలఁచియున్నారు. ఇఁకఁ గొఱవినిగూర్చి యాలోచింతము.

నిజామురాష్ట్రమున వరంగలుజిల్లాలో "కొఱవి" యనుగ్రామ మొకటి యున్నదని తెలియుచున్నది. ఆ 'కొఱవి' రాజధానిగాఁ గల్గు ప్రదేశమే కొఱవిదేశ మని యాకాలమునఁ బిలువఁబడుచుండెడి దని యూహింపవచ్చును. ఈబేతరాజు నీతిసారకృతికర్తయైన రుద్రదేవ మహారాజునకుఁ బూర్వుఁడగుటయేగాక, యాంధ్రదేశమును మూఁడు వందలసంవత్సరములు పరిపాలించినయాంధ్రచక్రవర్తులవంశమునకు మూలపురుషుఁ డగుటచేనప్రస్తుతవిషయములను జర్చించుచున్నాఁడ ననుభీతి యున్నను, ఈబేతరాజునుగూర్చియు నీతనిపేరుగల గూడూరుశాసనమునుగూర్చియు నింతదూరము చర్చింపవలసివచ్చినది. ఈశాసనము ఆంధ్రమహాభారతమునకుఁ బూర్వము పుట్టినది. ఆకాలమునాఁటిభాషాస్థితి, పద్యరచనము మొదలగుభాషావిషయములు గూడఁ గొంచెముగనైనను దెలియుచుండుటచే నీశాసనమునుగూర్చిన చర్చ నిట సాగించుచున్నాఁడను.

ఆకాలమున విరియాలవారు పరాక్రమవంతులైన ప్రభువులు గనో, లేక తాము చేపట్టిన వానిని ప్రభువులుగఁ జేయఁదగినసమర్థులు గనో యుండియున్నట్లీపద్యములవలనఁ దెలియుచున్నది. ఈవిరియాల వారు కమ్మవారనికొందఱును క్షత్రియులని కొందఱును వెలమలని కొందఱును నభిప్రాయపడియున్నారు. వారికులముతో మనకిటఁ బ్రసక్తి లేదు. ఈపద్యములలోఁ గోటవిదేశ మొకటియుఁ గాకతియొకటియు గన్పట్టుచున్నవి.

కోటవిదేశము మొదట బేతరాజునకో ఆతనిపూర్వులకో చెందియుండును. దానిని నెవ్వఁడో ఆక్రమించుకొనియుండును. విరియాలయెఱ్ఱ భూపతి, యుద్ధమున నాతనిని జంపి బేతరాజును గోటవిదేశమునందుఁ బ్రతిష్ఠ చేసెను. ఈయూహ మూఁడవపద్యము నందలి మొదటి రెండు పాదములపై నాధారపడియున్నది. మూఁడవపాదము నందలి భావమును సరిగా గ్రహింపఁగలిగితి మేని తక్కినవిషయమంతయు బోధపడఁగలదు. కాని యీపాదమందలి ప్రాసాక్షరము తప్పుటవలనను యతిస్థానమందక్షరము లేకపోవుటమూలమునను నాపాద మర్థమగుట లేదు. నాల్గవ పాదమందలివంద్రుఁ డెవ్వఁడో తెలియదు. వంద్రుఁడను, ఒకవ్యక్తియో! లేక యిది యెఱ్ఱఁడు చేసిన చేతను దెలుపు "చంపదు" వంటి క్రియాపదమో తెలియదు. 'మొగుడు' పదమునకు ముకుళింపఁజేయుననునర్థమున్నది. రెండుమూఁడుపాదములను సమన్వయము చేసి చూడఁగా బేతరాజు యొక్క వైరి కోకతనయుఁడున్నట్లును వాఁడప్రతిముఁడైనట్లును వాఁడు యుద్ధమునకు రాగా వానిని మొగుడు పఱచియు ననఁగా జయించి ముకుళీకృతుని గా జేసియు ఎఱ్ఱఁడు దయదలఁచి వానిని జంపనట్లును నా పాదముల కర్థము స్ఫురించుచున్నవి. అప్రతిముఁడనువిశేషణము ఎఱ్ఱని కన్వయింపఁజేయవచ్చును. ఇం దెంతవఱకు సత్యమున్నదో నిది యెంత వఱకు పండితాంగీకారమును బొందునో చెప్పఁజాలను. మూఁడవపద్యమందలి రెండవపాదాంత్యాక్షరము 'యా' అనియు మూఁడవపాదమందలి మొదటినాల్గక్షరములును "తతన" అనియు, నుండవలయు నని నా తలంపు. ఆతతనయు ననగా ఆకనితనయుఁడని కన్నడప్రయోగము. (తె. శా. సం. పుట ౧౬౭). ఈపక్షములోఁ బ్రాసభంగ ముండదు.

మొదటిమూఁడుపద్యములకును, నాల్గవపద్యమునకును సంబంధము లేదు. నాల్గవపద్యమందలికథ యెఱ్ఱభూపతియనంతరమున జరిగినది. ఈతనిభార్య కామమ్మ తనభర్తయనంతరముఁ గాకతిదేశమునకు పరిపాలకురాలుగానున్నట్లు కాన్పించుచున్నది. కనుకనే యామె కాకతి యందు బేతరాజును నిలుపఁగలిగినది. కాకతి కొఱవిదేశము లోనిదియే యనియు కొఱవిదేశముకుఁ గాకతి ప్రధానపట్టణమనియు నొకరనినారు. కాని యందుల కాధారములు లేవు.

పల్లవరాయఁ డొకఁడు కాకతిపైకి దండెత్తి రాఁగాఁ గామమ్మ వానిని నిరోధించుట (అఁక=నిరోధించుట) మంచిబుద్ధియని (మేల్కఱ దనికఱద—బుద్ధి) తలంచి, తాను స్త్రీ కావున తనభర్తచేఁ గొఱవి దేశమునఁ బ్రతిష్ఠింపఁబడిన బేతరాజును గాకతికిఁ బ్రభువునుగాఁ జేసి, యాతనిసాహాయ్యమున నాపల్లవరాయునిని గాకతిపై రాకుండ నడ్డగించి (అఁగి=అడ్డగించి) పిమ్మటఁ జక్రవర్తియైన భాస్కరవిభుని దర్శించి యాతని నాశ్రయించెను. (చొచ్చె=ఆశ్రయించెను) ఈవిధముగాఁ జేసి కాకతి రాజ్యమును నిలుపుట వలన నామెచేసిన సుకృతము కోటిగుణిత మైనది కదా! ఇది నాల్గవపద్యార్థ మని నా యభిప్రాయము. అయిన నిందలి పల్లవరాయఁ డెవఁడు? భాస్కరవిభుఁ డెవ్వఁడు? అనియాలోచింపవలసి యున్నది.

ఈశాసనము క్రి. శ. ౧౦౦౦ సంవత్సరప్రాంతము నాఁటి దని పైన వ్రాసియుంటిని. ఆకాలమునఁ బశ్చిమచాళుక్యుఁ డగు మొదటి త్రిభువనమల్లుఁడు చక్రవర్తిగానున్నాఁడు. అతనిపేరు విక్రమాదిత్యుఁడు. అతనికి విభువిక్రముఁడను బిరుదముకలదు. ఇందలి ఆదిత్య, విభుశబ్దములను దీసికొని, భాస్కరవిభుఁడని పైపద్యములో నుపయోగించినాఁ డని నాయభిప్రాయము. ఈ మొదటిత్రిభువనమల్లునిరాజ్యకాలము క్రి. శ. ౧౦౦౭ మొదలు ౧౦౧౮ వఱకు నైయున్నది. పశ్చిమచాళుక్యులకుఁ బల్లవరాజులు సామంతులుగా నుండి రనుట సుప్రసిద్ధచారిత్రకవిషయము. పల్లవసామంతుఁ డొకఁ డప్పుడు కాకతిపై దండెత్తివచ్చె ననియు, కామమ్మ, బేతరాజుసాహాయ్యమున నాతనిని నిరోధించి,

విక్రమాదిత్యుని శరణుజొచ్చి కాకతిరాజ్యమునకు వారివలన బాధ లేకుండ జేసిరనియు, కల్పన వ్రాసియున్నది. అప్పటినుండియు బేతరాజు విక్రమాదిత్యునితో మైత్రి గలిగియుండెను.

ఈగూడూరు పద్యశాసనమును కాకతీయులకు, ఆపత్కాలమున విరియాలవారు సాహాయ్యము చేయుటయు గాకతీయులను నిలువబెట్టినారని చూపుటకై విరియాలవారెవరో కల్పించి వ్రాయించిరని డాక్టరు శ్రీనివాసరావుగారు వ్రాసియున్నారు. (హై. శా. సం. ౧౩. ౧౪.) కాని యందులకు సరియైనయాధారములను వారుచూపలేదు. శ్రీ కొత్త భావయ్యచౌదరిగారు భారతిపత్రికలో(వ్యయ సం॥ శ్రావణము ౧౫౯ పుట) పూడూరుశాసనము (తెలింగానా శాసనములుపుట ౧-౨౮) నుదాహరించుచు త్రిభువనమల్లుని కాలమున నాతనికి సామంతుడుగా నొకపల్లవుడున్నాడని (ఆశాసనకర్త పల్లవుడే) యు గూడూరుశాసనమున నుదాహరింపబడినపల్లవు డాతడుగాని యట్టివాడే మఱియొకడుగాని యై యుండుననియు సందుచే గూడూరుశాసనము సత్యమైనదిగా దలంపగూడదనియు, వ్రాసియున్నారు. శ్రీ చౌదరిగారు చూపిన శాసనము క్రీ. శ. ౧౧౦౮ వ సంవత్సరమునాటిది. అందలి త్రిభువనమల్లుడు రెండవత్రిభువనమల్లుడు. అందుచే నాశాసన మీసందర్భమున నుపయోగింపదు. కాని బేతరాజుకాలమున గూడూరుశాసనమున కన్వయించెడి మొదటిత్రిభువనమల్లుని సామంతుడగుపల్లవరాయడింకొకడు లేడనిచెప్పజాలము. కావున నాల్గవపద్యమందలికథ సత్యమనియే నమ్మవచ్చును.

నాల్గవపద్యమందలికథకును నైదవపద్యమందలికథకును సంబంధము లేదు. సూరడను నాతడు కాడయనాయకుని జంపి, వేలుపుకొండరాజును వేలుపుకొండయందే నిలిపి యట్లుచేసినందులకు ప్రత్యుపకారముగా గొన్నిగ్రామములను బడసెనని ఐదవపద్యార్థము. ఇందలి కాడయన్నపు డనగా నాల్గవపద్యమందలిపల్లవరాయడే యని నాయుద్దేశము. పల్లవులకు కాడవులని నామాంతరమున్నది. (ఈగ్రంథ

మండలితిక్కనసోమయాజిచరిత్రమును జూడుడు.) వేలుపుకొండ యనఁగా దేవరకొండ. ఇది నైజామురాష్ట్రమునమున్నది. రత్నాపృథ్వీ= నృపరత్నము అయియుండును. నేరెడు, బోదిపాడు, చేబ్రమానిడి, యివి గ్రామములు. ఈపద్యమందలి గాడవనాయకవధకును, నాల్గవపద్య మందలికథకును గాలవ్యవధి విశేషముండదని నాయుద్దేశము. కాకతికథా నంతరమున నీవల్లపుడు మరల బేతరాజపరిపాలనములో నున్న దేవర కొండరాజ్యముపైకిదాడివెడలఁగా విరియాలసూరఁడు వానిని వధించెనని తోఁచుచున్నది. వేలుపుకొండప్రభువు పేరిందు లేదు. ఇతఁడు బేతరాజే యై యుండునా? యని సంశయము కలుగుచున్నది. ఈసూరఁడు విరి యాలసూరఁడే యైయుండును. విరియాలసూరభూపతి యొకఁడున్నట్లును, ఆతనికి కుమారుఁడు బేతరాజయినట్లును, ఆ బేతరాజునకును నాతనిభార్య బిజ్జమకును, మల్లఁ డనుకుమారుఁడు జన్మించి యొకతటాకమును నొక శివాలయమును నిర్మించి నట్లును నాతఁడు వ్రాయించిన శాసనమువలనఁ దెలియుచున్నది (తె. శా. సం. పుట ౧౬౯.) ఈశాసనమునందుఁ గాలము లేదు. విరియాలసూరఁడు బేతరాజునకడ సామంతుఁడుగనో సైన్యాధిపతిగనో యుండి, కాడవనాయకునిఁ జంపెననియుఁ దనపోషకుఁ డైన బేతరాజునామమును దనకుమారునకుంచినాఁడనియుఁ దలంచితి మేని యీసూరఁడును, బైయుదవపద్యమందలిసూరఁడు నొక్కఁడే యనినిశ్చయింపవచ్చును. మొత్తముమీఁద నీశాసనము విరియాల వారికీర్తిని బ్రకటించుటకును బేతరాజురాజ్యసంపాదనము దెలుపు టకును నుద్దేశింపఁబడినదని చెప్పవచ్చును. విరియాలయెఱ్ఱయకామమల కును సూరనికినే మయిన సంబంధ ముండెనో లేదో చెప్పఁజాలము. విరియాలవారికిని బేతరాజునకును బ్రభుసామంతసంబంధము మాత్రమే యుండెనో, లేక యితరబాంధవ్య మేమయినఁ గలదో చెప్పఁజాలము.

మొదటిబేతరాజు క్రి. శ. ౯౭౫ సంవత్సరప్రాంతమున జన్మించి ౧౦౧౦ సంవత్సరప్రాంతమునఁ గొఱవిదేశమునఁ బ్రతిష్ఠింపఁబడి ౧౦౧౫ సంవత్సరప్రాంతమునఁ గాకతివల్లభుఁడై ౧౦౫౦ వఱకును రాజ్యము చేసెనని నిశ్చయింపవచ్చును.

చేతరాజునకుఁ బూర్వ మీకొలనిదేశ మెవరిపరిపాలనముక్రింద నుండెనో యనువిషయము స్పష్టముగాఁ దెలియుటలేదు. కాని కొలని శాసన మను పేరఁ బిలువఁబడుచున్న యొకశాసనము కలదు. (తె. శా. సం. పుట ౧౭౯) దానివలన నీకొలనిపూర్వ విషయము లేమైనఁ దెలియునేమో యాశించియున్నది. అందుఁ గాల మీయ లేదు. కాని విక్రమాదిత్యునికుమారుఁ డగుచాళుక్యభీముని పే రందుండుటచేఁ గాలమును మనముసులభముగాఁ దెలిసికొనవచ్చును. ఇతఁడు తూర్పు చాళుక్యుఁడు. ఆకాలమునఁ దూర్పుచాళుక్యులయధికారము కొలని వఱకును వ్యాపించె నని చెప్పవచ్చును. ఇతనిని మొదటిభీముఁ డందురు. ఇతఁడు క్రీ. శ. ౮౯౨ మొదలు ౯౨౨ వఱకును వేఁగిసింహాసన మధిష్ఠించినవాఁడు, ఈశాసనమాతనికిఁ బిమ్మటఁ బుట్టినది. కావున శాసన కాలము క్రీ. శ. ౯౧౦ ప్రాంత మనవచ్చును. ఇందలి భాషయుఁ బై గూడూరుశాసనమువలెనే యిప్పుడు వాడుకలో లేనిపదములను గలిగి యర్థముగాకుండ నున్నది. ఇది యానాఁటిగద్యరచనమును దెలుపును. భావిపరిశోధకుల కనుకూలముగ నుండునని యాశాసనము నీక్రింద నిచ్చుచున్నాఁడను.

"శ్రీవిక్రమాదిత్యనృపాగ్రతనయుం డైనచాలుక్యభీమునకు గౌచకందర్పునకు వేగీశ్వరునకు రనమద్వాన్వయకులతిలకుం డయిన కుసుమాయుధుండు గన్నరబల్లహునికి స్త్రప్రాప్తంబయ్న (సంప్రాప్తం బయిన) రనమర్ద శ్రీమదనభుజవీర్యబలపరాక్రమంబున న్దచ్చికణ్ణియం గట్టి పట్టంబెత్తి ఖడ్గసహాయుండై నేలయెల్లం గావంబూని మడికొణ్డ నాణ్డాదిగ (మణికొండవాడు) వేగిదేసము విష్ణువర్ధనుతో నడ్డి రాజ్యంబు సేయుచున్నకుసుమాయుధు పెద్దకొడు కనేకరిపునృపతి మణిమకుటమకరి కారేపణమశ్రృశితగలరలావర్తంబు రాజ్యంబు సేయుచు నిష్టవిషయకామ భోగంబుల ననుభవించుచు సుఖంబుండి యొకనాడు కొరవి నల్లజెతెయ కొడుకు పెద్దన రావించి నీవు నాప్రాణసమానుండ నైన చెలివి నీచేసిన యుపకారంబునకు బ్రత్యుపకారంబు సేయువలయుం దాని....శిణ్కొమ్మ నృగి శ్రీనాకెల్లంగల దేమి లేకున్న వెణ్డికొణ్డు మయ్యాను (వేడికొండు

మయినను) బరోపకారంబుపొంద్ది గాని కొరవియున్న భీముఁడు నల్కాల కులసన పశివి గెల్చి శ్రీనిరవద్యు ణ్ణనేకసమరసంఘట్టణభుజాసిభాను రుండై (భానుకుండయ్యో?) తమయన్న రాజ్యశ్రీ కెల్ల న్నానయు ఈశుండై చేకొని నిల్చి భీమసలుకియు (చాళుక్యభీముఁడు) ననేకవస్తువాహనోత్స వంబు లొడయుచు తమయన్న గానగయ్య చేసినధర్మ్మవులు ననంబును నేగట్టను గావను రక్షింపను వఁయునేని చేకొని కొరవి కిచ్చినస్థితి నిల్పశిలాస్తంబంబు ప్రతిష్ఠించి విష్టరంబును నాతనికొట్టించిన చెఱువులు మఱియు నెవ్వియేని నాతనిచేయుంబడి వృకవత్రిగినను చెఱిచినను చుఱియవెఱికినను ముత్తిఱిగను అకాడిఁను, ణరవాత్యాది ఏనుం ద్రమ్మలు (బంగారునాణెవువిశేషము) మణిసి (మనుష్యుఁడు?) చేసినద్రోహంబునకు వానిజీవితంబు దణ్డువు.వరియారంబుపనువరంబు వెల్లారబంబు ఎరగద్యా ణంబు పేశామణి వున్నమనాడ్డు ఏనూఱు ద్రమ్మలం వెట్టిసుఖంబు మను ము,నాయకుణ్డై యాకాపులయిన్న వేఱరాజులంతొచ్చి ......మస్థితిమణిసి కొన్నరాజు ల్గలరేనియు యీస్థితి మడిసిన...నావకణ స్థమన్న కాంపు"

కుండలీకరింపబడినభాగములు నాయవి: సందేహము లున్న తావుల వర్ణక్రమము మాతృకయందున్నవిధముననే యుంచితిని. సిస్సంశయమైనతావులలో ప్రస్తుతపువర్ణక్రమము ననుసరించి వ్రాసితిని. ఇందు గొన్నికన్నడపదములుండుటవలనను, గొన్ని శాసనలేఖకునితప్పులుండుట మూలమునను శాసనకావ్యకర్త పండితుఁడు గాకుండుటచేతను శాసనకాలమునాఁటి కాంధ్రభాష యిప్పటివలె పరిపక్వస్థితి నందకయుండుటం బట్టియు నీశాసనము సరిగా బోధపడుట లేదు.

ఈ శాసనములో నున్నవిషయములను బరిశీలింతము.

౧. ఇది చాళుక్యభీముఁడు వేగిసింహాసనమునం దుండఁగా గన్నరబల్లహునికి సంప్రాప్తమయినరాజ్య మాతనిపెద్దకుమారుఁడు పరిపాలించుచున్న కాలములో వ్రాయఁబడినది.

౨. శాసనములో చెప్పఁబడినకుసుమాయుధునకు కన్నరబల్లహుఁడనునది నామాంతరమైయుండును.

౩. కుసుమాయుధునిపెద్దకొడుకు పేరిందుఁ గన్పట్టుట లేదు. "విష్ణువర్ధనునితో నడ్డి" అని శాసనమునందుండుటచే విష్ణువర్ధనునకుప్రతిరేకముగా

స్వతంత్రుఁడై [విష్ణువర్ధనునకు లోఁబడి" యనికూడ నర్థము చెప్పవచ్చును.] రాజ్యము చేయుచున్నట్లు కన్పట్టుచున్నది. ఇతఁడేలుచున్న రాజ్యము పేరు మణికొండనాడు. ఇది నిజాము రాష్ట్రములోనిదై యుండును.

4. పైన చెప్పిన కునమాయుధుని పెద్దకొడుకునకు రాజ్యపరిపాలనమున సాహాయ్యము చేయుచున్నవాఁడు కొరవి నల్లజెఱెయకొడుకు పెద్దన. ఈతఁడుచేసిన మేలునకుఁ బ్రత్యుపకారముగా నేమేని గోరుకొమ్మని పెద్దకొడుకు అడుగఁగా నాకేమియు నక్కఱ లేదని చెప్పుచు నేదియో యడిగెను. అడిగిన దేదియో తెలియుట లేదు. కాని యీ పెద్దన కిరువురన్నలున్నట్లును, అందు పెద్దవాఁడగు భీముఁడు యుద్ధము నందెవరినో గెలిచినట్లును, నాతనికిఁ బిమ్మట నాతని తమ్ముఁడు 'గాణగయ్య' తనయన్నగారి యైశ్వర్యమున కెల్ల నధికారియై భీమనల్కిచే బహుమతులందినట్లును అతఁ డనేకధర్మముల నాచరించినట్లును వానినిరక్షించి కొఱవిని నిలిపి, శిలాస్తంభమును బ్రతిష్ఠించున ట్లనుగ్రహింపు మని కోరినట్లును గన్పట్టుచున్నది. ఈసందర్భమున "పడివెగెల్చి" యని యొకశబ్ద ముపయోగించినాఁడు. ఈ "పడివె" శబ్దము పైనవ్రాసినగూడూరుపద్యశాసనమునందును గలదు. అందు "పడుసె గాడయనాయకుఁ జంపి," అని యున్నది. ఈ రెండుశబ్దములు నొకేయర్థమునం దుపయోగించినట్లు గన్పడుచున్నది. ఈశబ్దమునకు "యుద్ధమునందు" అనియర్థము. శబ్దరత్నాకరమున 'పడవ' అనఁగా యుద్ధ మని యర్థము నిచ్చి యున్నారు. ఇది కన్నడశబ్దమై యుండును.

ఈశాసనమునందుఁ గొఱవిశబ్దమును మూఁడుమారు లుదాహరించియున్నారు. పరిశీలించిచూడఁగా గొఱవియనునది గ్రామనామ మనియు నది ప్రధానపట్టణ మగుటచే నాదేశమునకుఁ గొఱవిదేశ మని పేరువచ్చెననియు, శాసనమునఁ గొఱవియన్నభీముఁ డని ప్రయోగించుట చూడఁగా నీగ్రామనామమే వారిగృహనామముకూడ నైయున్నట్లును గన్పట్టుచున్నది. ద్వాత్రింశత్సాలభంజికను రచించిన కొఱవి గోపనామాత్యుని యింటిపేరీ గ్రామమునుబట్టి వచ్చినదేమో!

ఈశాసనమునుబట్టి గన్నరబల్లహుఁడో లేక యాతనికుమారుఁడో

కొలనిదేశమును బేతరాజుపూర్వులవశమునుండి లాగికొని కొలని భీమునకో ఆతనిసోదరులకో యిచ్చియుండును. బహుశః కొలనిపెద్దనకుఁ గుణగామాయుధునికుమారుఁడే యిచ్చియుండును. పిమ్మట నీపెద్దన వంశీయులు దాని ననుభవించుచుండియుందురు. బేతరాజు తనపూర్వుల రాజ్యమును దిరిగి వశముచేసికొనఁ బ్రయత్నించుటలో విరియాల యెఱ్ఱఁడు సాహాయ్యమొనర్చియుండును. గన్నరబల్లాణుఁడు అనుపేరుగల రాష్ట్రకూటపురాజొకఁడుకలఁడు. ఇతనికి అకాలవర్షబిరుదాంకితుఁడగు రెండవకృష్ణరాజని నామాంతరము. రాష్ట్రకూటులకును దూర్పుచాళుక్యులకును దఱచుయుద్ధములు జరుగుచుండెడివి. చాళుక్యభీముని పెదతండ్రి యైనగుణగవిజయాదిత్యుఁ డీకృష్ణరాజును జయించియాతని పురమును దగులఁబెట్టి కృష్ణపురదహనవిఖ్యాతిని గాంచియుండెను. చాళుక్యభీముఁడుకూడ వేఁగిదేశముపై దండెత్తివచ్చిన యీకృష్ణరాజును జయించెను. తరువాత నీకృష్ణరాజు చాళుక్యభీమునకుసామంతుఁడుగా నుండియుండును. చాళుక్యభీమునకు విష్ణువర్ధనుఁడని నామాంతరమున్నది. పైశాసనములో నొకచోట చాళుక్యభీముఁడనియు నొకతావున విష్ణువర్ధనుఁడనియు వ్రాసియున్నారు. ఖాజీపేటశాసనమునం దీబేతరాజు చోడసేనాసముద్రమును మథించి లక్ష్మిని గైకొనియెనని యున్నది. ఈచోడుఁడు బస్తరుపట్టణము రాజధానిగాఁ బరిపాలనము చేయుచున్న రేనాఁటిచోడుఁడేమో యనియుఁ గాకున్న పశ్చిమచాళుక్యసామంతుఁడుగా నుండి ద్రావిడచోడులతోఁ జేసినయుద్ధములలోఁ బాల్గొనియుండవచ్చుననియు శ్రీవీరభద్రరావుగా రాంధ్రులచరిత్రమున వ్రాసియున్నారు. ఈబేతరాజు పశ్చిమచాళుక్యరాజగు మొదటిత్రిభువనమల్లునకు సామంతుఁడు. ఆకాలమున దక్షిణదేశమున మొదటి రాజేంద్రచోడుఁడు (భారతకృతిపతి యైనరాజరాజనకుమామ) రాజ్యము సేయుచుండెను. అతనికిని బశ్చిమచాళుక్యులకును సదా యుద్ధములు జరుగుచునే యుండెను. బేతరాజు రణములలోఁ బాల్గొనియుండు ననితలంచుటయే సమంజసము.

ఇంతవఱకు వ్రాసినపిమ్మట భావసంవత్సరాదిసంచికలో శ్రీమల్లం సోమశేఖరశర్మగారు ప్రకటించినయపరిష్కృతశాసన మొకటి నాకుఁ

గనపడినది. ఇది నిజాముప్రభుత్వము వారికోశాగారమునం దున్నదఁట. ఇదికుసుమాయుధుఁ డనురాజు (పురు) కుత్సితగోత్రుఁ డైనదోనమయ్య మొదలుగా ముప్పదియిద్దరు బ్రాహ్మణులకు, మంచికొండవిషయములోని మొగలుచెఱువు లనుగ్రామమును దానమిచ్చి వ్రాయించినది. ఇందు కాలములేదు. చాళుక్యులప్రశస్తి యుండుటంబట్టియు "ముదుగొండ్డచలుక్యానాంకులమలంకరిష్ణుర్ముదుగొండ్డురవాస్తవ్యః" అనియుండుటంబట్టియు నీశాసనకర్త చాళుక్యులలోని యొకశాఖకుఁ జెందినవాఁడనియు, నీశాఖకు ముదుగొండచాళుక్య శాఖయనిపేరనియు దీనివలనఁ దెలియుచున్నది. ఈశాఖ, యిదివఱకు చరిత్రలకెక్కలేదు. ఈశాసనము ననుసరించినవంశవృక్షమిది.

తెలియదు
- కోకిరాజు
  - ౧ కుసుమాయుధుఁడు
    - బిజయితుఁడు

      ౨ కుసుమాయుధుఁడు
      - విజయాదిత్యుఁడు
        - 3 కుసుమాయుధుఁడు
          - నిజ్జియరాజు = ఆచిదేవి
            - ౪ కుసుమాయుఃధుడు (శాసనదా
          - మల్బదురాజు
          - లోభచమకుఁడు
- తెలియదు (ఇతఁడు చియ్యరాజునుజయించెను)

ఈశాసనమపరిష్కృతమైనదగుటను, గ్రంథవిస్తరభయమునను నిటనీయలేదు. ఇందలికుసుమాయుధుఁడును కొఱవిశాసనమునందలి కుసుమాయుధుఁడు నొక్కరేయని చెప్పవచ్చును. ఇందలి ముదిగొండ నాఁడును కొఱవిశాసనమందలి మణిగొండనాఁడు నొకటియే కావచ్చును. దానమిచ్చిన మొగలిచెఱువునకు దక్షిణమున "కొరవిపొలము కార కుణ్డసీమసిల" అనియున్నది. ఈకొరవియే యాకొఱవియైయుండును. 'రణమర్దక' శబ్దమీరెండిటియందును గూడఁగలదు. కొఱవినల్ల జెఱయ కొడుకు పెద్దనతో సంబంధించినవాఁడు పైనవ్రాసినట్లు రాష్ట్రకూటవు రాజుగాక ముదిగొండచాళుక్యశాఖలోని కసుమాయుధుని పెద్దకొడుకై ననిజ్జియరాజై యుండుననియీశాసనమును బట్టియూహింపనగుచున్నది. ఎట్లయిననీవిషయమున నింకను బరిశోధన మావశ్యకమైయున్నది.

౨. ప్రోలరాజు:—ఇతఁడు పైవంశవృక్షములోని మొదటిబేతరాజు కుమారుఁడు. ఇతనివంశములో నింకనొకప్రోలరాజుండుటచే నీతనిని మొదటిప్రోలరాజందురు. ఖాజీపేటశాసనమునందీతఁడు "జగత్పవిత్ర చరిత్రుఁడైనప్రోలరాజు. చక్రకూటవిషయమును జయించి భద్రంగపురా ...రునిఁ బఱువెత్తించెను. కొంకణమండలమును జయించి యనుపమాన మగుకీర్తిని సంపాదించెను. ఇతఁ డనేకరాజవంశములను జయించి యుద్ధములో కొడవర్తిదుర్గరాజుకొడుకును సంహరించెను. గొన్నయ యనువానిని నిర్జించి పురకూటదేశమును స్వాధీనము చేసికొనియెను. అనుమకొండవిషయమును త్రైలోక్యమల్లునివలన శాసనపూర్వకముగాఁ బడసెను" అనియున్నది. ఇతనియొద్ద రేచర్లబమ్మిరెడ్డియను సేనాధిపతి యుండి యనేకయుద్ధములలోఁ బాల్గొని కీర్తిం గాంచియుండెను. ఇతనినామ మనేకశాసనములలో నున్నది. ఇతఁడు పశ్చిమచాళుక్యులకు సామంతుడుగనుండక స్వతంత్రుఁ డుగనే యుండెను. కాని వారితో మిత్రుఁడుగానుండి చోడులతో జరిగినయనేకయుద్ధములలోఁ దండ్రివలెనే వారికిసాహాయ్యముచేయుచుఁ దండ్రిసంపాదించిన రాజ్యము నభివృద్ధి లోనికిఁ దెచ్చెను. ఇతఁడు దాదాపుముప్పదిసంవత్సరములు రాజ్యము చేసినట్లు కనఁబట్టుచున్నది. నిశ్చయముగాఁ జెప్పలేకపోయినను, ఈతని

రాజ్యకాలము క్రీ. శ. ౧౦౫౦—౧౦౮౦ అని చెప్పవచ్చును. ఇతఁడు చోడసింహాసన సంపాదనమునందు కులోత్తుంగచోడు (రాజరాజకుమారుఁడు) నకు సాహాయ్యమొనర్చె నని కొందఱుచరిత్రకారు లూహించుచున్నారు.

3. బేతరాజు:—ఇతఁడు ప్రోలరాజునకు కుమారుఁడు; మొదటి బేతరాజునకుఁ బౌత్రుఁడు; ఇతనిని రెండవ బేతరా జందురు. ఇతఁడు పశ్చిమచాళుక్యరా జయినయాఱవ విక్రమాదిత్యునకు సామంతుఁడై యుండెను. అతనికి త్రిభువనమల్లుఁ డనిబిరుదమున్నది. ఆబిరుదమునే యీ బేతరాజుకూడ వహించియుండెననియు నందుచే నీతనిని త్రిభువనమల్లబేతరా జని పిలచెదరనియుఁ గొందఱందురు. కాని యది సత్యము కాదు. ఖాజీపేటశాసనమువలన నీతనికి విక్రమచక్రి యనబిరుదము గలదనియు, నితఁడు గండ్రగొడ్డలి చేఁబూనినవాఁ డనియు మాళవచోళరాజమదగజపంచాననుఁడనియు వర్ణితుఁ డయ్యె నని దెలియుచున్నది. అనుమకొండపట్టణమున, నొకయారామమును, దనపేరిట బేతేశ్వరుఁడని యొకశివలింగమును శివపురమనుతీర్థమును బ్రతిష్ఠించె ననియాశాసనమున వ్రాసియున్నది. ఇతనికి వైజననాథుఁ డనునొక మంత్రి యుండెనఁట. ఈతనిశాసనములో (ఎపిగ్రాఫియాఇండికా సం ౯. పుట ౨౫౬) "కాకతిబేతభూపాలక్రమాగత తదీయరాజ్యభరనిరూపిత మహామాత్యపదవీవిరాజమానోన్నత ప్రభుమంత్రోత్సాహశక్తిత్రయసంపన్నుఁడనియు, మహత్తరయశస్సుగలవాఁడై అగణితశౌర్యసంపత్తుచేఁ బ్రసిద్ధిఁ గాంచినబేతరాజును చాళుక్యచక్రవర్తిపాదపద్మములను సందర్శించునట్లుచేసి, యాచక్రవర్తిదయతో నిప్పించిన "సబ్బిసాయిర" మండలమును సర్వజనసంతోషకరముగాఁ బరిపాలింపఁజేసినవాఁడు" అని యామంత్రిసత్తముఁడుకొనియాడఁబడియుండెను. ఈ బేతరాజుకాలము గొంచెమెచ్చుతక్కువగా క్రీ. శ. ౧౦౮౦—౧౧౦౦ అనియనుకొనవచ్చును. ఇతనికి కాలాముఖసాంప్రదాయమునకుఁ జెందినరామేశ్వరదీక్షితుఁ డనుపండితుఁడు గురువుగా నుండి యితనిచే మల్లికార్జునమఠము కొఱకు దానములను పరిగ్రహించెను. ఖాజీపేటశాసనమువలన నీవిషయము తెలియుచున్నది.

౮. త్రిభువనమల్లదుర్గరాజు:—ఇతఁడు రెండవ బేతరాజుకుమారుఁడు. ఇతనికి దారిద్ర్యవిద్రావణుఁ డనుబిరుద ముండెను. పశ్చిమచాళుక్య వంశములోనివాఁడైన త్రిభువనమల్లదేవునకును నీబిరుదమున్నట్లు కనఁబట్టుచున్నది. ఈదుర్గనృపతి యునికిని గొందరుచరిత్రకారు లంగీకరించుట లేదు. శ్రీ ముట్నూరు వెంకటరామయ్యగారు మొట్టమొదట నీత్రిభువనమల్లదుర్గరాజును గనిపెట్టి వ్రాసిన వ్యాసముతోఁగూడఁ బ్రకటించిన (భారతి—వృష—శ్రావణము) ఖాజీపేటశాసనమును బట్టియు, మాదిరెడ్డికుంటశాసనమునుబట్టియు, రుద్రదేవుని మఱికొన్నిశాసనములనుబట్టియు నీతఁడున్నట్లుస్పష్టమగుచున్నది. రుద్రదేవుని శాసనములలో నాతనితండ్రి ప్రోలరాజనియు, తాత త్రిభువనమల్లుఁడనియు స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. అయితే, త్రిభువనమల్లుఁడనునది రెండవబేతరాజునకు బిరుదనామ మనియనుకొనుటచేఁ జరిత్రకారులు దుర్గనృపతియునికిని గుర్తింపలేదు.

రామేశ్వరపండితునకు శివపుర మనుగ్రామమును మొట్టమొదట దానమిచ్చినవాఁడు రెండవబేతరాజు. ఆదానకాలము శా. శ. ౧౦౧౭ ప్రమోదూతసం॥ కార్తికబ౧౫ ఆదిత్యవారము. నిమిత్తము సూర్యగ్రహణము. ఈదానము నుద్ధరించినవాఁడు. "బెటరననుపుత్ర కులతిలకం సకలజగతికళాసౌజన్యసార్వభౌమనె నిప్పగళికేన్ గె శ్రీమన్మహామండలేశ్వరం దుర్గనృపతిం త్రిభువనమల్లం॥

దానము నుద్ధరించిన కాలము "శ్రీమచ్చాళుక్య విక్రమకాలద ౨౩నేయ బహుధాన్యసంవత్సర దీశహియ్యుత్తరాయణసంక్రాంతి యొళిజరు తీర్థసంబన్నర్యాపనూగినేడి సిదశాసనగంబ మిదచంద్రార్కతారం నిల్వొ మంగళంమహా శ్రీ॥"

దానకాలమునకుఁ దరువాత దాదా పెనిమిదిసంవత్సరముల యనంతరమున నీశాసనస్తంభమును వేయించియున్నారు. దీనిని బట్టి రెండవబేతరాజునకు దుర్గనృపతి యనినామాంతరముగల త్రిభువనమల్లుఁ డనుకుమారుఁ డున్నట్లుస్పష్టమగుచున్నది. ఈశాసన మోరుగల్లులో

చిత్రాబుఖాను నింట నాంజనేయదేవళంవద్ద పడియున్న శిలపైఁ జెక్కఁబడియున్నది. ఈ స్తంభమును వేయించినవాఁడు దుర్గనృపతి.

ఈశివపుర మను గ్రామమునందు రామేశ్వరదీక్షితులు త్రిపురుష తీర్థము వేయించి యొక శాసన స్తంభమును వేయించినాఁడు. ఇదియే మాదిరెడ్డికుంట శాసనము. ఇం దీగ్రామము "త్రిభువనమల్లునితండ్రి యిచ్చినట్లు "స్వదత్తం యస్యభక్త్యా త్రిభువనమల్లావనీశజనకేన" అనిస్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. ఈ త్రిపురుషతీర్థ శాసనస్తంభమును జెక్కించి వేయించినది రామేశ్వరదీక్షితులశిష్యుఁ డైన ప్రోలరాజు. దీనినిబట్టికూడ దానమిచ్చిన బేతరాజు త్రిభువనమల్లునితండ్రి యనియు, త్రిభువనమల్లునికుమారుఁడు ప్రోలరాజనియు, స్పష్ట మగుచున్నది. కావున నీవరంపర సంగీకరింపకతప్పదు. ఈదుర్గనృపతి విశేషకాలము రాజ్యముచేసినట్లు గాన్పింపదు. బహుధాన్యసంవత్సరపు ఖాజీపేటశాసనమును తండ్రిజీవించియుండగనే వ్రాయించినట్లు గన్పట్టుచున్నది. ఈదుర్గనృపతి గావించినఘనకార్యములును లేవు. రుద్రదేవునిహనుమకొండశాసనము (శా. శ. ౧౦౮౪) లో నీత్రిభువనమల్లుఁడు

"శ్రీమత్త్రిభువనమల్లో రాజా కాకత్యవంశసంభూతః
ప్రబలరిపువర్గనారీవైధవ్యవిధాయకాచార్యః"

అనివర్ణింపఁబడినాఁడు. ఈశాసనమును వ్రాసినకవి రామేశ్వరదీక్షితుని కుమారుఁ డగునచింతేంద్రయతి."

రుద్రదేవుఁడు మొదలుగాఁ దరువాతివారు వ్రాయించినకొన్ని శాసనములలో త్రిభువనమల్లునితోఁ బ్రారంభించి వారివంశవర్ణనముఁ జేయ మొదలిడిరి. త్రిభువనమల్లబిరుదము రెండవ బేతరాజునకు లేదు. ఈ బేతరాజు పాశ్చాత్యచాళుక్యుఁ డైన త్రిభువనమల్లుని సామంతుఁడు. తనప్రభువుబిరుదమును తాను వహించినాఁ డనుటకంటెఁ దన యేలికనామమును దనపుత్త్రునకుఁ బెట్టినాఁడనుట సమంజసము. కావున శాసనముల యందలి త్రిభువనమల్లుఁడు రెండవ బేతరాజు కుమారుఁ డైనదుర్గనృపతి యనియే గ్రహింపవలసియున్నది.

పైనవ్రాసినకన్నడశాసనము మెకంజీవ్రాయించినస్థానికచరిత్రలో నున్నది. అది విశ్వాసార్హమైనది కాదనికొందఱనియెదరు. స్థానికచరిత్రలలో వ్రాసినదంతయు నసత్యమని చెప్పరాదు. స్థానికచరిత్రకారు లీశాసనమును సృష్టించిరనితలంపఁగూడదు. అదియునుగాక యితరశాసనములను బట్టికూడ దుర్గరాజున్నట్లుస్పష్ట మగుచున్నందున నిదియొప్పుకొనక తీరదు.

౪. ప్రోలరాజు:—ఇతఁడు పైనజెప్పినదుర్గరాజుకుమారుఁడు. ఇతనిని రెండవ ప్రోలరాజని యందురు. తాతకంటెఁ బరాక్రమవంతుఁడై, యాతనివలెనే యాఱవవిక్రమాదిత్యునకు సామంతుఁడై, పిమ్మటస్వతంత్రుఁడై త్రిలింగరాజ్యమునకుఁ బునాదులువైచినయీతనిరాజనీతి కొనియాడఁదగినది. ఇతఁడు మంత్రకూటపట్టణాధిపతి యైనగుండరాజును జయించెనని రుద్రదేవుని వేయిస్తంభాలగుడిశాసనమునందున్నది. ఈ గుండరాజును వధియించినది ప్రోలరాజుసేనాని యగుకామసేనాని యనిపాలంపేటశాసనము చెప్పుచున్నది. మంత్రకూట మనఁగా నిజాము రాష్ట్రమందలి మంథెనయనుగ్రామము. ఈవేయిస్తంభాలశాసనమునందే యీప్రోలరాజు అనంతపాలుని మేనల్లుఁడైనగోవిందదండనాయకుని జయించినట్లు చెప్పఁబడినది. ఈయనంతపాలుఁడే శ్రీపతిపండితారాధ్యుల శిష్యుఁడయినబ్రాహ్మణదండనాయకుఁడు.

ఈప్రోలరాజుతాత యైనబేతరాజుకడ మంత్రిగనున్నవైజదండాధినాథునకు యాకమాంబిక యందుజనించినబేతనప్రెగ్గడ, యీప్రోలరాజువద్ద మంత్రిగానుండెనఁట! బేతనప్రెగ్గడయు నీతనిభార్యయు జైనమతావలంబకులఁట. ఈప్రోలరాజురాజ్యపరిపాలనాకాలముక్రీ. శ. ౧౧౧౮ మొదలు ౧౧౫౮ వఱకునై యుండు నని చరిత్రకారులయభిప్రాయము. ఏకశిలానగర మనిచెప్పఁబడు వరంగల్లు నిర్మాణము నీతఁడే యారంభించెనందురు తానుజయించిన దేశములయందలిప్రజలనివాసము కొఱకీతఁడీపట్టణమును నిర్మించెనఁట. ఒకానొకదినమున నాగ్రామవాసుల కమ్ముకొనుటకై యాహారపదార్థములను దెచ్చినయొకబండి యొకరాతికిఁ దగిలి తల్క్రిందు లయ్యెనఁట. ఆబండికున్నయినుపపట్టా స్వర్ణమయ్యెనఁట. రాజావార్తవిని యచ్చటకు వచ్చియాశిల స్పర్శవేది

యగునొకశివలింగ మనిగ్రహించి స్వయంభూలింగ మని దానినచ్చటనే ప్రతిష్ఠించి యాలయముగట్టించి యాగ్రామమును గ్రమక్రమముగా నభివృద్ధిచేసి నని చెప్పుదురు. ఈతనితరువాతి వారచ్చట బలవత్తమమయినకోటగట్టించిరి. గణపతిదేవునికాలమున, రాజధాని హనుమకొండనుండి యోరుగల్లునకుమార్పఁబడియెను.

రుద్రదేవమహారాజు:—ఇతఁడు రెండవప్రోలరాజుకుమారుఁడు. ఇతఁడే నీతిసారమునురచించిన కవిరాజు. ఇతఁడు గొన్నిశాసనములలోఁ బ్రతాపరుద్రమహారాజని పేర్కొనఁబడియెను ఈతనితరువాతఁ గొంతకాలమునకు నింకనొకప్రతాపరుద్రమహారా జుండుటచే, నిటీవలి చరిత్రకారు లితనిని మొదటిప్రతాపరుద్రుఁ డనిపిలువఁజొచ్చిరి. ఇతఁడు క్రీ. శ. ౧౧౬౮ మొదలు ౧౧౯౭ వఱకు రాజ్యముచేసెను. ఇతనికిఁ బితృహంతకుఁ డనియొకయపకీర్తి వాటిల్లినది. ఒకనాఁ డీతఁడు దేవాలయమునఁ బండుకొని నిద్రపోవుచు శత్రువులతోఁ బోరుచున్నట్లు కలఁ గనుచుండెనఁట! ఇంతలోఁ దండ్రి యైనప్రోలరా జామార్గమునఁ బోవుచుఁ నాతని స్పృశించెనఁట! శత్రువెవ్వఁడో తనను దాఁకెననియనుకొని తటాలున లేచి యొఱనుండి కత్తివెఱికితండ్రిని బొడిచెనఁట! అదిప్రమాదవశ మని గ్రహించి తండ్రి యాతనికి రాజముద్రికనిచ్చి ప్రాణములను విడచెనఁట. ఈకథయాంధ్రులచరిత్రమునవ్రాయఁబడినది. తరువాతఁ దత్కర్తయగు శ్రీ వీరభద్రరావుగారే, యీకథ విశ్వాసార్హమైనదికాదనియు ద్రాక్షారామయం దున్నయొకశాసనములో (వెలనాటిరెండవచోడుఁడు వ్రాయించినశాసనము) "కాకతిప్రోలరాజునిర్దహన" అనియున్నదనియు, నందుచేఁ బ్రోలరాజునుజంపినవాఁడు వెలనాఁటిరెండవచోడుఁడు కాని రుద్రదేవుఁడు కాఁడని వ్రాసియున్నారు. దీనితో రుద్రదేవమహారాజుపై నారోపితమయినపితృహత్యాదోషము తొలఁగిపోయినది.

పైకథనించుకభేదముతోఁ గొంద ఱీవిధముగాఁ జెప్పుచున్నారు. రుద్రదేవమహారాజుజన్మించినకాలమందలి గ్రహస్థితినిబట్టి యీతఁడు పితృహంతకుఁ డగునని దైవజ్ఞులు చెప్పిరఁట. అందుపైఁ బ్రోలరా జీతని నొకశివార్చకున కిచ్చివేసెను. ఒకనాఁటి రాత్రిప్రొద్దు

పోయినపిమ్మట ప్రోలరాజాలయమునకుఁ బోఁగా దస్కరుఁడన్భ్రాంతిచే, రుద్రరాజాతనినిగత్తితోఁ బొడిచెనఁట. దైవజ్ఞులమాట తప్పలేదనితలంచి ప్రోలరాజు కుమారునిమన్నించి, రాజ్యమాతని కిచ్చివేసెనఁట. ఈకథ విశ్వాసార్హము కాదని, కథయే చెప్పుచున్నది.

రుద్రదేవమహారాజు మిగులపరాక్రమవంతుఁడును రాజనీతి నిపుణుఁడు నగుటచే, పూర్వార్జితమగు రాజ్యమునభివృద్ధిచేసియాంధ్ర రాజ్యమునకంతకుఁ బ్రభువై దాదాపు నలువదిసంవత్సరములు నిష్కంటకముగ రాజ్యముచేసెను.

18 మంత్రి భాస్కరుఁడు

ఆంధ్రు లతిపవిత్రములుగా ననుదినము తలంచుచుండెడిభారత భాగవతరామాయణములు మూఁడును, ఏకైకకవికృతములు గాక బహుకవికృతములగుటయు, విశేషించి యాగ్రంథకర్తలచారిత్రము లును, రచనావిషయములును వివాదాస్పదము లగుటయు నొకవిచిత్ర సంఘటనమై యున్నది. భారతము కవిత్రయముచేతను, భాగవతముకవి చతుష్టయమువలనను, రామాయణము కవిపంచకముచేతను నాంధ్రీక రింపఁబడియెను. (అరణ్యకాండయుద్ధకాండరచయితలు భాస్కరనామధారు లగువేఱువేఱుపురుషు లను వాద ముండుటచే రామాయణాంధ్రీకరణకర్త లైదుగురైరి.) ఈరామాయణమునకు భాస్కరరామాయణ మనిపేరు. దీనికర్తృత్వము వివాదాస్పదమైనది. అందుఁ బండితులును జరిత్ర కారులు నిదమిత్థమని నిర్ణయింపఁజాలనిమహాగహనరహస్యము లిమిడి యున్నవి.

ఈవిషయమున నిదివఱకు జరిత్రకారులును బండితులును చేసిన చర్చలనుబట్టి:—

౧. ఈగ్రంథమునకు భాస్కరరామాయణ మనుపే రెట్లువచ్చినది?

౨. ఈపేరు వచ్చుటకుఁ గారకుఁడైనభాస్కరుఁ డెవరు?

౩. అరణ్యకాండమును యుద్ధకాండమును రచియించినభాస్కరులు భిన్నులా? అయినచో వారెవరు?

౪. ఈ రామాయణమున మంత్రిభాస్కరునికవిత్వ మున్నదా? ఉన్నచో నెంతవఱకు? అతఁ డెప్పటివాఁడు?

అను ప్రశ్నలుదయించుచున్నవి.

మంత్రిభాస్కరుఁడు, భాస్కరరామాయణము గొంతవఱకు రచియించెనని వాద ముండుటచే, నాతనిచారిత్రము నిందు వ్రాసి పైప్రశ్నలకు సమాధానముల నీయఁ బ్రయత్నించెదను. భాస్కరరామాయణరచనావిషయమున వట్టికొంతవివాద మున్నది. అందునుగురించి హుళక్కి భాస్కరాదులచరిత్రములలో వ్రాయుదును.

మంత్రిభాస్కరుఁడు, నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; గౌతమగోత్రుఁడు; కేతననాచమాంబలపుత్త్రుఁడు; గుండ శౌరికిఁ బౌత్త్రుఁడు; మారెన యితనిప్రపితామహుఁడు. మహాభారత కృతికర్త యగుతిక్కనసోమయాజి యీమంత్రిభాస్కరునకు మనుమఁడు.

ఇతఁడు కవియా?

ఇతనినిగూర్చి తిక్కనసోమయాజి తననిర్వచనోత్తరరామాయణమునం దీక్రిందిపద్యమును జెప్పియున్నాఁడు.

గీ. సారకవితాభిరాము గుంటూరివిభుని
మంత్రిభాస్కరు మత్ప్రపితామహునిఁ దలఁచి
యైన మన్నన మెయి లోక మాదరించు
వేఱ నాకృతిగుణములు వేయ నేల.

తనకావ్యము, స్వగుణముచేతఁ గాకపోయినను, తనప్రపితామహుఁడైనమంత్రిభాస్కరుని సారకవిత్వమహిమచే నైనను లోకాదరణమును బొందఁగలుగు నని యీపద్య మందలిభావము. దీనినిబట్టి మంత్రిభాస్కరుఁడు తిక్కనవంటి మహాకవి కొనియాడుటకుఁ దగినకవిత్వముఁ

చెప్పఁగలసమర్థుఁ డని నిశ్చయించుటకు సంశయింపనక్కఱ లేదు. దశకుమారచరిత్రమును రచించిన కేతనకవి యితని

శా. శాపానుగ్రహశక్తియుక్తుఁ డమలాచారుండు సాహిత్యవి
ద్యాపారీణుఁడు ధర్మమార్గపథికుం డర్థార్థిలోకావన
వ్యాపారవ్రతుఁ డంచుఁ జెప్పు సుజనవ్రాతంబు గౌరీపతి
శ్రీపాదప్రవణాంతరంగు విబుధశ్రేయస్కరున్ భాస్కరున్.

అని సుతించియున్నాఁడు. ఈపద్యమందలి "శాపానుగ్రహశక్తి యుక్తుఁడు" "సాహిత్యవిద్యాపారీణుఁడు" అనువాక్యములవలన నీ భాస్కరుఁడు కవిత్వము చెప్పఁగలసమర్థుఁ డని యూహింపవచ్చును. తనకవిత్వముకంటె రసవత్తర మగుకవిత్వము చెప్పగలవాఁ డని తిక్కన సోమయాజియే చెప్పినప్పుడు, మంత్రిభాస్కరునికవితాసామర్థ్యమును గూర్చి మనము శంకింపనక్కఱ లేదు. ఇతఁ డేవియోనాల్గుపద్యము లల్లఁగలిగినసామాన్యకవిమాత్రుఁడు గాక రసవత్తర మైనకవిత్వము చెప్పఁగలిగినయొకగ్రంథకర్త యై యుండునని కూడఁ దిక్కనచెప్పిన పద్యమునుబట్టి యూహింపఁదగియున్నది.

ఇతఁడు భాస్కరరామాయణకర్తయా?

మంత్రిభాస్కరుఁడు రామాయణమున నరణ్యకాండాంతము వఱకును రచియించె ననియు, నీతనినిబట్టియే రామాయణమునకు భాస్కరరామాయణ మనుపేరు వచ్చినదనియు, నది యేకారణముచేతనో యుత్సన్నమై పోఁగాఁ దరువాతికవులు దానిని మరల రచించి రనియు లోకమున నొకప్రతీతి యున్నది. రామాయణము నాతఁడు పూర్తిగనే రచియించె ననువాదముకూడఁ గలదు. ఈవిషయమునఁ బండితులు భిన్నాభిప్రాయమును గలిగియున్నారు. రామాయణములోఁ గొంతభాగమును భాస్కరుఁ డనుకవి రచియించె నని యందఱు నంగీకరించుచున్నారు. ఆవిషయమునుగూర్చి గ్రంథనామమును, ఆరణ్యకాండాంతగద్యయును ప్రబలమైనసాక్ష్య మిచ్చుచున్నవి. కాని

ఆభాస్కరుఁ డీమంత్రిభాస్కరుఁడు కాఁడనియు, హుళక్కిభాస్కరుఁ డనుపేరుగలమఱియొక భాస్కరుఁ డనియుఁ గొందఱి వాదము. ప్రస్తుతము మనము చదువుచున్న భాస్కరరామాయణములో యుద్ధకాండమున గొంతవఱకు హుళక్కిభాస్కరుఁడు రచియించె ననియుభయపక్షములు వారును నంగీకరించుచున్నారు. అందువిషయమున భిన్నాభిప్రాయము లేదు. ఇఁక మొదటియైదుకాండములలోను మంత్రిభాస్కరునికవిత్వ ముండెనా? లేదా? యనునదియే వివాదాంశము. ఈయిరువురకును నామసామ్యము గలిగియుండుటమూలమున నీవివాదమును బరిష్కరించుట యంతసులభకార్యము కాదు. భాస్కరరామాయణమునుగూర్చి యింకను బరిశోధనము విశేషముగాఁ గావలసియున్నది. భావిపరిశోధకుల కుపకరించుననునూహతో నీవిషయమున నాకుఁ బొడఁగట్టిన విషయముల నిట వ్రాయుచున్నాఁడను.

మంత్రిభాస్కరుడు రామాయణమును రచించెనని పూర్వకవు లెవ్వరైనఁ జెప్పియుండిరా?

పూర్వకవులు పెక్కురును లక్షణగ్రంథకర్తలుకొందఱును దమ గ్రంథములలో భాస్కరునిఁ బూర్వకవినిగాఁ బేర్కొనియాతఁడు రామాయణకర్తయని చెప్పియున్నారు. కొందఱు "హుళక్కి" శబ్దమును జేర్చి హుళక్కిభాస్కరుఁ డని నుతించియున్నారు.

దీనినిబట్టి "హుళక్కిభాస్కరుఁ" డనిగాక కేవలభాస్కరుఁ డని చెప్పినయాతనిని మంత్రిభాస్కరుఁ డని నిశ్చయింపవలయునని కొంద అందురు. కానియీ వాదమునందంతగ బలము లేదు. మంత్రిభాస్కరుని కాలము క్రీ. శ. ౧౨౦౦ ప్రాంతము. హుళక్కిభాస్కరునికాలము ౧౩౨౦ ప్రాంతము. భాస్కరుని పూర్వకవినిగా నుతించినవా రందఱును ౧౩౨౦ వసంవత్సరమునకుఁదరువాతివారు గాని యంతకుపూర్వులు కారు. వీరు తమకావ్యములలో నేభాస్కరుని మనసునందుంచుకొని స్మరించిరో నిర్ణయింపఁజాలము. 'హుళక్కి' పదము లేనంతమాత్రమున నాతఁడు మంత్రిభాస్కరుఁడని నిర్ణయింపరాదు. క్రీ. శ. ౧౨౦౦—౧౩౨౦నడుమ నెవ్వరైనభాస్కరునిఁ గొనియాడియుండినచో, నాతఁడు మంత్రి

భాస్కరుఁడని చెప్పవచ్చును. కాని యట్టివారు కన్పడుట లేదు. ఆ కాలమున సుప్రసిద్ధకవులు విశేషముగా లేరు. సోమన, కేతన, తిక్కన, మారన, మంచెన, మొదలగుకొలఁదిసంఖ్యాకులు మాత్రమే కలరు. వీరిలో మంత్రిభాస్కరునిగూర్చి చెప్పవలసినవారు ముఖ్యముగా కేతన, తిక్కనలు. వీరాతనినిగూర్చి యేమిచెప్పినదియుఁ బైన వ్రాసియుంటిని. వీరిరువురునుగూడ భాస్కరుఁడు రామాయణమును రచించె నని చెప్పలేదు. కావున నాతనికి రామాయణకర్తృత్వ మారోపింపరా దని కొంద అనుచున్నారు. కాని యీ వాదమునందును సారము లేదు. ఆ కాలమునాఁటిమానవహృదయముల నీకాలమునాఁటికొలఁతబద్దతో కొలుచుటకు వీలు లేదు. పదియవశతాబ్ది మొదలు పదునైదవశతాబ్ది వఱకును గలకవులు స్వోత్కర్షఁ బ్రకటించుకొనుటకుఁ గాని, స్వీయచరిత్రమును జెప్పుకొనుటకుఁ గాని, యంతగా నిష్టపడినయొడివారు కారు. తరువాతికవులు క్రమక్రమముగాఁ దమనుగూర్చియుఁ దమపూర్వులనుగూర్చియుఁ గొంతకొంత వ్రాయుచువచ్చిరి. గ్రంథవిషయముకంటె తమవిషయమే ప్రధానముగ నెంచుకొనుకాల మిది. తిక్కనసోమయాజి తాను నిర్వచనోత్తరరామాయణమును రచించినట్లు భారతమునఁ జెప్పలేదు. మనుమసిద్ధియాస్థానమున నుండి తిక్కనామాత్యుఁ డుభయభాషలయందును గవిత్వముచెప్పె నని మాత్రమే కేతనచెప్పెను కాని యాతఁడు రచించినగ్రంథములపేరుల నైనఁ జెప్పలేదు. కేతనతనగ్రంథములు రెండింటిలోను, ఒకదానిసంగతి రెండవగ్రంథమునఁ జెప్పెనా? అదియును లేదు. ఇట్టియుదాహరణముల ననేకముగఁ జూపవచ్చును. కావున నితరకవు లెవ్వరును జెప్ప లే దనుకారణము నాధారము చేసికొని భాస్కరునిరామాయణకర్తృత్వమును తోసివేయక యితరాధారము లేవయిన నున్నవేమో చూడవలసియున్నది.

తిక్కన పూర్వరామాయణమును రచింపక యుత్తరరామాయణము నేల వ్రాసెను?

తిక్కనసోమయాజి పూర్వరామాయణమును విడచి యుత్తరరామాయణమును రచించుటవలనను మంత్రిభాస్కరుఁడు రామాయణ

మును రచించె ననుజనశ్రుతియుండుటను బట్టియు నాతఁడురామాయణ మును రచించె నని నిశ్చయింపవచ్చు నని కొందఱియభిప్రాయము. ఇందెంతవఱకు సత్యమున్నదో చూతము. తిక్కన నిర్వచనోత్తర రామాయణమున

"క. ఎత్తఱినైనను ధీరో
దాత్తనృపోత్తముఁడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్య మగుట
నుత్తరరామాయణోక్తియుక్తుఁడ నైతిన్"

అనిచెప్పియున్నాఁడు.

గంభీరహృదయుఁడును, ఉచితానుచితజ్ఞను బాటించుకవిసత్తముఁడునగుతిక్కనసోమయాజి యీపద్యమును వ్రాయుట కేమికారణము? అని యాలోచింపవలసియున్నది. పూర్వరామాయణ ముండఁగా దానిని రచింపక యుత్తరరామాయణ మేల రచింపవలయు నని లోకము ప్రశ్నించునేమో యని యందులకు సమాధానముగా ధీరోదాత్తనాయకుఁడైనశ్రీరామచంద్రునిసద్వృత్త మెచ్చటనుండి రచించినను పూజనీయమే యగును గావున నుత్తరరామాయణమును రచించితి నని యీపద్యమును జెప్పిన ట్లూకయూహ కలుగును. దీనినిబట్టి యదివఱకు పూర్వరామాయణము రచింపఁ బడలేదని తేలుచున్నది. పూర్వరామాయణ మదివఱకు రచింపఁబడియున్నయెడల లోకము ప్రశ్నించుట కవకాశమును లేదు. తిక్కన యీపద్యమును వ్రాయవలసినపనియు నుండదు.

కాని యంతకుపూర్వము రామాయణము సంపూర్ణముగాఁ గాక కొంతభాగము మాత్రమే రచియింపఁబడియుండెనేని, యాతరువాయి నందుకొని శేషమ్మును బూర్తిచేయక యాభాగమును వదలి యుత్తరరామాయణము నేల రచించుచున్నా వని లోకము తనను బ్రశ్నించు నేమోయని తిక్కన యీపద్యము మూలమున నాప్రశ్న కుత్తర మొసంగుచున్నాఁ డని తలఁచుట కవకాశము కలుగుచున్నది. ఆ పక్షములో ఆప్రశ్నకును, ఆసమాధానమునకును గూడ నవసర మేర్పడుచున్నది.

కావునఁ దిక్కనకాలమునాఁటికి రామాయణము కొంతభాగముఁ రచియింపఁబడియుండె నని యూహించుట కవకాశమున్నదనుట నిశ్చయము. ఎంతవఱకు రచియింపఁబడియుండె ననుటనుగూర్చి తరువాత నాలోచింతము.

పై పద్యముక్రిందనే తిక్కన తనపితామహునిఁగూర్చి యీ క్రిందిపద్యమును వ్రాసియుండెను.

తే. సారకవితాభిరాము గుంటూరివిభుని
మంత్రిభాస్కరు మత్పితామహునిఁ దలఁచి
దైన మన్ననమెయి లోక మాదరించు
వేఱ నాకృతిగుణములు వేయు నేల?

ఈ పద్యములో మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచించె ననుసూచన కూడ లేనిమాట నిశ్చయము. అయినను పైపద్యమును వ్రాసిన వెనువెంటనే తిక్కన యీపద్యమును వ్రాసియుండుటచేతఁ దనపితామహుఁడైన భాస్కరుఁడు రామాయణభాగమును రచించినాఁ డనువిషయము మనమునం దుంచుకొనియే యీపద్యమును వ్రాసియుండెనా యని సంశయము కలుగుచున్నది. ఈ పద్యము చెప్పినపిమ్మటఁ గాని తనకులగోత్రాదిప్రశంస యాతనిహృదయమునకు రాలేదు. ఈరెండుపద్యములను కలిపిచదివి యోచించితి మేని మంత్రిభాస్కరుఁడు రామాయణమున గొంతభాగము రచియించియుండె నని దృఢమైనయనుమానము గలుగక మానదు. అనుమానమేల? ఆయూహయందు సత్యమున్నదనియే నాతలంపు. అట్లయినచో, భారతమున నన్నయమూఁడుపర్వములు రచించె నని చెప్పినట్లే తనపితామహుఁ డింతవఱకు రచించెనని తిక్కన యేల చెప్పలేదను ప్రశ్న రావచ్చును. భారతమునందు తక్కినపదియేనుపర్వములునుఁ దాను పూర్తిచేయఁ దలపెట్టెను గావున నన్నయభట్టు మూఁడుపర్వములను రచియించెను. తక్కినభాగమును రచించి నేను భారతమునుఁ బూర్తిచేయుదు నని చెప్పుటలో సరస మున్నది. లోక మందులకు హర్షించును. ఇచ్చట నట్టి

యదృష్టము పట్టలేదు. తనపితామహుఁడు మూఁడుకాండములను రచించినాఁడు అని చెప్పి యంతటితో వదలివేసి తాను, ఉత్తరరామాయణమును రచించెద నని చెప్పినచో నది సరసముగ నుండునా? లోకము సంతసించునా? తిక్కన, యాతరువాయిభాగము నందుకొని రామాయణము నేల పూర్తిచేయలేదు? అని శంకింతు రేమో! మహాత్ముల హృదయములు దురవగాహములు. ఆయనమనసులోఁ నప్పు డేమికలదో యెవరు చెప్పఁగలరు? ఎంతటిధైర్యవంతునకైనను ఒక్కమారు చదివినంతనే హృదయవిదారకం బొనరించుస్త్రీపర్వాదులను రచించినతిక్కనసోమయాజి, భారతరచనానంతరమునఁ గూడ నారణ్యపర్వశేషమును బూరింపలేదు. దీనికిఁ గారణ మేమందుము? కొంత భాగమును రచించిమరణించిన తనపితామహునికావ్యము బూర్తిచేయుట కాతనికి మనసు గొలుపకయుండును.

పైనఁ జెప్పిన "ఎత్తఱినైనను" అనుపద్యములో నింతయర్థమిమిడియుండలే దనియు, "ఎప్పుడైనను ధీరోదాత్తనాయకుఁడైనరామచంద్రునివృత్తము పూజనీయమే కావున నుత్తరరామాయణమును రచించితి" ననుసామాన్యార్థము మాత్రమే యందుఁ గలదనియు, లోకము శంకించు ననునూహగాని యందుల కుత్తర మీయవలయు ననుభావము గాని తిక్కనకు లే దనియు, నట్లు దానితరువాయిపద్యములో నెట్టిసూచనయు లే దనియుఁ నీయూహలన్నియు మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచించె ననుభావమును గలిగియుండుటచే నుద్భవించెనిభ్రాంతిమూలకము లగునూహలనియుఁ గొంద అనవచ్చును.

ఆ పద్యమునం దెంతయర్థ ముండెనో, లోకమున కేమి తెలుపఁగోరి యాతఁ డాపద్యములను రచియించెనో, యనువిషయములను గూర్చి తిక్కనకవితాస్వారస్యమును గ్రహింపఁగలిగినరసజ్ఞులు తమకుఁ దోఁచినరీతిని నిర్ణయించెదరు గాత! తనపితామహుఁడు రామాయణభాగమును రచించియుండెనని తెలుపుటకే తిక్కన యాపద్యములను రచించెనని నాతలంపు

ఉ. భూరివివేకచిత్తులకుఁ బోలుఁ గసం దలఁపన్ దళంబులన్
సౌరభ మిచ్చుగంధవహుచందమునం బ్రకటంబు చేసి యిం
పారెడుపల్కు లం బడయు నప్పలుకు ల్సరి గ్రుచ్చునట్లుగాఁ
జేరుపనేరఁగా వలయుఁ జేసిద నేఁ గృతి యన్నవారికిన్.

నిర్వచనోత్తరరామాయణము.

భాస్కరరామాయణ మనుపే రెట్లు వచ్చినది ?

భాస్కరరామాయణ మనుపేరు కవి యుంచెనని చెప్పఁజాలము. కవి తనపేరును జేర్చి నామమిడిన గ్రంథములు కొన్నికలవు. కాని యిట్టి వివాదవిషయములలోఁ గవియే తనపేరుతో గ్రంథనామము నుంచె నని తలంచుట న్యాయము కాఁజాలదు. రామాయణమను పేరు గ్రంథమో, గ్రంథములో యుండుటచేఁ గొంతకాలమునకుఁ బిమ్మట లోక మీగ్రంథము నీపేరునఁ బిలువఁజొచ్చిన దని తలంపవలసి యున్నది. ఎప్పటినుండి యీ పేరు లోకమున వాడుకలోనికి వచ్చినదో చెప్పఁజాలము. క్రీ శ. ౧౨౦౦-౧౩౨౦ నడుమ నీపే రున్నదని ధృవపడిననేతప్ప, నీనామము మంత్రిభాస్కరున కన్వయించునని నిర్ణయించుట కవకాశము లేదు. ఆమధ్యకాలములో నీపేరు వాడుకలోనుండె నను సాక్ష్యము లేదు. కావున గ్రంథనామమునుబట్టి మంత్రిభాస్కరుని కర్తృత్వము స్థిరపడఁజాలదు. కాని యాతనిపేరుతోనే యీరామాయణమును బిలుచుచున్నారని తలంచుట కొకయవకాశము గన్పడుచున్నది.

ఇప్పుడు మనకు లభించుచున్న భాస్కరరామాయణమందలి గద్యపద్యములను బట్టి రామాయణకవు లైదుగురని తెలియుచున్నది. బాల, కిష్కింధసుందరకాండములను రచించినవాఁడు మల్లికార్జునభట్టు. అయోధ్యాకాండమును రచించినది కుమారరుద్రదేవుఁడు. అరణ్యకాండమునురచించినవాఁడు భాస్కరుఁడు. యుద్ధకాండమునఁ గొంత భాగమును రచించినవాఁడు హుళక్కిభాస్కరుఁడు. మిగిలినభాగమును రచించినది అయ్యలార్యుఁడు. గ్రంథమును ప్రారంభించినవాని

పేరునఁబట్టి గ్రంథనామ మేర్పడుట న్యాయము. అట్లుగాక గ్రంథాంత కాండములోఁ గొంతభాగమును రచించిన హుళక్కి-భాస్కరుని పేరుతో గ్రంథనామ మేర్పడిన దనుట సమంజసము కాదు.

ఈ సూత్రము నన్వయింపఁజేసి చూచినచో, నీ గ్రంథమునకు మల్లికార్జునరామాయణ మను పేరు రావలసియున్నది. అట్లు రాలేదు. భాస్కరరామాయణ మని పేరువచ్చుటకు, అరణ్యకాండగద్యలే కారణమై యుండవలయును. అరణ్యకాండ భాస్కరవిరచిత మని యీ గద్యల వలన స్పష్టముగాఁ దెలియుచున్నది. యుద్ధకాండాంతమున నయ్యలార్యునిగద్యయే కాని భాస్కరునిగద్య లేదు. కావున నీరామాయణమునకు భాస్కరరామాయణ మని పేరుపెట్టినవారు, ఆరణ్యకాండాంత గద్యనే యందుల కాధారముగాఁ గొనియున్నా రనితలంపవలసియున్నది. యుద్ధకాండములోఁ గొంతభాగమును హుళక్కి-భాస్కరుఁడు రచియించి యుండుటచే నాతనినిబట్టియే యీ వాడుక వచ్చిన దని కొందఱన వచ్చును. యుద్ధకాండభాగమును హుళక్కి-భాస్కరుఁడు రచియించె నని, యయ్యలార్యుఁడు చెప్పిన :-

"చ. అమర హుళక్కి-భాస్కరమహాకవి చెప్పఁగనున్న యుద్ధకాం
డము తరువాయి చెప్పెఁ బ్రకటప్రతిభాషణుఁ డప్పలార్యన
త్తమసుతుఁ డయ్యలార్యుఁడు కృతస్థితి నార్యులు మెచ్చునట్లుగా
హిమకరతారకారవిమహీవలయస్థిరలక్ష్మిఁ జేకుఱన్."

అనుపద్యమువలన మాత్రమే మనకుఁ దెలియవచ్చుచున్నది. ఈపద్యము లేక పోయినచో మనకు హుళక్కి-భాస్కరుఁడు తెలిసే లేఁడు. స్పష్టముగా రెండుగద్యలమూలమునఁ దెలియుచున్న భాస్కరునివిడచి, హుళక్కి-భాస్కరునకుఁ దరువాతఁ జాలకాలమునకు అయ్యలార్యుఁడు రచియించినపద్యముచే నెఱుంగవచ్చిన హుళక్కి-భాస్కరునిఁబట్టి గ్రంథనామ మేర్పడినదనుట సమంజసము కాదు. ఇందుల కారణ్యకాండ కర్తయు, యుద్ధకాండాది భాగకర్తయు నొక్కఁడే యనియు, నాతఁడే హుళక్కి-భాస్కరుఁడనియు ప్రతిపాదము రావచ్చును. ఆవాదమున కవకాశమున్నమాట నిశ్చయమే. కాని కారణాంతరములచే నారణ్య

కాండకర్తృభిన్నుఁ డనిధృవపడియెనేని, యాతనినిబట్టియే యీగ్రంథము నకు భాస్కరరామాయణ మను పేరువచ్చిన దని నిశ్చయింపవలసి యున్నది. ఇంతేకాదు. అట్టిభిన్నకర్తృత్వము స్థిరపడిన పక్షములో మొట్టమొదట మంత్రిభాస్కరుఁ డరణ్యకాండమువఱకునో, కాక యింకను మఱికొంత భాగమునో కాక పూర్తిగనో రచియించి యుండె ననియు, నాతనిపేరుతోడనే భాస్కరరామాయణ మనుపేరు వచ్చె ననియుఁ గాక తాళీయముగ హుళక్కిభాస్కరుఁడుకూడఁ గొంతభాగము నిందు రచియించియుండుటచేనాతనిబట్టి పేరువచ్చినట్లు లోకము భ్రమించుచున్నదనియుఁ దలంచుట కూడ సమంజస మగును.

బ్ర. శ్రీ వీరేశలింగముపంతులుగారు మున్నుగ కొందఱు హుళక్కిభాస్కరునిబట్టియే భాస్కరరామాయణమను పేరు వచ్చె నని వ్రాసియున్నారు. ఆవిషయమునుగూర్చి హుళక్కిభాస్కరునిచారిత్ర మునఁ జర్చించెదను. ఒకవేళ యుద్ధకాండమును రచించిన హుళక్కి భాస్కరుని పేరుతోడనే గ్రంథనామమేర్పడినదని యంగీకరించినను నంతమాత్రమున రామాయణరచనమునందు మంత్రిభాస్కరునకు స్థానము లేదని ధృవపరుపక యీవిచారణను గొనసాగింపవలసియే యున్నది.

మంత్రి భాస్కరుని కర్తృత్వమును స్థిరపర్చెడి యాధారములు గ్రంథమునం దేమైనఁ గలవా?

ఈ పైపై యూహాల నటుంచి, మంత్రిభాస్కరునికర్తృత్వమును స్థిరపరచెడియాధారములు గ్రంథమునం దేమయిన కల వేమో చూడ వలసియున్నది. భాస్కరరామాయణమునఁ దక్కినవానికంటె నారణ్య కాండము మంత్రిభాస్కరవిరచిత మనితలంచుట కాధారములున్న వని కొందఱనుచున్నారు. కావున ముందుగ నాకాండమునే పరిశీ లింతము.

ఆరణ్యకాండగద్యలు

ఆరణ్యకాండము రెండాశ్వాసములుగ విభజింపఁబడియున్నది. ఆరెండాశ్వాసములతుదలను గద్యము లొకేవిధమున నీరీతిగనున్నవి. గద్యము "ఇది సకలసుకవిజనవినుతయశస్కరభాస్కరప్రణీతం బైన శ్రీరామాయణమహాకావ్యంబునం దారణ్యకాండంబు" కొన్ని తాళపత్ర ప్రతులలో "యశస్కర" శబ్దము లేదు. ఆశబ్దమును దీసివేసినచో నిది సర్వవిధముల నన్నయభట్టు భారతమున వ్రాసికొనినగద్యను బోలియున్నది. శ్రీమహాభారతమున నన్నయభట్టు "ఇది సకలసుకవిజన వినుత నన్నయభట్టప్రణీతం బైన" అని వ్రాసికొనియున్నాఁడు.

ఈగద్యమునుబట్టి, దీనికర్త మంత్రిభాస్కరుఁడో హుళక్కిభాస్కరుఁడో నిర్ణయించుటకు సాధ్యము కాదు. హుళక్కిభాస్కరుని కంటె మంత్రిభాస్కరుఁడు నన్నయభట్టునకు సమీపకాలములోని వాఁడు కావున, నన్నయభట్టు ననుకరించినవాఁడు మంత్రిభాస్కరుఁడే యని నిర్ణయింపవలయు నని కొందఱందురు. కాని యావాదమునందు బలము లేదు. హుళక్కిభాస్కరుఁ డట్టిగద్యను వేసికొనియుండఁ డని తలంచుట కవకాశము లేదు. యుద్ధకాండమును హుళక్కిభాస్కరుఁడు పూర్తిగ రచింపకపోవుటచే నాతఁడు గద్యమును వేసికొని యుండలేదు. అది పూర్తియై గద్యమును వేసికొనునవసరము గలిగినచో నెట్లు వ్రాసికొనియుండునో యెవరు చెప్పఁగలరు?

ఆరణ్యకాండాశ్వాస విభజనము?

ఆరణ్యకాండము మొత్తము 238 పద్యములు. ఇందు మొదటియాశ్వాసమున ౨౬౮ పద్యములును రెండవయాశ్వాసమున ౭౮౦ పద్యములును గలవు. హుళక్కిభాస్కరుఁడు యుద్ధకాండమున ౧౧౩౯ పద్యములను రచించియుండియు నాశ్వాసవిభాగము చేయ లేదు. ఆరణ్యకాండము 238 పద్యములే యయ్యును రెండాశ్వాసములుగా నున్నది. ఇందువలన, ఆరణ్యకాండయుద్ధకాండకర్త లొక్కరు కారనితలంచుట కవకాశము కల్గుచున్నది. యుద్ధకాండ మంతయు

రచింపబడినపిమ్మట నాశ్వాసవిభజనము చేయవచ్చు నని హుళక్కి భాస్కరుఁడు తలంచియుండవచ్చు ననియు, నది పూర్తికాకపూర్వమే యాతనిరచనమాగిపోవుటచే నాశ్వాసవిభజనకార్యముకూడ నాగిపోయె ననియుఁగొందఱు సమాధానము చెప్పుచున్నారు. హుళక్కిభాస్కరుఁడు రచియించుచున్నది స్వతంత్రగ్రంథము కాదు. వాల్మీకిరామాయణమున కాంధ్రీకరణము. సంస్కృతరామాయణమున నధ్యాయవిభజన ముండియున్నది. తనకుచితమనితోఁచినని యధ్యాయముల నాంధ్రీకరించినపిమ్మట నక్కడి కొకయాశ్వాస మని వ్రాసికొనుట సులభము కాని గ్రంథమంతయు రచించినపిమ్మట నాశ్వాసవిభజన మొకపనిగాఁ బెట్టుకొనుట సులభముకాజాలదు. ఆశ్వాసమున కైదు పద్యము లధికముగా గ్రంథరచనామధ్యమున వ్రాయవలసివచ్చు నని యాకార్యమునుఁ దుదవఱకు నిలిపియుంచె ననుటలో స్వారస్యము లేదు. అరణ్యకాండమును హుళక్కిభాస్కరుఁడు రచియింప లేదని నిర్ణయించుట కీయాశ్వాసవిభజనావిషయ మొకగొప్పయాధారము కాక పోయినను, అరణ్యకాండయుద్ధకాండరచయిత లిరువురా? ఏకవ్యక్తియా? యని నిర్ధారణము చేయుటలో నీయంశము తోడుపడగలదు. ఇట్టి విషయములలో నొకవ్యక్తి యొకగ్రంథమునకు రెండుపద్ధతుల నవలంబించి యుండఁడు. కావున దీనినిబట్టి యారణ్యయుద్ధకాండకర్తలు భిన్నులని మనము నిర్ణయింపవచ్చును.

అరణ్యకాండకృతిపతి యెవ్వరు?

అరణ్యకాండమునందుఁగృతిపతిని సంబోధించినపద్యము లేవయిన కృతికర్తను నిశ్చయించుటకుఁ దోడుపడునేమో చూడవలసియున్నది. అరణ్యకాండప్రథమాశ్వాసమునఁ గృతిపతిని సంబోధించినపద్య మిది:

క. శ్రీహిత నయవిలసిత వా
ణీహిత మృదువచన ధారుణీహితగుణసం
దోహ త్రివిక్రమవిక్రమ
సాహస నగధైర్యసార సాహిణిమారా!

ఈ పద్యమునకుఁ బాఠాంతరముగా వ్రాతప్రతియం దీక్రింది పద్యమున్నది.

క॰ శ్రీరమ్యస్థితి వదనప
యోరుహ శుండాలగండయుగళితవిగళ
ద్ధారాళదానదారా
సారాప్లుత భవనహార సాహిణిమారా!

పాఠాంతర మిసప్పు డేవయిన కొన్నిశబ్దము లటునిటు నుం డుట ధర్మము. ఇచ్చట పద్య మంతయు వేఱు రీతిగా నున్నది. రెండు పద్యములయందలిభావములును వేఱు వేఱుగా నున్నవి.

రెండవ యాశ్వాసమునఁ గృతిపతిని సంబోధించినపద్య మిది:

క. శ్రీరామాకుచయుగళీ
హారిద్రోల్లసితవత్సహరిచరణసరో
జారాధ్యుఁడు మారయధర
ణీరమణోత్తముఁడు సాహిణీతిలక మిలన్.

ఈపద్యమే యించుకమార్పుతో నీక్రిందివిధమున బాలకాండ యందు ౨౩వ పద్యముగా నున్నది.

క. శ్రీరామాకుచయుగళీ
హారిద్రోల్లసితవత్సహరిచరణసరో
జారాధ్య! బుద్ధవిభునుత!
సారసహితతేజ! ధీర! సాహిణిమారా!

రెండవయాశ్వాసాదినిసంబోధనముండుటకు బదులుగా ప్రథమా విభక్తియుండుటయు, పాఠాంతరము లుండుటయుఁజూడఁగా, నీపద్య ములు కవివిరచితములు గాక, విలేఖకులో మఱియెవ్వరో సాహిణి మారునిసంబంధించుపద్యములను రచించి, యిందుఁ జేర్చి రని యూ హింపఁదగియున్నది. బాలకిష్కింధకాండములలోఁగూడ నిట్టిభేద ములు గన్పట్టుచున్నవి. (ఇందునుగూర్చి మల్లికార్జునభట్టుచారిత్రమున విపులముగాఁ జర్చింపఁదలఁచితిని.)

బాలకిష్కింధకాండాదిపద్యములు సాహిణిమారయ పేరునను, కాండాంతపద్యములు శివునిపేరను గలవు. సుందరకాండాదిపద్యము ముద్రితప్రతిలో సాహిణిపేరను, తాళపత్త్రప్రతిలో నీశ్వరుని పరముగను గలదు. రెండుప్రతులలోనుగూడ నాకాండాంతపద్యములు శివపరముగనే యున్నవి. దీనిఁబట్టి విలేఖకుఁడో మఱియెవ్వరో, అన్నికాండములకును సరిపడు నన్నికందపద్యము లొక్కసారిగా సాహిణిమారుని సంబోధించుచు వ్రాసి, యదివఱ కున్నపద్యములను దీసివేసి వానికి బదులుగా వీని నందుఁ జేర్చియుందు నని తోఁచుచున్నది. హుళక్కి భాస్కరుఁడు రచించినయుద్ధకాండమున మొదటిపద్యము సాహిణిపరముగా నున్నది. అతఁడు సాహిణిమారనికాలమున నున్నవాఁ డనుటయు నిజమే. కాని యీపద్యముదక్క యుద్ధకాండమును హుళక్కిభాస్కరుఁడు సాహిణిమారని కంకితము చేసెనని నిర్ణయించుటకుఁ దగినయాధారములు లేవు. యుద్ధకాండాదిపద్యముకూడ బాలకిష్కింధకాండాదిపద్యములవలెనే ప్రక్షిప్తమని నాయభిప్రాయము. (హుళక్కిభాస్కరకవిచారిత్రమున నీవిషయమునుగూర్చి వ్రాసెదను.)

బాలకాండాదులయందలి ప్రథమపద్యములవలెనే ఆరణ్యకాండాదిపద్యములుకూడ ప్రక్షిప్తము లని నిర్ణయించితిమేని, యాకాండముతో సాహిణిమారనిసంబంధమును, దానితోపాటు హుళక్కిభాస్కరుని సంబంధమునుగూడ లేకుండఁబోవును. అవి ప్రక్షిప్తములుకాక వాస్తవముగా భాస్కరకవియే రచియించెనని తలంచినచో నాభాస్కరుఁడు హుళక్కిభాస్కరుఁడే యని నిశ్చయింపవలసియున్నది. ఈవిషయమును నిర్ణయించుట కాశ్వాసాంతపద్యము లేమయిన సాహాయ్య మొనర్చునేమో చూడవలసియున్నది వాని నీక్రింద నిచ్చుచున్నాఁడను.

ప్రథమాశ్వాసాంతపద్యములు :

శా. పుణ్యుం డూర్జితశౌర్యధైర్యమహిమస్ఫూర్తిస్ఫురద్వైభవా
గణ్యుం డార్యజనానురంజితమహాకారుణ్యుఁ డుద్యచ్ఛ్లాఘ్యసౌ
జన్యుం డన్వయవార్ధిచంద్రుఁడు రిపుక్షోణీశ్వరస్థాపితా
రణ్యుం డార్తశరణ్యుఁ డుజ్జ్వలయశోరమ్యుండు సౌమ్యుం డిలన్

క. మతివిజితసురాచార్యుఁడు
చతురత్వచతుర్ముఖుఁడు సదమలవృత్తా
యతపంకజలోచనుఁడును
శ్రితవినుతగుణప్రధానధురీణుఁడు పేర్మిన్.

మాలిని. వితరణఖని యుద్యద్వీర్యప్రభావో
న్నతుఁడు భుజబలాత్యున్మాదవిద్విడ్ధరిత్రీ
పతిహరణసమిద్భ్యాభాగగణ్యుండు సంభా
వితపరిణతచిత్తోర్వీసురం డుర్వి నెంచన్.

ఈ మాలినీవృత్తము మాయూరమనున్న తాళపత్రప్రతిలో నిట్లున్నది :

"వితరణఖని యుద్యద్వీరశృంగారలక్ష్మీ
యుతుఁ డురుభుజశౌర్యాఢ్యుండు విద్విడ్ధరిత్రీ
పతిహరణసమిద్భ్యాభాగగణ్యుండు సంభా
వితపరిణతచిత్తోర్వీజనాధీనుం డెందున్."

ద్వితీయాశ్వాసాంతపద్యములు :

శా. వైరిక్ష్మాతలనాథపర్వతపహావజ్రాయుధున్ ఘోరదు
ర్వారాంహఃపరిధితారిదుస్సహతమిస్రప్రస్ఫురద్భానుఁ గం
భీరాంభోనిధి ధీరతానిమిషభూభృన్నాథు నత్యంతవి
స్తారోదారగుణప్రసిద్ధినవరాధాపుత్రు సన్మిత్రునిన్.

క. లలనాజనవరభద్రుని
బలవిలసితవినుతరామభద్రుని సుద్య
త్సులభతరగుణోన్నిద్రుని
బలవిలసితవినుతరామభద్రునిఁ బ్రీతిన్.

మాలిని. విభవజితసురేంద్రున్ విస్ఫురత్కాంతిచంద్రున్
శుభతరవరగాత్రున్ సూరిసంస్తోత్రపాత్రున్
ప్రభుజననివహోద్యత్ప్రాజ్ఞ విద్యానవద్యున్
సభయరిపుశరణ్యున్ సంభృతాగణ్యపుణ్యున్.

ఈపద్యము లారెంటిలోను సాహిణిమారుని పేరు గాని యాతనిని సూచించుమఱియొకపదముగాని లేదు. అయోధ్యాకాండము సాహిణి కంకితము జేసిన ట్లాకాండాంతపద్యమునందలి "కాచమారాంబాకుమారా" యనువాక్యమువలనఁ దెలియుచున్నది. అట్టి దారణ్యకాండమున నేమియును లేదు. కాని యాపద్యములలోఁ గృతిపతిపేరు గన్పడనంతమాత్రమున నాగ్రంథము సాహిణిమారని కంకితము కాలేదని నిర్ణయింపవీలు లేదు. ఆశ్వాసాంతపద్యములలోఁ గృతిపతిపేరు లేని గ్రంథములు పెక్కు లున్నవి. పైపద్యములలో నెవరిపేరును లేకుండుటయే యిందులకు నిదర్శనము.

ఈయాశ్వాసాంతపద్యములు దైవమును సంబోధించునవి కావు. ఒకప్రభువునుగూర్చి చెప్పిన వనుమాట సత్యము. అందలివర్ణనమును బట్టి ప్రభునిర్ణయమునుఁ జేయఁజాలము. సాహిణిమారయ కేవల మశ్వదళాధిపతిమాత్రమే యనియెంచినచో నాపద్యము లాతని కన్వయింపకపోవచ్చును. కాని యాతఁడుకూడ నొకచిన్నప్రభు వనియంగీకరించినచో నావర్ణన మాతనికినిఁ నన్వయించును. కుమారరుద్రదేవునియొక్క శాసనమునుఁబట్టి సాహిణిమారయ యఱువదిగ్రామములు గలయొక దేశమునకుఁ బ్రభు వని తెలియుచున్నది.

దీనినిబట్టి యాశ్వాసాదిపద్యములు ప్రక్షిప్తములు కావనియు, నీకాండము సాహిణిమారయ కంకిత మనియు, హుళక్కిభాస్కరకృత మనియు నిశ్చయింపవలసియున్నది. కాని యీనిర్ణయమునకువచ్చుటకుఁ బూర్వము మన మింకనొకవిషయమునుగూర్చి యాలోచింపవలసియున్నది. పైనఁజూపిన యారణ్యకాండప్రథమాశ్వాసాంతపద్యములును, తిక్కనామాత్యుఁడు రచించిన నిర్వచనోత్తర రామాయణాష్టమాశ్వాసాంతపద్యములు నొక్కపోలికగా నున్నవి. పదములయందును భావములలోనుగూడ రెండిటికిని సామ్య మున్నది. ఈరెండిటిని పోల్చిచూచుటకై, నిర్వచనోత్తరరామాయణములోని పద్యముల నీక్రింద నిచ్చుచున్నాఁడను.

ఉ. పుణ్యుఁడు భారతీవిభవపూతవికాసముఖారవిందలా
వణ్యుఁడు దీప్రకోపదవవహ్నినిరర్గళదగ్ధశాత్రవా
రణ్యుఁడు మానినీహృదయరంజననైపుణరూఢరూపతా
రుణ్యుఁడు భీతివిహ్వలపరోధిశరణ్యవరేణ్యుఁ డున్నతిన్.

క. దుర్జయవైరిధరాధిప
తర్జననిస్సాణగర్జితస్ఫురణుం డ
త్యూర్జితబాహాసంపదు
పార్జితవిఖ్యాతకలియుగార్జునుఁ డెలమిన్,

మాలిని. వితరణఖని యుద్యద్వీరశృంగారలక్ష్మీ
పతిరతివరలీలాషంగకృత్సాంగతాంగుం
డతులితమతివిస్తారాప్తదేవేజ్యుఁ డిజ్యా
ప్రతిదినపరితృప్తిప్రాప్తసప్తార్చిధాత్రిన్.

ఇందు మాలినీవృత్తముయొక్క ప్రథమపాదము రెండుగ్రంథములలోను నొక్కటియే. తనపితామహుఁడు రచించిన భాస్కరరామాయణములోని పద్యములను దిక్కన తఱచుగాఁ జదివియున్నవాఁ డగుటచే నందలిభావములును పదములును నాతనియుత్తరరామాయణమునఁ బడియుండు ననితలంచుట సహజము. ఈయూహ సత్యమయ్యెనేని భాస్కరరామాయణారణ్యకాండకర్త మంత్రిభాస్కరుఁ డని నిస్సంశయముగా నిశ్చయింపవచ్చును. కాని దీనికపవాదము లేకపోలేదు. తిక్కనామాత్యునికంటె హుళక్కిభాస్కరుఁ డేబదిసంవత్సరములు తరువాతివాఁడు. నిర్వచనోత్తరరామాయణము నందలిపద్యములను జదివి హుళక్కిభాస్కరుఁడు భాస్కరరామాయణారణ్యకాండమున నీపద్యములను వ్రాసియున్నాఁ డనిచెప్పుట కవకాశము కలదు. కాని యీయూహలు రెండిటియందు నేది యుచితముగనుండునో పాఠకులు నిర్ణయించుదురు గాత! తిక్కనామాత్యుని, హుళక్కిభాస్కరుఁ డనుసరించె ననిచెప్పుటకంటెఁ, దిక్కన తనతాత ననుసరించినాఁ డనుటయే యుచిత మని నాయభిప్రాయము. నిర్వచనోత్తరరామాయణము నందువలెనే, ఆరణ్యకాండప్రథమాశ్వాసాంతపద్యములు

ప్రథమావిభక్తిలోను ద్వితీయాశ్వాసాంతపద్యములు ద్వితీయావిభక్తి యందునుండుటయు, భాస్కరరామాయణారణ్య కాండాశ్వాసాంత పద్యములలోని "సభయరిపుశరణ్యున్" "ఆర్యజనానురంజితమహాశూరు ణ్యుఁడు" అను వాక్యము లుత్తరరామాయణమున "చకితనృపు శరణ్యున్" "ఆర్యజనతామతమంత్రుఁడు" అని మార్పునొందిపడియుండుటయు నిట్లే యుభయగ్రంథములలోను శబ్ద, వాక్య, భావసామ్యము లుండుటయు, నారణ్యకాండకర్త తిక్కనామాత్యునిపితామహుఁడగు మంత్రిభాస్కరుఁడే యనునూహకు బల మొసంగుచున్నవి.

వాల్మీకిరామాయణమందలియారణ్యకాండమును బూర్ణముగా నాంధ్రీకరింపక భాస్కరుఁడు సంక్షిప్తీకరించెను. హుళక్కిభాస్కరుఁడు యుద్ధకాండమును సంక్షిప్తము చేయలేక సరిపోకదా మాఘకావ్యమందలి కొంతభాగము నాంధ్రీకరించి యుద్ధకాండమునఁ జేర్చెనని చెప్పుచున్నారు. నిజముగా హుళక్కిభాస్కరుఁడే యారణ్యకాండమును రచియించియున్నయెడల నాతఁడు దానినంత సంక్షిప్తము చేసియుండఁడు. కావున నేవిధమునఁ జూచినను నారణ్యకాండకర్త మంత్రిభాస్కరుఁడే యనితలంచుట సమంజసము. మంత్రిభాస్కరుఁ డారణ్యకాండకర్త యైనచో నాయాశ్వాసాంతపద్యము లేప్రభువున కన్వయించును ? ఆతఁ డాగ్రంథము నెవరికిఁ గృతియిచ్చెను ? అనుప్రశ్నలు రావచ్చును. మంత్రిభాస్కరుఁడు మనుమసిద్ధితండ్రియైన చోళతిక్కనృపాలున కా గ్రంథము నంకితము చేసియుండు ననితలంపవచ్చును. మంత్రిభాస్కరునికుమారుఁ డైనసిద్ధయ, చోళతిక్కనృపాలునియొద్ద మంత్రిగా నున్నట్లు మనకు దృష్టాంతములు కనఁబడుచున్నవి. తిక్కరాజుబాల్యమున నీభాస్కరుఁడును, నాతనినడిమివయసు మొదలు తుదవఱకును సిద్ధనయు మంత్రులై యుందురని తలంచుట కవకాశము లున్నవి. ఇది సత్యమయినచో చోళతిక్కనృపాలుని జననము శా. శ. ౧౧౧౦ ప్రాంతము. (వివరములకు తిక్కనసోమయాజిచారిత్రమును చూడుఁడు) కావున నీ రామాయణరచనాకాలము క్రీ. శ. ౧౨౪౦ ప్రాంతమని నిశ్చయింపవచ్చును. అప్పటికి మంత్రిభాస్కరునకు ముప్పదినలువది సంవత్సరముల వయ సుండియుండును. చోళతిక్కనృపాలుఁడు పండితుఁ

డనియుఁ గవిసార్వభౌముఁడనియుఁ దిక్కన తననిర్వచనోత్తరరామాయణమున జెప్పియున్నాఁడు. ఇంతేకాదు. ఈ మనుజవిభుని యాస్థానమున జక్కయకవి తాత యగుపెద్దయామాత్యుఁ డను గొప్ప సుకవియుండి యనేక గ్రంథములను రచించెనని విక్రమార్కచరిత్రమున జక్కయ చెప్పియున్నాఁడు. అట్టివాఁ డీగ్రంథమును గృతి నందె ననుట యుచితమే యగును. పైనఁ జూపిన యాశ్వాసాంతపద్యములలోఁ "మతివిజితసురాచార్యుఁడు" "ప్రాజ్ఞవిద్యానవద్యుఁడు" అను పదము లీయంశమును ధ్రువపరచుచున్నవి. ఈవిశేషణములు మారయసాహిణి కన్వయించుననుటకంటెఁ దిక్కరాజున కన్వయించుననుటయే సమంజసము. మూలఘటిక కేతనకవి తిక్కనను వర్ణించుటలో మంత్రిపదవి వంశానుగతముగా వచ్చుచున్నట్లు చెప్పియుండుటచే నతనిపితామహుఁ డగు భాస్కరుఁడు చోళతిక్కనృపాలునియొద్ద మంత్రిగా నున్నట్లు తలంచుటలోఁ దప్పులేదు. తిక్కన మనుమసిద్ధికి నిర్వచనోత్తరరామాయణము నిచ్చినట్లే, భాస్కరుఁడు తిక్కనృపాలునకు భాస్కరరామాయణమునుఁ గృతియిచ్చియుండును. ఇంతేగాక మంత్రిభాస్కరుఁడు, తిక్కరాజు తండ్రియైన మనుమసిద్ధి పేరును తనకుమారునకు (సిద్ధన), తిక్కరాజు పేరును తనమనుమలకునుఁ బెట్టియుండును. అందుచే మంత్రిభాస్కరారణ్యకాండకృతిభర్త చోడతిక్కరాజని తలంచుటలోఁ దప్పుండదు. అట్లయినచో నీవిషయమునుఁ దిక్కనగాని కేతనగాని యేల చెప్పియుండలే దనుప్రశ్నకుఁ గర్తృత్వమును గూర్చి వ్రాయకపోవుటకుఁ బైనఁ జెప్పినసమాధానమే సమాధానము. భాస్కరరామాయణమునఁ గృత్యాది మనకు లభించియున్నచో, నీవిషయము స్పష్టముగాఁ దేలియుండును గాని మనకట్టియదృష్టము లభింపలేదు.

భాస్కరరామాయణములోనిపాఠభేదములు

భాస్కరరామాయణమునఁ బాఠభేదములు విశేషముగాఁ గన్పట్టుచున్నవి. ఈభాస్కరద్వయవివాదమును బరిష్కరించుట కవి తోడుపడు ననితోఁచుటచే వానినిగూర్చి యిట చర్చించు టావశ్యకమగుచున్నది. ఆవిషయమును యోచించుటకు ముందుగఁ గొన్నివిష

యముల నిటఁ జెప్పవలసియున్నది. ఇప్పుడు మనకు లభించుచున్న భాస్కరరామాయణముద్రితప్రతి వావిళ్ల వారు క్రీ. శ. ౧౯౪౧ లో ముద్రించినది. ఈ ప్రతికి శ్రీమేడేపల్లి వెంకటరమణాచార్యులుగారు విపులమైనపీఠికను వ్రాసియున్నారు. వావిళ్లవారే భాస్కరరామాయణమును ౧౯౧౩ సంవత్సరములో నొకసారి ముద్రించి యాప్రతు లన్నియు విక్రయమై పోఁగా ౧౯౩౦ లో మరల ముద్రింపించినారు. ప్రథమముద్రణప్రతికిఁ దరువాత ననేక తాళపత్రప్రతులను బరిశీలించి అవసరము లగుమార్పులను జేసి రెండవముద్రణప్రతిని ముద్రింపించి నట్లు పీఠికలోఁ దెలిపియున్నారు. పీఠికాకారులవాక్యము లివి:

"౧౯౧౩ వ సంవత్సరములో మొదటితేప వీరు భాస్కర రామాయణమును ముద్రింపించినపుడు దాని కొకపీఠిక వ్రాయు మని నా కాజ్ఞాపించిరి. అపుడు నా నేర్చినకొలఁది నొకపీఠికను వ్రాసి పంపితిని. ఆ ప్రతులన్నియుఁ జెల్లిపోఁగా నిపుడు మరల నాగ్రంథమును ముద్రించిరి. మునుపటిప్రతిలో లేనివిశేషములు కొన్ని దీనిలోఁ జేర్పఁబడినవి. ఎట్లంటే, వాల్మీకిరామాయణమునకు మొదట సంగ్రహ రామాయణ మున్నట్లు దీనిలోఁగూడ నొకసంగ్రహారామాయణము చేర్పఁబడినది. ఇంతియుకాక ప్రాచీనతాళపత్రకోశములనుండి కొన్ని పద్యములను దీసి సందర్భానుసారముగా నాయాకాండలయందుఁ గూర్పఁబడినవి. బాలకాండలో నిరువదియెనిమిదిపద్యములును, అయోధ్యాకాండలో నూటయిరువదియెనిమిదిపద్యములును, అరణ్యకాండము ప్రథమాశ్వాసమందు రెండుపద్యములు, ద్వితీయాశ్వాసమం దొక పద్యము, కిష్కింధకాండలో నేడుపద్యములు, సుందరకాండలో రెండు పద్యములు నీప్రతిలో హెచ్చు."

ఈ ప్రతిలోఁ గ్రొత్తగాఁ జేర్చిన సంగ్రహారామాయణకర్త యెవ్వరో పీఠికాకారులు చెప్పలేదు. బహుశః శ్రీవెంకటరమణాచార్యులుగారే యైయుందురు. కాని రామాయణకవులు వ్రాసినది కాదు. తాళపత్రప్రతులలో హెచ్చుగానున్నపద్యముల నన్నిటిని వీరిందు జేర్చలేదు. అందుఁ గొన్నిటిని మాత్రమే యిందుఁ జేర్చియున్నారు.

వ్రాతప్రతిలోనుండి గ్రహించినగద్యపద్యములకు [ ] గుర్తులనుంచి యా పాఠాంతరముల నాయాపుటలయడుగున జూపియున్నారు.

ఇంక నారణ్యకాండమునందలి పాఠాంతరములను గూర్చి యోచింపవలసియున్నది ఇతరకాండములయందలి పాఠాంతరములకును అరణ్యకాండమునందలి పాఠాంతరములకును విశేషభేదమున్నది. ఇతరకాండములయందు పద్యములందలి కొన్నిశబ్దములలో, పద్యభాగములలో పాఠాంతరములుగ నుండుచువచ్చినవి. అరణ్యకాండమున నట్లుగాదు. పద్యములకు బద్యములే పాఠాంతరములు. కొన్ని తావులలో కథాభాగములలోనే పాఠాంతరము లున్నవి. ఈ భేదముల నందలిపద్యముల నుదాహరించుచు నిటc జూపవలయుననినచో నారణ్యపర్వ మంతయు నిట వ్రాయవలసివచ్చును. కావున నీభాగమును జదువునప్పుడు వావిళ్ల వారు ౧౯౪౧లో ముద్రింపించిన భాస్కరరామాయణ ప్రతిని దగ్గర నుంచుకొని చూడవలసియున్నది. అందలి పద్యసంఖ్యను మాత్రమే యిట నుదాహరించెదను. ఈసందర్భమున నేను కొన్నిభాస్కరరామాయణతాళపత్రప్రతులను బరిశీలించితిని. అందుc గనిపెట్టినమార్పులనుగూడ సందర్భానుసారముగా నీక్రింద నుదాహరించుచున్నాcడను. సత్యము నెఱుంగ నుత్సహించుచున్నవారము కావున నేనిక్రింద నీయcబోవువివరములను జదువుటయందు వినువుc జెందవలదని పాఠకమహాశయులకు గోరుచున్నాcడను.

అరణ్యకాండప్రథమాశ్వాసమున ౯ వ పద్యమును దాని పాఠాంతరపద్యమును నీక్రింద నిచ్చుచున్నాcడను.

క. నృపచూడామణి రాఘవుc
డపరిమితక్రోడమహిషహారిభల్లూక
ద్వీపశరభచండగండక
విపులమహావిపినములc బ్రవేశించి తగన్. ముద్రితప్రతి.

క. కాకోలవ్యాకులమును
ఘూకాకులభీకరంబు ఘోరమృగవ్యా
ళాకరమును ఝిల్లీనిన
దాకర్ణనదుస్సహంబు నగుకాంతారవిన్. పాఠాంతరము.

పైపద్యమున కిది పాఠాంతరము కాదు. ఇందులో నేపద్యము న్నను తరువాయిపద్యముతో నన్వయించును. రెండు నుండుట సమంజసము కాదు. ఒకేవిషయమును వేఱువేఱుకవులు రచించినట్లు కనఁబడుచున్నది. "శ్రీరాముఁడు విరాధునిజంపుట" యనుకథలో ౧౮వ సీసపద్యములో తుదనున్న "యార్చుచుఁజీయు" ననుమాటలకుఁ బదులుగా నేనుచూచిన తాళపత్త్రప్రతిలో "యార్చుటయును" అనియున్నది. పిమ్మట ౧౫౧ మొదలు ౧౬౯ వఱకునున్న గద్యపద్యములు తాళపత్త్రప్రతిలో లేవు. ఈభాగము విరాధసంభాషణమును, లక్ష్మణుఁడు రామునితోఁ ననినమాటలు నై యున్నవి. ఇవి మొదటరచింపఁ బడలేదనియు దరువాత నెవ్వరో రచియించి యందుఁ జేర్చి రనియు నెంచఁదగియున్నది. ఈ భాగమునుఁ దీసివేసినను, కథ సరిగా నడచుచున్నది గాని లోపమున్నట్లు గాన్పించుట లేదు.

ముద్రితప్రతిలోని "జానకిడించి" యను ౧౭౮వ వచనమునకు మారుగా నేను చూచిన తాళపత్త్రప్రతిలో నీక్రిందిపద్య మున్నది.

ఉ. జానకిడించి భీమరభసంబున శూలము గొంచు నార్పుతో
పై నిగుడింపఁ ద్రుంచెఁ బటుభల్లమునన్ గరశూల ముద్ధతిన్
తోన గణంగి లక్ష్మణుఁడు తూపు......భుజాంతర
స్థానము గాఢ నేసిన పదంపడి వాఁ డతిరోషదీప్తుఁడై.

ముద్రిత ప్రతిలోని 33 వ వచనమునందలి నాల్గవపంక్తిలో "బ్రాహ్మణవ్యయసమయంబున వాఁడు" అనుమాటలకుఁ దరువాత ౮౧వ గద్యమువఱకును గలభాగము మాయూరనున్న ప్రతిలో లేదు. దానికి బదులుగా "బ్రాహ్మణవ్యయసమయంబున వాఁడు" "రాఘవులం బ్రస్తుతించి యేను తుంబురుం డనగంధర్వుండ కుబేరుశాపంబున నిట్టి రూపంబుఁ దాల్చి యిట నీచేత శాపవిముక్తిం గంటి ననిఁ జెప్పి యీయెడకు రెండవ యోజనంబున శరభంగుం డనుమునీంద్రు నాశ్రమంబు గల దచటికేఁజనుఁడు మే లగు నని చెప్పి నిశితాగ్నుండు రోజుచు ప్రాణంబులు విడిచె తదనంతరంబ" అనియున్నది. ఈ మార్పువలన కథాసందర్భమున కేమియు లోటు వాటిల్ల లేదు.

ముద్రితప్రతిలోని ౬౫ మొదలు ౭౧ వఱకుగల గద్యపద్యములకుఁ బదులుగా వ్రాఁతప్రతిలో నైదుపద్యములు కలవని యాపద్యముల నాపుటల యందుగుఁ నిచ్చియున్నారు చూడుఁడు. ఈ పద్యములు వేఱువేఱుకవులు రచించిన వని తలంప వలసి యున్నది. ఒక్కరు రెండు విధము లగుపద్యములను వ్రాయవలసినపని యుండదు.

ముద్రితప్రతిలోని ౯౭వ పద్యమునకుఁ దరువాత ౯౭వ పద్యము వఱకు గలభాగము మాయూరనున్న ప్రతిలో లేదు. అందులకు బదులుగా నీ క్రిందిమూఁడు పద్యము లున్నవి.

చ. అనఘుఁ డగస్త్యుతమ్ముని మహామునిఁ గాంచి తదీయ మైనయ
వ్వనమున నాఁడు నిల్చి జనవల్లభుఁ డమ్మునిముఖ్యు భక్తి వీ
డ్కొని చని గాంచె కుంభజు ప్రఘూర్ణ మహార్ణవివ స్త్వాతాంతకాం
బునివహపూరచారు పరిపూరితనిస్తుల హస్తపంకజున్.

చ. కని కడుభక్తి మ్రొక్కుటయు, గౌరవ మొప్పఁగఁ గౌఁగిలించి త
మ్మునను మనఁ గొల్చియున్న మునిముఖ్యుల కెల్లను రామచంద్రు
వినుతగుణావళుల్ ప్రకటవిస్తరభంగిఁగఁ జెప్పుచున్ ప్రియం
బునఁ గొనియాడుచున్ వివిధపూజలఁ దృప్తులఁ జేసి నెమ్మనోన్.

క. జనవరునకు లక్ష్మణునకు
జనకసుతకు కందమూలశాకాదికమై
మునిమానసీయ మగుభో
జనమునఁ బరితుష్టిఁ జేసె సముచితభంగిన్.

ముద్రితప్రతిలోని ౧౦౭ మొదలు ౧౧౧ తుదవఱకు గలభాగము మాయూరనున్న ప్రతిలో లేదు. ఇది లేకపోయినను కథాసూత్రము తెగిపోలేదు. మఱియు ముద్రితప్రతిలో నున్న ౧౧౭ మొదలు ౧౩౪ వఱకుఁ గల గద్యపద్యములు నేనుఁజూచిన ప్రతిలో లేవు. ఈ భాగమున జంబుకుమారనివధయు, నావధావృత్తాంతము నాతనితల్లియగు శూర్పణఖతో మహర్షులు చెప్పఁగా విని యామె వనమునఁ దిరుగుచుండుటయు నున్నది. ఈ భాగము మొదట రచింపఁబడలేదు. తరువాత రచింపఁ బడియుండును. ఈ మారుఁడు పోయె నన్నవిచారముతో నున్న శూ

ణాఖ ౧౩౩ వ పద్యములోఁ జెప్పినట్లు "ప త్తినవేడ్క నచ్చటికి నేఁగి" యుండదు. ఈ నూతన రచయిత యీసందర్భమును బాగుగా కలుప లేదు. ఈకథ వాల్మీకిరామాయణమున లేదని టీకాకారులు వ్రాసి యున్నారు.

ముద్రితప్రతిలోని ౧౪౩ పద్యమునను్న "వెండియున్" అను మాటకుఁ బదులుగా "చెప్పిఁన్" అని యున్నది. ౧౪౪-౧౪౫ పద్య గద్యములు నేను చూచినప్రతిలో లేవు. ౧౫౧ మొదలు ౧౫౫ వఱకు గల పద్యములకు బదులుగా నేను చూచినప్రతిలో నీక్రిందిపద్య మున్నది.

చ. అవని చలింప నైజవికృతాకృతిఁ గైకొని పేర్చి సీతపైఁ
గవిసిన చేయి మాటికుచుఁ గమ్మన లక్ష్మణ! దీనిఁ బట్టి యం
గవికలఁ జేయు మన్న నురుగాఢరయంబునఁ గోసె ముక్కునుం
జెవులును గ్రూరధారఁ లుసిల్లు కతాయమునన్ గనోగ్రతన్.

ముద్రితప్రతిలోని ౧౬౦-౧౬౧ పద్యములకుఁ బదులు యీక్రింది పద్యము తాళపత్రప్రతిలోనున్నది

క. మదనాగాయతసత్త్వుల
పదునలువుర దనుజభటులఁ బసిచె ఖరుండ
మ్మదిత వెసఁ దెరువు వెట్టఁగ
సదయులు జని రనుదు లుగ్ర మగుగభసమునన్.

ముద్రితప్రతిలో ౧౬౭-౧౯౦ వఱకుఁగల పద్యములకు మాఱుగా వ్రాతప్రతియందు ౧౦ పద్యములు మాత్ర మున్నవి. అవి ముద్రితప్రతిలో నడుగునఁ జూపఁ బడినవి. ౧౯౨-౧౯౯ వఱకుగల పద్యములకు మాఱుగా వ్రాతప్రతిలో ౭ పద్యములు వేఱుగా నున్నవని యాపద్యము లాపుటలలో నడుగున జూపఁబడినవి. ఈ యడు గున చూపఁబడినపద్యములలో "కాంచనరత్నదీప" యను పద్యము నకుఁ దరువాత నేనుచూచిన తాళపత్రప్రతిలో నీక్రిందిపద్య మొకటి యధికముగా నున్నది.

ఉ. నిర్మలహేమబంధు కమనీయము గాఢము నైననిస్ఫుర
ద్ధర్మము దాల్చి దీప్తపరిదారితవహ్నియుఁ బోలె దివ్యుఁడై

కార్ముక మెక్కు-వెట్టి గుణకర్కశ...కృతుల్ సమస్తది
క్సార్మ్మములం బగుల్చుచు సముగ్రుఁడు రాముఁడు నిల్చె నయ్యెడన్.

ముద్రితప్రతిలోని ౨౧౮ మొదలు ౨౮౮వఱకు గలగద్యపద్యములకు మాఱుగా వ్రాఁతప్రతిలో ౨౮గద్యపద్యములుగల వని యాపద్యముల నాపుటల నడుగునఁ జూపియున్నారు. ౨౬౧—౨౬౮ పద్యములకు మాఱుగా వ్రాఁతప్రతియందొక్కపద్యము కల దని దాని నడుగునఁ గనుపఱచియున్నారు. ౨౬౬—౨౭౯వఱకు గలపాఠమునకు మాఱుగ వ్రాఁతప్రతియందు ౮ పద్యము లున్నవని వాని నాపుట యడుగునఁ జూపియున్నారు. ఈ యెనిమిదిపద్యములలోని "ఆనరనాథ ముఖ్యు" డనుపద్యమునకుఁ దరువాత నేనుచూచిన తాళపత్త్రప్రతిలో క్రిందిపద్య మున్నది.

ఉ. ఆ నరనాథు కేలు దొనకైఁ గుడించుట యమ్ము మార్గిసం
ధానము నేత నాడు దెగఁ దార్కొని లక్ష్యము సేయు సేయుటల్
గానఁ జనస్రమున్ దళితకార్ముక మొక్కటి గంటిఁ గంటి న
ద్దానవదీప్తదేహసముదాయనిరంతరపాతివేగముల్

మఱియు దాఁ క్రిందనే యున్న "అనిపలికి" యనుకందపద్యము తరువాతను ౨౮౦వపద్యమునకు ముందును క్రిందిరెండుపద్యములు నున్నవి.

స్రగ్ధర. కరణీయానంబు నవ్వున్ గతినవలతికా సార మంగంబు చంద్రుఁ
బురణించున్ ముద్దుమోమంబురుహదళములంబోలుకన్నుల్
విపంచీ స్వరసంకాశంబు పల్కుల్ చలదవివతతనీస్వర్థియై
యుండు వేణీభర మాతన్వంగి కింద్రప్రముఖనిఖిలదిక్పాలకాభీల
శౌర్యా.

చ. అళినిభవేణి, చంద్రసదృశానన; యుత్పలపత్త్రనేత్ర; కో
మలలతికాభిరామభుజ; మంజులవక్త్రి; సమస్తసద్వయీ
కవిత, సుమధ్య; హృద్యకటి; కామ్యతరోరువు; రమ్యజంఘ; యు
జ్జ్వలచరణాబ్జ; తద్వనితజానకి వాకిలసిల్లు రావణా!

ముద్రితప్రతిలో ౨౮౦—౨౯౧వఱకుగల భాగమునకు మాఱుగా వ్రాతప్రతిలో ౬ పద్యములున్న వని వాని నాపుటల యందుం గనంజూపినాను. ఇంతవఱకు ప్రథమాశ్వాసమయినది. ద్వితీయాశ్వాసమునం గూడ నిట్టిభేదము లనేకములు గలవు. గ్రంథవిస్తరభీతియు, నీవివరణములతోం బాఠకులు విసువుం జెందుదు రేమో యనుసంకోచముండినను సత్యాన్వేషణకు గడంగువారికిం దోడుపడు సనుద్దేశముతో నా భేదములను గూడ నిక్రింద నిచ్చుచున్నాఁడను.

ముద్రితప్రతిలోని ౬ మొదలు ౧౦ వఱకు గలపద్యములకు మాఱుగా నేనుచూచినప్రతిలో నీక్రిందిరెండుపద్యము లున్నవి.

క. ఈ నవమ రామచంద్రుని
సేనం దోరంబు మువుర ముగ్రమెసంగం బులులమై
పూని వధింపఁగ నంచని
యా నరపతి నంత నంత చేరుటయుక్తా

క. శరములు మూఁడొకముష్టిన్
దిరముగఁ దొడిగేయ వారు ద్రెళ్లిరి వెస నే
మరిగి యిట వచ్చి ఘనభయ
వరవశగతినున్న వాఁడ పటుశౌర్యనిధీ!

ముద్రితప్రతిలోని ౨౩వవచనంబున "జనియె" ననుమాటకుం బిదపనున్నవచనము నేనుచూచినప్రతిలో లేదు. మఱియు ౨౮వసీసపద్యమునకు మాఱుగా నీక్రిందిగీతపద్య మున్నది.

గీ. ఇవ్విధంబున నరిగి రాజేంద్రచంద్రుఁ
డున్నకదలీవనంబును నొయ్యఁ జేరి
యచట రావణు నిలిపి మాయాకురంగ
మగుచు మారీచుఁ డుండె దీప్తు లతిశయింప.

ముద్రితప్రతిలోని ౩౬—౩౭ పద్యములకు నడుమ నీక్రిందిపద్యమున్నది.

క. మృగము గొని వేగంబున
జగతీశ్వర నీవు వచ్చి సమ్మతిఁ బడన్
దగ నాకిచ్చిన వేడుక
నెగడంగా వలదె నేను నీకరుణ మెయిన్.

ముద్రితప్రతిలోని ౩౯—౪౯ పద్యములకు మాఱుగా మాయూరనున్న తాళపత్రప్రతిలో నీక్రింది యైదుపద్యము లున్నవి. ౩౮ వ వచనములోని "నుండె వెండియు రఘువరుండు" అనుటకు మాఱుగా "నుండి వెండియు నిట్లనియె" అనియున్నది.

క. కనకపుమేనును రత్నపు
తనురుచులుం గలుగుమృగము ధరణిం గలదే
జనవర యిది మాయామృగ
మని దీని నెఱుంగరాదె యసురులమతముల్

చ. అన విని యల్లనవ్వుచు ధరాధిపుఁ డెంతయుఁ బ్రీతి తమ్మునిం
గనుఁగొని యీమృగంబుపైఁ గౌతుక మెక్కుడుఁ బట్టితేర నేఁ
జన నీటు లూరకున్న మది జానకి యెంతయుఁ జిన్నవోదె స
య్యన గొని యేగుదెంచెద గుణాకర! యేమరకుండు మియ్యెడన్.

క. ఇది దనుజమాయ యనినన్
మది సంశయ మేల మాయమాయించి శిత
ప్రదరంబునఁ దునిమెద నని
కదలెం బతి ఖడ్గతూణ కార్ముకధరుఁడై.

చ. కదలి రఘూద్వహుం డుఱుకఁగా నది ముందటఁ గొంతచేరువన్
మెదలుచు డాసినన్ బెదరి మీఁదికి నట్టిటు దాటుచున్ మృగం
బదె యిదె నాఁగ పెంపొదల నవ్వల నివ్వలఁ దోఁచుచున్ రయం
బొదవఁగ దారి డాయఁ గొనిపోయె మహాగహనంబు లోనికిన్.

మ. పరచుం దవ్వుల జేయు ...... నిలుచుం బట్టీక యాశాసగా
బిరువోవున్ బొద లందు డిందు నిలుచున్ బిట్టుల్కి వే దాటి క్ర
మ్మరి చూచున్ వెలి దాల్చు నిల్చు మలయున్ మట్టాడు గోరాడునే
మరి నట్లుండు తృణంబు లాను నలయుక్ మాయామృగం బిమ్ములన్.

ముద్రితప్రతిలోని ౫౨—౬౦ పద్యములకు మాఱుగా నేను చూచినప్రతిలో యీక్రింది మూఁడుపద్యము లున్నవి.

క. తిరిగి తిరిగి కడుదడవున
కరయఁగ నిది దనుజమాయ యగు నని కోపో
ద్ధురుఁడై యమోఘశరమున
ధరణీశ్వరుఁ డేసె శీఘ్రదారుణభంగిన్.

చ. అది మును మాయ ద్రింగి దనుజాంగము సొచ్చి పగిల్చె వాఁడు బె
ట్టిదముగ మీఁదికి న్నెగసి దెప్పర మై కడునొచ్చి తూలెఁ బెం
పొదలును మ్రాకులుం జదియ భూమిచలింపఁగఁ గూలి వ్రాలె పె
ల్లదరుచు లక్ష్మణా! యనుచు హా! యని రాము నెలుంగు భంగిగన్.

క. అని ఘోరంబుగ నరచుచు
దనుజుం డపు డాత్మరూపధరుఁడై పడియెన్
పెను మేనితోడ రాముఁడు
గనుఁగొని విభ్రాంతి చాల గదిరెడుమదితోన్.

ముద్రితప్రతిలోని ౬౪,౬౫,౬౬. కు మాఱుగా నీక్రిందిపద్య మొకటియు నున్నది.

ఉ. భూపతి యార్తిఁబొందె నని భూమిజ తల్లడ మంది లక్ష్మణా!
పాపము పొందె లెమ్ము వెనఁ బొరుము రాక్షసబాధ నొందఁగా
నోపు రఘూద్వహుండు నిను నొత్తిలి జీర నిశాటకోటిచే
నేపరబోలఁజాలు వలుకేది జవంబునఁ బొమ్ము గ్రన్ననన్.

మఱియు ౭౦—౭౪పద్యములకు మాఱుగా నీక్రిందిపద్య మొకటియుఁ నున్నది.

క. అప్పుడు పేర్చిన శోకం
బునఁ బెల్లేడ్చుచు మహాత్ముఁ బుణ్యచరిత్రుఁ
మనుజేంద్రుఁ గావఁ బోవం
జనదె రామునకుఁ దోడుచనవు రయమునన్.

ముద్రితప్రతిలోని ౭౭-౯౧ వఱకుగల పాఠమునకు మాఱుగా వ్రాఁతప్రతియందు ౯ పద్యము లున్న వనివాని నాపుటలయందుగున

నిచ్చియున్నారు. మఱియు ౯౩-౧౦౦ పద్యములకు మాఱుగా నీ క్రిందిపద్య మొకటియు నేనుచూచినప్రతిలో నున్నది.

గీ. ఏను మన్నించుచుందురుల్ వేనవేలు
నిన్నుఁ గొలువంగ ధన్య నై నన్నుఁ జెందు
మనుదుగా కింక వేదమనుజాతోడ
మనువు నీ కేల చనుదెమ్ము వనజవదన!

ముద్రితప్రతియందలి ౧౦౩-౧౦౯ పద్యములకు మాఱుగా మాయూరనున్న ప్రతిలో నిక్రింది మూఁడుపద్యము లున్నవి.

గీ. అనిన నన్నెమిగాఁ జూచి యాడెదనుచు
ననురువింశతి బాహువులు నతిశయోగ్ర
వదనదశకంబు మెఱయంగ వామనయన
యెదుర నిలచినఁ గంపించి యుదిలగొనుచు

క. తిరుగుడు వడ వెనువెనుకకు
నరుగఁగ వడిఁ బొదివి పట్టి యరదముపైఁ జె
చ్చెర నిడి యంబరపథమున
నరిగె దశాననుఁడు వికసితాననుఁ డగుచున్.

ఉ. అత్తరి సీత తల్లడిలి హా రఘునాయక! హా నరేంద్ర! న
న్నిత్తరి గావ రమ్మనుచు నొత్తిలి యేడ్వఁగ పంక్తికంధరుం
డత్తరుణిన్ నయుంబరి భయంపడునట్లుగఁ బెల్లదర్చుచున్
తత్తరపాటుతో నిజరథంబు నభంబునఁ దోలె నత్తరిన్.

౧౧౪,౧౧౩, ౧౨౮,౧౩౩ పద్యములు నేఁ జూచినప్రతిలో లేవు. ౧౪౮ మొదలు ౩౮౭ గద్యపద్యములవఱకు గల కథాభాగము వ్రాఁత ప్రతిలో ౬౬ గద్యపద్యములలోఁ జెప్పఁబడినది. ఇవి యాయాపుటల యందడుగుభాగములయం దీయఁబడినవి. ఇట్లడుగునఁ జూపఁబడిన భాగములో ౨౦౨పేజీలోని "అల్లంతి నెదురుగ" యను సీసపద్యము నకుఁ దరువాత నేను చూచిన తాళపత్రప్రతిలో నిక్రిందియైదుపద్యము లున్నవి.

శా. లోనైనన్ వెలినైన సీతయెడ నాలోకింప లే దేమొకో
యా నా తిచ్చట లేదొ కాక యది మా యావాసముం గాదొకో
యే సింహంబుగ సీత గానఁబడదో యే నొండెనుం గాననో
యే నా రాముఁడ నైన సీత వెలి యై యిట్లుండఁగా నేర్తునే.

శా. ఏ నుండఁడన్ నిను డాపఁగా వెఱువఁ డేయీశానుఁడుం బూని నా
మానం బారయ వేఁడి డాఁగి తిదియున్ మానంబె నిన్బాసి నా
మనం బ్రాణము నిల్చునే యెఱుఁగవే మేలంబు నోనాడు దే
మో నాతీ పాదచూపవే నిబిడరంభోరుద్వయా జానకీ.

ఉ. వ్యాళభుజంగమోదరనివాసముఁ జొబ్బితె జృంభితోగ్రశా
ర్దూలముఖాగ్రకోటరము దూరితె మర్త్యపలాశనార్తిదై
త్యాళిని శాతదంష్ట్రికల నందితె యేకత మెందు వోయితే
లోలవిశాలసారసవిలోచన మత్ప్రియభార్య జానకీ!

ఉ. పాటితనంబునన్ గడచు బల్కితి లక్ష్మణు నంచు నీవు మో
మోటమి జేసి నా కెదుర నొల్లక దాఁగితొ దాన నీకు ము
మ్మాటికి సైచితిన్ మదనమార్గణభిన్నత నుండ నైతి నా
మాటకు వేగ వేగ మఱుమాట మృదుధ్వని పల్కు మైథిలీ!

శా. తన్నున్ దానెఱుఁగండె పోలె ధృతికిం దవ్వై విలాపించుచున్
కన్నుంగోనల బాష్పపూరము లొగిన్ గ్రమ్మంగ హా! సీత! హా!
యున్నిద్రాంబుజనేత్రి! హా! నిబిడరంభోరుద్వయా! జానకీ!
నన్నున్ బాయుట పాడియే యనుచు నానారోదనధ్యానుఁడై.

ముద్రితప్రతియందలి 3౯౬—3౯౭కు మాఱుగ నేనుచూచిన తాళపత్త్రప్రతిలో నిక్కింది రెండుపద్యము లున్నవి.

గీ. ఇట్లు కూలిన దైత్యుఁ డొక్కింత వడికి
తనువు తెలివొందిమీ రెవ్వ రలఘుశౌర్యు
లార యనుటయుఁ జెప్పి నింపారఁ దమ వి
ధము దెలియుకతయును సుమిత్రాసుతుండు.

క. విని రామలక్ష్మణులకే
  జనవంద్యులు మీరు మీ ప్రసాదంబున శు
  ద్ధ్యనదుఃఖ మెల్ల వోయెను
  వినుఁ డస్మద్విధము మీకు వినుపింతుఁ దగన్.

ముద్రితప్రతియందలి ౧౦౬ మొదలు ౧౧౩వ పద్యమువఱకుఁ గల విషయమునకు మాఱుగా వ్రాఁతప్రతి లోనిపద్యములను ఆపుటల యడుగునఁ జూపియున్నారు. ౧౧౪ మొదలు ౧౩౭పద్యమువఱకును, మాయూరనున్న ప్రతిలో లేవు.

పాఠభేదముల ఫలితము

పాఠాంతరములనుగూర్చి పైన వ్రాసినవాక్యములను స్థూల దృష్టితోఁ జదివినవారికి, అరణ్యకాండమునఁ గవి రచించినవి కాక మఱికొన్నిపద్యములను మఱియెవ్వరో రచియించి యందుఁ జేర్చిరనియు, నది ప్రతివిలేఖకుల కృత్యమై యుండుననియుఁ దోఁచవచ్చును. కాని యిం దున్నదంతమాత్రమే యని తలంపరాదు. భాస్కరరామాయణ ముద్రితప్రతిని దగ్గర నుంచుకొని, పైన నేను వివరించినమార్పులను గమనించుచు, జాగ్రతగఁ బరీక్షించి చూచినయెడల, మొదట నొకకవి రచించినభాగముతోఁ దృప్తిఁజెందక వర్ణనాంశముల నధికముగఁ జేయ వలయు ననునుత్సాహముతో వేఱొకకవి మఱికొన్ని గద్యపద్యములను రచించి నడుమ నడుమఁ జేర్చుచువచ్చినట్లు స్పష్టమగును. ఈవిధముగ గ్రంథభాగమును బెంపొందించునప్పుడు, మొదటికవి రచించినపద్యము లందుల కభ్యంతరముగఁ గన్పించినచో నట్టివాని నీరెండవకవి తొలఁగించి యాపద్యములకు బదులుగఁ దాను క్రొత్తపద్యములను రచియించెను. ముద్రితప్రతిలోఁ బాఠాంతరము లని పుటలయడుగున నిచ్చినపద్యములను, మఱియు నేను జూచినతాళపత్రప్రతిలోని వని పైనఁ గనుపఱచిన గద్యపద్యములను గ్రంథభాగములోఁ జేర్చి, వానికిఁ బాఠాంతరముగా గ్రంథభాగములో నున్నగద్యపద్యములను దీసి వేఱుగా నుంచినచో నీరెండవకవి పెంచి రచించినగ్రంథభాగ మేదియో స్పష్టముగాఁ గన్పట్టును. ఆభాగమును మనము ప్రత్యేకముగాఁ జదివి

చూచితిమేని, జంబుకుమారవధ మొదలగు కొన్నికథలను జేర్చుటకును, మారీచరావణ సంభాషణమునందును, సీతాపహరణసందర్భమునను, ద్వితీయాశ్వాసమునఁ దుదిభాగమునను గథలను బెంచి వ్రాయుటకును నీరెండవకవి ప్రయత్నించె నని బోధపడఁగలదు. ఆరణ్యకాండమున నిప్పటిముద్రితప్రతిలో ౭౩౬ గద్యపద్యము లున్నవి. ఇందులో దాదాపు ౩౯౦ గద్యపద్యములు మొదటికవి రచించినవి. వీనిలో నించుమించుగ ౨౧౦ గద్యపద్యముల నట్లేయుంచి మిగిలిన ౧౮౦ పద్యగద్యములను దీసివేసి వానికి బదులుగా ౫౨౬ గద్యపద్యములను గ్రొత్తగా రచించి యందుఁ జేర్చెను. నేను వ్రాసిన యీవిషయము సులభముగా బోధపడుటకై యొక్క యుదాహరణ మిచ్చెదను. శూర్పణఖ సీతాదేవిని మ్రింగఁబోవుటయు శ్రీరామచంద్రుఁడు దానికిచేయి యడ్డువెట్టి శూర్పణఖముక్కుఁ జెవులుకోయు మని లక్ష్మణున కాజ్ఞయిచ్చుటయు నాతఁడట్లుచేయుటయు నొక్కపద్యములో నారణ్యకాండపు మొదటికవి చెప్పియున్నాఁడు. ఆపద్య మిది.

చ. అవని చలింప నైజవికృతాకృతిఁ గైకొని పేర్చి సీతపైఁ
గవిసిన చేయి వాఁ డడుచుఁ గ్రమ్మన లక్ష్మణ! దీనిఁ బట్టి యం
గవికలఁ జేయు మన్న ననుగాఢరయంబునఁ గోసె ముక్కునుం
జెవులును గ్రూరధారవిలసిల్లుకుఠారమునన్ గఠోరతన్.

ఈకథ నొక్కపద్యములోఁ జెప్పుట రెండవకవికిఁ దృప్తిఁ గల్గించ లేదు. ఈసందర్భమున మఱికొన్ని పద్యములను వ్రాయవలయునని సంకల్పించుకొనినాఁడు. కాని యీపద్యమును దీసివేసినఁగాని యాతని కోర్కె యీడేరదు. అందుకొఱ కీపద్యమును గ్రంథమునుండితొలగించి దానికి బదులుగా నీక్రిందిరెండువచనములను మూఁడుపద్యములను రచించి యందుఁ జేర్చెను.

“చ. కొఱవులభంగి మండుమిడిగ్రుడ్డుల నిప్పులు రాల దీప్తిఁ గ్రి
క్కిఱియ మహోల్క రోషిణి పయిం బఱతెంచినమాడ్కిఁ జూడ్కికిన్
వెఱపు జనింప సీతపయి వేపఱతేర నృపాలుఁ డొక్కచే
బిఱుసునఁ బట్టెఁ దయ్యబలఁ బెట్టుఱ రాక్షసిఁ బట్టె నొక్కటన్ ౧౫౧
ఇట్లనిశాచరిం బట్టి లక్ష్మణుం గనుఁగొని...... ౧౫౨

క. క్రూరులు దుష్టాత్ములు నగు
వారలతో నగవు లెప్పుడు వలవదు కంటే
నేరమి మన దెసఁ గల్గుట
నీరక్కసిజనకతనయ కిమ్మెయిఁ సోదరున్. ౧౫౩

వ. కావున దీని నింక విరూపిం జేయు మనుటయు నా సుమిత్రా
పుత్రుండు... ౧౫౪

క. ఘోరక్రోధంబున న
వ్వీరోత్తమునాజ్ఞ నొక్కవెస నన్నక్తం
చారిణి నప్పుడ పట్టి కు
ఠారంబున ముక్కు చెవులు డగ్గఱఁ గోయున్...... ౧౫౫

ఆరణ్యకాండ ప్రథమాశ్వాసము.

పై "అవనిచలింప" అనుపద్యమును రచించినకవియే యీ రైదు పద్యములను రచించియుండఁ డనుట స్పష్టము. ఆపద్యమును దీసివేయుటయు దానికిబదులుగ నైదుపద్యములను దాము రచించి గాని, మఱియే రామాయణములోనివో తెచ్చి యిందుఁ జేర్చుట గాని విలేఖకులకు సాధ్యమునుగాదు. అవసరమునుగాదు. ఇది తప్పక ఎవరో మఱియొక కవి చేసిన కార్యమని చెప్పక తప్పదు. పాఠభేదములని నేను పైఁ జెప్పినవానిలోఁ జాలభాగ మీయుదాహరణమును బోలియే యున్నవి. కొంచె మోర్పుతోఁ బనిచేసినచో మొదటికవి రచించిన భాగమేదియో రెండవకవిచేసినమార్పు లేవియో మనము స్పష్టముగాఁ దెలిసికొనవచ్చును.

ఆరణ్యకాండమున నీమార్పులకుఁ గారణములు

ఆరణ్యకాండమున నీమార్పు లెవరివలనవచ్చినవని యోచింతము. దీనికి మూఁడు మార్గములు స్ఫురించుచున్నవి. ౧. ఇరువురుకవులు రామాయణములను రచించియుండి రనియు, నందొకరు క్లుప్తముగను రెండవవారు విపులముగాను జేసియుంద రనియు, రెండు గ్రంథములను జూచినప్రతిలేఖకులు అందలివి కొన్నిటిని, నిందలివి కొన్నిటిని ఏర్చి చేర్చి కథను గలుపవలసినతావులలో నొకవచనమునో పద్యమునో

తాము వ్రాసి వేఱొకస్వతంత్రగ్రంథముగాఁ జేసియుందు రనియుఁ దలంచుట మొదటిమార్గము. ఈయూహయందు బలము లేదు. విలేఖకుల కిది సాధ్యమైనదని కాదు. ఈమార్పును కవి చేయవలయును గాని విలేఖకుఁడు చేయఁజాలఁడు. విలేఖకులకిది యవసరమగుకార్యమును గాదు. దీనివలన వారి కప్రయోజనమును లేదు. గ్రంథమునంతను జేయక యరణ్యకాండమును మాత్రమే చేయుటవలన లాభమును లేదు. ఒకకవి రచించినయరణ్యకాండము మాత్రమే వారికి లభ్యమగుటచే నరణ్యకాండమునందుమాత్రమే యట్టిమార్పులను చేసియుందు రనితలంచినను అందలి ౨౦ పద్యములను తీసివేసి వానికి బదులుగా ౫౦౦ పద్యములను చేర్చి రనుట స్వభావవిరుద్ధమును ప్రయోజనవిహీనమును నగుటచే నీయూహయందు సత్య ముండదని నిరాకరింపవలసియున్నది. ఒకవేళ నిందుసత్యమున్న దని యంగీకరించినను ప్రస్తుతారణ్యకాండమున నిరువురికవిత్వ మున్నదనుట నిశ్చయము.

౨ మొదటికవి రచించినగ్రంథము కొంతశిథిల మైపోఁగా వఱియొకఁడు దానిని పూరింపఁదలఁచి, శిథిలము కాకుండనున్నభాగము నట్లేయుంచి, శిథిల మగునభాగములను బూరించునప్పుడు తనయిష్టము ననుసరించి పెంచి రచించి పూరించె ననియు, నదియే యిప్పు డున్న ముద్రితప్రతియనియు, నటుపిమ్మట శిథిల మయిపోయినదన్నభాగము మరల లభించుటచేఁ గొన్నితాళపత్రప్రతులలో నాభాగమే యుండుచు వచ్చె ననియు నదియే పాఠాంతరముగా ముద్రితప్రతిలో నడుగున నీయఁబడిన దనియుఁ జెప్పవచ్చును. ఇది రెండవమార్గము. ఇది కొంత సయుక్తికముగాఁ గన్పట్టుచున్నను నీయూహకుఁ గూడ బలము లేదు. మొదటికవి రచించినగ్రంథము శిథిల మైనదనుట కాధారములు లేవు. మాయూరనున్నప్రతిలో, మొదటికవి రచించిన దని పైననిరూపించిన భాగము పూర్తిగ నున్నది. అందు కథాసూత్ర మెచ్చటను తెగిపోక సమగ్రముగా నున్నది. ఆప్రతియందలి గద్యపద్యములను ప్రస్తుతముద్రితప్రతిలో గుర్తుపెట్టి చూచినయెడల, నీరెండవకవి యెట్లు మార్చినదియు స్పష్ట మగును. మొదటికవిరచించిన గ్రంథము శిథిలము కాలే దని యిప్పటిముద్రితప్రతియే సాక్ష్య మిచ్చుచున్నది. శిథిలము సరిగా

వర్ణనలుగలపట్టున నే ప్షైనదని తలంచుటకూడ సమంజసముగా నుండదు. కావున నీయుత్పన్నగాథ విశ్వసనీయము కాదు. విశ్వసనీయమే యని యంగీకరించినను, నారణ్యకాండమున నిరువురికవిత్వము లున్నవనుట నిశ్చయము.

3. దాదాపు ౮౦౦ పద్యములలో నొకకవి చెప్పియుండిన యరణ్యకాండమును, క్లుప్తముగా నున్న దనుకారణమునఁ దాను విపులముగా వ్రాయఁదలఁచి కథను బెంచుటకవకాశ మీయని మొదటి రచనములోని ౧౮౦ పద్యములను వ్రోసివేసి తక్కిన ౬౧౦ పదములను దీసికొని తాను ౫౦౦పద్యములను రచించి యందుఁ జేర్చి మొత్తము కాండమును బూర్తిచేసియుండును నని చెప్పుట మూఁడవమార్గము. ఈ వాదమునందుఁగూడ దోషము లేకపోలేదు. ౫౦౦ పద్యములను రచింపఁగలిగినకవి ౬౦౦పద్యములనుగూడ దానే రచించి మొత్తము కాండమును బూర్తిచేయును గాని యిట్లు పులగ మేలచేయును? ఇట్లు చేయుట స్వభావవిరుద్ధముగాఁ గాన్పించును. అయినను, పైన వ్రాసిన మూఁడుమార్గములలో నిదియే మేలయినదిగా గాన్పించుటచేతను, నిందలిదోషమునకు సమాధానమిచ్చుట కవకాశ ముండుటవలనను నింతకంటె మార్గాంతరము స్ఫురింపకపోవుట మూలముననును, బలవత్తరమగుసాక్ష్యము లభించువఱకు నీయూహాయందే సత్యమున్న దని భావింతము. ఆరణ్యకాండద్వితీయకవి, యాకాండమును బెంచి వ్రాయవలయుననియే యుద్ధేశించెనుగాని యాకాండమును దాను బూర్తిగ వ్రాయఁదలపెట్టలేదు. అందుచే నైదువందలపద్యములను వ్రాసిన యాతఁడు ౬౦౦ పద్యముల నేల రచింపకుండు నని ప్రశ్నించుకొనిన లాభము లేదు. ఇదియే యిందలిదోషమునకు సమాధానము.

మొత్తముమీఁద నేపద్ధతిలోఁ జూచినను, నారణ్యకాండమున నిరువురికవిత్వ మున్నదని యొప్పుకొనక తప్పదు. ఈరెండుకవిత్వము లొక్కనివే యనియు, మొదట క్లుప్తముగా వ్రాసి, తరువాత నాతఁడే మఱికొన్నిపద్యములను రచించి యందుఁ జేర్చియుండవచ్చు ననియుఁ గొందఱనవచ్చును. ఇది సుసంగతము కాదు. తా నదివఱకు కష్టపడి రచించిన రెండువందలపద్యములను దీసివేయుట కెవ్వఁడు నంగీకరింపఁడు.

అతఁడే యట్లు చేసియుండినచో మొదటిగ్రంథము ప్రచారములోనికి వచ్చి యిప్పటివఱకు నిలిచియుండదు. మొదట నొకకవి, క్లుప్తముగా రచించిన మొదటిగ్రంథము ప్రచారములోనికి వచ్చినపిమ్మట నీరెండవ కవి యాగ్రంథమును బెంచి వ్రాసియుండును. అందుచే నీరెండు గ్రంథములకుఁ గూడఁ బ్రతికలు బయలువెడలి దేశములోఁ బ్రచారము సేయుచున్న వనితలంచుటయే సమంజసము. పరిశీలనాబుద్ధితోఁ జూచిన యెడల శైలినిబట్టికూడ నిం దిరువురికవిత్వ మున్నదని తోఁచును.

అరణ్యకాండకర్త లిరువురైనచో వారెవ్వరు?

అరణ్యకాండమున నిరువురికవిత్వ ముండె నని పైననిశ్చయించితిమి. అయినచో నాయిరువు రెవ్వ రని యాలోచింపవలసియున్నది. వాఙ్మయప్రపంచమున రామాయణకర్తలుగాఁ బైనఁజెప్పిన యైదుగురు గాక ఎఱ్ఱాప్రగ్గడ సత్యనారనలనామములు వినవచ్చుచున్నవి. ఇంకఁ గొంద ఱుండిననుండవచ్చును. వారందఱును సంపూర్ణరామాయణ కర్తలు. భాగరచయితలుగాని పూరయితలుగాని కారు. అందుచే నీ సందర్భమున వారినిగూర్చి యోచింప నవసరము లేదు. కొన్ని రామాయణతాళపత్రప్రతులలో నెఱ్ఱాప్రగడ రచించిన వని కొన్నిపద్యము లుదాహరింపఁ బడినట్లు శ్రీనేలటూరి వెంకటరమణయ్యగారు వ్రాసియున్నారు. కాని యవి స్వల్పసంఖ్యగలవి యగుటచే నీసందర్భమున నందునుగూర్చి కూడ యాలోచింపనక్కఱ లేదు. ఇఁక రామాయణ భాగకర్తలుగాఁ గనవచ్చుచున్నవారు. ౧ మంత్రిభాస్కరుఁడు ౨ హుళక్కిభాస్కరుఁడు ౩ మల్లికార్జునభట్టు ౪ కుమారరుద్రదేవుఁడు ౫ అయ్యలార్యుఁడు వీరు గాక నింకఁ గొంద ఱున్నారని యెవ్వరైన నందు రేని వారావిషయమును ససాక్ష్యముగాఁ దెలుపవలసియుందురు.

ముద్రితప్రతులయందును ససంఖ్యాకతాళపత్రప్రతులయందును నరణ్యకాండకర్త భాస్కరుఁ డని గద్యమూలమున స్పష్టమగుచుండుటచే నీకాండకర్తలలో నొకస్థానము భాస్కరున కీయక తప్పదు. రెండవ వారినిగూర్చి మాత్రమే మన మాలోచింపవలసియుండును. రచయిత పూరయితలిరువురిలో పూరయితకంటె రచయిత పూర్వుఁ డగుట నిశ్చ

యము కదా! భాస్కరున కీయఁబడినస్థానము నధిష్ఠింపవలసినవాఁడు మంత్రిభాస్కరుఁడా? హుళక్కిభాస్కరుఁడా? యనునది తీర్మానింపవలసిన యొకసమస్య యైయున్నది. అరణ్యకాండాంతగద్యయందలి భాస్కరుఁడు హుళక్కిభాస్కరుఁడనియు నాతఁడే మొదటికవి యనియుఁ దలంచు నెడల. నాకాండమును బెంచి వ్రాసినవాఁ డాతనికిఁదరువాతి వాఁడై యుండవలయునుగదా! హుళక్కిభాస్కరునకుఁ దరువాత నయ్యలార్యుఁడు దక్క రామాయణకవిముఖ్యులు గాన్పించుటలేదు. అతఁడు హుళక్కిభాస్కరుఁడు రచింపఁగా మిగిలిన యుద్ధకాండము తరువాయిని చెప్పితి ననియే చెప్పుకొనినాఁడుగాని యారణ్యకాండమునఁ దనకు సంబంధ మున్నట్లు చెప్పలేదు. కావున నం దాతనికి సంబంధమును గల్పింపరాదు. అందుచే హుళక్కిభాస్కరుఁ డారణ్యకాండమును రచించిన మొదటికవి కాఁ డనినిశ్చయింపఁదగియున్నది. ఇఁక నారణ్యకాండమును బెంపొందించి వ్రాసిన రెండవకవి హుళక్కిభాస్కరుఁడే యనియు, నాగద్య మాతనిదే యనియు, నొకవాదము రావచ్చును. ఈవాదము నిస్సార మైనది. ఆరణ్యకాండమునఁ దరువాతఁ జేర్చినభాగము లేకుండ మొదటికవి రచించిన ౪౦౦ పద్యములు గల తాళపత్త్రప్రతులలో, నిప్పటిముద్రితప్రతులలో నున్నట్లే, భాస్కరునిగద్య మున్నది. కావున నాగద్యము మొదటికవిది కాని రెండవకవిది కా దని స్పష్ట మగుచున్నది. ఇదియునుగాక హుళక్కిభాస్కరుఁ డారణ్యకాండద్వితీయకవి యను వాదము యుక్తియుక్తము కాదని యయోధ్యకాండమునుగూర్చి వ్రాయునప్పుడుకూడఁ జూపెదను.

మంత్రిభాస్కరుఁడే యారణ్యకాండప్రథమకవి

ఆరణ్యకాండగద్యయందు హుళక్కిభాస్కరునకు స్థానము లే నప్పుడు, దాని నధిష్ఠింపఁదగినవాఁడు మంత్రిభాస్కరుఁడు తప్ప వేఱొకఁడు లేఁడు. ఆస్థానము నెక్కిన హుళక్కిభాస్కరునకే యివ్వఁదలఁచి యెవ్వ రైనయందులకై పట్టుపట్టి పోరాడినచో గద్యకై నేను వారితోఁ గయ్యమునకు దిగను. కాని, హుళక్కిభాస్కరుఁడుగాక మిగిలిన రెండవకవి యెవ్వ రని వారిని బ్రశ్నింపకమానను. గద్యయం దున్నను లేక

పోయినను కవిత్వమునందు మంత్రిభాస్కరుని స్థానమును నిలువఁబెట్టి యాతనికి న్యాయ్యము గలుగుటకై ప్రయత్నింపక మానను. ఆతని పక్షమున న్యాయము లేదని తోఁచినచో నాతనికై పెనఁగులాడను. మంత్రిభాస్కరునకుఁ గవిత్వమునఁ జోటు లభించె నేని గద్య యాతనిదే కాఁగలదు.

మఱియొకభాస్కరుఁ డేలకాఁకూడదు ?

అరణ్యకాండగద్యయందలి భాస్కరుఁడు, హుళక్కిభాస్కరుఁడు గాక పోయినచో, మంత్రిభాస్కరుఁడే యేల కావలయును ? మఱియొక భాస్కరుఁడు కాఁగూడదా ? యని యెవ రైన ప్రశ్నింపవచ్చును. ఆగద్యము మంత్రిభాస్కరునకుఁ జెందినదా ? లేక హుళక్కిభాస్కరునిదియా ? యనియే యిదివఱకున్న ప్రశ్న ! మఱియొక భాస్కరునిగూర్చి యోచింపవలసిన ప్రసక్తి లేదు. భాస్కరనామధారులు పెక్కు రుండవచ్చును. ఆకాలమున నట్టికావ్యము నాంధ్రభాషలో రచియింపఁదగిన సమర్థత గలభాస్కరుఁడే మనకుఁ గావలయును. అట్టివా రెవ్వరును నాకుఁ గన్పడ లేదు.

ముద్రితభాస్కరరామాయణమునకుఁ బీఠిక వ్రాసిన శ్రీమేడేపల్లి వేంకటరమణాచార్యపండితులు పీఠికలో "దశగతులను గ్రంథమును భాషాంతరీకరించి, సాహిణిమారుని కంకితము చేయుటచేత భాస్కరుఁడను మహాకవియొకఁడు సాహిణిమారుని కాలమున నున్నవాఁ డనుట నిశ్చయము." అని వ్రాసియున్నారు. వారే మఱియొకచోట "దీనిని బట్టి (సోమదేవరాజీయము) చూచిన హుళక్కిభాస్కరుఁడును సాహిణిమారుఁడును సమకాలికు లని తెలియుటయేకాక యొకచోట నున్నవారనిగూడ స్పష్టమగుచున్నది" అని వ్రాసియున్నారు. దశగతు లను గ్రంథము నాకు లభింపలేదు. దశగతులకర్తయును, హుళక్కిభాస్కరుఁడును, ఒక్కరో భిన్నులో ఆచార్యులవారి వాక్యమువలనఁ దెలియుటలేదు. ఆగ్రంథ మాంధ్రభాషలోనే రచియింపఁబడియుండవలయును. సాహిణిమారనను గూర్చియు, భాస్కరునిఁ గూర్చియు ననేకవిషయములను జర్చించియు, దశగతులలోనుండ యొకవాక్యమునైన నుద్ధ

హరింపక పోవుటచే శ్రీయాచార్యుల వారికిని, ఆగ్రంథము లభింపలే దని యనుకొనుచున్నాఁడను. ఇంతకును శ్రీవారు తమపీఠికలో నారణ్యకాండ కర్తృత్వమును హుళక్కిభాస్కరునియందే యుంచిరి. కాని దశగతుల గ్రంథకర్తపైఁ బెట్టలేదు. రామాయణగ్రంథకర్తృత్వవిషయమున నీవఱ కెన్నఁడును దశగతిగ్రంథకర్తనామమును విని యెఱుంగము. కావున నీ సందర్భమున నాతనినిగూర్చి యాలోచింపనక్కఱలేదు. (దశగతులను దెనిఁగించినయాతఁడు హుళక్కిభాస్కరుఁ డని శ్రీచిలుకూరి వీరభద్ర రావుగారాంధ్రులచరిత్రమునను, శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు క్రీడాభిరామపీఠికయందును వ్రాసియున్నారు. కాని వీరెవరు నాగ్రంథమును జూచియున్నట్లు కనఁబడదు.)

రామాయణభాగరచయితలలో నొకఁడైన మల్లికార్జునభట్టునకుఁ దండ్రి యగు భాస్కరసత్కవి యొకఁడున్నాఁడు. ఆతఁడు హుళక్కిభాస్కరుఁడే యని యొకవాద మున్నది. అది సత్యమైనేని, యాతనికరణ్యకాండమున స్థానము లే దని పైనఁ జెప్పియుంటిమి. అది సత్యముకాక, యాభాస్కరుఁడు వే ఱని యందురేని యావాదమునందు సారము లేదు. మల్లికార్జునభట్టు తనతండ్రి రామాయణమును రచియించె నని చెప్పలేక చెప్పకపోయినఁ బోవుఁగాక తండ్రి యారణ్యకాండమును గుమారుఁడు బాలకాండమును రచించి రని చెప్పినచో వీరిరువురు సమకాలికు లని తేలునుకదా! అప్పుడు హుళక్కిభాస్కరున కన్వయించినపాత్రమే యాతనికి నన్వయించును. ఈతనిని మొదటికవి యనుకొనుమూ, తరువాతికవి లభింపఁడు. రెండవ కవియందునూ మొదటిస్థానము మంత్రిభాస్కరునిదే.

హుళక్కిభాస్కరుఁడుగాని, దశగతులభాస్కరుఁడుగాని, సత్కవి భాస్కరుఁడుగాని యరణ్యకాండరచయితలలో బ్రథముఁ డనియెంచితిమేని, రెండవస్థానము మల్లికార్జునభట్టునకో, కుమారరుద్రదేవునకో యివ్వవలసియుండును. వారిరువురు నరణ్యకాండమున కిఱుపక్కలనున్న గ్రంథములు రచించినవారు. వారిని మించి మఱియొక రారణ్యకాండమును వ్రాసి రని చెప్పవలనుపడదు. వీరియిరువురిలో నెవరో యొక రరణ్యకాండ

మును బెంచి వ్రాసిరని నిశ్చయించితిమేని, పైనఁ జెప్పినముగ్గురకు నారణ్యకాండమున స్థాన ముండదు. వారు ముగ్గురును వీరిరువురును సమకాలికులు. సమకాలికులలో నొకరు స్వల్పముగ వ్రాయుటయు నింకొకరు పెంచి వ్రాయుటయు సంభవింపదు. మల్లికార్జునభట్ట కుమారరుద్రదేవులలో నెవ్వరును, పైనఁ జెప్పిన ముగ్గురుభాస్కరులతో నారణ్యకాండకర్తృత్వమున భాగమును పంచుకొననేరరు. వారి కీకాండమున భాగ మీయఁదలఁచినచో, మంత్రిభాస్కరునితోడనే పంచి యీవలసియున్నది. ఎట్లయిన మంత్రిభాస్కరునిఁ దొలగింపవలయు నను నుద్దేశముతోఁ బైనఁ జెప్పిన ముగ్గురునుగాక మఱియొక భాస్కరుఁడో, మఱియొక రామాయణభాగరచయితయో యున్నాఁడనికాని, అయ్యలార్యునితరువాత మఱియెవ్వరో యీభాగమును బెంచి వ్రాసి యుందురనికాని వాదింపవచ్చును. అట్టియూహలాధారరహితము లును నసంగతములు నగును. ఎవ్వరైన ససాక్ష్యముగాఁ దమవాద మును బలపరచి చూపునంతవఱకు, నారణ్యకాండమున నిరువురికవిత్వ మున్నదనియు, నం దొకటి మంత్రిభాస్కరరచిత మనియు, నిస్సందేహ ముగా నిశ్చయింపవచ్చును. రెండవకవిత్వ మెవ్వరిదనువిషయమునుఁ గూర్చి తరువాత వ్రాసెదను.

మంత్రిభాస్కరుఁ డయోధ్యాకాండమునుగూడ రచియించెనా ?

మంత్రిభాస్కరుఁ డరణ్యకాండమును మాత్రమే రచియించెనా? మఱియేభాగము నైన రచియించెనా ? యని యాలోచింపవలసియున్నది. కొందఱుపండితు లరణ్యకాండమునమాత్రమే మంత్రిభాస్కరునకు సంబంధ ముండెనని నుడివియున్నారు. కావున నీవిషయవిచారణ మావశ్యక మైనది. ఏకవియును గ్రంథమధ్యభాగమును విశేషించి యారణ్యకాండమును రచింప నారంభించియుండఁడు. బాలకాండమును నయోధ్యాకాండమును నదివఱ కెవ్వరైన రచియించియున్నచో నీతఁ డరణ్యకాండమును రచియించె నని చెప్పవచ్చును. కాని యట్టిది లేనప్పు డీతఁ డొక్కఁ డరణ్యకాండమునే రచియించియుండె నని చెప్ప రాదు. ఈతఁడు మొదటినుండియు, రామాయణమును రచియించెనని యో

చెప్పవలసి యుండును. ఈ సందర్భమున నయోధ్యా కాండమును బరిశీలింతము.

ప్రస్తుతముద్రితప్రతిలో నయోధ్యాకాండమున గద్యపద్యములు ౪౬౫ యున్నవి. ఇందు ౧౩౮ గద్యపద్యములు వెనుకటిముద్రితప్రతికంటె హెచ్చుగా నున్న వనిపీఠికాకారులే వ్రాసియున్నారు. వెనుకటి ముద్రితప్రతిలోఁగూడఁ గొన్ని యధికముగాఁ జేరియుండవచ్చును. మాయూర నున్న తాళపత్రప్రతిలో ౩౨౭ గద్యపద్యము లున్నవి. వీనిని జదివి చూచితిని. కథాసూత్ర మెచ్చటను దెగిపోవక చక్కని శైలిలో ప్రౌఢముగానున్నది. తాళపత్రప్రతికంటె నధికముగా నున్న పద్యములసంఖ్య నిందిచ్చి పాఠకులకు విసువు జనింపఁజేయు నక్కర లేకుండ ముద్రాపకులే సౌకర్య మొనర్చియున్నారు. తాము క్రొత్తగాఁ జేర్చిన ౧౩౮ పద్యములను ముద్రితప్రతిలో [ ] నీవిధముగఁ గుండలీకరించి యున్నారు. ఇట్లు మార్పుచేయుటలో ముద్రాపకులు కొన్ని తావులయందిచ్చటివచ్చట నచ్చటివిచ్చటఁ జేర్చియున్నారు. అట్టి మార్పులు మనచర్చకు బాధకములుకావు. తాళపత్రప్రతికంటె ముద్రితప్రతిలో నధిక మనిచెప్పిన ౧౩౮ పోను మిగతా ౬౫ పద్యములును అయోధ్యాకాండాంతమున ౪౦౧ మొదలు ౪౬౫ వఱకు నై యున్నవి. ఈ పద్యములకు మాఱుగా నేనుజూచిన తాళపత్రప్రతిలో నొక్కసీసపద్యము మాత్రమే కలదు. అది యిది.

సీ. అంత నక్కడ రాముఁ డచటికి భరతుండు
క్రమ్మఱ వచ్చి సామ్రాజ్యమునకు
తన్నె రమ్మనుచుఁ బ్రార్థన సేయునో యని
చింతించి యాత్మలోఁ జిత్రకూట
మునఁగలమునిజనంబుల వీడుకొని మార్గ
తరువీక్షణంబునఁ గరము వేడ్కఁ
దనరి సీతానుమిత్రపుత్రసమేతుఁడై దం
డకావనమహీస్థలికి నరిగె

వనఁగ నయోధ్యాకాండ దా నఖిమతముగ
వినినఁ జదివిన వ్రాసిన విస్తరించి
చెప్పినను వారలకును సంసిద్ధి యొసఁగు
సంపదాయురారోగ్యముల్ సంభవించు.

(అరణ్యకాండాదిపద్యములందరు వ్రాత "అవధరింపుము" అని చేర్చి పిమ్మట కావ పద్యములతోఁ గలిపి చదువవచ్చును. ముద్రితప్రతిలోని యారణ్యకాండము ప్రథమాశ్వాసము 3వ పద్యమునకు ౧౧వ పద్యమును, ౭వ పదమునకు ౧౭వ పద్యమును పునరుక్తిదోషమును గల్గించుచున్నవి చూడుఁడు. ఇట్టి వింతలు గలవు.)

అయోధ్యాకాండమున మొదటికవి ౨౬౨ పద్యగద్యములను మాత్రమే రచించె ననియుఁ బిమ్మట నెవ్వరో శక్తిహీనగ్రంథమును జేర్చి పెంపొందించి రనియుఁ బైన వ్రాసిన వాక్యములవలన స్పష్ట మగుచున్నది. అరణ్యకాండమువలెనే యీ పెంపొందించినభాగము రెండవకవికృత మని నిశ్చయించుటకు సంశయింపనక్కఱ లేదు. అత్రిమహర్షి యాశ్రమంబున నడచినకథను జేర్చుటయు నచ్చటచ్చట మఱికొన్నికథలను జేర్చి పెంచి వ్రాయుటయు నీరెండవకవి యుద్దేశము. ఈభాగమును దీసివేసినను గథకు భంగము కలుగకుండ నడచుచున్న దని పాఠకులు గ్రహింపగలరు. ముద్రితప్రతిలోఁ గుండలీకరించినభాగములోఁ బద్యభాగముకంటె గద్యభాగ మధికముగ నున్నది. మఱియు, నయోధ్యకాండమును రెండుఖండములుగ విభజించితి మేని, పూర్వఖండమునఁ దాళపత్రప్రతిలో లేనిభాగ మధికముగను, నుత్తరఖండమునఁ నల్పముగను నున్నట్లు గన్పట్టును.

అయోధ్యాకాండాంతపద్యములు ముద్రితప్రతిలో నొకవిధముగను, గొన్ని తాళపత్రప్రతులలో వేఱొకవిధముగను నున్నవి. వాని నీక్రిందఁ జూపుచున్నాను.

ముద్రితప్రతి :

ఉ. రాజకిరీటకీలిత విరాజితనూతనరత్న [illegible] నీ
రాజన [illegible] ఖడ్గధా

రాజయలభ్యమానసుచిరద్యుతి మన్మణిశాతకుంభవి
భ్రాజితసద్వితీర్ణ రిపుపార్థివఖండన కీర్తిమండనా ?

క. భూరిభుజార్గళలసదసి
ధారాచలితప్రతాపదహన మహోదు
ర్వారశిఖాంతరనిపత
ద్వైరారిక మారశంభ విక్రమసులభా !

మా. వినయగుణ విశాలా! విప్రసంత్రాణలోలా!
వినుతశుభచరిత్రా! విద్వదంభోజమిత్రా!
ఘనవిజయధురీణా! కామినీపంచబాణా!
కనకకుధరధీరా! కాచమాంబాకుమారా!

తాళపత్రప్రతి :

శా. మందారద్రుమ సామ్యదానఖని యున్మాదాంధవిద్వేషి రా
ట్సందోహప్రకటోగ్ర శౌర్యహరణోత్సాహ స్ఫురద్బాహుఁ డా
నందాపాదిత భూసురప్రకరనానాస్తోత్రపాత్రుండు కుం
దేందుప్రఖ్యముఖారవిందుఁడు గుణాన్వితుండు ధీరుం డనిన్.

క. బాలాలాలి తనవహం
చాలుఁడు సుకవినికరసంతతమ్మృదువా
చాలుఁడు విపులాభరితయ
శోలలితుఁడు వైరిహృదయశూలుఁడు పేర్మిన్.

మా. భువనభరిత కీర్తిస్ఫూర్తిదారోరుగాత్రుం
డసహితసుమహోచ్ఛౌర్య స్ఫురదచ్ఛత్రుజైత్రుం
డు వితరణరణోగ్రప్రాప సప్తాశ్వపుత్రుం
డు విబుధజనరక్షాదక్షుండు సన్మిత్రుఁ డుర్విన్.

పై పద్యములకును క్రిందిపద్యములకును పోలిక లేదు. పై పద్యములు సంబోధనావిభక్తిలో నున్నవి. తాళపత్రప్రతిలోని పద్యములు ఆరణ్యకాండపద్యములవలెను, నిర్వచనోత్తర రామాయణమందలి యాశ్వాసాంతపద్యముల పోలికను ప్రథమావిభక్తిలో నున్నవి.

ఆరణ్యకాండాంతపద్యములో "వితరణఖని" యనియు నీపద్యములలో "దానఖని" యనియు నుండుటనుబట్టికూడ నారణ్యకాండరచయితయు నయోధ్యాకాండరచయితయు నొక్కఁడే యని యూహింపనగును.

పైనవ్రాసినవానిలో "మందారద్రుమ" మిత్యాదిమూఁడుపద్యములు గల తాళపత్రప్రతియందలిగద్య ఆరణ్యకాండగద్యవలెనే "సకలసుకవిజనవినుత"ఇత్యాది భాస్కరకవిగద్యయే యున్నది. దీనినిబట్టి యయోధ్యాకాండము భాస్కరవిరచిత మని స్పష్టమగుచున్నది. కేవలము గద్యయొక్కటియే యైనచో నది భాస్కరవిరచిత మని నిశ్చయింపలేము కాని, యాశ్వాసాంతపద్యములు వేఱుగానుండుటను బట్టియు, గ్రంథము ౨౬౭ పద్యములుగలిగి వేఱుగా నుండుటమూలమునను, ఆరణ్యకాండరచయితలలోని మొదటికవియు నయోధ్యాకాండరచయితలలోని మొదటికవియు నేకవ్యక్తి యని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. అయోధ్యాకాండకర్తలను నిర్ణయించుట కరణ్యకాండమునకుఁ బడినంతశ్రమ యక్కరలేదు. అయోధ్యాకాండముద్రితప్రతిలోనిగద్య ననుసరించి, యొకస్థానమును గుమారరుద్రదేవునకును, తాళపత్రప్రతిగద్యనుబట్టి యొకస్థానము భాస్కరునకును నీయవచ్చును. కుమారరుద్రదేవుఁడు, హుళక్కిభాస్కర, దశగతిభాస్కర, సత్కవిభాస్కరులతో సమకాలికుఁడు కావునను, సమకాలికులలో నొకఁడు క్లుప్తముగ వ్రాసినదానిని మఱియొకఁడు పెంచి వ్రాయుట సంభవింపదు. కావునను, అయోధ్యాకాండకర్తృత్వము నిస్సంశయముగా మంత్రిభాస్కరునకు సంక్రమింపకతప్పదు. అయోధ్యారణ్యకాండకర్త యొక్కఁడే కావున, ఆరణ్యకాండకర్త, హుళక్కిభాస్కరుఁ డనువాదము యుక్తియుక్తము కానేరదు.

కుమారరుద్రదేవుఁడు గ్రంథచౌర్య మొనర్చెనా ?

పైవిమర్శనమునుబట్టి యయోధ్యాకాండమును మొదట౨౬౭ గద్యపద్యములతో మంత్రిభాస్కరుఁడు రచియించె ననియుఁ, బిమ్మట దాదాపు ౨౦౦ గద్యపద్యములను కుమారరుద్రదేవుఁడు రచియించి,

యందుఁ జేర్చి మొత్తమునకుఁ దనగద్య వేసికొనెననియుఁ దేలుచున్నది. ఇందువలనఁ గుమారరుద్రదేవునిపై గ్రంథచౌర్య మారోపించినవార మగుచున్నాము. ఇది న్యాయమా యని కొందఱు అడుగవచ్చును. ఎవరిపైనను గ్రంథచౌర్య మాపాదించు నుద్దేశము మాకు లేదు. తాము కనిపెట్టిన విషయములను సత్యాన్వేషణబుద్ధితో విమర్శింపుచు లోకమునెదుట నుంచుట చరిత్రకారులధర్మము. ఆధర్మమునే మే మవలంబించితిమి. కుమారరుద్రదేవుఁడు, భాస్కరవిరచితము లగుగద్య పద్యములను గ్రహించి, మఱి రెండువందలగద్యపద్యములను రచించి చేర్చి, తానురచించినభాగమును సాహిణిమారన కంకితముచేసి, తాను వ్రాసికొనినప్రతియందు, రెండుగద్యములును, రెండువిధములగు కాండాద్యంతపద్యములును వేసియుండును. తత్ప్రతికావి లేఖకులు కొందఱ ఆ రెండువిధము లగువ్రాతలలో నొకదానిని విడచివేసి తమయిష్టము వచ్చిన యొకగద్యను, ఒకవిధ మగునాద్యంతపద్యములను వ్రాసికొని యుందురు. అందుచేతనే కొన్నిప్రతులలో భాస్కరవిరచితకాండాంత పద్యములును గుమారరుద్రదేవునిగద్యయు నుండుట సంభవించినది. ఇట్టితబ్బిబ్బులు కొన్నికొన్ని తాళపత్రప్రతులలో యుద్ధకాండమునందుఁ దక్కఁ దక్కినకాండములయందుఁ గన్పట్టుచున్నవి. ఈయూహయందు సత్యముండెనేని, కుమారరుద్రదేవునియందు గ్రంథచౌర్యదోషముండదు.

అరణ్యకాండద్వితీయకవి యెవ్వరు?

అయోధ్యాకాండద్వితీయకవి కుమారరుద్రదేవుఁ డని యనుకొన్నారము. ఆరణ్యకాండమును బెంచివ్రాసినకవి యెవ్వ రని యోచింపవలసియున్నది. ఇదికూడఁ గుమారరుద్రదేవుఁడుగాని మల్లికార్జున భట్టుగాని యైయుండు రనినాయూహ. వీరిరువురుతప్ప మఱెవ్వరును గారని నా నమ్మకము. ఏ రిరువురిలో నెవ్వరో నిశ్చయించుటకు నాకాధారములు లభింపలేదు. కాని కుమారరుద్రదేవుఁ డైయుండునని నా తలంపు. కుమారరుద్రదేవుఁ డయోధ్యాకాండగద్యను మార్చి నట్లరణ్యాకాండగద్య నేల మార్పలే దని కొంద అడుగవచ్చును. ఆరణ్యకాండాంతగద్యలోఁగూడ భాస్కరునిదిగాక మఱియొకరిదికూడ

నుండియుండు ననియు, దానిని లేఖకుఁడు దీసికొనియుండఁ డనియుఁ దాళపత్రప్రతు లింకను బరిశోధించినచో నది బయటపడుననియు నా నమ్మకము. లేదా ఆరణ్యకాండమునుఁ దాను రచించినట్లు వేసికొనినచో నేర్పడైనఁ గీడు మూడునేమో యనుభయముచేతను నా కాండమునఁ దాను కొంతభాగమును మాత్రమే వ్రాసి యుండియు మొత్తమంతయుఁ దాను రచించినట్లు ప్రకటించుకొని యా కీడునంతను దన నెత్తిపై వేసికొనుట కిష్టములేకయు భాస్కరునిగద్యము నీరెండవకవి మార్చకపోయియుండును. భారతారణ్యపర్వశేషమును రచించిన యెఱ్ఱాప్రగ్గడ తనపేరున గద్యమును వ్రాసికొనక నన్నయపేరుననే గ్రంథము నుంచుటకుఁగూడ నిదియే కారణమైయుండును. అంతటి మహాకవుల కిట్టిమూఢనమ్మకము లుండునా యని తలంపరాదు. గొప్పనాగరికులమని చెప్పుకొనెడివారిలో నిప్పుడుకూడ నిట్టినమ్మకము లున్నవారు కలరు. ఆ వివరముల నిటఁ దెలుపుట యప్రస్తుతప్రశంసయగును. మంత్రిభాస్కరుఁడు ప్రతికాండాంతమునను ఫలశ్రుతిపద్యము వ్రాసినట్లు కన్పట్టుచున్నది.

అయోధ్యాకాండఫలశ్రుతిని పైన వ్రాసియున్నాఁడను. ఆరణ్యకాండ ఫలశ్రుతి పద్యమిది:

సీ. ఆ సరోవరమునయందు నృపాత్మజు
        లతి శయస్నానపానాదివిధులు
    ప్రియమునఁ జల్పి సంప్రీతాంతరంగులై
        తత్సమీపోన్నతతరుచయంబు
    శీతలచ్ఛాయ నాసీనులై విశ్రమం బంది
        కొండొకతడ వచట నిలిచి
    సౌఖ్యంబు నొంది సత్సేవ్యమైన యీ
        యారణ్యకాండంబు నర్థితోడ
గీ. వినినఁ జదివిన వ్రాసిన విస్తరించి
    చెప్పినను వారలకు సౌఖ్యసిద్ధి యగుచు
    సంపదాయురారోగ్యముల్ సంభవించు
    నతులపుణ్యంబు లెప్పుడు ననుభవింత్రు.

బాలకాండఫలశ్రుతిపద్యము నాకు లభింపలేదు.

బాలకాండమున మంత్రిభాస్కరునికవిత్వ ముండెనా?

అయోధ్యారణ్యకాండములయందు మంత్రిభాస్కరుని కవిత్వ మున్నదని నిర్ణయించినప్పుడు బాలకాండలో నాతనిరచన మున్న దని వేఱుగఁ జెప్పనక్కర లేదు. కాని యారెండుకాండములలోను స్పష్టముగాఁ దెలిసినట్లు బాలకాండమున నావిభేదమునుఁ దెలుపు తాళపత్త్రప్రతులు నాకు లభింపలేదు. నేను జూచిన తాళపత్త్రప్రతులలోఁ జాలభాగము ముద్రితప్రతితో సమానముగనే యున్నవి. కాని యొక ప్రతిలో కొన్ని భేదములు గానవచ్చినవి. అందు మచ్చునకు మూఁడు పద్యముల నుదాహరించెదను. ఇట్టి వింకను గలవు.

ముద్రితప్రతి : (ఇవికూడ వ్రాఁతప్రతిలో నివనియే ముద్రాపకులు వ్రాసి యున్నారు.)

చ ధర విలసిల్లు తొమ్మిదినిధానములున్ దనయింట నుండఁగా
నరుఁ డట యెక్కురింత పరిణామము చూపొకటే విరోధియై
తరమియు తేరు దీసికొని తమ్ముఁ డటంచును గిన్నరేశునిన్
తిరిపెముతోడిచుట్ట మని తిట్టుదు రప్పురి వైశ్యపుంగవుల్. 32

మ. బలవంతంబున లావునన్ విపులశుంభద్దేహముల్ దాల్చి తా
మిల యెల్లన్ వడి దున్ని సస్యములచే నింపారఁ బూరించి రా
సులుగాఁ జేతురు ధాన్యముల్ సుగుణులై పెంపొంది యప్పట్టిలో
పల నెల్లప్పుడు నుండ శూద్రులు ధరన్ బ్రాహ్మణ్యసేవాపరుల్. 33

23౯ ఇదియొకవచనము.

గ్రంథవిస్తరభీతిచే నీయలేదు. ముద్రితప్రతిని జూడుఁడు. వీనికి మారుగాఁ దాళపత్త్రప్రతిలో క్రిందిపద్యములున్నవి.

గీ శరధికైనను రత్నములే చాల నొసఁగ
నలకుబేరుని కర్థంబు లంది యుప్పఁ
జాలియుండ్రట్టి వైశ్యులు సంతతంబుగను
మొసఁగియుందురు తత్పురవరమునను.

క. వర్ణత్రయసంశీవ్యో
దీర్ణ మహాత్వంబు గలిగి ధృతిచే హింసువ
త్స్వర్ణధరంబులో యునఁగాఁ
బూర్ణులు నై యుండు రేవుడు బురిఁ గంశూద్రుల్.

౭౩కావ వచనమునకు బదులుగా నీ క్రింది పద్యగద్యములున్నవి.

క. ధాత్రీసుత రామునకు శ్రీ
మిత్రికి నూర్మిళను బ్రియము నొయి నైకేయీ
పుత్రునకు న్మాళవి మఱి
శత్రుఘ్నునకు స్పజితకీర్తి సమ్మతి నిచ్చెన్.

వ. అప్పు డారాఘవులు నగ్నిసన్నిధిఁ గమోక్తక్రమంబులఁ బాణి
గ్రహణంబులు చేసి యగ్నిదేవునకు మునులకు దశరథజనకులకు
నమస్కరించి బహువిధాశీర్వాదంబుల విలసిల్లు నాసమయంబున.

ఈ యుదాహరణములనుబట్టి బాలకాండమునఁగూడ నిరువురి కవిత్వ మున్నదనియు నందొకఁడు మంత్రిభాస్కరుఁడనియు రెండవ యాతఁడు మల్లికార్జున భట్టనియు నిశ్చయింపవచ్చును. బాలకాండ ముద్రితప్రతిలో ౭౮౩ గద్యపద్యము లున్నవి. ఇందు ౪౦౦ గద్య పద్యములు మంత్రిభాస్కరునివనియుఁ దక్కినవి మల్లికార్జునుని వనియు ననుకొనవచ్చును. అయోధ్యారణ్యకాండములయందలి మంత్రిభాస్క రుని కవిత్వరీతినిబట్టి చూచినచో నాతఁడు కథపట్టులను గలుపుటకై స్వల్పవాక్యములతోఁ గూడిన వచనరచనము దప్ప గద్యరచనము నందు విశేషాభిరుచికలవాఁడు కాఁడనియు, కథాంశమును బ్రౌఢమైన శైలిలో రచించుటయం దెక్కువ యిష్టము కలవాఁడుకాని, వర్ణ నాంశములయం దభిలాషకలవాఁడు కాఁడనియుఁ, దోఁచగలదు. బాల కాండమున ౧౬ పెద్దవచనములును దాదాపు ౧౨౦ సామాన్య వచనములును, ౫౦ వఱకు కథపట్టులను గలుపుచిన్నవచనములును గలవు. ఈ గద్యభాగమున, నే స్వల్పసంఖ్యగలచిన్నగద్యములోఁదక్కఁ దక్కినవన్నియు మల్లికార్జునునిరచన మని చెప్పనొప్పును. మొదటి ౨౫ పద్యములలో ౩వ పద్యము మాత్రమే భాస్కరునిదై యుండును.

భాస్కరుఁడు విశ్వామిత్రచరిత్రము నంతవిస్తరించి, చెప్పియుండఁ డని నాయూహ. వాల్మీకిరామాయణములో లేనికొన్నివిషయములను మల్లికార్జునభట్టు, అధ్యాత్మరామాయణాదులనుండి యాంధ్రీకరించె నని పీఠికాకారులు వ్రాసియున్నారు. వాల్మీకిరామాయణమునే సంక్షేపముగా నాంధ్రీకరింపఁదలచినవాఁడు మంత్రిభాస్కరుఁడు. అట్టి యాతఁ డీవనికిఁ బూనుకొనఁడు కదా! బాలకాండమున మంత్రిభాస్కరుని పద్యము లేవో నిశ్చయముగాఁ జెప్పజాలము. కాని దిఙ్మాత్రసూచకముగాఁ దెలిసికొనుటకై పై వాక్యములను వ్రాసితిని.

భాస్కరరామాయణమున నవతారిక లేదేమి?

ప్రస్తుతము మనకు దొరకుచున్నముద్రితప్రతులలోఁగాని, తాళపత్ర ప్రతులలోఁగాని భాస్కరరామాయణమున నవతారిక లేదు. ఇందులకుఁ గారణ మేమై యుండునని యాలోచింపవలసియున్నది. "ఏకవియును దనయిష్టదైవమునుఁ బ్రార్థింపకుండ గ్రంథారంభమును జేయఁడు. మంత్రిభాస్కరుఁడు కృత్యాదిని రచియించియే యుండును. అది యాతని గ్రంథముతోఁ బాటుగ నశించియుండును." అని కొంద అనుచున్నారు. కాని యీయూహ కొకబాధకము గన్పట్టుచున్నది. మంత్రిభాస్కరరామాయణ ముత్సన్నము కాలేదు. అయోధ్యారణ్యకాండములు యథామాతృకములుగా నున్నతాళపత్రప్రతు లచ్చటచ్చటఁ గన్పట్టుచున్నవి. అట్లే బాలకాండముగూడ యథామాతృకగా నున్నప్రతి యెన్నటికైన లభింపకమాన దని నా యాశ. అదిలభించెనేని యవతారిక యుండెనో లేదో నిశ్చయము కాఁగలదు. అంతవఱకు నీ విషయము నిదమిత్థ మని నిశ్చయముగాఁ జెప్పఁజాలము. భాస్కరుఁడు కృత్యాదిని రచియింపలే దనియనకొనుటకుగూడ నవకాశము కలదు. గ్రంథమంతయు రచించినపిదపఁ గృత్యాదిని రచించు నాచార మిప్పుడును మనలోఁ గలదు. భాస్కరుఁడుకూడ నట్లే తలంచి యుండెనేమో! గ్రంథము సాంతము కాకపోవుటచేఁ గృత్యాది వ్రాయబడకపోయి యుండవచ్చును. పూర్వకవిప్రణీతము లగుగ్రంథములలో నవతారికలు లేనివి కొన్ని కలవు. కృత్యాదిని వ్రాయకుండఁ గవులు

చనిపోవుటచే నాతనితనయుఁడో శిష్యుఁడో దానిని వ్రాసి పూర్తిచేసిన గ్రంథములును గలవు.

భాస్కరునికృత్యాది లేకపోయినమాని మల్లికార్జునభట్టైనను నవతారిక వ్రాయులే దేమనుప్రశ్న రాకమానదు. దీనికిఁ దృప్తికర మైనసమాధానము గానరాలేదు. గ్రంథమంతయుఁ బూర్తియైనపిదప నవతారికను వ్రాయవచ్చు ననితలంచినాఁ డనుసమాధాన మీతనిపట్ల వర్తింపదు. ఈతఁడు వ్రాయఁదలఁచినది సుందరకాండాంతమువఱకు మాత్రమే. అదిపూర్తి యైనది. అవతారిక వ్రాయఁదలఁచినచో వ్రాయుట కాతని కవకాశ మున్నది. కాని యాతఁడు వ్రాయలేదు. మంత్రిభాస్కరవిరచితబాలకాండమునందుఁ దానుఁ గొంతగ్రంథము నధికముగఁ జేర్చుటమాత్రమే చేసియుండుటచే వేఱుగ నవతారిక వ్రాయునిష్టము లేక మానివేసెనేమో చెప్పఁజాలము. కాండాంత పద్యములను వేఱుగ శివపరముగ వ్రాసి వేఱుగఁ దనగద్యను వ్రాసికొనినయాతఁడు కృత్యాది నేల వ్రాయకుండు నని కొంద ఱడుగ వచ్చును. అవతారిక వ్రాయఁదలఁచెనేని బాలకాండమునఁ దన కెంత ప్రసక్తి యున్నదియు స్పష్టముగాఁ జెప్పవలసివచ్చును. అందుచే నాతఁడు దానిని వ్రాయక యుండవచ్చును. మల్లికార్జునభట్టుపైనిగూడ గ్రంథచౌర్య మారోపింపలేము. అయోధ్యాకాండరచనా విచారణ సందర్భమునఁ గుమారరుద్రదేవునిఁగూర్చి వ్రాసినవాక్యములు మల్లికార్జున భట్టునకుఁ గూడ ననువర్తింపఁ జేయవలసియుండును.

కిష్కింధసుందరకాండములలో మంత్రిభాస్కరునికవిత్వ మున్నదా?

మంత్రిభాస్కరునికవిత్వ మారణ్యకాండముతో నాగిపోయె నని నిశ్చయింపఁజాలము. కాని మొదటి మూఁడు కాండములలోవలె నీ రెండుకాండములయందును నాతనికవిత్వ మున్నదని, నిరూపించుటకుఁ దగినసాధనము లు లభ్యములు కాలేదు. కొన్ని తాళపత్రప్రతులయం దీరెండుకాండములతుదిగద్యలు. "ఇది సకలసుకవిజనుత" మొదలుగా భాస్కరునిపేర నుండుటచేత, సుందరకాండాంతమువఱకును భాస్కరుఁడు

రచించియుండుననియు, యుద్ధకాండమునఁగూడఁగొంతవఱకు నీతఁడే రచించియుండుననియు దోఁచుచున్నది. కొన్ని తాళపత్రప్రతులలోని గద్యములనుబట్టి యిట్లూహించుట న్యాయముగా దనుకొంద మందురేమో! ఆ వాదమునందుఁగూడ సత్యముండ వచ్చును. ఎట్లయిన నీ విషయమున నింకను బరిశోధన మావశ్యకమయి యున్నది. ఈ కాండములలో నేను చూచిన తాళపత్రప్రతులకును ముద్రితప్రతికిని విశేషభేదము గన్పట్టలేదు.

కిష్కింధకాండాంతపద్యములలో ముద్రితప్రతియం దీక్రింది పద్యము కన్పట్టుచున్నది.

శా. లాటీచందనచర్చ చోళమహిళాలావణ్యసామగ్రి క
ర్ణాటీగీతకలాసరస్వతి కళింగాంతఃపురీమల్లికా
వాటీమంజరి గౌడవామనయనావక్షోజహారావళి యె
పాటింపందగు నీదుకీర్తి రథినీపాలాగ్రణీ సాహిణీ.

ఈ పద్యము సాహిణిమారయను సంబోధించుచున్నది. కాండాదిపద్యములు గాండాంతపద్యములును శివపరములుగా నున్నవి. మల్లికార్జునభట్టు తనకవిత్వము నీశ్వరునకుఁ గృతి యిచ్చెననుట స్పష్టము. కావునఁ బైనఁజూపినశార్దూలవృత్త మిట నుండఁదగినదని కాదనియుఁ బ్రక్షిప్తమనియు నిశ్చయింపవలసి యున్నది. ఇంతేకాదు, సాహిణిమారయ కంకితమైన యేయితర గ్రంథమునుండియో కొన్నిపద్యములను దెచ్చి భాస్కరరామాయణమున నెవ్వరో చేర్చియుందురను సూహ కలుగుచున్నది. హుళక్కి భాస్కరుఁ డాంధ్రీకరించి సాహిణిమారని కంకిత మొసంగె నని చెప్పెడు దశగతులలోని పద్యములను విలేఖకు లిందుఁ జేర్చిరేమో! ప్రస్తుత ముద్రితప్రతినిబట్టి కిష్కింధసుందరకాండములు మల్లికార్జునభట్టరచితము లనియు నీశ్వరాంకితము లనియు స్పష్టముగాఁ దెలియుచున్నది. “ఇవి నిజముగా మంత్రిభాస్కరకృతము లైనచోఁ గాండాంతపద్యము లీశ్వర సంబోధకములుగాక యేప్రభువును సంబోధించునవిగా నుండవలసి యున్నది. అయోధ్యారణ్యకాండముల కట్టిపద్యములు మనకు లభించి

నవి. మల్లికార్జునభట్టుపేర నున్నమూఁడుకాండములకు నట్టిపద్యములు మనకు దొరకలేదు. దీని కేదేనిప్రత్యేకకారణ ముండియుండవలయును. అయోధ్యారణ్యకాండములను మంత్రిభాస్కరుఁడు రచియించెనని మన మంగీకరించితిమేని, యాతఁడు బాలకాండమును రచింపకుండ నయోధ్యారణ్యకాండములనుమాత్రమే రచియించియుండఁడు. కావున బాలకాండమున నాతనిరచన మున్నదనునుపసిద్ధాంతము నంగీకరింపక తప్పదు. బాలకాండాంతమున మంత్రిభాస్కరుఁడు రచించినప్రభుస్తుతిపద్యములు మనకు లభించి, కిష్కింధసుందరకాండాంతపద్యములు లభింపకపోయినచో నీ రెండుకాండములయందు నీతని కవిత్వము లేదనియనుకొనవచ్చును. కాని బాలకాండాంతపద్యములు లభింపకపోవుటచేఁ గిష్కింధసుందరకాండాంతపద్యములు భాస్కరరచితములు నట్లు లభింపలేదనియు, నవి లభింపనంతమాత్రమున నాకాండములలో భాస్కరునికవిత్వము లేదని నిశ్చయింపఁగూడ దనియుఁ జెప్పవలసియున్నది. మల్లికార్జునుని పేరనున్న మూఁడుకాండములులోను భాస్కరుని గద్యయుండి యాతనికాండాంతపద్యములు లేకపోవుటకుఁ గారణము విలేఖకులై యుండవచ్చును.

అయోధ్యారణ్యకాండముల కవిత్వధోరణిఁబట్టి చూచినచో, మంత్రిభాస్కరుఁడు వాల్మీకిరామాయణమును సాధ్యమైనంతవఱకు క్లుప్తీకరించి యాంధ్రరామాయణమును రచింపఁదలపెట్టెననియు, మిక్కిలిపొడవుగల వచనములను రచియింప నాతఁడిష్టములేనివాఁడనియు వర్ణనాంశములతో గ్రంథమునుఁ బెంచునభిలాషకలవాఁడు కాఁడనియుదోఁచును. ఈ లక్షణములనుఁ గిష్కింధసుందరకాండముల కన్వయింపఁజేసిచూచినచో, బాలకాండమువలెనే యీ రెండుకాండములయందునుఁ గొంత మంత్రిభాస్కరునికవిత్వ ముండెననియు, మల్లికార్జున భట్టీకాండములనుఁగూడఁ వర్ణనాంశములనుఁ బెంచియు, వాల్మీకరామాయణమందు లేని "తారశ్రీరామునిశపించుట, లంక కేగి సీతావృత్తాంతమును గనుగొని రమ్మనిసంపాతి తనకుమారున కాజ్ఞాపించుట, హనుమంతుఁడు తన జననవృత్తాంతమున గజద్వయవధను

జెప్పుట" మొదలగుకథలనుఁ జేర్చియుఁ బెద్దవిగాఁ జేసె ననియుఁ దలంప నవకాశము గలుగుచున్నది. వాల్మీకిరామాయణమునఁ జెప్పినకథలనే సంగ్రహపరచి వ్రాయఁదలఁచినభాస్కరుఁ డందులేనికథలనుఁ దెచ్చి పెట్టినాఁ డనితలంపరాదు. కిష్కింథకాండమున దాదాపుగ నిరువదియుఁ సుందరకాండమున నిరువదియుఁ బెద్దవచనము లున్నవి. ఇవియన్నియు మల్లికార్జునభట్టు పెంచివ్రాసినవని నాయభిప్రాయము. కిష్కింధ కాండమున ౬౮౯వ సంఖ్యగల వచనమిందుల కుదాహరణము. ఈ వచనమునుఁ దీసివేసినను గథాసూత్రము తెగిపోలేదు. ఈ పెద్ద వచనము లున్నతావులలో భాస్కరుఁడు స్వల్పసంఖ్యగలపద్యములనో చిన్నవచనములనో వ్రాసియుండు నని నాయుద్దేశము. కిష్కింధా కాండమున నిపుడు ౮౩౦ గద్యపద్యము లున్నవి. ఇందులోఁ బద్య మధ్యమునఁ గథపట్టులను గలుపుటకై వ్రాయఁబడిన చిన్న గద్యములు దాదాపు ౧౮౦ కలవు. మిగిలిన ౬౩౦ పద్యము లలోఁ గందములు ౩౯౦. సుందరకాండమున నున్నగద్యపద్యములు ౯౭౦లోను, పైనఁజెప్పినరీతి గలచిన్నవచనములు ౧౧౦పోను మిగిలిన ౮౩౦ పద్యములలోను గందములు ౨౬౦. యుద్ధకాండమున నున్న గద్యపద్యములు ౨౭౦౦లోను వచనములు ౮౨౯ పద్యములు ౨౨౭౯ లోనుఁ గందములు ౭౦౦. కిష్కింధసుందరకాండములయందు మంత్రి భాస్కరుని కవిత యుండెనా లేదా యనివిమర్శించునప్పుడీయంకెలు గమనింపఁదగినవి. ఈ సందర్భమునఁ బైనఁ జెప్పినయుక్తులలోఁ గొన్ని నిశితవిమర్శనమునకు నిలువలేక పోవచ్చును. కాని మొత్తముమీఁద యోచించిచూడఁగాఁ గిష్కింధసుందరకాండములలో మంత్రిభాస్కరుని కవిత యున్నదనియు, బాలకాండమువలెనే యీ కాండములను గూడ మల్లికార్జునభట్టు పెంచివ్రాసెననియుఁ దోఁపకమానదు. విశేషపరిశ్రమచేసి, పరిశోధన మొనర్చినచో నయోధ్యారణ్యకాండముల వలెనే, తక్కిన మూఁడుకాండములయందును భాస్కరునికవిత యెంత యున్నదియుఁ దెలియఁగల దనినానమ్మకము.

బాల, కిష్కింధ సుందరకాండములయందు భాస్కరుని కవిత్వ మున్నచో నది యేల బయటపడలేదు?

ఈ ప్రశ్న కింకను దాళపత్రప్రతులపరిశోధన మావశ్యక మని చెప్పుటతక్క వేఱుతృప్తికరమగు ప్రత్యుత్తరము లేదు. ఈ తాళపత్రప్రతులు లభించుటలోఁ గూడ నొకకష్ట మున్నది. మల్లికార్జునభట్టుచేఁ బెంచి వ్రాయఁబడిన రామాయణప్రతులు ప్రచారములోనికి వచ్చినది మొదలు భాస్కరరామాయణప్రతులు మూలఁ బడిపోయియుండును. దీనికిఁ గారణము, మల్లికార్జునరామాయణమున గ్రంథ మెక్కువగా నుండుట. యుద్ధకాండముగూడ మల్లికార్జునభట్టుకాలముననే రచియింపబడి యుండుటచే, దానితోఁ గూడ గలసిన ప్రతులను విలేఖకులు వ్రాసికొనుచువచ్చిరి. అయ్యలార్యునకుఁ దరువాత సమగ్రరామాయణమును విడచి, యసమగ్రముగ నున్న భాస్కరునిప్రతుల నేవిలేఖకులును వ్రాసికొనియుండరు కదా! మల్లికార్జునభట్టునకుఁ బూర్వము వ్రాసికొనిన మంత్రిభాస్కరునిరామాయణప్రతులో లేక వానిప్రతికలో ప్రతికాప్రతికలో మనకు లభింపవలసియున్నది. అట్టివి లభించుట చాలదుర్ఘటము. అదృష్టవశమున నయోధ్యారణ్యకాండప్రతులు దొరకినవి. ఇట్లే తక్కినమూఁడుకాండములునుగూడ లభించుననియే నాయాశ. ఇప్పుడు ముద్రితప్రతులు విశేషప్రచారములో నుండుటచేఁ దాళపత్రప్రతులను జూచువా రరుదుగా నున్నారు. అందులో మంత్రిభాస్కరుఁడు రామాయణకర్తకాఁ డని యిదివఱకు పండితులు సిద్ధాంతీకరించి యుండుటచే, నీ విషయమునఁ బరిశోధన మవసరములే దని భావించువార లనేకు లున్నారు. అందుచే సామాన్యముగా నీ విషయమునుగూర్చి పరిశోధనముజరుగుట లేదు. నేను పైన వ్రాసిన యంశములను మనసు నందిడుకొని తాళపత్రపరిశోధనము గావింపవలసియున్నది.

భాస్కరరామాయణ టీకాకారుల యభిప్రాయము

భాస్కరరామాయణముద్రితప్రతికిఁ బీఠిక వ్రాసిన శ్రీమేడేపల్లి వెంకటరమణాచార్యపండితులు భాస్కరరామాయణముతో మంత్రిభాస్కరునకు సంబంధము లేదనియు, హుళక్కిభాస్కరుఁడే రామాయణకర్త యనియు నిశ్చయించియున్నారు. అందు వారు చూపిన యుక్తులకుఁ గొన్నిటికి (వారివాక్యముల నుదాహరింపకపోయినను) సమాధానములను పైన వ్రాసితిని. కొన్నిటికి మల్లికార్జునాది రామాయణకవుల చారిత్రములలో సమాధానములను వ్రాయఁబయత్నించెదను. ఈ సందర్భమునఁ బీఠికలో శ్రీయాచార్యులవారీక్రిందివాక్యములను వ్రాసియున్నారు.

"ఈ రామాయణమునకు భాస్కరరామాయణ మని కవిపేరుతోఁగూడిన నామముతో వ్యవహారముండుటలో నొకవిశేషమున్నది. అది యేదియన నదివఱ కొకరామాయణ మున్నట్లు సూచించుట. భారతముండఁగాఁ దరువాత జైమినిరచించినభారతమునకు జైమినిభారత మని పేరబ్బిన ట్లొకగ్రంథముండఁగా మఱల రెండవది పుట్టిన దానిసంజ్ఞకుఁ గవిపేరుచేర్చుట లోకములో వాడుకయైయున్నది. దీనివలన నీ రామాయణమునకు మఱియొక రామాయణము ముం దుండవలసియున్నది. అది యెఱ్ఱనకృతరామాయణ మని యూహింపవచ్చును. పింగళిసూరనార్యుఁడు భారతరామాయణకథను జోడించి వ్రాసినరాఘవపాండవీయములో:-

ఉ. ఏయెడ నర్థగౌరవసమృద్ధియు శబ్దవిశుద్ధియుం దిరం
బై యనవద్యతం బరఁగ సంధ్రివచస్థితి భారతంబు రా
మాయణము న్రచించినమహాత్ముల నాత్మఁ దలంచెదన్ జగ
ద్గేయుల నన్నపార్యుని దిక్కసుధీమణి నెఱ్ఱసత్కవిన్

అని రామాయణమును భారతమును రచించినపూర్వకవులు వీరు మువ్వురే యని తెలిపియున్నాఁడు. ఈ పద్యము తిక్కనకుఁ బూర్వము మంత్రిభాస్కరునిచే రామాయణము రచింపఁబడియుండలే దనిఁ దెలియుచేయుటయేకాక భాస్కరరామాయణముకూడ మొదటిది

కాదని సూచించుచున్నది. కాని ప్రతాపరుద్రునికాల మందున్న భాస్కరుఁడు ప్రతాపరుద్రునితరువాత రాజ్య మాక్రమించుకొన్నయన వేమారెడ్డి కాలములోనిమెత్త్రాప్రగ్గడకుఁ దరువాత నుండుట యెట్లు సందర్భించునను నంశ మాలోచింపవలసియున్నది. ప్రతాపరుద్రుని కాలములో భాస్కరుఁడున్నను నపుడు రామాయణమును రచించి యుండలేదు. ప్రతాపరుద్రునితరువాత సాహిణిమారన రాజుకాఁగా నపుడు రచించెను. ప్రతాపరుద్రుఁడు కారాసిబద్ధుఁ డైనతరువాతఁ దన్సేనానాయకులు స్వతంత్రరాజులయిరి. వినుకొండకుఁ బోలయ వేమారెడ్డియునుఁ గొండవీడునకు సాహిణిమారనయు రాజులైరి. మొదటఁ బోలయ వేమారెడ్డి స్వల్పకాలము రాజ్యముచేసి మృతుఁ డయిన తరువాత నన వేమారెడ్డి రాజయ్యెఁ గావున కొండవీడును సాహిణి మారుఁడు వినుకొండను వేమారెడ్డియుఁ బాలించుచుండఁగా భాస్కరరామాయణము పుట్టినది. ఇది పుట్టినప్పటికి భాస్కరపుత్రుఁడు గూడ గొప్పకవియై యున్నందునను భాస్కరుఁడు కొంతభాగమునే రచించియుండుటనుబట్టి, నీ గ్రంథము భాస్కరునిముసలితనమందు రచింపఁబడెనని యూహింపవలసియున్నది. ఇఁక నన వేమారెడ్డికడ నున్న యెఱ్ఱన రామాయణ మాతనియౌవ్వనకాలమున నిర్మింపఁబడినది. అన వేమారెడ్డి కంకితము చేయఁబడినహరివంశమునకుఁ బూర్వమే రామాయణము రచింపఁబడినట్లు హరివంశమువలనఁ దెలియవచ్చు చున్నది.

శా. “నాతమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు నిన్నాతత
శ్రీతోడన్ సముపేతుఁ జేసి యెలమిం జేపట్టి మాకిచ్చుటం
జేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి నింకనుం దనియ, నేకావ్యామృతస్వాదనన్”

ఇతనిగ్రంథములలో నిదియే మొదటిదని తోఁచుచున్నది. కావున నీ రెండురామాయణములలో నెఱ్ఱనది ముందుఁ బుట్టియుండవచ్చును.

కాఁబట్టి పైనవ్రాసినయుపపత్తులచే సర్వవిధముల నీ రామాయణమును రచించినవాఁడు హుళక్కిభాస్కరుఁడే కాని మంత్రిభాస్కరుఁడు కాఁ డనిగ్రహింపవలయును.

శ్రీయాచార్యులవారి యీ వాక్యములయందలి యంశములు చరిత్రకు విరుద్ధములుగా నున్నవి.

పింగళిసూరనార్యునిపద్యములో శ్రీయాచార్యులువారు చెప్పినంతయర్థము లేదు. కవిత్రయమును నుతించుటయే యాతనియుద్దేశము. కాని రామాయణకర్తలను జెప్పుట యాతనితలంపు కాదు. కవిత్రయము వారు భారతరామాయణములను రచించినవారనిమాత్రమే సూరనార్యుఁడు చెప్పెనుకాని, మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచింపలే దనికాని భాస్కరరామాయణము మొదటిది కాదనిగాని యాతఁడు చెప్ప నుద్దేశింపలేదు. నన్నయ రామాయణకర్త కాఁడు. రామాయణకర్తయైనభాస్కరుఁడు తనకుఁ బూర్వుఁడైనను నాతని నందు నుతింపలేదు. ఈ పద్యమునుబట్టి యెఱ్ఱనరామాయణము మొదటి దని నిర్ధారణచేయఁబూనుట వృథాయాసము. ప్రమాదభరితము.

ఎఱ్ఱాప్రగడ అనవేమారెడ్డికడ కవిగానుండి, రామాయణమును హరివంశము నతనికంకితము చేసె ననుటసరికాదు. హరివంశరచనము నాఁటి కనవేమారెడ్డి పుట్టెనో లేదో చెప్పలేము. పుట్టినను బదియేండ్ల లోపువయసుకలవాఁడుగా నుండును. హరివంశకృతిపతి ప్రోలయవేమారెడ్డి కాని యనవేమారెడ్డి కాఁడు. ప్రోలయవేముఁడు స్వల్పకాలముమాత్రమే రాజ్యముచేసినవాఁడును గాఁడు. క్రీ. శ. ౧౩౨౦ మొదలు ౧౩౪౯వఱకు ముప్పదిసంవత్సరములు రాజ్యము చేసినప్రతిభాశాలి. ఆతనికిఁ దరువాత నన వేమారెడ్డి రాజ్యమునకు రాలేదు. ప్రోలయవేముని పెద్దకుమారుఁడైన యనపోతారెడ్డి క్రీ. శ. ౧౩౫౦ మొదలు ౧౩౬౧వఱకు రాజ్యముచేసెను. అటుపిమ్మట క్రీ. శ. ౧౩౬౨ మొదలు ౧౩౮౦వఱకు నన వేమారెడ్డి రాజ్యమేలెను. ఈ కాలములో నెఱ్ఱాప్రగ్గడ లేఁడు. భాస్కరరామాయణ మింతకుపూర్వమే రచియింపఁబడి యుండెను. వాస్తవముచేత నెఱ్ఱాప్రగ్గడ తనరామాయణమును క్రీ. శ. ౧౩౨౫—౧౩౩౫ మధ్యకాలమున రచియించి యుండెను. (యెఱ్ఱాప్రగడచరిత్రము చూడుఁడు.) భాస్కరరామాయణ మంతకుఁబూర్వమే రచితమైనది. ఎఱ్ఱనరామాయణము మొదటి దగుటచే రెండవదయిన యీ రామాయణమునకు భాస్కరరామాయణ

మని పేరువచ్చిన దని శ్రీయాచార్యులువారు సాధింపఁజూచిరి కాని, యందు సత్యము లేదు. అనవేమారెడ్డికాలములో నెఱ్ఱనరామాయణము పుట్టిన దనువారివాదము నంగీకరించినచో, భాస్కరరామాయణమే తప్పక మొదటి దగును. భాస్కరరామాయణ మనుపేరు కొంతకాలము గడచినపిమ్మట వచ్చియుండును. కవిపేరుతోఁ జేర్చి చెప్పినంతమాత్రమున నదివఱ కాపేరుగల గ్రంథ ముండితీరవలయునని నిశ్చయించుటయు, దానినిబట్టి వాని పౌర్వాపర్యములను నిర్ణయించుటయు న్యాయము కాదు. సులభముగా బోధపడుటకై కవిపేరుతోఁ జేర్చి లోకము వాడుచుండును. కొందఱు పండితులు భారతమును వ్యాసభారత మని వాడుటకలదు. ఎఱ్ఱాప్రగ్గడరామాయణ మిప్పుడు లభించెనేని లోకము దాని నెఱ్ఱాప్రగ్గడరామాయణ మనియే వాడును.

సాహిణిమారఁడు కొండపిడునుఁ బరిపాలించె ననుటకుఁ జారిత్రకాధారములు లేవు. ప్రతాపరుద్రుఁడు క్రీ. శ ౧౩౨౩లో బందీకృతుఁడయ్యెను. అటుపిమ్మట సాహిణిమారయ రాజయ్యెననియు, నాతని కాలములో రామాయణము పుట్టినదనియు నాచార్యులువారి యభిప్రాయము. అట్లయినచో, ౧౧౨౫—౧౩౩౦ ప్రాంతమున భాస్కరరామాయణము పుట్టియుండవలయును అనవేమారెడ్డిరాజ్యకాలములో ఎఱ్ఱనరామాయణము పుట్టిన దన్నవాదమునను సరించినచో నది క్రీ. శ. ౧౩౭౦ ప్రాంత మగును. అది సత్యమునకు విరుద్ధము. ఎఱ్ఱనరామాయణము క్రీ. శ. ౧౩౨౫—౧౩౩౫నడుమ జన్మించినది. ఎఱ్ఱనరామాయణముకంటె భాస్కరరామాయణమే వయసునఁ గొంచెము పెద్దది. సాహిణిమారయ క్రీ. శ. ౧౩౧౧కు పూర్వమే చనిపోయినట్లు శాసనాధారము లున్నవి. ఈ విషయమునుగూర్చి హుళక్కిభాస్కరుని చారిత్రమున వ్రాసెదను. ఎఱ్ఱనరామాయణము మొదటిదని నిశ్చయించుటకై ప్రతాపరుద్రునికిఁ దరువాత హుళక్కిభాస్కరుఁడు ముసలివాఁడుగా నున్నప్పుడు యుద్ధకాండమును రచియించెనని శ్రీయాచార్యులువారు వ్రాసిరి గాని యవి యాధారరహితములైన యూహలు.

శ్రీ యాచార్యులవారు, వెంకటజీదారవారు వ్రాసినపుస్తకములో నున్నదను కారణమున నంతవరకు సత్య మున్నదియు విమర్శింపకుండ "ఓరుగల్లునందొక దేవాలయములోఁ గూర్చుండి యీమహాకవి (తిక్కనసోమయాజి) యీ గ్రంథమును (మహాభారతమును) వ్రాసినట్లు" భారతములోని "అపూర్వాని యీ దృశంబులగు పుణ్యబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్కయారాధనవిశేషం బగుటం జేసి" అనువచనమువలన స్పష్టమగుచున్నది. కావున మొదటి ప్రతాపరుద్రుని కాలమున భారతము తెనిగింపఁబడిన దనియుఁ దిక్కన పండ్రెండవశతాబ్దము వాఁ డనియుఁ దలంపవలసియున్నది. ఇఁకఁ దిక్కనతండ్రి పండ్రెండవశతాబ్దమధ్యమున నుండె ననియు నతనితండ్రియగు మంత్రిభాస్కరుఁడు పండ్రెండవశతాబ్దారంభమును పదునొకండవ శతాబ్దాంతమునను జీవించెననియు నూహింపవలసియున్నది." అని వ్రాసి యీ వాక్యములపై నాధారము చేసికొని రామాయణకర్త హుళక్కిభాస్కరుఁ డని నిర్ణయించినారు. కాని యీ వాక్యములలోని యంశములు సత్యములని చరిత్రకారు లంగీకరింపరు. చరిత్రకు విరుద్ధములుగానున్న యీ యంశములనుగూర్చి విశేషచర్చ చేయుట, అనగత్యము. ఇట్టి యంశములమీఁద నాధారపడిన శ్రీ యాచార్యులవారి యూహలును యుక్తులును వాస్తవమునుఁ దెలిసికొనుటకుఁ దోడుపడవు.

భాస్కరోదంతము :

కవిజీవితకారులగు శ్రీ గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారును, ఆంధ్రకవులచరిత్ర ప్రథమముద్రణమున శ్రీ వీరేశలింగము పంతులుగారును, మంత్రిభాస్కరుఁడు రామాయణమునఁ గొంత భాగమును రచియించియుండె నని యభిప్రాయపడియున్నారు. అందుపైని శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు భాస్కరోదంతమను ౭౮ పేజీలగ్రంథమున నీవిషయమును విమర్శించి భాస్కరరామాయణముతో మంత్రిభాస్కరునకు సంబంధము లేదనియు హుళక్కిభాస్కరుఁడే రామాయణగ్రంథకర్తయనియు నిరూపించియున్నారు. దానినిబట్టి

కాఁబోలు శ్రీ వీరేశలింగముపంతులుగారు తమ యభిప్రాయమును మార్చుకొని కవులచరిత్ర రెండవముద్రణమున రామాయణకర్త హుళక్కి భాస్కరుఁడని వ్రాసియున్నారు.

భాస్కరోదంతము క్రీ. శ. ౧౮౯౭వ సంవత్సరమున ననఁగా దాదాపు యేఁబదిసంవత్సరములక్రిందట ముద్రితమైనది. పంతులుగారి కవులచరిత్రము రెండవముద్రణమును, భాస్కరోదంతమును, జదివిన పిమ్మటఁగూడ నాయభిప్రాయము మారలేదు. మంత్రిభాస్కరుఁడు రామాయణములోఁ గొంతభాగమును రచించియుండెననియే నా నిశ్చితాభిప్రాయము. భాస్కరోదంతమునందలివిషయములు కొన్ని సత్యమునకు విరుద్ధముగా నున్నవి. ఎఱ్ఱాప్రగ్గడరచించిన రామాయణకృతిభర్త అనవేమారెడ్డియని భాస్కరోదంతము తెలుపుచున్నది. అది వాస్తవముకాదు. ఆ రామాయణకృతిభర్త ప్రోలయవేమారెడ్డి కాని యనవేమారెడ్డి కాఁడు. మంత్రిభాస్కరునియొక్కయుఁ దిక్కనసోమయాజి యొక్కయు కాలమును భాస్కరోదంతము సరిగా నిర్ణయింపలేదు. ఇట్టివాని కన్నిటికిని వివరముగాఁ బ్రత్యుత్తర మీయవలసి వచ్చినచో నది యొకపెద్దగ్రంథ మగునుగావున నావనికిఁ బూనుకొనలేదు. శ్రీ పంతులుగారును, శాస్త్రిలుగారును చెప్పినయుక్తులకుఁ బైన వ్రాసినపంక్తులలోఁ గొంతవఱకు సమాధానము లున్నవి. మిగిలిన వానికి సమాధానములు మల్లికార్జునభట్టు, కుమారరుద్రదేవుఁడు, హుళక్కిభాస్కరుడు, అయ్యలార్యుఁడు ననువారిచరిత్రములయందు వ్రాయఁబ్రయత్నించెదను. ఇంతకంటె భాస్కరోదంతము నందలి ప్రతియుక్తికిని వాదమునకును సమాధానమీయవలసిన యావశ్యకత నాకుఁ గన్పట్టలేదు.

మంత్రిభాస్కరుని కాలము:

మంత్రిభాస్కరుఁడు పన్నెండవశతాబ్ది నాల్గవపాదమునను, పదమూఁడవశతాబ్ది ప్రథమపాదమునందు నున్నాఁడని చెప్పవచ్చును. ఇతని నివాసము గుంటూరు అని తిక్కనయే చెప్పియున్నాఁడు. ఇతని వంశవృత్తమును దిక్కనసోమయాజిచారిత్రమున నిచ్చుచున్నాఁడను.

ఇతఁడు పండ్రెండవశతాబ్దారంభమున నున్నవాఁడని భాస్కరరామాయణ టీకాకారులు వ్రాసిరి, కాని యది సరికాదు. ఇతఁడు గుంటూరునకుఁ గరణ మని కొందఱనుచున్నారు. ఆకాలపు గ్రామకరణములు ప్రభువునకు మంత్రులుగను దండనాయకులుగను కూడ నుండెడివారని యనేకదృష్టాంతము లున్నవి. భాస్కరుఁడు మంత్రియుఁ గవియు దండనాయకుఁడునై యుండినట్లు నిశ్చయింపవలసియున్నది.

ఈ విషయముల నన్నిటిని బరికించి చూడఁగా మంత్రిభాస్కరుఁడు రచింపఁగా మిగిలినభాగమును రచియించియు, రచియించిన భాగమును విపులీకరించియు సంపూర్ణరామాయణమును లోకమున కీయవలయునని సంకల్పించుకొని హుళక్కిభాస్కరుఁడును మల్లికార్జునభట్టును గుమారరుద్రదేవుఁడును బనిచేసిరని యూహింపనగుచున్నది.

భాస్కరరామాయణ పరిశోధనము:

మొత్తముమీఁద భాస్కరరామాయణమునుగూర్చి పరిశోధన మింకను నెక్కువగా జరుగవలసియున్నది. భాస్కరరామాయణ తాళపత్రప్రతులు గ్రామములలో విశేషముగాఁ గలవు. ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమునందే దాదాపుగ నేఁబదిప్రతులు లున్నవి. సాధ్యమయినన్నిప్రతులను సంపాదించి పరిశోధించినచోఁ బ్రస్తుతమునఁ జరిత్రకారులకుఁ బండితులకుఁ గలవరపెట్టుచున్నయనేకాంశములకు సమాధానములు లభింపఁగలవని నా యాశ. నే నారంభించిన గ్రంథసమాప్తికై పాటుపడుచుండుటచే నేనాకార్యమునకిప్పుడు పూనుకొనలేక పోయితిని. ఆ కార్యభారమును వహింపవలసినవారు చారిత్రాసక్తులగు ధనాధికులును బండితులునై యున్నారు. భగవదనుగ్రహముండెనేని యా పరిశోధనాభాగ్యము నాకుఁగూడ లభింపవచ్చును. కాలక్రమమున నా పరిశోధనము జరిగి సత్యము బయలుపడుననియు నందు మంత్రిభాస్కరునకు న్యాయము లభించుననియుఁ దలంచుచు నీతనిచారిత్రమును ముగించుచున్నాఁడను.

పైనఁ జేసినచర్చనుబట్టి అయోధ్యారణ్య కాండములయందు మంత్రిభాస్కరునికవిత్వ మేదియో తెలిసినది. కావున నాతనిశైలి

తెలియుటకై కాండమునకు నాల్గువంతున నెనిమిది పద్యముల నీ క్రింద నిచ్చుచున్నాఁడను.

అయోధ్యాకాండము :

ఉ. బంధులు మంత్రులున్ భరతుఁ బట్టరు రాముఁడు పెద్దవాఁడు స
ద్బంధురదోర్బలుండు గుణభాసియు నా సుతుఁ డుండ నానుతున్
సింధుపరీతధాత్రి కభిషిక్తునిఁ జేయుమె భూవిభుం డసం
బంధము గానఁ దీనికి నుపాయ మెఱింగినఁ జెప్పుమంథరా! ౬౨

శా. స్వచ్ఛందస్థితిఁ గీర్తి దిక్తటములన్ వర్తింప నేకాతప ౨౩౪
త్రచ్ఛాయంబుగ భూమి యేల రఘురత్నం బున్నచో ధర్మముం
బ్రచ్ఛాదించి విభుండు గూర్చు నని నిర్బంధించి యిబ్భంగిఁ దు
చ్ఛేచ్ఛం గైక వరంబు వేఁడె విధితో నెవ్వాఁడు నేర్చుం గటా!

చ. తరణికులప్రధానబిరుదధ్వజపంక్తులఁ జూచి సేనతో
భరతుఁడు దాడివెట్టి తముఁ బట్టఁగ వచ్చుటఁ గాఁ దలంచి ని
ష్ఠురగతి లక్ష్మణుండు ఘనచుంబిమహీరుహశాఖనుండి యా
గ్గిరి యగలంగ డిగ్గ నుఱికెం గులిశాతతపాతమో యనఁగ. ౩౮౧

శా. అస్మత్కార్ముకముక్తబాణవిసరం బాభీలదంభోళిసం
ఘస్మేరాగ్రము గాఁగ యుష్మదభిషేకప్రాతికూల్యంబు దా
నస్మార్యం బటుగాక తక్కిన నయోధ్యాపట్టణం బంతయున్
భస్మీభూతము సేసి పుచ్చెద మహీపాలాన్వయగ్రామణీ. ౧౪౧

అరణ్యకాండము :

మ. ధరణీపుత్త్రిఁ బ్రమోదపూరభరితాత్మం జేసి నానావిధా
ధ్వరసంగున్ శరభంగుఁ జూచుటకు జిత్తం బుత్సవం బొంద భా
స్కరవంశాగ్రణి యేఁగి కాంచె నచటన్ జంభారి రంభాది ని
ర్జరనారీకరచామరోద్భవమరుత్సంచారలోలాలకున్. ౧౪౨

మ. ఖరదైత్యాధిపుఁ డేయుబాణచయముల్ కౌకుత్స్థుబాణౌఘముల్
సరినాకాశము నిండి తాఁకుడలలం జండాగ్నికీలాసము
త్కర ముగ్రంబుగఁ జేయఁ దద్గతఘనధ్వానంబు బ్రహ్మాండక
ర్పరముం దాఁకి తెరల్చి రాల్చె నురుతారామౌక్తికశ్రేణులన్.

చ. అఱుగునె యుక్కుగుండు గడు సంగడ మ్రింగినసూఁచిచూచినన్
విఱుగునె మేరుభూధరము వెంగలివై రఘురాముభామినిం
జెఱగొని పోవఁ జూచెదవు చెచ్చెర నిప్పుడ యోరి సీచ నా
కఱపినబుద్ధిఁ గైకొనుము కాచెద జానకి డింపు మిమ్మహిన్. ౧-౨౧

మ. శిరముం గంఠము లేక వక్షమునఁ బ్రస్ఫీతాంబకంబున్ నిజో
దర దేశంబున వక్త్రముం గలుగునద్దైత్యాఘమున్ శత్రుభీ
కరసారోగ్ర సుదగ్రవిగ్రహరయుద్గర్వగ్రహగ్రస్తు నా
ద్ధురమోహాంధుని గ్రౌర్యబంధునిఁ గబంధుం గాంచిరా రాఘవుల్.

19. కేతనప్రగ్గడ

పెదపాటిజగ్గన, తన ప్రబంధరత్నాకరమునందు భాస్కరుని కేతన కాదంబరిలోని వని యీ క్రింది రెండుపద్యముల నుదాహరించి యున్నాఁడు.

సీ. దీనిలోపలఁ గొన్ని దినము లుండిన నుష్ణ
కరుఁ డైన నట శీతకరుఁడు గాఁడె
దీనిపెంపెఱిగిన (లోతెఱిఁగిన) దా నంబురాశిలోఁ
గా దని జలశాయి కాఁపు రాఁడె
దీనితియ్యనినీరు దివిజులు ద్రాగి చూ
చినఁ దమయమృతంబు చేఁదు నారె
దీనితోయము తలపై నల్కినంతనె (తోయమ్ములఁ దీర్థమాడినంత)
పాపాత్ములును మోక్షపరులు గారె (పదవిఁ గనరె)
యనుచుఁ గొలనినీటియతిశీలత్వంబు
బఱపుఁ బెంపుఁ దీపుఁ బావనతయుఁ
గనమునఁ బెంపఁగా నాజి బడివాగె
(మనుజనాయకుండు గొనియాడి పడివాగె)

త్రాటఁ దిగిచికొనుచుఁ దఱియఁ జొచ్చె.
(త్రాట హయముఁ దిగిచి తఱియఁజొచ్చె.)

శా. గంధర్వాత్మజ రాజుఁ జూచెఁ బతియుం గాదంబరిం జూచెఁ ద
ర్పాంధీభూతమనస్కుఁడై మరుఁడు విల్లందెక్ప్రసూనోల్లస
ద్గంధం బొప్పఁగ నెక్కువెట్టి గుణనాదం బాని పుష్పాస్త్రముల్
సంధించెన్ దెగఁబాపి యేయఁదొడఁగెన్ సవ్యాపసవ్యంబుగన్.

కస్తూరిరంగకవి తనరంగరాట్ఛందమునందుఁ గేతన కాదంబరి లోని వని ప్రాదియతికి లక్ష్యముగా నొకగీతపద్యమును, నభేదయతికి లక్ష్యముగా నొకశార్దూలవృత్తపాదము నిచ్చియున్నాఁడు. అవి యివి:

గీ. జనవరేణ్యుఁ గాంచి సాష్టాంగ మెఱఁగిన
నావిభుండు వాని లేవనెత్తి
కౌఁగిలించి వానిఁ గనుఁగొని కేయూర
కాభిధానమునఁ గెఁ గౌతుకమున.

శా. డా చే యంకతలంబుఁ జేర్చి వలచేతన్ మాలికన్ దాల్చి.

"బాణోచ్ఛిష్టంజగత్త్రయ"మ్మని కీర్తిఁ గాంచినబాణభట్టమహాకవి సంస్కృతమున "కాదంబరి"యనుమహాకావ్యమును రచియించి యుండెను. దాని నీతఁ డాంధ్రమునఁ బద్యకావ్యముగా రచియించె నని తలంపవలసియున్నది. కేతననామధారులు కవులు మూలఘటిక కేతన, నండూరి కేతన మొదలుగాఁ గొంద ఱున్నారు. కాని వారెవ్వరును భాస్కరునితనయులు కారు.

తిక్కనసోమయాజివంశములోఁ దిక్కనకుఁబూర్వులు భాస్కరుని కేతన లిరువురున్నారు. వారిరువురును తాతయు మనుమఁడును. దశకుమారచరిత్రమున, వీరిరువురిలోఁ దాతయైన కేతనను గవి యని చెప్పియున్నాఁడు. కావున నా కేతనయే కాదంబరికర్తయని నిశ్చయింప వలసి యున్నది. దశకుమారచరిత్రమున నీ కేతనను వర్ణించిన పద్యముల నీక్రింద నిచ్చుచున్నాఁడను.

ఉ. దీపిధి భాస్కరార్యునకు ధీరగుణాన్విత కొమ్మమాంబకున్
మానవకోటిలోపల సమస్తగుణంబుల వాఁడు పెద్ద నా
వానికి వాఁడు పెద్దయన వానికి వానికి వాఁడు పెద్ద నా
వానికి వారలిద్దఱకు వాఁ డధికుం డనఁ బుట్టి రాత్మజుల్.

సీ. వివిధవిద్యాకేళి భవనభావంబున
జలజజుముఖచతుష్టయముఁ బోలి
విబుధవిప్రతిపత్తినిదళనక్రీడనై
జలశాయిభుజచతుష్టయముఁ బోలి
ధర్మమార్గక్రియాధుర్యకత్వంబున
సన్నుతామ్నాయచతుష్టయముఁ బోలి
పృథుతరప్రథితగాంభీర్యగుణంబున
శంబరాకరచతుష్టయముఁ బోలి
సుతచతుష్టయంబు నుతికెక్కె గుణనిధి
కేతనయును బారిజాతనిభుఁడు
మల్లనయును మంత్రిమణి సిద్ధనయు రూప
కుసుమమార్గణుండు కొమ్మనయును.

వ. అందగ్రనందనుండు.

చ. కవితకు ముఖ్యుఁ డీతఁ డనఁ గామితవస్తువు లిచ్చువాఁడు నా
నవరసభావకుం డితఁ డనన్ బురుషార్థపరాయణుండు నా
నవు నన రాజనీతివిషయజ్ఞుఁ డితం డనఁ గీర్తిచంద్రికా
ధవళితదిక్కుఁడై నెగడె ధన్యుఁడు కేతనమంత్రి యిమ్మహిన్.

ఇందు మొదటిపద్యములోఁ జెప్పఁబడినభాస్కరుఁడే భాస్కరరామాయణకర్త యని యూహింపఁబడినయాతఁడు. అతనిచారిత్రము నింతకుముందు వ్రాసియుంటిని. అతనికుమారులు నలుగురిలో పెద్దవాఁడైన కేతనయే కాదంబరీకర్త యని చెప్పబడిన యీ కవి మూఁడవకుమారుఁడైన సిద్ధన, చోడతిక్కరాజునకు మంత్రి. ఈతనినిగూర్చి

తిక్కనసోమయాజిచరిత్రము వ్రాయుచున్నాఁడను. నాల్గవకుమారుఁడైన కొమ్మన తిక్కనసోమయాజితండ్రి.

కాదంబరీ కృతికర్త యైన కేతనకుమారుఁడు భాస్కరుఁడు. ఈభాస్కరున కిరువురు కుమారులు. అందు పెద్దవాఁడు కేతన. ఇతనినే మనుమఁడు కేతన యని పైన వ్రాసియుంటిని. ఇతఁడు కవి యైనట్లు దశకుమారచరిత్రకర్త యైన మూలఘటిక కేతనకవి చెప్పియుండలేదు. ఈవిషయములను దెలుపుపద్యములను గూడ నీక్రింద వ్రాయుచున్నాఁడను.

ఉ. మానిని బ్రహ్మమాంబకు నమాత్యశిఖామణి కేతశౌరికిన్
భానుతకీర్తి భాస్కరుఁడు పుణ్యచరిత్రుఁడు మంత్రిగుండఁడున్
ధీనిధి నల్లసిద్ధియు నతిస్థిరచిత్తులు ధర్మతత్పరుల్
మానవనాథపూజ్యులు క్రమంబునఁ బుట్టిరి కీర్తనీయులై

వ. అం దగ్రజుండు

క. నీతిసురాచార్యుం డన
దాతృతఁ గొనియాఁ డనఁ బ్రతాపంబునఁ బ్ర
ద్యోతనుఁ డన సచివాగ్రణి
కేతయభాస్కరుఁడు జగతిఁ గీర్తన కెక్కెన్

చ. గొనములప్రోఁక భాస్కరుననకున్ బతిదేవత మారమాంబకున్
దినకరతేజులై తుహినదీధితిసన్నిభకాంతిమంతులై
వనధిగభీరులై సుజనవందితులై జనియించి రొప్పుగా
మనుచరితుండు కేతనయు మారసమానుఁడు మారశౌరియున్

క. శౌచంబున గంగాత్మజుఁ
డాచారంబున మరీచి యర్థుల కీగిన్
ఖేచరవల్లభుఁ డనఁగాఁ
బాచయకేతుండు కీర్తిపాత్రం బయ్యెన్.

తాత యైన కేతనను కవి యని చెప్పియుండుటచేతను, మనుమని కవిగా వర్ణింపకపోవుట చేతను, తాతకేతనయే కాదంబరీకర్త యని

నిశ్చయింపఁ దగియున్నది. చోడతిక్కరాజు కాలము క్రీ. శ. ౧౧౧౦-౧౧౬౦ అయియున్నది. అతనియొద్ద మంత్రిగనున్న సిద్ధన, యీ కేతన ప్రెగ్గడకుఁ దమ్ముఁడు. కావున నీ కేతన ప్రెగ్గడయు నా కాలమునం దున్నవాఁ డని నిశ్చయింపవచ్చును. అనఁగా క్రీస్తుశకము పదుమూఁడవ శతాబ్ధిప్రథమార్థమున నున్నవాఁ డనియర్థము.

ప్రబంధరత్నాకరమునందు కేతన విజయేశ్వరచరిత్రములోని దని యీ క్రిందిపద్య ముదాహృతమయినది.

ఉ. కోట తనర్పుచూడ్కుల కగోచర మయ్యును దేవుఁబోలెఁ బ
ల్మాటున నేఁగుచోఁట దగులం బడునే రవిమండలంబు నీ
పాటిదయన్ తలంపునకుఁ బట్టగుచున్నది గాక దీనికిం
జాటి యనంగ నుజ్జనగఁ బట్టినె యయ్యొకయాస్త్రశైలముల్.

ఈ కేతన, యెవ్వరో తెలిసికొనుటకుఁ దగినయాధారములు దొరకలేదు. మూలఘటికకేతన కాఁడు. నందూరికేతన యైన నై యుండవచ్చును. లేదా మఱియెవ్వరైనఁ గావచ్చును.

ఆంధ్రపద్యకాదంబరి యిప్పు డెచ్చటను గాన్పించుట లేదు. ఉదాహృతపద్యములనుబట్టి యీ ప్రబంధమందలి శైలి ప్రౌఢముగను, రసవంతముగను మనోహరముగను నుండునట్లు తోఁచుచున్నది. ఇట్టి యుత్తమప్రబంధము నామమాత్రావశేష మగుట యాంధ్రుల దురదృష్టము. ఆఱువందలసంవత్సరములకుఁ బూర్వము రచింపఁబడిన యీ గ్రంథ మెంతయో యదృష్టముండినఁగాని బయటపడు ననునాశ లేదు.

20. తిక్కనసోమయాజి

ఈకవిబ్రహ్మ, ఈయుభయకవిమిత్రుఁడు, ఈపండితశిరోమణి, ఈకవిపండితపోషకుఁడు, ఈయధరీకృతకల్పభూరుహుఁడు, ఈనిరతాగ్నిహోత్రి, ఈరాజనీతిచాణక్యుఁడు, ఈ మహాభారతనిర్మాత, ఈ మహాసౌందర్యరాశి ఆఱువేలనియోగిబ్రాహ్మణకుటుంబమునఁ గౌతమ గోత్రమునఁ గొమ్మనదండనాథునకును, వన్నమాంబకును నొకశుభ ముహూర్తమున జనన మందెను. ఈతనికి మంత్రిభాస్కరుఁడు పితామహుఁడు; కొమ్మమాంబ పితామహి. ఈతని వంశవృక్షము నిందు నిచ్చుచున్నాఁడను.

ఇతని పూర్వుల ప్రశంస:

మూలఘటిక కేతనకవికృతమగు దశకుమారచరిత్రమునందలి పద్యము లీవంశవృక్షమున కాధారములు. ఈ వంశమిప్పటికిని దామర తంపరయై యభివృద్ధి నందుచున్నదని తెలియుచున్నది.

ఒకానొక శాసనమున (A. R. నెం. 290 ఆ. 1932-33) మావెన యను నాతఁడు వస్తువులపైఁ బన్నును రాబట్టెడియధికారిగా నుండి యాపన్నును గుంటూరుమండలమందలి సత్తెనపల్లితాలూకా మావెందల (మాడాల)లో నున్నసకలేశ్వరదేవునకు దీపముకొఱకై శా. శ. ౧౦౫౧వ సంవత్సరమున ధారవోసినట్లు వ్రాసియున్నది. ఆమావెన పై వంశవృక్షమందలి మూలపురుషుఁ డేమో పరిశోధింపవలసి యున్నది. కాల మందుల కడ్డమురాదు. తిక్కనవంశకర్తయైన మావెనను మూలఘటిక కేతనకవి తనదశకుమారచరిత్రమున నిట్లు వర్ణించి యున్నాఁడు.

క. ఆగౌతమగోత్రమునన్
   ద్యాగవ్రతశీలుఁ డమలినాచారుఁడు నా
   నాగుణమండితయశుఁ
   డాగమకోవిదుఁడు మావెనార్యుఁడు పుట్టెన్.

పైనఁ జెప్పినశాసనమిది. "శకవర్షంబులు ౧౦౫౧గు సుక్రశాహి సంక్రవెగ్గడ మావెన శ్రీ సకలేశ్వరదేవర కఖండవర్తి దీపంబునకు మావుందల

తిక్కనసోమయాజివంశవృక్షము :

- మావెన
  - గుండశౌరి
    - కేతన=భార్య నాచమ్మ
      - గుండన
      - భాస్కరమంత్రి=భార్య కొమ్మమాంబ
        - కేతనప్రెగ్గడ=భార్య బ్రహ్మమ్మ.
          - భాస్కరుఁడు=భార్య మారమాంబ.
            - కేతన
            - మారన
          - గుండన=భార్య భూమిదేవి
            - మల్లన
            - కొమ్మన
            - సిద్ధన్న
            - కేతన్న
          - మల్లసిద్ధి=భార్య అన్నమ్మ.
            - కేతన
            - మల్లన=భార్య కూచమ్మ.
              - మనుమసిద్ధి
        - మల్లన
        - సిద్ధన=భార్య ప్రోలాంబ. (ఇతఁడు తిక్కరాజునకు మంత్రి)
        - కొమ్మన=భార్య అన్నమాంబ
          - తిక్కనసోమయాజి (భారత గ్రంథకర్త)
      - మహేశ్వరుఁడు

సిద్ధన=భార్య ప్రోలాంబ (ఇతఁడు తిక్కరాజునకు మంత్రి)

తిక్కన	భాస్కరుఁడు	కేతన	మల్లన	మల్లన	చినభాస్కరుఁడు	పెమ్మన

తిక్కన (భార్య జానమాంబ) గంధవారణ బిరుదు. ఇతనినే ఖడ్గతిక్కన యందురు.

సిద్ధన	కొమ్మన	ఇమ్మడిమనుమసిద్ధి	ముమ్మడిమనుమసిద్ధి

కోటిపిసా మాచంద్రార్కముగా నిచ్చె" (ఈ శాసనము ప్రతిని నేనడుగగనే వ్రాసిపంపినందులకు ఉదకమండలమునందున్న దొరతనము వారి ఎపిగ్రాఫిస్టుగారి కెంతయుఁ గృతజ్ఞుఁడను).

ఈ మానవమనుమఁడైన కేతన కమ్మనాఁటిని బాలించిన త్రిభువనమల్లదేవచోడుని మంత్రియనియు నా కేతనమనుమలైన కేతన మల్లన లీ కమ్మనాఁటిచోడులకు మంత్రులుగా నుండిరనియుఁ దెలియు చున్నదని. బ్ర. శ్రీ. చిలుకూరి వీరభద్రరావుగారు (ఆంధ్రులచరిత్ర ౪౭–౯౦ పుటలు) వ్రాసియున్నారు. కాని యందు సత్యము లేదు. ఈ త్రిభువనమల్లదేవచోడుఁడు క్రీ. శ. ౧౧౫౦ ప్రాంతము వాఁడు. ఆతని పేరున శాసనము లనేకములున్నవి. ఆతనికడ మంత్రులుగానున్న వారు కాశ్యపగోత్రులు. అందు కేతన శివజ్యేష్ఠునికొడుకు. కేతన, మల్లనలు అమాత్యసిద్ధదోనమాంబల తనయులు (ద. హిం. శా. సం. ౯సంఖ్య ౧౩౭; ౯౪౩) తిక్కనసోమయాజివంశీయులకును వారికిని నేమియు సంబంధము లేదు.

పైవంశవృక్షమునఁ దిక్కనసోమయాజికిఁ బితామహుఁడుగాఁ గన్పట్టుచున్న భాస్కరమంత్రియే భాస్కరరామాయణకర్త యని యూహింపఁబడుచున్నయాతఁడు. ఆతనిచారిత్రము నీ గ్రంథమున వేఱుగ వ్రాసియున్నాఁడను. ఆభాస్కరమంత్రి పెద్దకుమారుఁడును, దిక్కనసోమయాజికిఁ బెదతండ్రియునగు కేతనప్రగ్గడయే ఆంధ్రపద్య కాదంబరీ కావ్యకర్త యని తలంచుచున్నారు. ఆ కవిచారిత్రమును గూడ నిందు వేఱుగ వ్రాసియుంటిని.

తిక్కనకు వేఱొక పెదతండ్రియగు సిద్ధనయు నాతనికుమారుఁడైన తిక్కన (ఖడ్గతిక్కన)యుఁ జోడతిక్కరాజునకడ మంత్రులై సేనాధిపతులై పరాక్రమవంతులై యనేక రణములలోఁ బాల్గొని శాశ్వతకీర్తిని గడించియున్నారు. చోడతిక్కరాజెవ్వరో తెలిసినఁగాని వారినిగూర్చి చెప్పిన ప్రయోజనము లేదు. కావున వారివృత్తాంతమునుఁ దరువాత వ్రాసెదను.

ఈ ఖడ్గతిక్కనకు సోదరులైన కేతన, మల్లన, భాస్కరులు పరాక్రమవంతులును శూరులు నైనట్లీ క్రిందిపద్యములలోఁ గేతనకవి దశకుమారచరిత్రమునఁ జెప్పియున్నాఁడు.

ఉ. ఆతనినీతిసంపద విహంగమపుంగవకేతుఁ జెప్పుచోఁ
గేతనఁ జెప్పి యుద్ధవిజిగీష వానరకేతుఁ జెప్పుచోఁ
గేతనఁ జెప్పి దిగ్విదితకీర్తిరతున్ వృషకేతుఁ జెప్పుచోఁ
గేతనఁ జెప్పి కాక ధరఁ గేవలమర్త్యులఁ జెప్పఁజాలునే.

శా. పారావారపరీతధాత్రి వినుతింపం బోలుమల్లాంకునిన్
సారోదారయశోభిరాము బహుశాస్త్రప్రౌఢు శస్త్రాస్త్రవి
ద్యారాజత్పటుబాహువిక్రము నుదాత్తస్వాంతు ధర్మక్రియా
బారప్రాప్తసమస్తదోషశమనున్ జొహత్తనారాయణున్.

చ. ఉరవడి నుగ్రసేవణపయోనిధి బాడబవహ్ని చాడ్పునన్
దరికొని కుంభజన్ముక్రియఁ ద్రాగి రఘుక్షితినాథుమాడ్కి న
చ్చెరువుగ నింకఁజేసె నని చెప్పఁ జనప్రకరంబు విక్రమా
చరణుని సిద్ధనార్యసుతు బాచని సన్నుతగంధవారణున్.

ఈ పద్యమునఁ జెప్పినసేవణరాజు లనఁగా దేవగిరి రాజధానిగా రాజ్యమేలిన యాదవరాజు లని చరిత్రకారులు నిర్ణయించియున్నారు. ఈ సేవణరాజులనుఁ జోడతిక్కరాజు జయించినట్లు దశకుమారచరిత్రము నందుఁ దిక్కరాజును వర్ణించుసందర్భమునఁ గేతనకవి రచించిన "సేవణ కటక సామంతులగర్వ మడఁచె" ననుపద్యపాదమువలనఁ దెలియు చున్నది. పైచంపకమాలలోని భాస్కరుఁడు మంత్రిభాస్కరునకుఁ బౌత్రుఁడు. తిక్కనసోమయాజికిఁ బెదతండ్రికుమారుఁడు. ఇతఁడుఁ గూడ తండ్రివలెను, సోదరుఁడగు ఖడ్గతిక్కనవలెనుఁ జోడతిక్కరాజుకడఁ సేనాధిపతిగా నుండి సేవణరాజులతోఁ నాతనికి జరిగినయుద్ధములలోఁ బాల్గొని జయముఁ గల్గించియుండును.

తిక్కనసోమయాజితండ్రియైన కొమ్మనామాత్యునిఁ దల్లియైన యన్నమాంబను, దశకుమారచరిత్రమునఁ గేతనకవి యీ క్రింది పద్యములలో వర్ణించియున్నాఁడు.

సీ. స్వారాజ్యపూజ్యుఁడో కౌరవాధీశుఁడో
నాఁగ భోగమున మానమున నెగడె
రతినాథుఁడో దినరాజతనూజుఁడో
నాఁగ రూపమున దానమున నెగడె
ధరణీధరేంద్రుఁడో ధర్మసంజాతుఁడో
యనఁగ ధైర్యమున సత్యమున నెగడె
గంగాత్మజన్ముఁడో గాండీవధన్వుఁడో
యనఁగ శౌచమున శౌర్యమున నెగడె
సూర్యవంశభూపాలనుచిరరాజ్య
వనవసంతుండు బుధలోకవత్సలుండు
గౌతమాన్వయాంభోనిధి శీతకరుఁడు
కులనిధానంబు కొట్టరు కొమ్మశౌరి.

సీ. పతిభక్తి నలయరుంధతి పోలె నేనియు
సౌభాగ్యమహిమ నీ సతికి నెనయె
సౌభాగ్యమున రతి సరియయ్యె నేని
భాగ్యంబున నీయంబుజాక్షి కెనయె

భాగ్యంబునందు శ్రీప్రతి యయ్యె నేని యుఁ
దాలిమి నీ లతాతన్వి కేనయె
తాలిమి భూదేవి తగసాటియగు నేని,
నేర్పున నీపద్మనేత్ర కేనయె
యని యనేకవిధంబుల నఖిలజనులు
పొగడ నెగడెఁ గృపాపరిపూరితాంత
రంగ కొమ్మనామాత్యు నర్థాంగలక్ష్మి
యఖిలగుణగణాలంకృతి యన్నమాంబ.

తిక్కనసోమయాజి తనతండ్రి యగుకొమ్మనామాత్యుఁడు, దండనాథుఁ డనియు, గుంటూరివిభుఁ డనియు భారతమునఁ జెప్పియున్నాఁడు. గుంటూరివిభుఁ డనఁగా గుంటూరునకుఁ గరణ మనియుఁ దిక్కనసోమయాజికుమారుఁడు కూడ గ్రామకరణముగా నుండెను. కావున వీరు మొదటినుండియు గ్రామకరణములుగా నుండిరనియుఁ గొందఱియభిప్రాయము. సుప్రసిద్ధచరిత్రకారు లగు శ్రీ చి. వీరభద్రరావుపంతులుగారీయభిప్రాయము సరి కాదనిరి. కొమ్మన కరణ మైన నగుఁగాక. అయిన నాకాలమునాఁటికరణము లిప్పటివారివలె లెక్కలు వ్రాయువారుగా మాత్రమే యుండి పేరు ప్రతిష్ఠలు లేనివారుగా నుండెడివా రని తలంపరాదు. ఆకాలపుకరణములు, శాస్త్రజ్ఞానసంపన్నులై పరాక్రమవంతులై యాత్మగౌరవముకలవారై తమగ్రామసంరక్షణమునకుఁ గావలసినసైన్యము నుంచుకొని రాజునకు సర్వవిధముల సాహాయ్య మొనర్చుచు రాజుచే గౌరవము నందుచుండెడివారు. అందుచేతనే "విభు" "పరిపాలక" శబ్దములు, వారియందు వర్తించుచుండెను. తిక్కనసోమయాజితండ్రి గ్రామకరణ మని యంగీకరించినను, నంతమాత్రమున నాతనిని సామాన్యునిగాఁ దలంపరాదు. ఇతఁడు సాంగవేదవేది. దండాధిపతి. సూర్యవంశభూపాలసుచిరరాజ్యావనవనంతుఁడై గాండీవధన్వివలె శౌర్యమున నెగడియున్నాఁ డని కేతనకవి చెప్పియుండుటచే నీతని కేవల మొక వ్రాయసగాఁ డని తలంపరాదు. ఇతఁడుకూడ చోడరాజులకడ సేనాధిపతిగా నుండి నెల్లూరునందు జర

గినయొకమహారణములో వీరమరణము నందె ననియు, నావార్త గుంటూరునం దున్నయీతనిభార్య విని యించుకేనియు విచారము నందక తాను వీరపత్ని యైనందులకు సంతసించిభర్తతో సహగమనము గావించెననియుఁ జెప్పుదురు. భర్తమరణవార్త చెప్పవచ్చినవారి తోడను, స్నానసమయమునఁ దనను జూడవచ్చినవారితోడను దేహ మశాశ్వత మనియు, జీవితమునుఁ బరోపకారముగాఁ గడపుటయు, వీర మరణము నొందుటయు నుత్తమపురుషలక్షణము లనియు నట్టిభర్తతో సహగమన మొనరించుట నుత్తమసాధ్వీధర్మ మనియు హితోపదేశము గావించెనఁట. ఈ దంపతుల సుగుణములను దెలుపుకథలను బ్రజలు విశేషముగా నిప్పుడునుఁ జెప్పుకొనుచుందురఁట.

జగద్విఖ్యాతచారిత్రుఁడైన తిక్కనసోమయాజి కీపుణ్యదంపతులు తలిదండ్రులు. మొత్తముమీఁద నీకుటుంబమున మొదటినుండియుఁ బండితులునుఁ గవులును, శూరులును, దాతలు నుద్భవించి తమయశశ్చంద్రికల దిగంతముల వ్యాపింపఁ జేసియుండిరని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. ఈ కుటుంబమువారు, నెల్లూరు రాజధానిగా నాచుట్టుప్రక్కల నున్న దేశమును బరిపాలించినచోడరాజులకడ మంత్రులుగను సేనాధిపతులుగ నుండి పేరు వడసి రనిచెప్పుట కీవంశమునందలి పేరులు సాక్ష్య మిచ్చుచున్నవి. ఆ కాలమున మంత్రులు, సేనాధిపతులు మొదలగురాజకీయోద్యోగులు తమసంతానమునకుఁ దమప్రభువుల నామములనుంచి తమకృతజ్ఞతను వెల్లడించు నాచార ముండెడిది. తిక్కనరచించిన నిర్వచనోత్తర రామాయణమునుఁ గృతి నందిన ప్రభువు మనుమసిద్ధి. ఆతనితండ్రి తిక్కరాజు. ఆతనితండ్రి మనుమసిద్ధి. ఆతని పూర్వుఁడు నల్లసిద్ధి. ఈ పేరు లీ వంశవృక్షమునఁ గాన్పించుచున్నవి. మనచారిత్రకపురుషుఁడైన తిక్కనపేరు, మనుమసిద్ధితండ్రి యైనతిక్కరాజునుఁ బట్టియే వచ్చినదని తలపవచ్చును. కాళహస్తియందున్న తిరుకాళత్తిదేవుఁడే యాంధ్రమునఁ దిక్కన యైనాఁడు. చోడతిక్కరాజునుఁ దిరుకాళత్తిదేవచోడుఁ డని కూడ పిలచెదరు.

ఇట్టిసుప్రసిద్ధవంశమునఁ దిక్కనసోమయాజి జననమొంది మహాకవి యగుటయేగాక గొప్పరాజకీయవేత్తయై మహాదాతయై వేదవేదాంగసంపన్నుఁడై కర్మిష్ఠియై కవిపండితపోషకుఁడై కృతిపతియై శాశ్వతకీర్తిని గడించియున్నాఁడు.

కొట్టరువు కొమ్మనప్రగ్గడ కొడుకు మల్లనప్రగ్గడ యనునాతఁడు విశ్వేశ్వరశివదేశికుని (కాకతీయగణపతిదేవునకు రాజగురువు)యొద్ద ధాన్యాధిపతిగా నుండి శా. శ. ౧౨౦౮ చిత్రభాను సం॥ర ఆశ్వయుజ బహుళతృతీయనాఁడు విశ్వనాథదేవునకు దీపమునకై యేఁబదిగొఱ్ఱెల నిచ్చినట్లు గుంటూరుమండలములోని చందరగ్రామమున నొకశాసనమున్నది. (A. R. నెం. 98 రు. 1917) పై వంశవృక్షములోఁ గొమ్మన కొడుకు మల్లన కనుపడుట లేదు. కాని దానితుది కొమ్మలయందిరువురు కొమ్మనలున్నారు. వారిలో నెవరికైన మల్లన యుద్భవించినాఁడేమో! లేక యాతఁడు మఱియొకవంశములోనివాఁడో! శాసనములో నాతఁడు భారద్వాజగోత్రుఁ డని యున్నది. తిక్కనసోమయాజి గౌతమగోత్రుఁడు. శాసనములోని వ్రాఁత పొరబాటు కావలయును. లేదా కొట్టరువువారిలో రెండుగోత్రములవా రుండి యుండవలయును.

తిక్కనసోమయాజి తననుగూర్చి చెప్పినవిషయములు:

ఈ మహాకవి రచించినగ్రంథములయందుఁ దననుగూర్చి యేమి వ్రాసికొని యుండెనో చూతము.

ఇతడు నిర్వచనోత్తరరామాయణమును శ్రీమహాభారతమున విరాటపర్వ మాదిగాఁ దుదవఱకు బదునైదుపర్వములును నాంధ్రమునఁ బద్యకావ్యములుగా రచించి యుండెను. నిర్వచనోత్తరరామాయణమున నితఁడు తననుఁగూర్చి యీయొక్కపద్యమును మాత్రమే చెప్పికొని యున్నాఁడు.

మ. అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్.

ఈపద్యమునందుఁ దాను శివభక్తుఁడనైనట్లు చెప్పియున్నను వైష్ణవద్వేషమున్నవాఁడు గాఁడని నిర్వచనోత్తరరామాయణరచనను వలనను నందలి ప్రథమపద్యముననే "హరిహరపద్మగర్భులను" అని చెప్పియుండుటచేతను స్పష్టమగుచున్నది. మఱియు సంస్కృతాంధ్రకావ్యశిల్పమునందుఁ బారగుఁడననియుఁ గళావిదుఁడననియుఁ జెప్పుకొనియుండుటచే నదివఱకేవియో కొన్ని సంస్కృతాంధ్రగ్రంథములను రచియించియున్నట్లు పొడగట్టుచున్నది. కాని యీరామాయణభారతములు దక్క నింకనే గ్రంథములును నీతనిరచనములు మనకు లభ్యములగుట లేదు. తిక్కనసోమయాజికి దశకుమారచరిత్రమునుఁ గృతియిచ్చి కేతనకవి

క. అభినుతుఁడు మనుమభూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయకవిమిత్రనామము
త్రిభువనముల నెగడ మంత్రితిక్కఁడు దాల్చెన్.

అని చెప్పియుండుటచే నితఁడనేకసంస్కృతాంధ్రగ్రంథములను రచియించినట్లు తెలియుచున్నది. కేతనకవి చెప్పియుండకపోవుటచే నీ మహాకవిరచనముల పేరులనైనను తెలిసికొను నదృష్టము లేకపోయినది. ఆకాలము వారికి, తామదివఱకు రచించిన గ్రంథముల పేరులను గాని తమపూర్వులు రచించిన కావ్యముల పేరులు గాని చెప్పుకొను నాచారము లేదు. తిక్కనసోమయాజికూడ తనతాతనుఁ గూర్చి చెప్పునప్పుడు "సారకవితాభిరాము" అని చెప్పెనే గాని యాతఁడు రచించిన గ్రంథములనుఁ బేర్కొనలేదు.

సంగమవంశజుఁడైన కంపరాజుభార్య గంగాదేవి తనభర్త విజయములను వర్ణించుచు వ్రాసిన మధురావిజయమను సంస్కృతగ్రంథమునఁ దిక్కనసోమయాజిని సంస్కృతకవులలోఁ జేర్చి వర్ణించినది. కాని యందును నాతఁడు రచించినగ్రంథనామముల నీయలేదు.

ఈమహాకవి, భారతములోఁ గూడఁ దననుఁ గూర్చియుఁ దన పూర్వులనుఁ గూర్చియు నొక్కపద్యమే వ్రాసికొనినాఁడు.

సీ. మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్ర
          మహితుండు భాస్కరమంత్రితనయుఁ
     డన్నమాంబాపతి యనఘులు కేతన
          మల్లన సిద్ధనామాత్యవరుల
     కూరిమితమ్ముండు గుంటూరివిభుఁడు కొ
          మ్మనదండనాథుఁడు మధురకీర్తి
     విస్తులస్ఫారుఁ డాపస్తంబసూత్రప
          విత్రశీలుఁడు సాంగవేదవేది
తే. యర్థిఁ గల వచ్చి వాత్సల్య మతిశయిల్ల
     నస్మదీయప్రణామంబు లాదరించి
     తుష్టి దీవించి కరుణార్ద్రదృష్టిఁ జూచి
     యెలమి నిట్లని యానతి యిచ్చె నాకు.

తిక్కన, తనను గూర్చిగాని, తనపూర్వులను గూర్చిగాని యీ గ్రంథములయందు విశేషముగాఁ జెప్పుకొనకుండుట కాత్మశ్లాఘనమునం దిష్టము లేకపోవుటయో, పూర్వగ్రంథములయందు వర్ణించి యుండి మరలమరలఁ జెప్పుకొనుట రుచింపకయో యైయుండును. ఇప్పటివారివలెఁగాక యానాటిమహాకవులకు, స్వవిషయకథనమునం దిష్టముండెడిదికాదు. నన్నయభట్టు తండ్రిపేరైనను గృహనామము నైనను జెప్పుకొనలేదు.

ఇతనిగృహనామము: నివాసము :

తిక్కన తనగృహనామము నెచ్చటనుఁ జెప్పుకొనియుండ లేదు. కేతనకవి రచించినదశకుమారచరిత్రమువలన వీరియింటిపేరు కొట్టరువువా రని యెఱుంగనగుచున్నది. మొట్టమొదట వీరిగృహనామము గుంటూరు వారనియుఁ బిమ్మట కొట్టరువుగా మారె ననియునందురు. తిక్కన పూర్వులనివాసము గుంటూరుమండలమందలి పసుగుపాడనియుఁ గొన్ని తరములయినపిమ్మట గుంటూరునకువచ్చి యచ్చటనివాస మేర్పరచు కొనిరనియుఁ దిక్కనపితామహుని జీవితకాలమునందో, కాక యాతని తండ్రులకాలముననో నెల్లూరునకు వచ్చి యట నివాస మేర్పరచుకొని

రనియుఁ జెప్పుచున్నారు. తిక్కన నెల్లూరునివాసి యనుటనిర్వివాద విషయము. తండ్రిని గుంటూరువిభుఁ డనుటచేత తండ్రినివాసము గుంటూరనియే చెప్పనొప్పును.

కొన్నిశాసనములలో కోష్ఠాధిపతి యనుసంస్కృతశబ్దమునకుఁ దెలుఁగున కొట్టారువు అని వ్రాసియున్నారు. ఇట్లే భాండాగారాధిపతులకు భండారువు అనియుపయోగించియున్నారు. తిక్కనవంశీయులలోఁ బూర్వులే మహారాజునొద్దనో కోష్ఠాధిపతులై యుండిరనియు నాకాలపు తెలుఁగుభాషనుబట్టి వారిని కొట్టారువు లనివాడియుండిరనియు దాని ననుసరించి యీవంశీయులకు "కొట్టరువు" అను నింటిపేరువచ్చియుండు ననియు నూహింపఁదగియున్నది. ఈపే రెప్పుడువచ్చెనో చెప్పుట కాధారములు లేవు.

కొట్టరువు అనునొకగ్రామ ముండెననియు దానినిబట్టి వీరిగృహనామ మేర్పడెననియుఁ గొందఱనుచున్నారు. కాని యది సత్యము కాదు. కొట్టరువుగ్రామ మెచ్చట నుండెనో వారు చెప్పలేరు. గుంటూరు నెల్లూరు మండలములలో కొట్టరువు లేదు.

దశకుమారచరిత్రమందలి తిక్కనప్రశంస:

తిక్కనసోమయాజి, మూలఘటిక కేతనకవి రచించినదశకుమారచరిత్రమునుఁ గృతి నందెను. అందుఁ దిక్కననుగూర్చి యాకేతనకవి రచించినపద్యముల నిక్రింద నుదాహరించుచున్నాఁడను.

సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన
  వీఁ డనునాలుకకుఁ దొడవైనవాఁడు
 చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన
  వీఁ డనుశబ్దమున కర్థమైనవాఁడు
 దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిన
  వీఁ డనిచెప్పుటకుఁ బాత్రమైనవాఁడు
 సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన
  వీఁ డనిచూపుటకు గుఱియైనవాఁడు

మనుమసిద్ధిమహీశసమస్తరాజ్య
భాగ్యధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యుకూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి.

క. అగు ననఁ గొమ్మనయతిక్కఁడు
జగతి నపూర్వార్థశబ్దచారుకవిత మై
నెగడినబాణోచ్ఛిష్టం
జగత్త్రియం బనినపలుకు సఫలం బయ్యెన్.

క. కృతులు రచియింప సుకవుల
కృతులొప్పఁ గొనంగ నొరునికిం దీరు నె వా
క్పతినిభుఁడు వితరణశ్రీ
యుతుఁ డన్నమనుతుఁడు తిక్కఁ డొకనికిఁ దక్కన్.

సీ. సరసకవీంద్రులసత్ప్రబంధము లొప్పఁ
గొను ననుటధికకీర్తనకుఁ దెరువు
లలితనానాకావ్యములు చెప్ప నుభయభా
షలయందు ననుట ప్రశంసతోవ
యర్థి మైఁ బెక్కుశ్రోత్రియాగ్రహారంబులఁ
గా నిచ్చు ననుట భోగప్రవాహము
మహికదక్షిణలైనబహువిధయాగంబు
లొనరించు ననుట వర్ణనము దారి
పరుని కొక్కరి కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజము లై పెంపు సొంపార నెగడు నట్టి
కొమ్మనామాత్యుతిక్కన కొలఁది సచివు
లింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁ గలఁడు?

ఇతఁడు కేవలమంత్రియే గాక దండాధీశుఁడు గూడ నైనట్లు కేతన రచించినయీక్రిందిపద్యముల వలన స్పష్టపడుచున్నది.

క. శ్రీకరవరవచనవిభూ
తీకరణవినోదశుభచరిత్రుని సమరం
పాకరహృదయుఁ గుణాబ్ధిను
ధాకలశుభమూర్తిఁ దిక్కదండాధిపునిన్.

క. శ్రీవిలసన రమణీయా
భావితభవపాదపద్మభావంధానా
భూవినుతశుభచరిత్రా
ధీవిభవాత్మస్వరూప! తిక్కచమూపా!

కేతనకవి రచించిన యీపద్యములయందు దతిశయోక్తి గాని యుత్ప్రేక్ష గాని లేదని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నుఁడగు నీమహామహుఁడు తనవంశమున రాఁబోవువారల కైశ్వర్యమును సంపాదించి నిలువయుంచవలయు ననుకోరికకలవాఁడు కాఁడనుట కేతనికుమారుఁడొక చిన్నగ్రామమునకుఁ గరణమైనాఁ డనుటయే నిదర్శనము. ఇతఁడు తనశక్తినంతయును ప్రభుకార్యనిర్వహణము నందు వినియోగించి చోడరాజ్యస్థాపనాచార్యుఁ డయ్యెను. తనపాండిత్యమును లోకశ్రేయమునకును, ఆంధ్రసాహిత్యాభివృద్ధికి నుపయోగపరచి, యుద్గ్రంథరచనము గావించుటయేఁగాక యనేకకవులకుఁ బండితులకుఁ బ్రోత్సాహ మొసంగియున్నవాఁడు. మారనవంటిమహాకవి యీతనికి శిష్యుఁ డగుటయు, కేతనవంటి పండితకవి కృతిదాత గావుటయు, బయ్యనవంటివాఁ డీతనిచే బిరుదమును గ్రహించుటయు నిందులకుఁ బ్రామాణములు.

హరిహరనాథుని ప్రసంస:

ఇతఁడు పరమభక్తాగ్రేసరుఁడనుట కీతనిరచనములే దృష్టాంతములు. ఇతని కాలమున వీరశైవవీరవైష్ణవమతములు పరస్పరద్వేషముతో నుండి యన్యోన్యహింసకూడ గావించుకొనుస్వభావముతో మెలంగుచు వచ్చినవి. అట్టిసమయమున నీమహామహుఁడు శివకేశవుల కభేదమును ప్రతిపాదించి, హరిహరనాథుఁ డనుదైవమునకు తనభారతమునుఁ గృతి యిచ్చెను. నెల్లూరునందు హరిహరనాథదేవాలయ ముండెడిదనియు,

తిక్కనసోమయాజి భారతము నాయాలయమున బవిత్రహృదయము తోఁ గూర్చుండి రచియించెననియుఁ జెప్పుదురు. భారత విరాటపర్వ కృత్యాది యందలి "అని పూని యాదృశ్యంబులగు పుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్కయారాధనవిశేషం బగుటం జేసి" అను వాక్యము లీయంశమును ధ్రువపర్చుచున్నవి. ఈ కృతిరచన మొకవిధమగు దేవతారాధన మనియే తిక్కన మనఃపూర్వ విశ్వసించెను. ఈతనితరువాతికవులు కొందఱీతని ననుకరించి తమగ్రంథములను హరి హరనాథునకు గృతి నొసంగిరి. నెల్లూరునం దిప్పుడీయాలయము లేదు. పాండవులయాలయ మొకటికలదు. ఇప్పుడు రంగనాథస్వామియాలయ మున్నచోటనే పూర్వము హరిహరనాథునియాలయ ముండెడిదనియు నది శిథిలమైపోఁగా నాప్రదేశమున రంగనాథాలయమును నిర్మించి రనియుఁ జెప్పుదురు. నెల్లూరుకడ పెన్న రెండుపాయలైనదనియు, రెండవపాయ నెల్లూరునకు దక్షిణముననుండెడిదనియు, నదియిప్పుడు పూడిపోయినదనియు, నాపాయకు దక్షిణపుటొడ్డున హరిహరనాథ దేవాలయముండెడిదనియు దానిశిథిలచిహ్నము లిప్పుడును గన్పడు చున్నవనియు కొందఱనియెదరు. చైచరాజు వెంకటనాథకవి తనపంచ తంత్రము నీ హరిహరనాథునకుఁ గృతియిచ్చియుండుటచే నాతనికాలము వఱకును (పదునైదవశతాబ్ది) నీయాలయ ముండెనని విశ్వసింపవచ్చును. సప్తగోదావరీ సంగమమున నొక హరిహరదేవాలయ ముండెడిదని ద్రాక్షారామ మందలి యొక శాసనము (పదుకొండవశతాబ్దినాటిది. ద. హిం. శా. సం. ౪ సంఖ్య ౧౦౫౯)వలనఁ దెలియుచున్నది. హరి హరనామక పట్టణ మొకండు కర్ణాటదేశమునఁ గలదు.

హరిహరనాథునిఁ బ్రశ్నించుచు తిక్కనరచించిన యీ క్రింది శ్లోక మాదేవునకుఁ బరమప్రీతినిఁ గల్గించె నఁట!

"కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్
కిం కాలకూటః కిము వా యశోదా
స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే."

"ప్రభో! నీవు అలంకరించుకొనుటలో అస్థిమాల నిచ్ఛయింతువా లేక కౌస్తుభము నభిలషింతువా? నీకు కాలకూటము రుచ్యముగా నుండునా? లేక యశోదాస్తన్యము రుచ్యముగా నుండునా నాకు జెప్పుము." ఇది పైశ్లోకార్థము.

భగవంతుఁడు స్వప్నమునఁ బ్రత్యక్షమై శివకేశవులకభేదమునుఁ బ్రతిపాదించుచు గ్రంథమును రచించినందులకుఁ దననుఁ గొనియాడుచున్నట్లీక్రిందిపద్యములోఁ గవి చెప్పియున్నాఁడు.

ఉ. వైదికమార్గనిష్ఠ మగువర్తనముం దగ నిర్వహించుచు
న్భేదము లేనిభక్తి మతి నిర్మలవృత్తిఁగఁ జేయుచుండ మ
త్పాదనిరంతస్మరణతత్పరభావము కల్మి నాత్మ న
మ్మోదముఁ బొందఁ గావ్యరసముం గొనియాడుచునుండు నెప్పుడున్.

స్వప్నసాక్షాత్కారకథనుఁ జెప్పిన వారిలో మొదటివాఁడు తిక్కనసోమయాజి. తరువాతి కవులు పెక్కురీతిని ననుకరించి తమ గ్రంథములలోఁ దమపూర్వులో, తమరారాధించెడి దేవతలో స్వప్నమునఁ బ్రత్యక్షమైనట్లు వ్రాసికొనుచువచ్చిరి. కొందఱదియొక యాచారముగాఁ బరిగణించి యట్లు చెప్పికొనియుందురని తలంచినను దిక్కనసోమయాజివంటి భక్తాగ్రగణ్యున కీశ్వరసాక్షాత్కారమయ్యెనని యూహించుటయే సముంజసము. పరమహంసరామకృష్ణునకుఁ గాళికాదేవి ప్రత్యక్షమగుచుండెడి దని చెప్పుటయు నది సత్యమని విశ్వసించుటయు నీయిరువదియవశతాబ్దియందలి సంగతులు. మానవునకుఁ బరమేశ్వరసాక్షాత్కార మసంభవ మని యీ కాలమునఁ గొందఱి విశ్వాసము. కాని యది యాప్తవాక్యవిహితము కాఁజాలదు.

హరిహరనాథుఁడు తిక్కన హృదయమున నిర్మించుకొనిన దేవుఁడే కాని యర్చాస్వరూపుఁడు కాఁ డని కొందఱి మతము. అది సత్యము కాదు. హరిహరనాథాలయములు పూర్వకాలమున నచ్చటచ్చట నుండెడి వనుటకు శాసనదృష్టాంతములు కలవు. ఆయాలయములందలి యేకవిగ్రహమున హరిహరరూపములు రెంటిను గనుపడు నట్లు చెక్కఁబడియుండెడి వని చెప్పుదురు. తూర్పుగోదావరిమండలమున

రాజోలుతాలూకాలో కేశవస్వామి యాలయమున నెదుటిప్రక్క కేశవ రూపమును వెనుక ప్రక్క స్త్రీరూపమును గలిగియున్నవి. శ్రీమహా విష్ణువు మోహినీరూపమున శివుని వంచించిన కథను సూచించుటకై యీవిగ్రహమును నిర్మించిరని యచ్చటివారు చెప్పుచుందురు. కావున హరిహరనాథుఁడు కేవలమానసికారాధకుల కొఱకుఁ గల్పించుకొనిన వాఁడే కాక యర్చాస్వరూపుఁడుగాఁ గూడ నున్నాఁడని విశ్వసింపవచ్చును.

తిక్కనసోమయాజి నిర్వచనోత్తర రామాయణమును రచియించు నాఁటికిఁ బూర్వమే తలిదండ్రులిరువురును స్వర్గము నలంకరించియుండి రని చెప్పఁదగును. దీనిం బట్టి యాతని బాల్యవయసునందే పితృమాతృ విహీనుఁడయ్యెననియుఁ బెదతండ్రులచేఁ బెంపఁబడి విద్యల నభ్యసించి సర్వకళలఁ బరిపూర్ణుఁడయ్యెననియు నెంచఁదగియున్నది.

తిక్కన యజ్ఞకథ:

తిక్కనామాత్యుఁడు రాజకార్యములలో నిమగ్నుఁడైయున్నను బ్రాహ్మణోచితము లగువైదికకర్మము లనుపేక్షింపలేదు, నిర్వచనోత్తర రామాయణగద్యయందు "బుధారాధనవిధేయ తిక్కననామధేయ" యనియు, భారతగద్యయందు "బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి", యనియుఁ జెప్పుకొనియుండుటచే నీతఁడు నిర్వచనోత్తరరామాయణ రచనమునకుఁ దరువాతను, భారతరచనాత్పూర్వమునను జన్నము చేసె ననుట స్పష్టము కేతనకవి దశకుమారచరిత్రమునఁ దిక్కనను వర్ణించుచు "మహితదక్షిణ లైనబహువిధయాగంబు లొనరించుననుట వర్ణనము దారి"యని చెప్పుటచే దశకుమారచరిత్రమునుఁ గృతినొందుటకుఁ బూర్వమే యాతఁడు యజ్ఞమునుఁ జేసియుండు నని కొంద ఱనుచున్నారు. అదిసత్యమైనచోఁ గేతనకవి యెచ్చటనైనను తిక్కననామాంతమున నాతఁడు యజ్ఞకర్త యనిసూచించునపదమును వేయకుండ నుండఁడు. అట్టిపద మేదియు దశకుమారచరిత్రమున లేదు. కావున నాయూహ యందు సత్యము లేదని తలంపవలసియున్నది. కేతనచెప్పినదానికి వైశ్వదేవాదియాగము లని యర్థము చెప్పవలసియుండును. మనుమసిద్ధి

చనిపోయినపిదప భారతము నారంభించుటకు బూర్వమే తిక్కన జన్మ మొనర్చియుండు నని నా యభిప్రాయము.

నన్నయభట్టు రచింపక మిగిలిన భాగమును పూర్తి చేయించుటకై తగినకవికొఱకు రాజరాజనరేంద్రుడు ప్రయత్నము సేయుచు, నన్నయరచనమునందలి యీపద్యము :

ఉ. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణక
ర్పూరపరాగపాండురుచిపూరములం బరిపూరితంబులై"

యను పద్యము నొక తాళపత్రముపై వ్రాయించి యిట్లు వ్రాయగలిగిన కవు లెవరైన నున్నచో నీభావమును దమశైలిలో రచించి పంపుడని రాజస్థానములకుం బంపిననియు, నది మనుమసిద్ధికడకు రాఁగా దిక్కన సోమయాజి యాపద్యముననే వేఱొకపత్రముపై వ్రాసియిచ్చె ననియు, నన్నయతో సమానముగాఁ దాను వ్రాయఁగలనని తిక్కన భావమును గ్రహించి రాజరాజు తనకడకుఁ బంపు మని మనుమసిద్ధినిఁ గోరె ననియుఁ దిక్కన యందుల కంగీకరింపకపోఁగా మనుమసిద్ధికిఁ గోపము వచ్చి "పలువురిలో నీ బుఱ్ఱ గొఱిగించి వీథులవెంటఁ ద్రిప్పి మానమును దినిపించెద"నని తూలనాడెననియుఁ దరువాత రాజు పశ్చాత్తప్తుఁడై తనమాట నిలుపుకొనుటకై తిక్కనామాత్యునిచే యజ్ఞము చేయించె ననియు నొకకథ చెప్పెదరు. కాని యింత లేశమాత్రమును సత్యము లేదు. (యజ్ఞము చేయువానికి క్షౌరమును, [illegible], సోమపానమును గర్తవ్యములు).

మనుమసిద్ధిమహారాజు రాజరాజునకుఁ దరువాత రెండువందల సంవత్సరములలో నున్నవాఁడు. భారతమును బూర్తి చేయించుటకై రాజరాజు ప్రయత్నించె ననుటకుఁ గూడ నాధారములు లేవు. భారతమునుఁ దనకుఁ గృతియిమ్మని మనుమసిద్ధి యడిగెననియుఁ దిక్కన యందుల కంగీకరింపకపోఁగా [illegible] జెప్పినకథ నడచెననియుఁ గొందఱందురు. కాని యందును సత్యము లేదు. తిక్కన భారతమును రచించునాఁటికి,

మనుమసిద్ధి జీవించియుండెనో లేదో యని సంశయముగా నున్నది. భారతమును భగవంతునకుఁ గృతి యీయఁదలచినప్పు డందుల కభ్యంతరముఁ గలుగఁజేయు స్వభావముకలవాఁడు కాఁడు మనుమసిద్ధి. తిక్కనయెడల మనుమసిద్ధికి గౌరవము మెండు. శ్రీకృష్ణదేవరాయలు తనమంత్రియైన తిమ్మరసును "అప్పాజీ"యని పిలచినట్లే మనుమసిద్ధి తిక్కనను "మామా"యని పిలుచుచుండెడివాఁడు. మనుమసిద్ధి తిక్కనలకుఁ గల యన్యోన్యగౌరవము నిర్వచనోత్తరరామాయణమునందలి యీ క్రింది పద్యములవలనఁ దెలియుచున్నది.

చ. హరిహరపద్మగర్భులను నాదికవీంద్రుల నూత్నసత్కవీ
శ్వరులను భక్తిఁ గొల్చి తగ వారికృపం గవితావిలాసవి
స్తరమహనీయుఁ డైన నను సర్వగుణోత్తరమూర్తి మన్మభూ
వరుఁడు దగంగ రాఁ బనిచి వారవిమన్నన నాదరించుచున్.

క. ఏ నిన్ను మామయనియెడు
దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీనర్హుఁడ వగు దనినను
భూనాయకువల్కు చిత్తమున కిం పగుడున్.

సీ. సకలలోకప్రదీపకుఁ డగుపద్మినీ
మిత్రవంశమున జన్మించె ననియుఁ
జూచిన మగలైనఁ జొక్కెడునట్టిసౌం
దర్యసంపద సొంపుఁ దాల్చె ననియు
జనహృదయానందజనకమై నెగడిన
చతురత కల్మి నప్రతిముఁ డనియు
మెఱసి యొండొంటికి మిగులు శౌర్యత్యాగ
విఖ్యాతకీర్తుల వెలసె ననియు
వివిధవిద్యాపరిశ్రమవేది యనియు
సరసబహుమానవిరచనాశాలి యనియు
సత్కృతీశ్వరుఁ డగుమన్న మనుమనృపతి
సుభగుఁ గావించుటకు సముచ్ఛ్వాసుఁడ నైతి.

మనుమసిద్ధిమహారాజు తిక్కనకు రాజచిహ్నముల నిచ్చి గౌరవించిన ట్లీక్రిందిపద్యమునఁ గేతనకవి చెప్పియున్నాఁడు.

గీ. అంకలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జముకిశంఖములును
గంబగట్లు భూమి గానికగాఁ గాంచెఁ
బెనఁగు రాచపదవులెల్ల బడసె.

పైపద్యమునందు మనుమసిద్ధి వివిధవిద్యాపరిశ్రమ వేదియనియుఁ సరసబహుపురాణవిరచనాశాలి, యనియుఁ జెప్పియున్నాఁడు. అట్టివాఁడు తిక్కననుఁ బరుషోక్తు లాడెనని దలంచుటకు వీలులేదు. కావునఁ బై కథ యెంతమాత్రమును విశ్వసనీయము కాదు. కృతినిఁ గన్యకతోఁ బోల్చిన వారిలోఁ దిక్కనయె మొదటివాఁడు. రాజరాజు పరీక్షార్థమంపినపద్యము పైనఁజెప్పినది కాదనియు "నింకుమనంబు" అనుపద్య మనియు. గొంద అందురు. మఱియొకటి యనియింకఁ గొంద అందురు.

తిక్కనతరువాత నాతనివంశము :

తిక్కనసోమయాజికిఁ దరువాత నాతనికుమారుఁడు నెల్లూరునకుఁ పడమట రెండుమూఁడుక్రోసులదూరములో పినాకినీనదీతీరమందున్న పాటూరుగ్రామకరణీకమును సంపాదించి యక్కడ నివాసమేర్పరచుకొని రనియు నప్పటినుండియు వారు పాటూరివా రని పిలువఁబడుచుండి రనియుఁ జెప్పుచున్నారు. ఈవంశావళిని వర్ణించు రెండుసీసపద్యములను బ్ర. శ్రీ. వీరేశలింగముపంతులుగా రాంధ్రకవులచరిత్రమున నుదాహరించియున్నారు. ఆ పద్యము లివి:

సీ. భారత పర్వములు పదియేను వరుసగాఁ
దెనిఁగించె గుంటూరితిక్కయజ్వ
యామహాత్మునిపుత్రుఁ డౌ కొమ్మనఘనుండు
కల్పించెఁ బాటూరి కరణికంబు
నాకొమ్మనకుఁ గల్గె హరిహరామాత్యుండు
నెమ్మితో నతనికిఁ గొమ్మఘనుఁడు

రహిఁ బూజి నతనికి రామన తిప్పన
యారామునకు సోమ యాహ్వయుండు
ఆ ఘనునకు వీరనామాత్యుఁ డతనికి
సోమలింగమంత్రి యామహాత్ము
నకును సోమరాజనాముఁడుఁ జిటివీర
ఘనుఁ డనంగ సుతులు గలిగి రందు

సీ. సోమమంత్రికిఁ గల్గె సుతుఁడు పాపనమంత్రి
యతనికి వీరన యాఘనునకుఁ
గూరిమి తనయులు గోపాలభద్రార్య
నరసింహమంత్రు లనంగ ముగురు
వారిలో నరసింహవరునకు శరభార్యుఁ
డును భాస్కరామాత్యుఁడు నరసింహ
ఘనుఁ డనఁ బుత్రులు గలిగిరి మువ్వురు
వారిలో శరభార్యవర్యునకును
వీరఘనుఁడు గలిగె వేఙ్కనామంత్రికి
శరభమంత్రివరుఁడు జననమొంది
ప్రబలియున్నవాఁడు పాటూరిలోఁ దన
కులము వర్ధిలంగఁ గోమరు మీఱి.

ఇందులో మొదటిపద్యము పూర్వరచిత మనియు, రెండవ పద్యము శరభరాజు గారిచ్చిన వంశానుక్రమణికనుబట్టి బ్రహ్మశ్రీ శతఘంటము వెంకటరంగనాథశాస్త్రిగారు రచియించి రనియుఁ జెప్పుచుఁ నీపద్యములను శరభరాజుగారు వీరేశలింగముపంతులుగారి కిచ్చి రఁట. పాటూరి కరణీకమును బట్టి వీరు పాటూరి వారైనారఁట.

కొందఱు ఈవంశావళిని గూర్చి సంశయమును దెలుపుచున్నారు. తిక్కనసోమయాజి యుపయోగించిన గంటపువర చాలకాలము వీరియింట నుండెడి దనియు నందుపై నొకప్రక్క సరస్వతివిగ్రహమును నొకప్రక్క విఘ్నేశ్వరవిగ్రహమునుఁ జెక్కఁబడియున్నవనియుఁ బ్రతీతి కలదు. అది

యిప్పుడున్నదో లేదో తెలియదు. బ్ర. శ్రీ. వీరేశలింగముపంతులుగారీ వంశావళినిబట్టి తిక్కనకాలమును నిర్ణయింపయత్నించిరి. ఇప్పుడు శాసనసాహాయ్యమున నీమహాకవికాలము స్పష్టముగాఁ దెలియుచున్నది. కావున నందుల కీవంశావళితోఁ బనిలేదు. మడికిసింగనకుఁ బితామహుఁడైన యల్లాడమంత్రి తిక్కనసోమయాజి పౌత్రినిఁ బరిణయమాడెనని సింగకవికృత వాసిష్ఠరామాయణములోఁ జెప్పఁబడియున్నది.

ఆంధ్రభాష కితఁడొనర్చిన సేవ:

ఆంధ్రభాషాభివృద్ధికై పాటుపడినవారిలోఁ దిక్కన యగ్రేసరుఁడు. నన్నయాదు లాంధ్రభాషలోఁ గావ్యములను రచించినను, వారికావ్యములలో సంస్కృతపదము లధికమును, ఆంధ్రపదములు స్వల్పముగ నున్నవి. నన్నెచోడుఁడు, సోమనాథుఁడు మొదలగుశివకవులు తమగ్రంథములలో దేశీయపదముల నధికముగ నుపయోగించి యాంధ్రసాహిత్యాభివృద్ధికై యెక్కువగా పాటుపడియుండిరి. తిక్కనసోమయాజి రెండుగ్రంథములను రచియించుటేకాక, యాకావ్యములలో దేశీయపదములను జక్కగా సంస్కరించి యుపయోగించి, తన రచనముల నాంధ్రసాహిత్యగ్రంథములనుగా జేసెను. ఆంధ్రాభ్యుదయ రచయితలలోఁ దిక్కనయగ్రగణ్యుఁ డని చెప్పనొప్పును. ఆంధ్రసాహిత్యపోషణమున కితఁడు పడినశ్రమ యపారము. ఈతనిరచనములు రెండును సంస్కృతమున కాంధ్రీకరణములైనను, ఇతఁడు గొప్పసంస్కృతపండితుఁడైనను, నీతనికవిత్వమునందుఁ "నన్నుపయోగింపుఁడు నన్నుఁ గొనుఁ"డని సంస్కృతపదములు ముందునకువచ్చి యుఱ్ఱూత లూగించుచున్నను, నాంధ్రభాషాభివృద్ధియే మనమున నిడుకొని విశేషముగా జాతీయపదములనే యుపయోగించి, రసముప్పతిల్లునట్లు కావ్యరచనము సాగించినవాఁ డీమహాకవి. ఈతనికవిత్వమునందు సంస్కృతపదములున్నను నవి యతిమృదులములై సామాన్యమానవులు వాడుకొనుచుండునట్టివియుఁ "నివి సంస్కృతపదములా? జాతీయములా?" యనిసంశయము గల్గించునట్టివియునై యున్నవి. ఈతఁడు తనరచనావిధానమును సూచించుచు నిర్వచనోత్తరరామాయణమున :

ఉ. జాత్యముగామి నొప్పయినసంస్కృత మెయ్యెడఁ జొప్పు; వాక్యసాం
గత్యము సేయుచోనయిన గద్యముతోడుగఁ జెప్పిపెట్టు; దా
గ్గత్యము దోఁపఁ బ్రాసము ప్రకారము వేఱగు నక్షరంబులన్
శ్రుత్యనుమాప మంచు నిడ; సూరుల కివ్విధ మింపుఁ బెంపదే.

అనుపద్యమునుఁ జెప్పి యారీతిగనే తనకావ్యములను విరచించినాఁడు. ఈసందర్భమునఁ దిక్కనకవిత్వపుసొంపుసూపుటకై కొన్నిపద్యములనిట నుదాహరించుట యావశ్యకము కాకపోదు.

ఉ. నన్నుఁ బరాభవించి సదనంబునకుం జని కీచకుండు ము
న్నున్నతెఱంగు దప్పక సుఖోచితశయ్యను నిద్ర సేయ నీ
కన్న మొగుడ్చునాఱటకుఁ గారణ మెయ్యది భీమసేన! యీ
యన్నపరాక్రమంబు వలనన్న నొకో నయమాలి తక్కటా' (వి.ప)

క. ఆపదఁ గడవంబెట్టఁగ
నోపి శుభంబైనదాని నొడఁగూర్పను మా
కీపుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా!

ఆ. కొడుకుఁగాంచు రాచకూఁతు రెద్దానికి
నట్టిపనికి నుచిత మైనసమయ
మిదవెఁ దడయు టింక నొప్పదు జనములు
నట్లుగాని పురుషు లనరు మిమ్ము ఉ. ప.

తే. పట్టపగలింటిసూర్యునిపగిదిఁ గర్ణుఁ
డుగ్రమూర్తియై వెలుఁగుచున్నవాఁడు
మాధవా! మనరథంబును మరలనిమ్ము
బ్రదికియుండిన శుభములు బడయవచ్చు. క. ప.

చ. వెరవును లావుఁ జేవయును వీరల కారయ నొక్కరూప దు
స్తరభుజశక్తి ధర్మజుఁడు శల్యుని రూపడగించి యివ్వసుం
ధరఁ గొనునొక్కొ నేఁ డితనిఁ దా సమయించి సమస్తమేదినీ
శ్వరుఁడుగఁ జేయనోపునొకొ శల్యుఁడు కౌరవరాజనందనున్. (శవ)

ఉ. క్రూరుఁడు లోభియున్ శఠుఁడు గొండియుఁడున్ జడుఁడుం గృతఘ్నుఁ[డున్
నేరనివాఁడు బొంకరియు నిందకునోర్చునతండుఁ బందయున్
ధీరత లేమి దుర్ణయ మతివ్యసనత్వముఁ గల్గువారలుం
జేరువ నున్కి భూపతికిఁ జెట్ట యొనర్చు నరేశ్వరోత్తమా! (శాం.ప)

సీ. దివియలోఁ బడుఁబుర్వు దివియయొత్తినవానిఁ
బాపంబు పొందునే! యోపి దున్న
నాఁగేటి మొనఁ జచ్చు నానావిధప్రాణు
లన్నరుఁబొందునే యఘము? వారు
దమవను ల్సేయ విధాతృవశమున నా
యువు దెగినట్టిజంతువులు సచ్చు
నేను సంప్రీతి మనియించు కేనియు నహం
కారంబు వారికిఁ గలుగ దట్లు
ఆ. గాన చూవె వారిఁ గల్మష మొందదు
పుణ్యపాపములకు బుద్ధిమూల
మనిశివుండు మఱియు నను హింసపోలె నై
యధికధర్మమైనవిధము వినుము. అ. ప.

ఉ. ఏను హితంబు సెప్ప నిటు లేచిదురాచరణంబు లిమ్మెయిన్
మానవు రోగి చేఁదయినమం దఱువుం దెవు లంటఁదాఁకినం
గాని యొఱుంగఁ డప్డు ప్రతికారము గల్గునె యట్లపోలె నీ
వైన నికృష్టవృత్తిఫల మంది తలంచెదుగాక పిమ్మటన్. ని. రా.

స్థాలీపులాకన్యాయముగ నీ పద్యములఁ జూపితిని. గ్రంథమంతయు నిట్లే యుండును. ఈతనినిజూచి కేతనమారనాదు లిట్లే తమగ్రంథముల యందు జాతీయపదముల నుంచి రచించుచువచ్చిరి. కాని శ్రీనాథాది మహాకవులు కొంద ఱీమార్గమును విడనాడి తమకావ్యములను సంస్కృత పదజాలముతో నింపివైచిరి. సాంస్కృతికదీర్ఘసమాసములతో గ్రంథము

లను రచించుటయే గొప్పతనమని తలంచినకవులుకూడఁ గొందఱు కలరు. ఆంధ్రభాషలోఁ గావ్యరచనముఁ జేయఁదలచికొనినప్పుడు దేశీయ పదములతోఁ బాఠకలోకమునకును విను వారికిని హృదయాహ్లాదమునుఁ గలుగఁ జేయునట్లు రచించుటయే గొప్పతనమగును గాని నిఘంటుసాహాయ్య ముండినఁగాని యర్థము కాని గూఢసంస్కృతపదసమాసములతోఁ నాంధ్ర కావ్యమును రచించుట గొప్పతనము కాజాలదు. ఈ సందర్భమున మొల్ల తన రామాయణమునఁ జెప్పిన

క. మును సంస్కృతంబు తేటగఁ
దెనిగించెడిచోట నేమి తెలియక యుండన్
దనవిద్య మెఱయఁ గమ్మని
ఘన మగుసంస్కృతముఁ జెప్పఁగా రుచి యగునే.

ఆ. తేనెసోక నోరు తియ్యన యగురీతిఁ
దోన యర్థ మెల్లదోఁపకున్న
గూఢశబ్దవితతికొట్లాటపని మొల్ల
మూఁగ చెవుడు నాడుముచ్చ టగును

క. కందువమాటలు సామెత
లందముగాఁ గూర్చి చెప్ప నది తెనుఁగునకున్
బొందై రుచియై వీనుల
విందై మఱికానిపించు విబుధుల కెల్లన్.

అనుపద్యములు స్ఫురణకువచ్చుచున్నవి. తిక్కనసోమయాజి తన గ్రంథములయం దుపయోగించిన దేశీయపద్యములు వేలకొలఁదిగ నున్నవి. సంస్కృతపదములవిషయమున "బాణోచ్ఛిష్టంజగత్త్రయ"మ్మని యనెడు మాట దేశీయపదవిషయమున నీమహాకవికి వర్తించు ననుటకు సంశయము లేదు. ఈ భావమును దశకుమారచరిత్రకృతికర్తయగు కేతన వి "అగుననఁగొమ్మయతికఁడు" (ఈ పద్యమును బైననుదహరించి ని.) అనుపద్యములో వ్యక్తీకరించియున్నాఁడు.

ఇతని కవిత్వగుణము :

అద్వితీయప్రతిభావంతుఁ డగు నీ మహామహుని కవిత్వగుణమును జూపనెంచుట సూర్యుని కాగడాతోఁ జూపనెంచుట వంటిది. ఆంధ్ర కవులలో నీతనితో సమాను లింకొకరు లేరు. ఈతని కవిత్వ మింతగా సర్వజనాకర్షణీయ మగుటకుఁ గారణములు కొన్ని గలవు. అందు

మొదటిది:— ఈతఁడు చేపట్టిన కావ్యములయందలి యితివృత్తములు. ఆర్యులమగు మనకుఁ గల యితిహాసములలో శ్రేష్ఠము లయినవి రెండు. భారతము, రామాయణము. ఈ కావ్యములు రెండింటి నీతఁడు చేపట్టినాఁడు. "మణినావలయమ్ వలయేన మణిః" యనునట్లు కవితవలన కథయునుఁ గథచేఁ గవితయు శోభ కెక్కును. వ్యాస వాల్మీకుల ప్రతిభ జగద్విదిత మగుటకుఁ గారణ మీ కావ్యముల యందలి యితివృత్తములే. తన కవితాశక్తిని బ్రదర్శించుటకుఁ దగినకథ లీతనికి లభించుట గొప్ప యదృష్టము.

రెండవది:— పదసౌష్టవము. ఈతని కవితయందు పెద్దపెద్ద సంస్కృత సమాసము లుండవు. చిన్నచిన్న దేశీయపదములనే విశేషముగా నీతఁ డుపయోగించును. ఏ తావున నే పద ముపయోగించిన రస ముప్పతిల్లునో యీ కవిచంద్రునకు బాగుగాఁ దెలియును. ఎచ్చట నైన సంస్కృతసమాసము లున్నను, అవి మృదుపదసంయుతములై మనోహరముగా నుండును. వాని యర్థమును గ్రహించుటకై నిఘంటుకారముల యక్కర యుండదు.

మూఁడవది:— అర్థగాంభీర్యము. ఎంత చిన్నపదముల నుపయోగించినను వానియం దెంతయో గాంభీర్య మగునర్థ మిమిడియుండును. పాఠకుని శక్తికొలఁది నందలి భావగాంభీర్యము విదితమగుచుండును.

నాల్గవది:— వ్యర్థపదరాహిత్యము. ఇతని కవిత్వమునందుఁ బాదపూరణమునకును యతిప్రాసల కొఱకునుఁ దెచ్చిపెట్టుకొనెడి పదము లుండవు. ఎచ్చటనేని స్వల్పముగా నట్టిపదము లున్నను నవి కేవ

లము పడికట్టురాళ్లుగా నుండక యవియుఁ గూడ నెంతయో కొంత తూకమునుఁ దెలుపునవిగానే యుండును.

ఐదవది:— పాత్రౌచిత్యము. కవిత్వ మెంతరసవంతముగ నున్నను, పాత్ర పోషణము యుక్తముగ లేకున్నచో సహృదయుల కానందము కలుగదు. భారతమున ప్రధానపాత్రములు రెండు. ధర్మరాజును, ద్రౌపదియు, తిక్కన నీ యిరువురను భారతమునఁ దుదకంటఁ జక్కఁగా పోషించినాఁడు. ఈ విషయమున వ్యాసుని కంటె నీతనిదే పైచెయ్యి యైనది. ధర్మరాజు రాజనీతిజ్ఞత, సమయోచిత జ్ఞానము, కార్యదీక్ష, ఇంద్రియనిగ్రహము, సత్యాగ్రహము, ఓర్పు మొదలగు గుణములనుఁ జూపుచుఁ దిక్కన వ్రాసిన భాగముల నొక్కచోఁ జేర్చి చూపినచో, లోకమున కెంతయో మేలుకలుగు నని నా యభిప్రాయము. భారతమందలి యితరపాత్రములనుఁగూడ నీతఁడు చక్కఁగా ప్రదర్శించినాఁడు.

ఆఱవది:— భావప్రకటనము. తాను చెప్పఁదలచుకొనినభావము పాఠకులకు స్పష్టముగాఁ దెలియునట్లు చిన్నచిన్నమాటలతో వ్రాయు నేర్పు కవిశేఖరున కలవడినట్లింకొకరి కలవడలేదు. ఇరువురువ్యక్తులు మాటలాడునప్పుడది పద్యరూపమునసున్నను దృశ్యప్రబంధములో వలె నెదురుగా గూర్చుండి మాటలాడుకొనుచున్నట్లే యుండి పాఠకున కెంతయో యానందము కలిగించుచుండును. పౌరాణికున కట్టిసందర్భములలో నాభావమును దనమాటలతో శ్రోతలకు విప్పి చెప్పుట కవకాశము గలుగుచుండును. ఎంతటి కఠినవిషయము నైనను చిన్నమాటలతో సులభముగా బోధపడునట్లు చెప్పుటలో నీతఁడు మిగులనిపుణుఁడు.

ఏడవది:— రసపోషణము. సందర్భము ననుసరించి నవరసములును పాఠకుఁ డనుభవించుటకుఁ దగిన యితివృత్తమునుఁ గల్పించుట యందును, ఆరస మున్పతిల్లుపదముల నుపయోగించుటయందును రసపోషణమునందును నీతనికిఁగలశక్తి యపారము.

ఎనిమిదవది:—లోకజ్ఞానప్రదర్శనము. ఈ మహానుభావుఁడు కేవలపండితుఁడునుఁ గవియునే గాక లోకజ్ఞానమెఱింగిన మహామేధావి. శాస్త్రములయందునుఁ గ్రంథములయందునుఁ జెప్పఁబడినదియే గాక నిత్యమును ప్రపంచమునఁ జరుగుచున్న విషయములనుఁ గ్రహించి యందలిమంచిచెడ్డల నెఱింగి లోకహితమునుఁ గాంక్షించి, తన యనుభవజ్ఞానమునుఁ దనగ్రంథములయందు బ్రకటించిన మహాపురుషుఁడీతఁడు.

ఈ కారణములచే నితనికవిత్వము పండితపామరజనానురంజకమై సర్వజనహృదయాకర్షణ మొనరించుచున్నది. వీని కుదాహరణములను జూప నెంచినచో నది యొకపెద్దగ్రంథ మగును.

ఈతని యాంధ్రీకరణవిధానము :

ఈ మహాకవి భారతాంధ్రీకరణమును యథేచ్ఛగా సాగించినాఁడు. కాని మక్కికిమక్కిగా చేయలేదు. ఇతఁడు విరాటోద్యోగపర్వములలో మూలమందలికథను మాత్రము గైకొని తనయిష్టము వచ్చినట్లు పెంచియుఁ గుదించియుఁ బాత్రౌచిత్యముకొఱకును రసపోషణము కొఱకును ననేకమార్పులనుఁ గావించి యాపర్వములను స్వతంత్రగ్రంథ మనునట్లుగా రచించినాఁడు. భారతమునందు పాఠకులకును శ్రోతలకు నెక్కువయాహ్లాదమునుఁ గలిగించునవి, విరాటోద్యోగపర్వములు. తిక్కనసోమయాజి తన లోకజ్ఞానమును, పాత్రౌచిత్యమునుఁ గనుపరచి, యీ రెండు పర్వములను రచించియుండెను. ఈతని యాంధ్రీకరణవిధానమునుఁ జూపుటకై యీ పర్వములనుండియే దృష్టాంతములనుఁ గైకొనుట సమంజసమని యట్లుచేసితిని.

కౌరవసభకు శ్రీకృష్ణుఁడు రాయబారము పోవనున్నప్పుడు ద్రౌపది శ్రీకృష్ణునితోఁ నుడివిన వాక్యములను, సంస్కృత భారతమునుండియు, తిక్కనభారతమునుండియు నెత్తి యీక్రింద వ్రాయుచున్నాఁడను.

"సుతా ద్రుపదరాజస్య అసితాయతమూర్ధజా
సంపూజ్యసహదేవంచ సాత్యకించ మహారథమ్"
"భీమసేనంచ సంశాంతం దృష్ట్వా పరమదుర్మనాః
అశ్రుపూర్ణేక్షణా వాక్య మువాచేదం మనస్వినీ".
"విదితం తే మహాబాహో ధర్మజ్ఞ మధుసూదన
యథా నికృతి మాస్థాయ భ్రంశితాః పాండవా స్సుఖాత్."
"ధృతరాష్ట్రస్యపుత్రేణ సామాత్యేన జనార్దన
యథాచ సంజయో రాజ్ఞా మంత్రం రహసి శ్రావితః."
"యుధిష్ఠిరేణ దాశార్హ తచ్చాపి విదితం తవ
యథోక్తః సంజయ శ్చైవ తచ్చ సర్వం శ్రుతం త్వయా".
"పంచనస్తా తదీయంతాం గ్రామా యితి మహాద్యుతే
అవిస్థలం వృకస్థలం మాకందీం వారణావతమ్".
"అవసానం మహాబాహో కఞ్చి దేకంచ పంచమమ్
ఇతి దుర్యోధనో వాచ్య స్సుహృద శ్చాస్య కేశవ."
"నచాపి వ్యాకరో ద్వాక్యం శ్రుత్వా కృష్ణ సుయోధనః,
యుధిష్ఠిరస్య దాశార్హ హ్రీమత స్సంధి మిచ్ఛతః."
"అప్రదానేన రాజ్యస్య యది కృష్ణ సుయోధనః,
సంధి మిచ్ఛే న్నకర్తవ్య స్తత్ర గత్వా కథంచన."
"శక్ష్యంతి హి మహాబాహో పాండవా స్సృంజయై స్సహ
ధార్తరాష్ట్రబలం ఘోరం క్రుద్ధం ప్రతిసమాసితుమ్."
"నహి సామ్నా నదానేన శక్యోర్థ స్తేషు కశ్చన,
తస్మా త్తేషు నకర్తవ్యా కృపా తే మధుసూదన."
"సామ్నా దానేనవా కృష్ణ యేన శామ్యంతి శత్రవః
మోక్తవ్య స్తేషు దండ స్స్యాత్ జీవితం పరిరక్షతా".
"తస్మా త్తేషు మహాదండః క్షేప్తవ్యః క్షిప్ర మచ్యుత,
త్వయాచైవ మహాబాహో పాండవై స్సహసృంజయైః".

"ఏత త్సమం ధర్మం పార్థానాం తవచైవ యశస్కరమ్
క్రియమాణం భవేత్ కృష్ణ క్షత్రస్యచ సుఖావహామ్".

"క్షత్రియేణహి హంతవ్యః క్షత్రియో లోభమాస్థితః,
అక్షత్రియోవా దాశార్హ స్వధర్మ మనుతిష్ఠతా".

"అన్యత్ర బ్రాహ్మణా త్తాత సర్వపాపే ష్వవస్థితాత్,
గురుర్హి సర్వవర్ణానాం బ్రాహ్మణః ప్రసృతాగ్రభుక్".

"యథా వధ్యే భవే ద్దోషో వధ్యమానే జనార్దన,
సవధ్య స్యావధే దృష్ట ఇతి ధర్మవిదో విదుః".

"యథా త్వాం నస్పృశే దేష దోషఃకృష్ణ తథా కురు,
పాండవై స్సహదాశార్హ సృంజయైస్సహ సైనికైః".

"పునరుక్తంచ వక్ష్యామి విస్రమ్భేణ జనార్దన,
కానుసీమంతినీ మాదృక్ పృథివ్యా మస్తికేశవ".

"సుతా ద్రుపదరాజస్య వేదీమధ్యా త్సముత్థితా,
దృష్టద్యుమ్నస్య భగినీ తవ కృష్ణప్రియాసఖీ".

"ఆజమీఢ కులంప్రాప్తా స్నుషా పాండో ర్మహాత్మనః,
మహిషీ పాండుపుత్రాణాం పంచేంద్ర సమవర్చసామ్".

"సుతా మే పంచభి ర్వీరైః పంచజాతా మహారథాః,
అభిమన్యు ర్యథా కృష్ణ తథా తే తవ ధర్మతః".

"సాహం కేశగ్రహం ప్రాప్తా పరిక్లిష్టా సభాం గతా,
పశ్యతాం పాండుపుత్రాణాం త్వయి జీవతి కేశవ".

"జీవత్సు పాండుపుత్రేషు పాంచాలే ష్వథ వృష్ణిషు,
దాసీభూతాస్మి పాపానాం సభామధ్యే వ్యవస్థితా".

"నిరమర్షే ష్వచేష్టేషు ప్రేక్షమాణేషు పాండుషు
పాహి మా మితి గోవింద మనసా చింతితోఽసిమే".

"యత్ర మాం భగవా న్రాజా, శ్వశురో వాక్య మబ్రవీత్,
వరం వృణీష్వ పాంచాలి వరార్హాసి మతాసిమే".

"అదాసాః పాండవా స్సంతు సరథా స్సాయుధా ఇతి
మయోక్తే యత్ర నిర్ముక్తా వనవాసాయ కేశవ".

"ఏవంవిధానాం దుఃఖానా మభిజ్ఞోఽసి జనార్దన
త్రాయస్వ పుండరీకాక్ష సభ ర్తృజ్ఞాతిబాంధవామ్".

"నన్వహం కృష్ణ భీష్మస్య ధృతరాష్ట్రస్య చోభయోః
స్నుషా భవామి ధర్మేణ సాహం దాసీకృతా బలాత్".

"ధి క్పార్థస్య ధనుష్మత్తాం భీమసేనస్య ధిగ్బలమ్
యత్ర దుర్యోధనః కృష్ణ ముహూ ర్తమపి జీవతి".

"యది తేఽహ మనుగ్రాహ్యా యది తేఽస్తి కృపామయి,
ధార్తరాష్ట్రేషు వైకోపః సర్వః కృష్ణ విధీయతామ్".

వైశంపాయనః,

"ఇత్యుక్త్వా మృదుసంహారం వృజినాగ్రం సుదర్శనమ్
సునీల మసితాపాంగీ సర్వగంధాధివాసితమ్".

"సర్వలక్షణసంపన్నం మహాభుజగవర్చసమ్
కేశపక్షం వరారోహా గృహ్యా వామేన పాణినా".

"పద్మాక్షీ పుండరీకాక్ష ముపేత్య గజగామినీ,
అశ్రుపూర్ణేక్షణాదీనా కృష్ణం వచన మబ్రవీత్".

"అయం తే పుండరీకాక్ష దుశ్శాసనకరోద్ధృతః,
స్మర్తవ్య స్సర్వకార్యేషు పరేషాం సంధి మిచ్ఛతామ్".

"యది భీమార్జునౌ కృష్ణ కృపణౌ సంధికాముకౌ,
పితా మే యోత్స్యతేవృద్ధః సహపుత్రై ర్మహారథైః".

"పంచచైవ మహావీర్యాః పుత్రా మే మధుసూదన,
అభిమన్యుం పురస్కృత్య యోత్స్యంతే కురుభి స్సహ".

"దుశ్శాసనభుజం శ్యామం సంఛిన్నం పాంసుకుంఠితమ్,
యద్యహంతు నపశ్యామి కా శాంతిః హృదయస్య మే."

"త్రయోదశహి వర్షాణి ప్రతీక్షం త్వ్యాగతానిమే,
నిధాయ హృదయే మన్యుం ప్రదీప్త మివ పావకమ్."

"విదీర్యతే మే హృదయం భీమవాక్శల్యపీడితమ్,
యోఽయ మద్య మహాబాహు ర్ధర్మమే వానుపశ్యతి."

"ఇత్యుక్త్వా బాష్పసంఘేన కంఠేనాయతలోచనా,
రురోద కృష్ణా సోత్కంపం సస్వనం బాష్పగద్గదమ్."

"స్తనౌ పీనాయతశ్రోణీ సహితా వభివర్షతీ,
ద్రవీభూత మివాత్యుష్ణం ముంచతీ వారినేత్రజమ్."

ఈ శ్లోకములయర్థము సులభగ్రాహ్యం బగుటను. గ్రంథవిస్తరభీతి చేతను వీనికిఁ దెలుఁగు వ్రాయలేదు.

గీ. ధర్మనందనుపలుకులు దనకు హృదయ
తాప మొనరింప మోహమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్య బలికె
గినవి శౌరితో గద్గదకంఠి యగుచు.

ఉ. అంతలు చేసి పోనడచి యక్కట! సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె? ఇట్టియాటలు మదిం బ్రియమంది యుధిష్ఠిరుండు దా
నంతన యూళ్ళు లేవురకు నైదు సుయోధను డిచ్చునొక్కొ? ఈ
కంతకృపావిహీనమతి నాతఁడు నేచునె యన్నదమ్ములన్!

చ. తనమునువడ్డ బన్నములఁ దమ్ములపైఁ గలకూర్మి పేర్మి నీ
జనపతి సైపకున్నె? యదిసక్కన! రాజ్యముపాలు లేక తీ
ఱున కొడబాటు గల్గిన, నెఱుంగమి వెట్టరె? చాలరైరి వీ
రనరొకొ? నానలేమియని యాడరె లోకమువారు కేశవా?

శా. పెంపేదం దమకిట్టితక్కువలు రూపింపంగ నేలా? విచా
రింపన్ వారికి మేలు సంధి తమచేరిం జూచినం దారు సా
ధింపంజాలరొ? కాక పోరఁ దగమర్థింపం దలంపేని శం
కింపం బట్టరొకొ? వారు బ్రాహ్మణులె? యేకీడైన సైరింపఁగన్.

ఉ. ఓట యొకింత యేనియు సుయోధనుచిత్తమునందు లేదు నీ
మాటలఁ బోవునే దురభిమానము యెక్కుడుఁ పూను గాక, యీ
చ్చోటన సంగరంబు లగుచొప్పులు పుట్టినసైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ? సోదరా? కానల నుండ నచ్యుతా!

ఉ. ఏనిటులంటి నా వలవ దంచను నీవును రాజు దమ్ములుం
గానుచితంబు సూచి మన కార్యము, మీనుజనత్వముం జెడం
గా నొకభంగి సేయక తగం గురువర్గముతోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుఁడు నేర్పు లేర్పడన్.

ఉ. ఆఱడిబోకయున్, ఫలము నందుటయున్, గని పల్కనేరమిన్
మాఱటనోరిదానసయి మాటలు చిత్తమునందు నిల్పకే
గాఱులు ప్రేలెదన్ వినుఁడు, కర్జము నెగ్గును గాన నల్కమై
వీఱిడియైనమానిసికి వెండి వివేకము గల్గనేర్చునే.

చ. వరమునఁ బుట్టితిన్, భరతవంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ
వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి, నీతివిక్రమ
స్థిరు లగుపుత్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపుఁ గాంచితిన్
సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్.

వ. అట్లుంగాక.

ఉ. నీవు సుభద్రకంటె గడునెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు; దిట్టినముఁ బంకజనాభ, యొకండు రాజసూ
యావభృథంబునందు శుచియై పెనుపొందినవేణి పట్టి యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చె! కులాంగన నిట్లొనర్తురే?

ఉ. ఆసభ కేకవస్త్ర యగునట్టి ననుం గొనివచ్చి నొంచు దు
శ్శాసనుజూచుచుం బతు లసంభ్రములై తగుచేష్ట లేక నా
యాసలు మాని చిత్రముల యాకృతినున్నయెడన్, ముకుంద! వి
శ్వాసముతోడ నిన్ గొలువవచ్చె మనం బదియుం దలంపవే?

చ. అరయమిఁ జేసి కోడలన కప్పుడు దాసిగఁ జేసె, నమ్మహా
పురుషునిపాలికిం బతులు పోవఁగ వీరలతోన యేనుఁ జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో? అటుగాక పాడిపై
నరవుడమోపి జేయుకున్నా వారికి? మాధవ! నిశ్చయింపుమా!

వ. అని యట్లుగ్గడించి,

ఉ. ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విచ్చి వెండ్రుకల్
దావలచేతఁ బూని యసితచ్ఛవిఁ బోల్చు మహాభుజంగమో
నా విలసిల్లి ప్రేంకగ మనంబునఁ బొంగు విషాదరోషముల్
గావఁగలేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై.

క. ఇవి దుస్ససేను ప్రేళ్ళం
దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి కౌ
రవులకడ దీఱుమాటల
యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వినిన్.

సీ. ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యాచేయి
దొలుత గాఁ బోరిలో దుస్ససేను
తనువింతలింతలు తునియలై చెదరి రూ
పఱియున్నఁ గని యుడుకాఱుగాక
యలుపాలఁ బొనుపడునట్టి చిచ్చే యిది?
పెనుగద వట్టిన భీమసేను
బాహుబలంబునఁ బాటించి గాండీవ
మనునొక విల్లెవ్వఁడును వహించు

ఆ. క్షత్రవిక్రమంబుఁగాల్పనే? యిట్లు
బన్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు నీసుంగుఁ గన్నారఁ
గానఁబడయు మైతిమేనిఁ గృష్ణ?

ఉ. నెట్టన యిట్టియల్క మదినిల్పితి రక్కసతాల్మి జిచ్చొడిం
గట్టినయట్లు పెద్దయును గాలము దీనికి నాఱు పెన్నదున్
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు గాఁచు నట్టిలో
బుట్టువు నీవు, తేజమునఁ బోల్చిన భర్తలు గల్గనచ్యుతా!

వ. అనుచు నెలుంగు రాలుపడనేడ్చిన యాజ్ఞసేనిం గృపాయత్తచిత్తుం డయి నారాయణుం డూఱార్చి కూర్చుండ నియమించి కన్నీరు దుడువను, బెన్నెఱివేణి ముడువనుం దగువారి నియోగించి యమ్మానినితో నిట్లనియె."

పై శ్లోకములనుఁ బద్యములనుఁ జదివి చూచినచో సంస్కృత భారతమునకుఁ దిక్కనసోమయాజి రచనము వన్నె పెట్టిన దని తోఁపక మానదు. ఈ సందర్భమున శ్రీ కొ. లక్ష్మణరావుపంతులుగారు వ్రాసిన వాక్యముల నుదాహరించెదను. "తిక్కనకృతభారతము సంస్కృతమహాభారతమునకు భాషాంతరీకరణ మని మన వారంద ఱనుకొనుచున్నారు; కాని యది గొప్పపొరబాటు. ఇట్లనుకొనుట మనము తిక్కనయెడ నొక యపరాధము సేయుటయే. సంస్కృతభారతము బంగారపుముద్ద. ఆంధ్రభారత మా ముద్దలోనుండి కావలయునంత బంగారమును దీసికొని స్వర్ణకారుని బుద్ధివైభవముతోఁ జేయంబడిన చక్కని సువర్ణకమలము వంటిది. ఉభయభారతములలోని యీ భేదముఁ జూపి స్వర్ణకారుని బుద్ధివైభవము వెల్లడిచేయుటయే మా యుద్దేశము." విరాటోద్యోగ పర్వములందక్క తక్కినభాగమునుఁ దిక్కన క్లుప్తముచేసినాఁడు.

పూర్వకాలమున విశేష రాజకార్యములలో నవసరము వచ్చి నప్పుడు మహారాణులుఁ గూడ సభలోనుండి చర్చలలోఁ బాల్గొనుచుం డెడివారని యీ కథవలన మనకుఁ దెలియుచున్నది. ఇట్టి సాంప్రదాయము పురాణయుగములోనే కాదు. చారిత్రకయుగమునఁ గూడఁ గలదు. పదునొకొండవ శతాబ్దిప్రాంతమున మనదేశముపైకి దండెత్తి వచ్చిన మహమ్మదీయులకు సాహాయ్య మొనర్చుచున్న జయచంద్ర మహారాజుపై యుద్ధముచేయఁబోవుచు నాతనియల్లుఁ డగుపృథ్వీరాజు చిత్తూరురాణా యైన సమరసింహుఁడు మొదలగు మహారాజులతో నాలోచించుటకై యొకసభను సమకూర్చె ననియు, పృథ్వీరాజు నాజ్ఞానుసారముగ నాతనిరాణియుఁ జయచంద్రుని తనయయు నగుసంయుక్తాదేవి యీ సభకువచ్చి సమరతంత్రములలోఁ బాల్గొని దేశమతసంరక్షణమునకై జయచంద్రునితోఁ బోరుసల్పుట యుచితమే యనియు నంచుఁ దండ్రి ప్రాణములు వోయిననుఁ దా నందులకుఁ జింతింపననియుఁ దెల్పి భర్త ప్రయత్నమునకుఁ దోడువడెననియు, నప్పు డాసభయందున్న చాందాభట్టు అను మహాకవి "పృథ్వీరాయరాసా" యను గ్రంథమున వ్రాసి యున్నాఁడు.

తిక్కనమహాకవి రచించినకావ్యములు :

తిక్కనసోమయాజి సంస్కృతాంధ్రములయందుఁ బెక్కు గ్రంథములను రచించినట్లు చెప్పుదురు. కాని రెండుగ్రంథములు మాత్రమే మన కిప్పుడులభ్యము లగుచున్నవి. అందు మొదటిది నిర్వచనోత్తరరామాయణము. రెండవది శ్రీమహాభారతము.

నిర్వచనోత్తర రామాయణము :

ఇది వాల్మీకిరామాయణములోనిసప్తమకాండమున కాంధ్రీకరణము. రావణవధానంతరము శ్రీరామచంద్రుఁ డయోధ్యయందు పట్టాభిషిక్తుఁ డగువఱకునుఁ జరగినకథకుఁ బూర్వరామాయణ మనిపేరు. ఇది యాఱుకాండలు కలది. ఈ యాఱుకాండములలోనఁ జెప్పని రావణజననాది పూర్వవృత్తాంతమును శ్రీ రామపట్టాభిషేకానంతర సీతావనవాసకథయు కుశలవజననాదికథలును నేడవకాండమునను న్నవి. దీని కుత్తరరామాయణ మనిపేరు. దీని నీ యుభయకవిమిత్రుఁడు రచించెను. గ్రంథమందెచ్చటను వచనము లేకుండ రచియించుటచే దీనికి నిర్వచనోత్తరరామాయణమని పేరువచ్చినది. కవులు సాధారణముగాఁ గథాసందర్భమునుఁ గలుపు పట్టులయందును, వర్ణనలనుఁ జేయుపట్టులను వచనములను రచియించుచుందురు. అట్టివి లేకుండ నా భాగములనుఁగూడఁ బద్యములచేఁ బూరించిన సొంపుగ నుండునని తన యభిప్రాయమునఁ దిక్కన యీ క్రిందిపద్యములలో వ్యక్తీకరించినాఁడు.

క. వచనము లేకయు వర్ణన
రచియింపఁగఁ గొంత వచ్చుఁ బ్రౌఢులకుఁ గథా
ప్రచయముఁ బద్యములన పొం
దుచితంబుగఁ జెప్పఁ గావ్య లొప్పిద మనరే?

క. లలితపదహృద్యపద్యం
బులన కథార్థంబు ఘటితపూర్వాపరమై
యలఁతి యలంతి తునియలుగ
హాల సంధించినవిధంబు నమరఁగఁబలయున్.

ఇతఁడు పూర్వరామాయణమును విడచి యుత్తరరామాయణమునుఁ దెలిఁగించుటకుఁ గారణ మంతకుఁ బూర్వమే పూర్వరామాయణమును భాస్కరుఁడాంధ్రీకరించియుండుటయే యనియు భాస్కర రామాయణమును రచించిన దీతని పితామహుఁడైన భాస్కరుఁడే యనియుఁ గొందఱనుచున్నారు. ఈ సందర్భమునఁ దిక్కన రచించిన రెండుపద్యముల నుదాహరించుచు వానినిగూర్చియు, భాస్కరరామాయణ కర్తృత్వమునుగూర్చియు మంత్రిభాస్కరునిచారిత్రమున విపులముగాఁ జర్చించియున్నాఁడను. ఆ విషయములను మరల నిట వ్రాయుట పునరుక్తి యని విడచితిని. తిక్కనసోమయాజి భారతాంధ్రీకరణమువలెనే నిర్వచనోత్తరరామాయణమును మక్కికి మక్కిగాఁ జేయక స్వేచ్ఛఁ గైకొనిరచించియున్నాఁడు. నిర్వచనోత్తరరామాయణమునుఁ బదియాశ్వాసములుగా రచియించి తనప్రభువగు మనుమసిద్ధి మహారాజున కంకితముచేసెను. ఇందు నన్నయవలెనే యితఁడును తన గ్రంథము మొదల నాంధ్రపద్యమును వ్రాయక యీ క్రింది సంస్కృత శ్లోకమును రచియించెను.

శ్లో. శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజాస్తమ్భే జగన్మణ్డల
ప్రసాదస్థిరభారభాజి దధతీ సా సాలభఞ్జీశ్రియం
శుణ్డాలోత్తమగణ్డభిత్తిషు మదవ్యాసఙ్గవశ్యాత్మనాం
యా ముత్తేజయతేతరాం మధువిహా మానన్దసాన్ద్రస్థితిః॥

శ్రీ మహాభారతము

వ్యాసవిరచితమైన సంస్కృతభారతమునందలి పదునెనిమిది పర్వములలోను నన్నయభట్టు ఆదిపర్వమును, సభాపర్వమును, నరణ్య పర్వమునఁ గొంతభాగము నాంధ్రీకరించెను.

తిక్కనసోమయాజి యరణ్యపర్వమునందలి తక్కినభాగము నాంధ్రీకరింపవలసియుండఁగా దానిని విడచి విరాటపర్వాదిగాఁ బదునైదు పర్వముల నాంధ్రీకరించెను. తిక్కనరచించిన:

"ఉ. ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెనుపొందియుండ నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

మ. హృదయాహ్లాదిచతుర్థ మూర్జితకథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యుద్యోగాదులుం గూడఁగా
బదియేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టం రచియించు టొప్పు బుధసంతోషంబు నింపారఁగన్

అనుపద్యములనుబట్టి యరణ్యపర్వమును నన్నయభట్టు పూర్తిగనే రచించినట్లు కన్పట్టుచున్నది. కాని సాక్ష్యమిందులకు వ్యతిరేకముగా నున్నది. ఈవిషయమునుగూర్చి యెఱ్ఱాప్రెగ్గడచరిత్రమునఁ జర్చింపఁ దలంచి యిట వదలివైచితిని.

ఆంధ్రలోకాభ్యుదయమునుఁ గాంక్షించి, యీమహాభారత నిర్మాణకార్యమునకుఁ దాను నంసిద్ధుఁడ నైతి నని యీకవిసార్వభౌముఁ డీక్రిందపద్యములోఁ జెప్పియున్నాఁడు.

"ఉ. కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయసంస్మృతిం
శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్.

ప్రశాంతహృదయముతో భారతరచనమునకు దీక్షఁ గైకొనిన యీ పుణ్యపురుషుఁడు తెలుఁగుబాసలో భారతమును రచియించుట "పురుషార్థరుపక్వఫల" మనిహరిహరనాథుఁడే రచియించిన ట్లీకవి యీ క్రిందిపద్యములలోఁ దెలిపినాఁడు.

క. పారాశర్యనికృతి యయి
భారత మనుపేరఁ బరగుపంచమవేదం
బారాధ్యము జనులకు ద
ద్గౌరవ మూహించి నీ వఖండితభక్తిన్

తే. తెనుఁగుబాస వినిర్మింపఁ దిప్పురు టరయు
భవ్యపురుషార్థతరుకల్పఫలము గాదె
దీని కెడనియ్యకొని వేడ్క నాకు కృతిప
తిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ!

ఆంధ్రభాషలో హృద్యము లగు కావ్యములను రచించినవారిలోఁ దిక్కనసోమయాజిని మొదటివానినిగా నెన్నవచ్చును. ఇంతే కాదు. పరిమాణమునందుఁగూడ నీతనితో సమానముగ గ్రంథరచనము గావించిన యాంధ్రకవు లింకొకరు లేరు. నిర్వచనోత్తరరామాయణమున దాదాపు ౧౩౦౦ పద్యములును, మహాభారతమునఁ బదునాఱువేలు గద్యపద్యములునుఁ గలవు. ఈతని రచనములయం దే భాగమునఁ దీసి చదివినను విసువు జనింపక యింకను జదువవలయుననియే యుత్సాహము కలుగుచుండును.

తిక్కన పద్యరచనము:

కందపద్యరచనమునం దీతఁడు కడునేర్పరి. మన దేశమున "పందినిఁ బొడిచినవాఁడు బంటు. కందమునుఁ జేసినవాఁడు కవి" యనునొక నానుడి కలదు. కందపద్యములను రచించుట కష్టతర మని దీనియభిప్రాయము. కవిచౌడప్ప చెప్పిన:

"క. ముందుగఁ జను దినములలో
కందమునకు సోమయాజి ఘనుఁ డందురు నేఁ
డందఱు నను ఘనుఁ డందురు
కందమునకుఁ గుందవరపుకవిచౌడప్పా."

అను పద్యమునుబట్టి పూర్వకాలములోఁ దిక్కనసోమయాజి కందములు ఖ్యాతికెక్కినవని తెలియుచున్నది. ఇతఁడు కందపద్యములను సరసముగా రచియించుటే కాక సంఖ్యయందుగూడ వాని నధికముగా వ్రాసియున్నాఁడు. దాదాపు ౧౩౦౦ పద్యములుగల నిర్వచనోత్తర రామాయణములో నైదువందల యిరువదివఱకు గ్రంథము లున్నవి. భారతమునందలి మొత్తము గద్యపద్యములు పదునాఱువేలలోను మూఁడవభాగ

మయిదువేల మూడువందలు కందపద్యములు. భాస్కరరామాయణమున మల్లికార్జునభట్టురచించిన భాగములోఁ గూడ నూటికి నలువదికి మించి కందపద్యములు కలవు. మల్లికార్జునభట్టు పేరఁగల భాగములోఁ జాలభాగము మంత్రిభాస్కరుఁడు రచించె నని యొక వాదము కలదు. ఆవాదము సత్యమయ్యెనేని, తాతయు మనుమఁడును, కొమారులును మంత్రులు, నగుటయందే కాక, కందపద్యరచనమునఁ గూడ నొకరి కొకరు దీసిపోక వంశమర్యాదను గాపాడిరని విదిత మగును. విరాటపర్వాదియందుఁ దక్కఁ దక్కిన ప్రతియాశ్వాసాదియందునుఁ దిక్కన కందపద్యములనే వ్రాసియుండెను.

తిక్కనసోమయాజి సామాన్యముగా, శార్దూల మత్తేభాది పద్యములనే గాని, కవిరాజవిరాజితాదివృత్తములను రచియించుటలో నేర్పరి కాఁడని యెవ్వరో యాక్షేపింపగా స్త్రీపర్వమునఁగష్టపడి యాతఁడు విశేషముగా వృత్తములను రచియించెనని కొందఱనుచున్నారు. స్త్రీపర్వమున నట్టివృత్తములు విశేషముగా నున్నమాట సత్యమే కాని, యెవరో యాక్షేపించిన మీఁదట వానిని రచించె ననుటలో సత్యముండదు. స్త్రీపర్వమందలి కథ దుఃఖకరమైనది. అందు స్త్రీపాత్రము లెక్కువగా పాల్గొని శోకపూరితము లగువాక్యములఁ బల్కుచుండుట గాననగును. ఆకథ కనుకూలముగ నుండునని యావృత్తముల నాతఁడు రచియించి యుండును. చంపకోత్పలములుగాని, మత్తేభశార్దూలములుగాని, స్త్రీపర్వమున లేవు. దాదాపు నలువదివిధములగు నితరవృత్తము లిందుఁ గలవు.

ఈతఁడు రచియించిన రెండుకావ్యములలోను, నిర్వచనోత్తర రామాయణకవిత్వముకంటె మహాభారతకవిత్వము రసవత్తరమై యారితేరి హృదయంగమముగా నున్నది. నిర్వచనోత్తరరామాయణమునఁ గొన్నితావులలో నీరసకవిత్వము నారికేళపాకములో నున్నదని కొంద ఱందురు. కాని యది సత్యము కాదు.

ఈతనికవిత్వశైలి చూపుటకిదివఱకుదాహరింపఁబడినపద్యములే చాలియున్నవి. ఈతనిపద్యములన్నియు, రసవంతములై, రుచ్యములై, మనోహరములగు మామిడిపండ్లనుఁ బోలి యుండును. అట్టివానిలో

మంచివివి యనియొప్పుట యసంభవము. అయినను, రామాయణము నుండి యాశ్వాసమున కొక్కటిచొప్పున పదిపద్యములను, భారతమునుండి పర్వమున కొకటిచొప్పున పదునెనిమిదిపద్యముల నీదిగువ నుదాహరించు చున్నాడను. మచ్చుచూపుటలో మంచిచెడ్డలు రెండిటిని గూడఁ జూపుట ధర్మముకదా !

నిర్వచనోత్తరరామాయణము :

చ. జనకునియజ్ఞవేదికఁ బ్రశస్తముగా జనియించి యంగనా
జనతకు భూషణం బనఁగఁ జాలిన సీతకు రుద్రచాపభం
జన మనుసుంకు విచ్చి నృపసత్తమసూతిఁ బరిగ్రహించి పే
ర్చినయుభయానురాగమునఁ జిత్తభవుం జరితార్థుఁ జేయుచున్. ఆ౧

చ. వరములు గాంచి బాహుబలవంతుఁ డనం దగుమాల్యవంతుఁ డ
చ్చెరు వగువిక్రమంబునఁ బ్రసిద్ధి వహించి నిజానుజన్ములం
గర మనురక్తి మన్ననఁ దగం గొనియాడుచు సర్వలోకభీ
కరుఁ డయి దేవతామునినికాయము దల్లడ మందుచుండఁగన్. ఆ౨

చ. తనయుఁడు తండ్రి యాగ్రజుఁడు తమ్ముఁ డనం జనుసయ్యు రాజ్యముల్
గొను నెడ శౌర్యలంపటులకున్ మఱి చుట్టఱికంబు గల్గునే
యను వగునంతకున్ రిపు నుదగ్రత సైఁచిన నింక నూరకుం
డ నగునె వేగ పోరికిఁ గడంగుము నీభుజదర్ప మేర్పడన్. ఆ 3

శా. కేలీకందుక మల్ల నెత్తుకొను మాడ్కిం బట్టి నాయున్నయీ
కైలాసాచల మిట్లు నీవు నెరయంగా నెత్తినం జోద్యమై
నీలా వేఁగొనియాడు నెల్లరును వర్ణింపంగ నీకొక్క పే
రేలోకంబునఁ జెల్ల దైత్యులకుఁ బెంపెక్కంగ నే నిచ్చెదన్. ఆ ౪

చ. పరమపతివ్రతావిభవభాసురలీల వెలుంగుమమ్ము ని
ష్కరుణత నిమ్మెయిం బఱిచెఁ గావున నీదనుజాధముండు స
త్పురుషపరిగ్రహం బయినపుణ్యసతిం గలుషింపఁ జేసి త
ద్వరుని పరాక్రమంబున నవశ్యము మృత్యువుఁ బొందుఁ గావుతన్. ఆ౫

ఉ. పంచినకెంపుఁ బాసి దివిఁ బ్రాకి దిశల్ వెలిఁగించి చంద్రకాం
తంబుల నీరు సేసి కుముదంబులఁ బిండువు సేయఁ బంచి యు

బ్జంబుల పేర్చి పుచ్చి మహిసాయకముల్ గరసానఁబట్టి కో
కంబుల నేఁచి లోకము పొగడ్తలు సేయని చంద్రుఁడున్నెడన్. ఆ ౬

శా. వాలిం గీలియు వాయుపుత్త్రు సరియే వాఁ డాత్మశక్తిజ్ఞుఁడై
యీలోకంబులు గెల్తు నే ననిన మా తెందుం గలండే మహీ
పాలాగ్రేసర వానివర్తనముఁ జెప్పం జిట్టలావిక్రమ
శ్రీలోలున్ భవదీయసన్నిధిఁ బ్రశంసింప న్దగుం జెప్పెదన్. ఆ ౭

ఉ. రావణునింట నుండఁగ ధరాసుత నేమరలంగఁ దెచ్చి సం
భావన సేఁత కష్టమని పల్కిరి చూచితె లక్ష్మణా! మహా
దేవుఁడు బ్రహ్మయున్ మునులు దేవగణంబులు మెచ్చ నయ్యెడం
బావకుఁ డిచ్చె నాకు సతిఁ బాపపుమాటలు పుట్టె నియ్యెడన్. ఆ ౮

మ. ఒకనారీతిలకంబు గానవములో నుద్దామశోకార్తయై
వికలాలోకన మశ్రుధారలును బృథ్వీరేణులిప్తాంగముం
బ్రకటాక్రందనమున్ వికీర్ణకబరీభారంబు వక్త్రాబ్జశో
షకనిశ్వాసగమోష్మముం గలయవస్థం బొందఁగా నయ్యెడన్. ఆ ౯

చ. జయజయశబ్దముల్ సెలఁగ సర్వజనంబు నెలర్ప వర్మిలిం
బ్రియసుత యుగ్మముం దిగిచి పెద్దయుఁ బ్రొద్దొగిఁ గౌగిలించి మో
దయుతమనస్కుఁడై నృపతి దస్సుల నమ్మద మొందఁ జేసి య
వ్యయపరివృద్ధి తల్లుల మనం బలరం బ్రకటించి వేడుకన్. ఆ ౧౦

మహాభారతము:

ఉ. ఈతఁ డజాతశత్రుఁడు మహిం దగ దిగ్విజయంబు సేసె వి
ద్యాతిశయర్ధి వాసవుమహాసన మైనను నెక్క నర్హుఁడు
ద్ద్యోతితమూర్తి కౌరవకులోద్వహుఁ డార్యనికాయసంతత
ఖ్యాతచరిత్రుఁ డీ చిఱుతగద్దియకుం దగఁడే నరేశ్వరా. వి. ప.

మ. తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్మడవియందుం బేరు వంచించియున్
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగి రా పాలీకపోవచ్చునే
యది గాదేఁ తెగి బంటవై యుఱుము మాయ వ్రేపున్న నేర్పింక చె
ల్లదు సూనీకిని యానుయోధనునియుల్లం బుచ్చినో నాడుమా. ఉ. ప.

ఉ. కోపము సంహరింపు యదుకుంజర ! పాండవకోటి కెల్లనుం
దేవవు గావె నీవిటు లధీరతఁ బూనికి దప్పినం బ్రతి
జ్ఞావరుఁ డైనధర్మసుతుశౌర్యము ధైర్యము బాహువీర్యమున్
రూపఱిపోక కాదె యనురూపమె నీ కిది లోకనాయకా. భీ. ప.

చ. వినుము కిరీటి ! దివ్యశరవేదివి నాఁజను దేను లేఁచచో
టను మును నెల్లె నీకు నిచటం జననిత్తునె యిప్డు నీబలం
బును హరినేర్పుఁ జూచుటకుఁ బోరికి వచ్చితి నీవు పాండురా
జునకు జనించితేనిఁ దెగిచూపుము శౌర్యము నస్త్రవీర్యమున్. ద్రో. ప.

శా. క్రాంతిం బొందినవాఁడు పార్థుఁ డపరిక్రాంతుండు గర్ణుండు దు
ర్దాంతోదగ్రత నేఁడు గీటడఁచు నీతం డాతనిన్ వహ్ని య
త్యంతంబున్ శిశిరత్వ మొందినను గోత్రాళులే వడంకాడినం
గుంతీసూనునిచేతఁ గర్ణున కసం గోల్పాటు వాటిల్లునే. క. ప.

చ. చదివితి నెల్ల వేదములు జన్నము లొప్పఁగఁ జేసితిన్ రమా
స్పద మగువృత్తిఁ బొల్చి నరపాలకు లెల్లను గొల్వఁ గంటి దు
ర్మదరిపుగాఢగర్వపరిమర్దనకేళి యొనర్చితిం దగం
దుది నని మిత్రబాంధవులతోఁ ద్రిదివంబున కేఁగు టొప్పదే. శం. ప.

చ. దురమున నఁ బెంపుఁ జేవయును దుర్దమలీల వెలుంగుచుండ ను
స్థిరత శమంతపంచకవిశిష్టతలంబునఁ బోరి సద్గతిన్
బొరసెదు నీవునై వగపు వుట్టము బంధులు రాజ దేవులున్
విరియుచు రింక వారి దగుదీనత కోర్వక యుమ్మలించెదన్. సా. ప.

మంగళమహాశ్రీ :

ఈతఁడు రణంబునకు నెత్తి చనుచుండియును
నెంతయును భక్తిఁ గని నాకుం
బ్రీతి యొసఁగం బలికి ప్రేమ మొలయం బొగడి
పెద్దయు వినీతినిరతుండై
చేతులు మొగిడ్చి జయసిద్ధియుఁగ దీవన వి
శిష్టదయ నిమ్మనిన ధర్మం
జేతల ననూన మగు సిద్ధజయ మగుమాతలకు
నెట్లయిన సిద్ధ మగు సంటిక్షా. శ్రీ. ప.

మ. నిజదారైకపరత్వముం గరుణయున్ నిక్కంబునుం దాల్మియున్
సుజనాసంగము దేవపిత్రతిథిసంశుద్ధార్చనల్ హవ్యభు
గ్భుజనంబున్ సకలాశ్రమస్థులను శక్యప్రక్రియం బ్రోవుఁ బం
కజగర్భుండు గృహస్థధర్మములుగాఁ గల్పించె సర్వేశ్వరా. శాం.ప.

చ. అనశననిష్ఠఁ జేసి సుగలాదిమునుల్ మహితానుభావులై
రనఘ సహస్రవర్షసమనంతరకల్పితమైనయేకభు
క్తనియమతంత్రమున్ నడపి గాధితనూజుఁడు బ్రాహ్మణత్వమున్
గనియె మహోపవాసములఁ గాని ఫలంబులు లేవు భావరా. అ.ప.

ఉ. ఉత్తర బిడ్డ నెత్తికొని యొయ్యన మా మలరంగ వచ్చి య
త్యుత్తమ తేజుఁడైన పురుషోత్తము నంఘ్రులపొంత భూస్థలిం
జిత్త మెలర్పఁగాఁ దనదు చెన్నగుఫాలము సేర్చినన్ ముదా
యుత్తమనస్కుఁడై యతఁడు సాదరభాషల గారవించుచున్. అ.ప.

క. మాయయ్య కాననమునకుఁ
బోయెడు నేనితనితోడఁ బోయెద శుశ్రూ
షాయత్తుఁడనై యుండెద
నీయువిదలఁ గొనుచు మగిడి యేగుము తల్లీ. ఆ. వ.

చ. వలసిననట్టికార్యమును వావిరి నెట్టుగనైనఁ జేయఁగా
వలఁతి మృతుం బరీక్షితుని వత్సలతం బ్రదికించె శౌరి మొ
క్కలమున యాదవుల్ పెనఁగఁగాఁ గని మాన్పఁ డుపేక్ష సేసె నీ
పొలియుట వశ్యభావ్యమని బుద్ధిఁ దలంచుట గాననయ్యెడున్. మా.ప.

చ. తనువు దొఱంగ కిట్లు సుకృతంబుల పెంపున వచ్చితి వ్విదం
బునకు మహాత్మ! యిచ్చటను బోవను నిమదిఁ బాసి మర్త్యతం
బనుపడియున్న నెయ్యము సభాసదులన్ శుభదృష్టిఁ జూడుమా
మునులను సిద్ధులందగు నెముంగటిచందము నొందియుండఁగన్. మ.ప్ర.

ఉ. భారత మర్థితో వినిన భక్తిఁ జరించిన శ్రీయు నాయువున్
భూరియశంబునుం బ్రమదముల్ దృఢవిద్యయుఁ గల్గు వాంఛితా
కోరిక లైనవేగ మొనఁగూడు సుపుత్త్రినిఁ గాంచు సద్వరున్
గారవ మొప్పఁగాఁ బడయు గర్భిణియున్ వరుసం గుమారియున్. స్వా.ప.

తిక్కన రచించిన యుతర కావ్యములు :

(౧) విజయసేనము.

తిక్కనామాత్యుఁడు విజయసేన మను ప్రబంధమును రచించె ననియొక ప్రతీతి కలదు. ఈక్రిందిపద్యములు విజయసేనములోనివని పెదపాటిజగ్గనకవి సమకూర్చిన ప్రబంధరత్నావళిలో నుదాహరించి యున్నాఁడు. ఈరత్నావళిని శ్రీవేటూరిప్రభాకరశాస్త్రిలుగారు ప్రకటించియున్నారు. విజయసేన మిప్పు డెచ్చటను గనుపట్టుట లేదు. ఇది యొకప్రౌఢకావ్య మని చెప్పుచు శ్రీ చిలుకూరివీరభద్రరావుగా రాంధ్రులచరిత్రమున నీక్రిందిపద్యముల నుదాహరించియున్నారు. ఈ పద్యములు వారికెట్లులభించినవో తెలియదు.

"సీ. ఘనసారకస్తూరికాగంధముల నన్య
గంధబంధంబులఁ గలపి కలపి,
కుసుమితవల్లికాలసితవీథులఁ జొచ్చి
గని సరోగృహముల మునిఁగి మునిఁగి,
సమధికామోర్యాంగసంగీతములతోన
కన్నెతీఁగల కాట కలపి కలపి,
కుముదకుట్మలకుటీకోరకంబులు దూఱి
యలిదంపతులకుఁ బ్రదఁ దెలిపి దెలిపి,
గీ. యనుదినమ్ము నప్పురాంతికమ్మున గట్టు
వాలు పోలె విప్రవరుఁడు పోలె
నట్టువోలెఁ దాను వచ్చినచెలి పోలె
మలయుచుండు మందమారుతంబు.

ఉ. పల్లవపుష్పసంపదలఁ బంచి వసంతుఁడు కాపురాక కై
యెల్లవనంబు సంకటము లేదఁగఁ దా గొడికంబు మీఱి న
ట్లల్లన క్రోలి క్రోలి మలయానిలుఁ డందుఁ బురాణపత్త్రముల్
చల్లఁగఁ జేసె పత్త్రికయుఁ బటుత్వము కాముఁడు విచ్చలింపఁగన్."

విజయసేనము : (ప్రబంధరత్నావళిలోనివి).

ఉ. అల్లనఁ దొండ మెత్తి శివు నౌదలయేటిజలంబు పుచ్చి సం
ఫుల్లతఁ బాదపీఠకము వొంతనయున్నసహస్రనేత్రుపైఁ
జల్లి శివార్చనాకమలసంహతిఁ బ్రోక్షణ సేయు నట్లు శో
భిల్లుగజాననుండు మదభీప్సితసిద్ధికరుండు గావుతన్.

శా. గీర్వాణాచలసానువప్రరదనక్రీడాహతం బైన న
య్యుర్వీరంధ్రము నంద నంత ఫణరత్నోద్యత్ప్రభ ల్పర్వి దృ
క్పర్వంబై పొడగట్టి పేర్చిన మదింగంబుం బయంచున్ గన
గ్గర్వోన్మీలితనేత్రుఁ డై మెఱయు వేదండాననుం గొల్చెదన్.

సీ. పద్మంబులును వజ్రపద్మరాగప్రతి
బింబములును తగ బెరసి మెఱయఁ
గల్లోలములును రంగన్మకరాయిత
తుండములును పటు తోట్రుపడఁగ,
బిసములు విహారణరససమాగతరసా
తలనాగశిశువులు చెలిమి సేయఁ
జక్రయుగ్మంబులు జలకేళిలోలని
తంబినీస్తనములు తడఁబడంగ

గీ. సొంపుమీఱి నట్టిపెంపును గంభీర
తయును బరవు బోవు వేడ్కఁ దగిలి జనులు
సంస్తుతింప నఖిలసన్నివేశస్థితి
నప్పురంబు పరిఖ యతిశయిల్లు.

చ. తరుణుల వీఁగుఁజన్నుఁగవ తాఁకున మన్మథచక్రవాకబం
ధురగతి లీలఁ గామినుల తోరపుటూరులఘట్టనంబులన్
కరివరహస్తకాండపటుఘట్టనలన్ బరిఖాతరంగముల్
దిరుగుడు వడ్డతీరములఁ దెట్టువు గట్టు సరోజరేణువుల్.

చ. కొనియెద మన్నబండరులు కోటుల కమ్ముదు ; రమ్మఁ బూనితె
చ్చిన సర కెంత పెద్దవెల చెప్పినఁ గొంద్రు తగంగ నిచ్చి ; న
చ్చినవెల తీర్చి లక్ష్మి తమచెప్పినయట్టుల చేయు సొంపు పే
ర్కొన గణుతింప రాదు ; పురికోమటులం బ్రణుతింప నొప్పదే !

క. కిసలయకదళీబిసబిం
బసుధాంశుప్రాయవస్తుబహువిధరూపో
ల్లసము మద మధుప సఖుఁ డాక
యసమాకృతి దాల్చె ననఁగ నంగన యొప్పెన్.

సీ. మదనవశీకార మంత్రదేవత దృష్టి
గోచరమూర్తిఁ గైకొనియె నొక్కొ?
సితకరబింబ నిస్సృతసుధాధార ని
తంబినీరూపంబుఁ దాల్చె నొక్కొ?
విధి కామినీసృష్టి విజ్ఞానపరసీమ
భాసురతనులీలఁ బడసె నొక్కొ?
శృంగారనవరస శ్రీవిలాసోన్నతి
సుందరాకారంబు నొందె నొక్కొ?

గీ. కాక యొకవధూటికడుపునఁ బుట్టిన
భామ కేల యిట్టిరామణీయ
కంబు గలుగుననుచుఁ గన్నియపై మహీ
పాలసుతుఁడు దృష్టిఁ బఱపె నర్థి.

సీ. అరిమానసమ్ములు దరికొనియేర్చు నె
వ్వని యుజ్జ్వలాకార వైభవంబు?
బంధులలజ్జానతిఁ బొందునట్లుగఁ జేయు
నెవ్వని పాండిత్య మెసకఁ మెసఁగఁ?
నెట్టిమాన్యుల నైన నెవ్వనివితరణం
బులు వందిజనుల చాపల మొనర్చు?
వనితాజనము మానధనముఁ గోల్పుచ్చు వి
చ్చలవిడి నెవ్వాని విలసనంబు

గీ. అట్టి విజయు నేను నభిరామమూర్తి వి
ద్యానిరూఢమతి వదాన్యవరుఁడు
మధురవిభ్రమైకనిధి యను జగమెల్ల
నతఁడు చిత్రగుణసముద్రుఁ డగుట.

శా. ఉత్సాహప్రభుమంత్రశక్తుల నజేయుండై పరీక్షించినన్
దిత్యావ్యగ్రుఁడు గాక విగ్రహముతో దేశంబుఁ గాలంబు సం
పత్సామగ్ర్యముఁ జూపి శక్యము దెసన్ బ్రారంభియై భూప్రజా
వాత్సల్యార్థమనస్కుఁడైనపతి శశ్వచ్ఛ్రీసమేతుండగున్.

క. పరధన పరాంగనాజన
పరిహారము ధర్మపథ మందురు స
త్పురుషులు మఱవక వీనిం
బరికింపుము వినకు మెపుడు పైశున్యంబుల్.

గీ. మహిమ చెడదు స్వామ్యమాత్య సుహృత్కోశ
రాష్ట్రదుర్గబల పరాయణులకు
నీవు నిదియు నెఱిఁగి కావింపు సప్తాంగ
సంగ్రహంబు నీతిశాస్త్రనిపుణ.

ఈక్రింది సీసపద్యము తిక్కనవిజయసేనము లోనిదని బ్ర. శ్రీ మానవిల్లి రామకృష్ణకవిగారు వ్రాసియున్నారు.

సీ. అమ్మోదననిసఁ బద్మాక్షుకౌస్తుభ మైన
వెలవక కొనియొడి వెరవుగలిగి
విలువ యిచ్చెదమని వేఁడినఁ బులిజున్నుఁ
గమ్మపసిండియు నమ్మఁగలిగి
యేవస్తు వెంత ప్రొద్దెందఱు చనుదెంచి
యొంతటికడిగన నెదురఁ గలిగి
తమయింట లేనియర్థము లర్థపతియింట
నైన వెదకిన లేవనుట గలిగి

గీ. తమకులాచార వర్తన(?)ము కొఱకు
సంగడుల యొప్పునకును బేహారుమాట
గాని లాభమునకు గా దనంగ
నఱలుదురు పురవరమున వైశ్యవరులు.

ఈ పద్యమును బ్ర. శ్రీ. ప్రభాకరశాస్త్రులుగారు తమ ప్రబంధ రత్నావళి పీఠికలో నుదాహరించుచు, పైపద్యములలో నొకటి వైశ్య

వర్ణన మున్నది. ఇదియు వైశ్యవర్ణనమే. రెండు పద్యములును విజయ సేనమందలివే యగునా? యని శంకించినారు. పైపద్యములలో గణపతి స్తోత్రమును రెండు పద్యములలో నున్నది. పరిఖావర్ణనమును రెండు పద్యములలోఁ గన్పట్టుచున్నది. జగ్గనకవి సమకూర్పుటలో నేదైన పొరపాటు జరిగెనో? లేక తిక్కనయే యట్లు రచించెనో? చెప్పఁ జాలము. చిమ్మపూడి అమరేశ్వరుఁడను మహాకవి విక్రమసేన మను నొక ప్రబంధమును రచియించియుండెను. అందలి నాయకుఁడు విక్రమ సేనుఁడు. నాయిక నిషధసుత. తిక్కన విజయసేనములోని నాయకుఁడు విజయసేనుఁడు. నాయిక పేరు లభింపలేదు. ఈగ్రంథముల నామాక్షర ములలో రెండవ మూఁడవ యక్షరములుదక్కఁ దక్కినవి సమానము లగుటచే జగ్గకవి గ్రంథ నామముల నిచ్చుటలో పొరపాటు పడియె నేమో!

అప్పకవియును, కస్తూరి రంగకవియును, క్రిందిది పద్యము విజయసేనములోనిఁ దని సంశయప్లుత యతికి లక్ష్యముగా నిచ్చి యున్నారు.

ఉ. వల్లభుఁ డేగు దుర్లభుఁడు వానిదెసం దగు లూఁది యిమ్మెయిన్
దల్లడ మందె దేల యుచితస్థితికి న్ననుఁ బాపఁ జూపినన్
దల్లియు బంధులోకమును దండ్రియు నే మనువా రెఱింగి రే
నల్లమ యిట్లు నీకుఁ దగునో తగదో పరికించి చూడుమా!

కాని యీపద్యమునే చిమ్మపూడి యమరేశ్వరుని విక్రమసేన ములోనిదని కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహమున నుదాహరించియున్నాఁడు. దీనిబట్టి విజయసేన విక్రమసేనములనుఁ జెప్పుటలో తారుమారు జరుగుచున్నదని నిశ్చయింపవచ్చును. అట్లు యినచోఁ బైనవ్రాసిన వానిలో నొకే విషయవర్ణనము గల రెండు పద్య ములలో నొకటి తిక్కన సోమయాజియు నొకటి యమరేశ్వరుఁడును రచియించియుండురు. గజాననస్తోత్ర పద్యములు రెంటింటిలో నుత్పల మాలనుఁ దిక్కనయు శార్దూలము నమరేశ్వరుఁడును రచియించి యుందురు. పరిఖావర్ణనమున సీసపద్యమును వైశ్యవర్ణనముగఁ జంపక

మాలయుఁ దిక్కన రచితములని నాయభిప్రాయము. తిక్కన విజయసేనమును రచియించి యుండుట సత్యమేని, యది నిర్వచనోత్తరరామాయణమునకుఁ బూర్వమై యుండును.

(2) కవిసార్వభౌమ చంధస్సు.

ఈ మహాకవి యాంధ్రమున నొక ఛందోగ్రంథమును వ్రాసియుండెనని చెప్పుదురు. దాని పేరు కవివాగ్బంధన మని కొందఱును కవిసార్వభౌమ చంధస్సు అని కొందఱును జెప్పుచున్నారు. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున 36 పంక్తులు గల యొక చిన్న పుస్తక మొకటి యున్నది. గ్రంథాంతపద్య మిది:

క. తనరన్ గవివాగ్బంధం
బను ఛందం బవని వెలయ హర్షముతోఁ ది
క్కనసోమయాజి చెప్పెనుఁ
జనులెల్ల నుతింప బుధుల సమ్మతి గాఁగన్.

అందలి మఱి రెండుపద్యముల నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

క. కులములు గుణములు వేళలు
నలలింగము లంగములును నాగ్రహవేథల్
తెలియఁగ వలయును గవి తలఁ
బలికెడువర్ణంబు లైదుపదములకు మొదలన్.

క. అకచటవర్గలు విప్రులు
ప్రకటిత తవమపలు నృపులు రయబహాశషసల్
వికసిల్లు వైశ్యకులమున
నుకవిస్తుత ళశలు రెండు శూద్రకులంబుల్.

తంజావూరు నందున్న పుస్తకభాండాగారము నందొక తాళపత్రప్రతి యున్నది. అందలి గ్రంథాంత పద్యమును పైపద్యమును నొక్క రీతిగనే యున్నవి. ఆప్రతియందలి మూఁడు పద్యము లివి:

క. విద్యలలోపల నుత్తమ
విద్య కవిత్వంబు మఱికవిత్వము ఛందో
వేద్యము గావునఁ జెప్పెద
హృద్యంబుగఁ గవితఛంద మేర్పడఁ గృష్ణా.

ఈపద్యము సులక్షణసారమున నున్నట్లు వావిళ్ళవారి ముద్రిత ప్రతి వలనఁ దెలియుచున్నది. కాని సులక్షణసారగ్రంథకర్త వెల్లంకి తాతంబట్టని ప్రకటించిన వావిళ్ళవారి గ్రంథమునుఁబట్టి యీపద్యకర్తృత్వమును నిర్ణయింపఁజాలము.

ఆ. చాలు కాలు కూలు సంహారవచనంబు
లోలి కావ్యమందు నొవకె నేని
ఫాలలోచనుఁ డయినభస్మ మయిపోవును
బాలవార్ధిశయన బాలకృష్ణ !

మ. స్వరవర్గద్రుతముల్ శకంధుగుణముత్వప్రాద్యభేదర్యను
స్వరభిన్నప్రభుకాకునిత్యములు దేశ్యజ్ఞోభయాఖండముల్
సరసాదేశవిభాగవృద్ధులును మానంయుక్త వైకల్వ్యముల్
గరిమన్ బోలిక చక్కటెక్కటి యనంగా నిర్వ దేడా యతుల్.

తిక్కనసోమయాజి యీలక్షణగ్రంథమును రచించెనని నమ్ముట కవకాశము లేదు. ఈతనితో సమకాలికుఁడైన కేతనకవి యాంధ్ర భాషాభూషణమున నదివఱ కెవ్వరునుఁ దెనుఁగునకు లక్షణము చెప్ప లేదని యీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

ఆ. కవితఁ జెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చ
బరఁగ దశకుమారచరితంబుఁ జెప్పిన
శ్రీడ నన్ను వేఱ పొగడ నేల

క. మున్ను తెనుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరునుఁ జెప్ప రేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాదికవి జనంబులకరుణన్.

తిక్కన తెనుఁగు గ్రంథమును వ్రాసియున్నచో నేతనకవి యిట్లు చెప్పియుండఁడు. తిక్కనయే యీగ్రంథమును వ్రాసియున్నచోఁ బై పద్యములో "పాలవార్ధి" యని చెప్పియుండఁడు. "పాలకడలి" యని యుపయోగించియుండును.

అనంతామాత్యుఁ డిరువదినాల్గు యతులనుఁ జేసె ననియు నాతని తరువాతి వారిరువదియేడు యతుల నంగీకరించిరనియు నప్పకవి యీ క్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

క. భీమన పదిచెప్పె ననం
తామాత్యుఁడు చేసె వెనుక యతు లిరువదినా
ల్గామీఁదఁ గొందఱు కవి
గ్రామణు లిరువదియు నేడు గావించి రొగిన్.

పైనచెప్పిన వాగ్బంధన మను గ్రంథములో ౨౭ యతులు చెప్పి యున్నాఁడు. కావున నాతఁ డనంతామాత్యునకుఁ దరువాతివాఁ డని యెంచఁ దగియున్నది. అనంతామాత్యుఁడు క్రీ. శ. ౧౩౭౫-౧౪౩౦ ప్రాంతము వాఁడు. కవివాగ్బంధన కారుఁడు యతులనుఁబట్టి యీకాలము నకుఁ దరువాతివాఁ డగుచున్నాఁడు. తిక్కనసోమయాజి ౧౨౫౦-౧౩౦౦ ప్రాంతము వాఁడు. కావున ననంతామాత్యునకుఁ దరువాత నేకవియో యీకవివాగ్బంధనమును రచించి తిక్కనపేరు పెట్టియుండును.

(౩) కృష్ణశతకము

తిక్కనసోమయాజి కృష్ణశతకమును రచియించె ననియు నీక్రింది పద్య మాశతకము లోనిదనియుఁ గొందఱు చెప్పుచున్నారు.

మ. అరయన్ శంతనుపుత్రుపై విదురుపై నక్రూరుపైఁ గుబ్జపై
నరుపై ద్రౌపదిపైఁ గుచేలునిపయి న్నందవ్రజస్త్రీలపైఁ
బరఁగం గల్గుభవత్కృపారసము నాపైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాఁడ జగదీశా! కృష్ణ భక్తప్రియా!

"కృష్ణ! భక్తప్రియా!" యనుమకుటముతో నున్నశతక మున్నట్లు గానరాదు. వెన్నెలకంటిజన్నయకృత మగు "కృష్ణా! దేవకీనందనా" యనుమకుటముతో నున్న శతక మొకటియున్నది.

అదియు నిదియు నొకటి కాదు. భావిపరిశోధనమున నేమైనసాక్ష్యము లభించిననే తప్ప నీశతక మొకటి యుండె ననికాని దానికర్త తిక్కన యనికాని భావించుటకు వీలు లేదు.

తిక్కనను నుతించినకవులు :

ఆంధ్రభాషలోఁ బద్యకావ్యములను రచించినకవులలో నీతనిని నుతింపనివారుండరు. ఈతనికవిత్వగుణము నెఱింగినసుప్రసిద్ధకవు లీతనిని నుతించినపద్యములఁ గొన్నిటి నీక్రింద నుదాహరించెదను.

"మ. తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా నేముఖం
బునఁ దాఁ బల్కినపల్కు లాగమములై పొల్పొందునా వాణి న
త్తను నీశం డొకరుంచు నాఁ జనుమహత్త్వాప్తిం గవిబ్రహ్మనా
వినుతింతుం గవి తిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్."

—ఎఱ్ఱాప్రెగ్గడ.

"హ్రాక్రుత్తు తిక్కయజ్వపరికారము రసాభ్యుచితపరిబంధముగ నొక్కొక్కమాటు." —శ్రీనాథుఁడు.

"చ. ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు సంవిహితాధ్వరక్రియా
ప్రభు బుధబంధు భూరిగుణబంధురు భారతసంహితాకథా
విభుఁ బరతత్త్వబోధను నవీనపరాశరసూను సంతత
త్రిభువనకీర్తనీయయశుఁ దిక్కకవీంద్రునిఁ గొల్తు నర్థితోన్."

—మారన.

ఉ. పంచమవేదమై పరఁగుభారతసంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యుని నఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తి వైభవ విరాజికి దిక్కనసోమయాజికిన్.

—శ్రీనాథుఁడు.

గీ. ఉభయకవిమిత్రు నత్యంతశుభచరిత్రు
భానుసమతేజుఁ గొమ్మనయప్రభుతనూజు
సుకృతవిభ్రాజిఁ దిక్కనసోమయాజిఁ
బ్రణుతబహుదేశకవిరాజుఁ బ్రస్తుతించి. —పి. పినవీరన్న.

చ. క్షితిఁ గ్రతుకర్త నా మహిమ చేకొని పంచమవేదమైన భా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవి నాయకుఁ డాదట......

—అనంతామాత్యుఁడు.

ఉ. ఆంధ్రకవిత్వతత్త్వసముదంచితకీర్తిని దిక్కయజ్వ నీ
రంధ్రతరప్రభావనిధిఁ బ్రస్తుతి సేయుదు...నుల్లస
ద్గ్రంధగభీరమంజుతరగర్జితవిభ్రమభవ్యభంగి సై
రంధ్రిక యైనచాటు మధుర స్ఫుట బంధురవాగ్విజృంభిగన్.

—గంగాధరకవి.

ఉ. అంజలిఁ జేతుఁ బద్మజనిశాంతకరాంత నిరంతరోల్బణా
న్మంజులవల్లకీ మధురమంద్రనినాద సముల్లసద్ధ్వని
వ్యంజకవాఙ్నిగుంభన సమంచిత నూతనసృష్టి చాతురీ
రంజిత సత్కవీంద్ర బుధరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

—నృసింహాకవి.

చ. పరువడి భారతాఖ్య గలపంచమవేదము నాంధ్రభాషను
స్థిరత రచించుచోఁ గృతిపతిత్వము గోరి ప్రసన్నుఁడైన యా
హరిహరనాథుచేఁబడసి నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁ డా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూని నుతింతుఁ గృతాధ్వరోత్సవున్.

—జిక్కయ.

భగవద్గీతలనుఁ దిక్కన యేల తెలుఁగు సేయలేదు?

భారతమునందలి భీష్మపర్వములోఁ జెప్పఁబడిన భగవద్గీతలనుఁ దిక్కన సోమయాజి యాంధ్రీకరింపలేదు. అందులకుఁ గారణ మాతని యసమర్థత యని తలంచువారు కొందఱున్నారు. భగవద్గీతలు లేకుండ వ్రాయఁబడిన తాళపత్రప్రతులు కొన్ని కలవనియు, నట్టిప్రతి యొకటి కుంభకోణమునం దిప్పుడునుఁ గలదనియు, నట్టిప్రతియె తిక్కనకు లభించి యుండునని యు నందుచే నది యాతని యాంధ్రీకరణమునఁ జేరలేద నియుఁ గొంద అభిప్రాయపడుచున్నారు. వేదాంత ప్రతిపాదకములగు

ననేక కథలను శాంత్యనుశాసనికాది పర్వములలో సోమయాజి యాంధ్రీకరించి యుండెను. తర్కశాస్త్రవిజ్ఞాతయైన తిక్కన భగవద్గీతల నాంధ్రీకరింప శక్తిలేకపోయె ననుటకంటె వింతవిషయ మింక నొకటి యుండదు. భగవద్గీతలను దత్తోజీపండితుఁడు మొదలగువారు పద్యములుగా వ్రాసియుండిరి. ఆమాత్రపు విజ్ఞానము తిక్కనసోమయాజికి లేదని తలంచుట పొరబాటు. సనత్కుమారగీతలు, ఉత్తరహిందూదేశ ప్రతులయందేగాని, దక్షిణహిందూదేశ ప్రతులయందు లేవని పండితులు వ్రాసియున్నారు. అందుచేతనే తిక్కన భారతమునందవి లేవు. అట్లే భగవద్గీతారహితమైన భారతమే తిక్కనకు లభించినదని తలంచుట కవకాశమున్నది. యుద్ధారంభదినమున నుభయసేనామధ్యమున రథముపై నిలువఁబడి చూచినప్పు డర్జునునకుఁ దాను చేయఁబోవు గురువృద్ధ బంధుజనవధాకార్యము హృదయమునకుఁ దట్టి విషాదము కలిగి యుద్ధవిముఖుఁ డగుటయుఁ గృష్ణుఁ డాతని శాసనమున జ్ఞానము నుపదేశించి రణోన్ముఖునిఁ జేయుటయు గీతయొక్క ప్రధానోద్దేశము. భారతమునం దిప్పుడున్న పదునెనిమిదియధ్యాయముల గ్రంథము నప్పుడు జరిగినదని తలంపరాదు. ఆగ్రంథమును జదువుట కథమము రెండుదినములు పట్టును. అంతకాలము యుద్ధము మాని వారు భగవద్గీతావిషయములనుఁ జర్చించుచుఁ గూర్చుండియుండ లేదు. శ్రీకృష్ణభగవానుఁడు, అర్జునుని మూఢత్వమునుఁ బోఁగొట్టుటకై తగిన మాటలనుఁ జెప్పి విశ్వరూపమునుఁ జూపి రెండుమూఁడు ముహూర్తముల కాలములో నాతనిని రణోన్ముఖునిఁ జేసియుండెనని తలంపవలసి యుండును. భగవద్గీత ప్రక్షిప్తమని నే ననుట లేదు. తక్కినకథలన్నియు నెట్లువిస్తరింపఁబడియెనో, ఈభగవద్గీతయు భారతమునన ట్లే చెప్పఁబడియుండును. కథపోకుండ నాసందర్భమునఁ గొన్నిశ్లోకములను మాత్ర ముంచితక్కినవానిని విలేఖకు లందుండి తొలఁగించిభగవద్గీతా గ్రంథమును వేఱుగ వ్రాసికొనిరేమో!

భగవద్గీతాసహితమైనభారతము లభించియున్నను, వీరరస ప్రధానమైనయాఘట్టమున నీపదునెనిమిదియధ్యాయముల గ్రంథమును

రచించి, రసభంగము చేయుట కిష్టములేక తిక్కన దానిని విడిచివేసి యనికూడ భావింపవచ్చును. భారతము నందనేకకథల నాతఁడు తెలిగింపక విడిచిపెట్టియుండెను. అట్లే దీనిని విడిచిపెట్టి యుండవచ్చును. భగవద్గీతను బూర్తిగ భాషాంతరీకరింపకపోయినను కథాసందర్భమునుఁ బొత్తిగా వదలివేయక కొన్ని పద్యములను వ్రాసియున్నాఁడు. భగవద్గీత పదునెనిమిదియధ్యాయములందును శ్రీకృష్ణుఁ డేసిద్ధాంతములనుఁ బ్రతిపాదించెనో వానిని చిన్నమాటలలో నీగద్యపద్యములలో సోమయాజి స్పష్టపరచియున్నాఁడు. వానిలోఁ గొన్నిటి నిటనుదాహరించెదను.

“చ. వగవగ నేమియుం దగనివారికినై హృదయంబు గుందఁగా
వగచెదు బుద్ధిమాటలును వావిరి నాడెదు నీవు పండితుల్
వగతురె యున్నవారికి నవశ్యవిధేయతఁ జన్నవారికిం
దెగు వగలెల్లఁ జిత్తము ప్రదీప్తవివేకమయత్వ మొందినన్

వ. ఇద్దేహంబునందు బాల్యంబు, యౌవనంబు, వార్ధకంబు ననం గలుగు నవస్థలం బొందినట్లును, జీర్ణంబులైన వస్త్రంబులు విడిచి నూతనంబులైన వానిం గైకొనినచాడ్పునను గాని దేహాంతరగమనం బాత్మహానిం జేయదు. పుట్టువు జావు ననునివి లేమిం జేసి శరీరంబు వ్రేలె శస్త్రచ్ఛేదనంబు మొదలైన వికృతికారణంబులకు నాత్ముండు లోనుగాఁడు. అప్పురుషుండు నొప్పించువాఁడును నొప్పింపఁబడియెడు వాఁడునుం గాఁడు. ఆత్మకు నభావంబును, శరీరంబునకు భావంబునుఁ గలుగదు.

ఆ. ఇట్టు లగుటఁ జేసి యెవ్వరిదెసకు శో
కంబుఁ బొందఁ గారణంబు లేదు
జీవుఁ డెల్లభంగిఁ జెడియెడువాఁడు గాఁ
దలఁచితేని వగవవలవదు మున్న.

క. పురుషుండు సెడు ననువాఁడును
బురుషుఁడు సెఱుచు ననిపలుకుపురుషుండును న
య్యిరువురు నవివేకుల య
ప్పురుషుఁడు సెఱుపండు సెఱఁడు భుజవీర్యనిధీ!

క. పురుషుఁ డన వేఱొకం డే
పురుషోత్తముఁ డైనయేని పురుషోత్తమతా
స్ఫురణకుఁ బురుషత్వం బను
మెరమెరగల దదియు కాదె మెయికొనుఁ గ్రియకున్.

క. సమరంబు రాజులకు ను
త్తమ కర్మం బది యుపాకృతస్వర్గద్వా
రము సుమ్ము లెమ్ము దగఁ గ
య్యము సేయుము దీని కేల యనుమానింపన్

క. ఫలములయెడ బ్రహ్మార్పణ
కలనపరుం డగుచుఁ గార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము
తలకొనినం గర్మశమము దానై కలుగున్

క. వైరమున నులిచి త్రెంపక
కారాకులు డుల్లినట్లు కర్మము లెల్లం
దార పెడఁబాయవలయుట
సారకృపం దెలియఁ జెప్పె శౌరి యతనికిన్.

విశ్వరూప ప్రదర్శనానంతరమున:

"ఏను లోకక్షయకర్త యగు కాలుండ నిచ్చో జనసమాజసమాహారణంబునకుఁ బ్రవృత్తుండ నైతి నీవు సంపవలయు నని లే దీగురు భీష్మాదు లెట్లును లేకుండువార నాచేతం జచ్చినవారి నెల్లను జయించినవాఁడ వగుటకు నిమిత్తమాత్రమ్ము గమ్ము లెమ్ము రాజ్యమ్ము గైకొనుము"

ఈకథాసందర్భమున నడుమనడుమ రచింపఁబడిన "అనేక వాక్యంబుల నాత్మతత్త్వంబు శాశ్వతం బగుట యొఱింగించి" "వివిధ వాక్యంబుల నాత్మునకు బాధ్యబాధకత్వంబులు లేకునికి వివరించి" "స్వకర్మావలంబనంబు వదలం దగమి దెలియుటకు వాక్యంబులు పెక్కు లుపన్యసించి" ఈదృశంబు లగు వాక్యంబు లనేకంబు లనుగ్రహించుచు వివిధ పరిహారంబుల వికల్పించి విజయుం డడిగిన వాని కెల్లనదుత్తరంబు లిచ్చి

"మత్కర్మపరుండును, మద్భక్తుండును నైనవానికి నన్నుఁ బడయవచ్చు నని యాశ్వాసించి"

తే. అతఁడు మఱియును బ్రహ్మవిద్యాన్వయమునఁ
దనకు సందిగ్ధ మైనట్టిదాని నెల్ల
నడుగఁగా నమ్మహాత్ముఁ డత్యంతకరుణఁ
దెలియఁ జెప్పుచు హృదయసంచలత మాన్చి

వ. ఇవ్విధంబున ఫాల్గున కుపనిషదర్థజాతం బవగతంబు సేసి"

అను వాక్యములవలనఁబట్టి భగవద్గీత యంతయుఁ దిక్కనయొద్దఁ గల దనియు రసభంగ మగునని యో మఱియే కారణమువననో దానిని బూర్తిగ నాంధ్రీకరింపనిష్టము లేక విడిచిపెట్టె ననియుఁ గోచరించు చున్నది. ఉత్తరగీతలనుఁగూడ నీతఁడు తెలుఁగు సేయక, వానిసారము నయిదారుపుటలలో నశ్వమేధ పర్వప్రథమాశ్వాసమునఁ జెప్పి యున్నాఁడు. మొత్తముమీఁద వేదాంతచర్చలతో గ్రంథమును నింపి సామాన్యపాఠకులను విసువు జెందింపకుండ నందుముఖ్యము లగు విషయములను క్లుప్తముగను స్పష్టముగను వెల్లడించుటయే కవి యుద్దేశ మయినట్లు స్పష్ట మగుచున్నది. ఆగీతలను తెలుఁగు సేయుట కాతనికి సమర్థత లే దని తలంచుట పొరబాటు.

భారత రచనాకాలము తిక్కన వయసు:

నిర్వచనోత్తర రామాయణమును మనుమసిద్ధిరాజున కంకిత మొసంగుటయు, శ్రీమహాభారతము నాతని పేరైన నుదాహరింపక పోవుటయు జూడ మనుమసిద్ధి కాలధర్మము నొందిన పిదప నీతఁడు భారతరచనము నారంభించెనని తలంపవలసియున్నది. మనుమసిద్ధి క్రీ. శ. ౧౨౬౦ సంవత్సర ప్రాంతమున చనిపోయెనని తలంచుటకు వీలగుచున్నది. అటుపిమ్మటఁ దిక్కన రాజకార్యములయందు విరక్తుఁడై భారతరచనమున నిమగ్నుఁడై తనజీవితమును శాంతముగా గడపి యుండును. ఇతఁడు డబ్బదియెనిమిది సంవత్సరములు జీవించెనని ప్రసిద్ధి గలదని శ్రీవీరేశలింగముపంతులుగారు వ్రాసియున్నారు. నిర్వచ

నోత్తరరామాయణ కాలమునాటి కతనికి దాదాపు నలువది సంవత్సరముల వయసుండెనని తలంచితిమేని యాతని జననము క్రీ. శ. ౧౨౨౦ ప్రాంతమై నిర్యాణము క్రీ. శ. ౧౩౦౦ ప్రాంతమగును. తిక్కనసోమయాజి మనుమసిద్ధితో సమవయస్కుఁడని నాయభిప్రాయము. కాదేని యేఁడెనిమిది సంవత్సరములు మనుమసిద్ధి పెద్దవాఁడైనఁ గావచ్చును. మనుమసిద్ధి తిక్కనను 'మామా' యని పిలుచువాఁ డనుటచేఁ దిక్కనయే కొంచెము పెద్దవాఁడేమో యని యనుకొనుటకుఁగూడ నవకాశము కలదు. కాని యెట్లయినను వీరిరువురినడుమ నంతరము విశేషముండదు. మహాభారతము నీతఁడు క్రీ. శ. ౧౨౬౦–౧౨౭౦ నడుమ రచియించియుండును అని నేననుకొనుచున్నాఁడను. మనుమసిద్ధి చనిపోయిననాఁటి కీతనికి ౮౦-౮౫ సంవత్సరముల వయసుండును. మనుమసిద్ధి మహారాజు చనిపోయిన తత్క్షణమే మహాభారత రచనమున కారంభించియుండఁడు. నాలుగైదేండ్లు గడచిన తరువాతఁ బ్రారంభించియుండుననియుఁ గొన్నిదినములు వ్రాయకున్నను సగటున దినమున కైదు పద్యములు వంతున వ్రాసియుండెనని తలంచినచోఁ బదేండ్లలో భారతము పూర్తియగును. కావున నాతని యేబది అరువదియేండ్ల వయసు మధ్య ననఁగా క్రీ. శ ౧౨౬౦-౧౨౭౦ నడుమ మహాభారత రచనము జరిగియుండు ననియు నాయభిప్రాయము.

తిక్కనసోమయాజి నిర్యాణము:

క. అంబర రవి శశి శాకా
బ్దంబులు చనఁ గాళయుక్తి భాద్రపదపు మా
సంబున సంబరమణిబిం
బం బనఁదగు తిక్కయజ్వ బ్రహ్మముఁ జేరెన్.

అనుపద్య మొకటి చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకాలయమున మెకాంజి యను నైరోపీయుఁడు సంపాదించియుంచిన వ్రాఁతప్రతిలోఁ గలదఁట. ఈపద్యమునుబట్టి శా. శ. ౧౧౨౦ (క్రీ. శ.) ౧౧౯౮ సంవత్సరమునఁ దిక్కన పరలోకము నొందెనని తెలియుచున్నది. ఆసంవ

త్సరము కాళయుక్తి యైనమాట నిజము. కానిఅప్పటికి తిక్కన జన్మింప లేదు. శా. శ. ౧౧౮౦ (క్రీ. శ ౧౨౫౮) కాళయుక్తి ప్రాంతమున నాతఁడు నిర్వచనోత్తర రామాయణమును రచియించియున్నాఁడు. అప్పటికాతఁడు జీవించియుండుటచే నాకాళయుక్తి యాతని నిర్యాణ కాలము కాఁజాలదు. ఇఁక శా. శ. ౧౨౪౦ (క్రీ. శ. ౧౩౧౮) కాళ యుక్తి నాఁటికి పైనవ్రాసిన లెక్కప్రకారము తిక్కన ౯౩ సంవత్స రముల వయసు వాఁడగును. పద్యములోని శకసంఖ్య మార్చవలసి యుండును. కావున నాతని మరణకాల మదియనుగానేరదు. అందుచే దిక్కన చనిపోయిన కాలమునుఁ దెలుపు నీపద్యము సత్యము జెప్పుచుండె నని తలంపవీలు లేదు. పైపద్యమునందలి "రసశశి" యనుమాటలను "శశిరవి" యని మార్చవలయునని కొందఱనుచున్నారు. అట్లు మార్చి నచో నది శా. శ. ౧౨౧౦ (క్రీ. శ. ౧౨౮౮) యగును. అప్పటి కాతనికి దాదాపు డెబ్బది యేండ్లుండును. కాని యది కాళయుక్తి కాక సర్వధారిసంవత్సర మగుచున్నది. కావున నీపద్యమునుబట్టి తిక్కన సోమయాజి నిర్యాణకాలమును నిర్ణయింపఁ బూనుట వ్యర్థప్రయాసము.

ఇతఁ డరణ్యపర్వము నేల పూర్తిచేయలేదు?

భారతరచనము పూర్తియైన పిమ్మటఁగూడ నీసుకవి కొంత కాలము జీవించియున్నట్లు కన్పట్టుచున్నది. అయిన నీతఁడు భారతా రణ్య పర్వశేషమునుఁ బూర్తిచేయు లేదు. దానిని రచించుట కాతని కిష్టము లేకయే విడిచిపెట్టి యుండును. ఆభాగమును రచించినచో నన్నయభట్టువలెనే తానుగూడ మరణింతునని భయపడి యాభాగ మును రచింపలేదని కొందఱందురు. తత్త్వజ్ఞానసంపన్నుఁడగు తిక్కన యరణ్యపర్వభాగ రచనముచే మరణము సంభవించునని తలంచునంతటి యవివేకియని యనఁజాలము. కాని యేదియో యొకవిధమగు సంశయ మాతని హృదయమునం దుండుటచేతనే యాభాగము నాతఁడు పూరింప లేదని యూహింపఁ దగియున్నది. నిర్వచనోత్తర రామాయణమున శ్రీరామనిర్యాణ కథాభాగము నాతఁడు తెలుఁగు సేయక శ్రీరామ చంద్రుఁడు కుమారులతోఁ గలసి సుఖముగా రాజ్యము సేయుచుండె

నని శుభాంతముగా గ్రంథమును ముగించినాఁడు. భారతాంతమున ధర్మరాజు స్వర్గమునకు స్వశరీరముతోఁ బోవుటయు నచ్చట భార్యను, సోదరులనుఁ గలసికొనుటయుఁ జెప్పి దానినిఁగూడ శుభాంతముగనే ముగించినాఁడు. మొత్తముమీఁద గ్రంథము ముగియునప్పటికి పాఠకుల హృదయములు దుఃఖపూరితములు గాకుండనుండవలయు ననుకోర్కె యీకవి హృదయమునందుండి యుండును. భారతమును సంపూర్ణముగా రచించి సంతృప్త హృదయముతోనున్న యీమహామహుఁడు మరల నారణ్యపర్వభాగమును రచింపఁదలపెట్టుట కిష్టము లేకుండుటయే యీభాగమును రచింపక పోవుటకుఁ గారణమై యుండును. భారతమధ్యమునఁ గొంతభాగము మిగిలియున్నదను విషయమాతఁడెఱుంగక పోలేదు. దానిని పూరింపకపోయిన నెట్లను విచారమాతనికి లేదు. తనవలెనే యీభాగమును పూరించుట కింకొక రుందురనియే యాతని యుద్దేశము. ఆయదృష్ట మెఱ్ఱాప్రగడకు లభించినది. ఉత్తరరామాయణమున రామనిర్యాణకథాభాగము తెలుఁగు గాకుండ నిలిచి యున్నదను విచారమును నాతనికి లేదు. ఆభాగమును రచించు వారింకొకరుందురనియే యాతని యూహ. అట్లే యీభాగమును జయంతి రామభట్టు పూరించియుండెను.

తిక్కన యశౌన్నత్యము :

తిక్కన సోమయాజి కవిత్వానైపుణినిగూర్చియు నాతని యుదారాశయాదర్శములనుఁ గూర్చియు నెంత వ్రాసినను దనివితీరదు. దిఙ్మాత్ర ప్రదర్శనముగఁ గొన్ని విషయములనుఁ దెలిపియుంటిని. తిక్కననుఁ గూర్చియు నాతని వంశములోని పూర్వులనుఁ గూర్చియు ననేక కథలు నెల్లూరు, గుంటూరు మండలములలోఁ బ్రచారములోనున్నవని తెలియుచున్నవి. ఏవిధమునఁ జూచినను భావిపురాతనాద్యత నాంధ్రకవులలో నీతనితో సమానుని జూడఁజాలము. ఇంతటి యదృష్టవంతుఁ డింకొకఁడు లేఁడు. ఉండఁడు. ఇహపరములను రెండింటిని సాధించిన మహాపురుషుఁ డితఁడు. శూరులై, పండితులై, కవులై, వైదికమార్గానువర్తులై, రాజ్యాంగవేత్తలై పేరుగనినవారి కుటుంబమున నీతఁడు

జననమందెను. రూపమున శరీరధారియగు మన్మథుఁడు. ఇతని పొందర్యాతిశయమునుఁగూర్చి కేతనకవి దశకుమార చరిత్రమున వ్రాసిన వాక్యము లెన్నియో కలవు. వానినిఁ జదివినవారి కీతఁడు గొప్పసౌందర్యరాశి యని తోఁచును. ఇంతేకాదు. ఈపుణ్యరాశి మహామంత్రిశేఖరుఁడై, దండాధినాథుఁడై, తన ప్రభువు రాజ్యభ్రష్టుఁడు కాఁగా నారాజ్యమును మఱల సంపాదించి, ప్రభురాజ్యస్థాపనాచార్య బిరుదమును వహించి, రాజ్యతంత్రజ్ఞుఁడని పేరుగాంచెను. పండితుఁడై, యసంఖ్యాక శిష్యబృందమునకు గురువై, పరమతఖండనమునఁ బ్రవీణుఁడై మహామేధావియను యశము నార్జించెను. కవియై, యుత్తమ కావ్యకర్తయై, కృతిభర్తయై, కృతివిదాతయై తనకీర్తిని, యితరుల యశమునుఁ గూడ శాశ్వతమొనర్చిన ప్రతిభాశాలియని పొగడొందెను. దైన్యమనునది యెఱుంగక యాగర్భశ్రీమంతుఁడై, మహాదాతయై, యగ్రహారాదికము నొసంగి యాజన్మాంతము సుఖభోగముల ననుభవించిన మహాభోగి యనుకీర్తి వడసెను. పుత్రపౌత్రాది సంపదగలిగి బహుకుటుంబీకుఁడైయెనలేని సంపదల ననుభవించిన యదృష్టవంతుఁడీతఁడను ఖ్యాతిని గడించెను. వేదవేదాంగ వేదియై, కర్మిష్ఠియై, యజ్ఞయాగాదు లొనర్చి కర్మవీరుఁడనియు, రాజయోగి యనియుఁ బ్రశస్తిని గాంచెను. అల్పాయువుగాక సహస్రమాస జీవియై, మాతృయాతావనవసకుతారము గాఁగాక జీవితమునుఁ బురుషార్థసంపాదనా సాధనముగా వినియోగించిన కృతార్థజీవి యని ఖ్యాతిని గాంచెను. లోకశ్రేయోభిలాషియై, వైదిక మతాభిమానియై, సర్వమునుఁ ద్యజించి నిస్సంగియై పద్మపత్రజలబిందువువలె జీవితమునుఁ గడపిన మహాజ్ఞాని యని పేరొందెను. మానవజన్మమున నింతకంటెఁ బడయఁదగిన దేమికలదు? ఇన్ని విధములఁ బ్రసిద్ధి నొందిన యదృష్టవంతుఁ డెవ్వఁడు? ఆంధ్రకవులలో నీతనితో సమానుఁ డెవ్వఁడు? ఈతని యశశ్చంద్రికలు భూమిపై నాచంద్రార్కముండఁ గలవు.

తిక్కన కాలము:

కవిజీవితములను రచించిన శ్రీ గురజాడ శ్రీరామమూర్తి పంతులుగారు, తిక్కన సోమయాజి, నన్నయభట్టుతో సమకాలికుఁడని వ్రాసిరి. కాని యది సత్యముకాదు. బ్ర. శ్రీ. వీరేశలింగముపంతులుగా రాంధ్రకవుల చరిత్రమునఁ దిక్కనకాలమును సరిగానే నిర్ణయించిరి కాని, వారు గైకొనిన యాధారములు సంశయాస్పదములుగా నున్నవి. వారాధారముగాఁ గైకొనిన పెంటాపిలశాసనములు మన మనుమసిద్ధివి గావనియు, ముక్కంటి కాడువెట్టి వంశీయుఁడైన భుజబలవీరమనుమసిద్ధి వనియుఁ దోఁచుచున్నది. మనుమసిద్ధి నామధారులు పెక్కురున్నారు. కామయదేవుని కొడుకొకఁడు. రాజేంద్రచోడుని కొడుకొకఁడు. ఇట్లే పలువురున్నారు. తిక్కన యొనర్చినకృతిదానముచే ధన్యతం గాంచిన మనుమసిద్ధి యెవ్వరో తెలిపి యాతనిఁగూర్చియిటుఁ గొంత వ్రాయుట యప్రస్తుతప్రశంస కానేరదు. అందువలనఁ దిక్కన కాలము సరిగా నిర్ణయమగుటయు, కృతిపతి విషయము దెలియుటయుఁ గూడ నగును.

నిర్వచనోత్తరరామాయణ కృతిపతియైన మనుమసిద్ధి వంశావళినిఁ దిక్కనామాత్యుఁడు సంపూర్తిగాఁ జెప్పియుండలేదు. సూర్యవంశము నందలి యిక్ష్వాకును, రఘుమహారాజును, శ్రీరామచంద్రుని వర్ణించి పిమ్మట నావంశమునజన్మించిన కరికాలచోళునిఁ గొనియాడి యాతని కులమునఁ బుట్టినబిజ్జనను స్మరించి, పిమ్మట యావంగడమున జనన మందినకృతిపతికిఁ బితామహుఁ డగు మనుమసిద్ధిని, తండ్రి యగు తిక్కమహీపాలుని నుతించెను. ఈ కరికాలచోడునినుండి యనేక చోడవంశము లుత్పన్న మయ్యెను. ఇతనినిగూర్చి నన్నిచోడకవి చారిత్రమున (ఆంధ్రకవితరంగిణి మొదటిసంపుటము పుట ౧౭౮) వ్రాసియున్నాఁడను. ఈకరికాలునకును, బిజ్జునకును నడుమఁ జాల పురుషాంతరములు గడచినవి. వానివివరములు తెలియవు. నన్నిచోడుని చారిత్రమునఁ జోత్తపిచోడశాఖలైదింటిని జూపియున్నాఁడను. అందు ౨-౩-౪ సంఖ్యలుగల శాఖలకును, మన యీమనుమసిద్ధి శాఖకును సన్నిహితసంబంధము లేదు. ఆశాఖలలో బిజ్జన లేఁడు. ఆతఁడా శాఖలకుఁ జెందినవాఁడు కాఁడు. కాని అందలి మొదటిసంఖ్యగల వంశ

వృత్తమును, మనుమసిద్ధివంశవృత్తమును బిజ్జనమండి యుత్పన్నమైనవి. ఆవంశవృత్తమునఁ గడపటిపురుషుఁడైన ఓపిలిసిద్ధియు, మనుమసిద్ధి తండ్రి యగుతిక్కరాజును సమకాలికులు, బిజ్జనకుఁదరువాత ౧-౩ పురుషాంతరములలోపల ఓపిలిసిద్ధి మనుమసిద్ధివంశములు విడిపోయి యుండును. ఓపిలిసిద్ధివంశీయులు కొణిదెనలోను, మనుమసిద్ధివంశీయులు నెల్లూరుమండలమునను రాజ్యముచేసినట్లు కనుపట్టుచున్నది.

తిక్కనకావ్యమునకుఁ గృతిపతియైన మనుమసిద్ధి కోలూరను గ్రామమును బ్రాహ్మణుల కొసంగి వ్రాయించినశిలాశాసన మొకటి నందలూరు గ్రామమున సౌమ్యనాథేశ్వరుని యాలయమునఁ గలదు. (A. R. 580 of 07) అందు మనుమసిద్ధి వంశవృక్ష మున్నది. ఆశాసనమునందుఁ గొంతభాగము గోడలోపల కట్టఁబడియుండుటచేఁ బూర్తిగ లభింపలేదు. బ్రహ్మ, మరీచి, కాశ్యప, మను, ఇక్ష్వాకు, కకుత్థ్స, దశరథులకుఁ బిమ్మటఁ గరికాలుని నాపిమ్మట బిజ్జన నుదాహరించినాఁడు. తరువాతఁ గట్టడములో నుండిపోవుటచేఁ నాతనిసంతతిని గ్రమముగాఁ దెలిసికొనవీలు కలిగినదికాదు. అటుతరువాతివంశవృక్ష మీక్రిందివిధముగా నున్నది.

దాయభీముఁడు
|
బేతభూపతి
|
ఎఱ్ఱసిద్ధి
|
రాజేంద్రమనుమసిద్ధి
|
తిక్కనృపతి
|
పేరు తెలియదు — మనుమసిద్ధి

(ఇతఁడే తిక్కనచే నిర్వచనోత్తర రామాయణమును గృతినందినవాఁడు)

ఈవంశమునకు మూలపురుషుఁడైన బిజ్జనను నిర్వచనోత్తర రామాయణమున నిట్లు వర్ణించినాఁడు.

చ. పరువపరాక్రముం డగుచుఁ బల్లవుపీట నదగ్రుడైన ప
న్నిరువుర నాతనిం గలయ నెన్ని యనర్గళమత్సరంబుమై
మురరిపుసన్నిభుండు పదుమువ్వురగండఁ డనంగఁ బెట్టెఁ దా
బిరుదు వెలుంగ బిజ్జలుఁడు భీకరభూరిభుజాబలంబునన్.

ఈతఁ డేకాలమువాఁడో స్పష్టముగాఁ దెలియుట లేదు. ఉజ్జ్యపురియందు శిఖరమున గరుడ విగ్రహము గలిగిన విజయస్తంభము నొకదానిని బిజ్జన నిర్మించెనని యొక శాసనమున గలదఁట. కర్నూలు మండలమునందలి నందికొత్తూరు తాలూకా కొత్తపల్లిలో బిజ్జనచోళ మహారాజు శాసనమొకటి కలదు. (ద. హిం. శా. సం. ౯ భా ౧ సంఖ్య ౨౨౨) ఇతఁడు కరికాలచోడుని వంశములోని వాఁడైనట్లా శాసనమందలి "స్వస్తి చరణసరోరుహవిహిత విలోచనత్రిలోచన ప్రముఖాఖిలపృథ్వీశ్వర కారితకావేరీతీర కరికాలకులరత్నప్రదీప" యను ప్రశస్తిని బట్టి తెలియుచున్నది. ఈతని కాలము శాసనమున నీయలేదు. కాని యితఁడు త్రిభువన మల్లదేవుని సామంతుఁడైనట్లు శాసనమునందుండుటచేతను, పశ్చిమచాళుక్యుఁడగు మొదటి త్రిభువనమల్లుఁడు శా. శ. ౯౮౦-౧౦౦౦ వఱకు రాజ్యము చేసినవాఁడగుట చేతను చోళబిజ్జన యాకాలము వాఁడని నిశ్చయింపవచ్చును. ఓపిలిసిద్ధి, మనుమసిద్ధుల వంశవృక్షములనుబట్టి చూచినను బిజ్జనకాలము దీనితో సరిపోవుచున్నది. అందుచే నాబిజ్జనయు నీతఁడు నొక్కఁడే యని నిర్ధారణము చేయవచ్చును. నిర్వచనోత్తరరామాయణమునఁ జెప్పిన పదుమువ్వురు గండఁడను బిరుదము నీశాసనమున నుదాహరింపలేదు. ఈశాసనానంతరమున నీతఁడు పదుమువ్వుర గండఁడయ్యెనేమో! ఈశాసనము సమగ్రముగాఁ గూడ లేదు. ఈతఁడే మనుమసిద్ధి వంశమునకు మూలపురుషుఁడయ్యెనేని, నితనికిని బైవంశవృక్షమందలిదాయ భీమునకు నడుమ కట్టడములో నున్న పురుషాంతరము లెన్నియో యుండవు. ఆబిజ్జనకు దాయభీముడు పుత్రుఁడో పౌత్రుఁడో యై యుండును.

పైన నుదాహరించిన శాసనములో మధురాంతకపొత్తపిచోళ శబ్దమును మనుమసిద్ధికిఁ జేర్చియుండుటచే నీశాఖ చోళులలోని మధురాంతకపొత్తపిశాఖ యనుట స్పష్టము. అందులో వీరు నెల్లూరును రాజధానినిగా జేసికొనినవా రగుటచే వీరిని నెల్లూరు తెలుగుచోడు లని యందురు. పైఁజూపినవంశములోని మొదటిముగ్గురనుగాని, యంతకు బూర్వులైన బిజ్జనతిరుకాళ వారినిగాని తిక్కన తననిర్వచనోత్తర రామాయణమునఁ జేర్కొనలేదు. వారిశాసనములును గన్పట్టలేదు. వారు పొత్తపిచోళప్రభుశాఖకుఁ జెందియున్నను బరిపాలనములో సంబంధము లేదో, ఉన్నను, ఏదేని యొకస్వల్పప్రదేశముపై నధికారము వహించియుండిరో తెలియదు.

తాతమనుమసిద్ధి :

మన మనుమసిద్ధికిఁ దాతామహుఁడైన మనుమసిద్ధిని దిక్కన యీ క్రింది రెండు పద్యములలో వర్ణించినాఁడు.

క. తద్వంశంబునఁ బోషిత
విద్వజ్జనుఁ డహితభుజగవిహగేంద్రుఁడు ధ
ర్మాద్వైతమూర్తి వరయో
పిద్వర్గస్మరుఁడు మనుమసిద్ధి జనించెన్.

సీ. భూరిపరితాపంబు వైరిమదాంధకా
రమున కఖండదీపముగఁ జేసి
కరుణ దీనానాథకవిబంధుజనచకో
రములకుఁ జంద్రాతపముగఁ జేసి
చరితంబు నిఖిలభూజన నిత్యశోభన
లతకును నాలవాలముగఁ జేసి
కీర్తిజాలముఁ ద్రిలోకీశారికకు సభి
రామరాజిత పంజరముగఁ జేసి

ఆ. సుందరీజనంబు డెందంబునకుఁ దన
నిరుపమాన మైనసౌభాగ్య కలిమి

నతిప్రసిద్ధి చేసి యసదృశలీలమైఁ
బరగె మనుమసిద్ధి ధరణివిభుఁడు.

ఈపద్యములనుఁబట్టి యీతఁడు విశేషప్రఖ్యాతిగనినవాఁడు గాక పోయినను, కొంతపరిపాలనాధికారమునుఁ గలిగియున్నవాఁడుగా గన్పడు చున్నాఁడు.

పైవంశవృక్షములోని భేతభూపతిభార్య శ్రియాదేవి యనియు, నాతని కుమారుఁడైన యెఱ్ఱసిద్ధికి నల్లసిద్ధి, తమ్మసిద్ధి యను కుమారు లున్నారనియు, శా. శ. ౧౧౨౯ సంవత్సరపు శాసనమువలనఁ దెలియుచున్నది. (నె. శా. సం. కావలి ౩౯) వీరు, రాజేంద్ర మనుమ సిద్ధికిఁదమ్ములై యుందురు.

తిక్కరాజు:

ఇతఁడు రాజేంద్ర మనుమసిద్ధి కుమారుఁడు. ఇతఁడు మిగులఁ బరాక్రమశాలి. కడప, చిత్తూరు, చెంగల్పట్టు, మండలములను జయించి కాంచీపురము వఱకునుఁ దన రాజ్యమునుఁ విస్తరింపఁజేసిన ప్రతిభావంతుఁడు. ఈతని విజయగాథలనుఁ దిక్కన నిర్వచనోత్తరరామాయణమున మూఁడు పద్యములలో వర్ణించియున్నాఁడు. దానినిబట్టి యితఁడు (౧) పృథ్వీశ్వరుని జంపెననియు, (౨) కర్ణాటసోమేశుని జయించి, చోళస్థాపనాచార్య బిరుదమును వహించెననియు (౩) కాడవపతిని జయించి, కప్పమునుఁ గొనెననియు, (౪) లకుమయను, శంభురాజును, దాయాదులను జయించెననియుఁ దెలియుచున్నది. ఈతిక్కరాజు జయించిన రాజులెవ్వరో క్రమముగా నీదిగువ వివరించెదను. దీనినిబట్టి .రాజు కాలము తెలియును.

తిక్కరాజు చంపిన పృథ్వీశ్వరుఁ డెవ్వరు?

ఉ. కేశవసన్నిభుండు పరిగీతయశోనిధి చోళతిక్కభూ
శ్రీశుఁడు కేవలుండె నృపు లెవ్వరి కాచరితంబు గల్గునే
శైశవలీలనాఁడు పటుశౌర్యధురంధరబాహుఁడైన పృ
థ్వీశనరేంద్రుమస్తకము నేడ్తెఱఁ గందుకకేళి సల్పడే.

-నిర్వచనోత్తరరామాయణము.

ఈపృథ్వీశ్వరుఁడు వెలనాటిచోడుఁడు, మూఁడవ గొంకరాజున కును జయాంబికకునుఁ గుమారుఁడు. ఈవెలనాఁటిచోడులనుఁ గూర్చిన కథలతో సంబంధము నుంచెనకవి చారిత్రమున కెక్కువ గాఁగలదు. కావున వీరి విషయమునందు వ్రాసెదను. పృథ్వీశ్వరుని శాసనములు శా. శ. ౧౧౦౮ మొదలు ౧౧౨౮ వఱకును గన్పట్టుచున్నవి. (ద.హిం శా. సం. ౫ సంఖ్య ౧౩౩౮-౧౨౫౮.) ౧౧౨౮ తరువాత నీతనిశాసనములుఁ గన్పట్టుటలేదు. తిక్కరాజు తనశైశవమునందే యీతనిని జంపెనని వైపద్యమునందుఁ జెప్పియుండుటచే, ౧౧౨౮వ సంవత్సరము నకుఁ బిమ్మట కొలఁదికాలములోనే తన ౧౮ వ యేట నీతఁడు పృథ్వీశ్వరుని సంహరించెననియు, దానినిబట్టి తిక్కరాజుయొక్క జననము ౧౧౧౦ ప్రాంతమై యుండుననియు, నిశ్చయింపవచ్చును. ఈతని పిన తండ్రియైన నల్లసిద్ధి శాసనమును బట్టియును, నీతని కుమారుఁడైన మనుమసిద్ధి శాసనమునుఁ బట్టియును, నీతిక్కరాజు కాలము సరియైన దనియే చెప్పవచ్చును.

తిక్కరాజు జయించిన సోమేశ్వరుఁడెవఁడు ?

కర్ణాటప్రభువైన సోమేశ్వరుఁడు చోళరాజ్యము నపహరింపఁగా నీ తిక్కరాజాతనినిజయించి చోళసింహాసనమునఁ జోళుని నిలిపి చోళ స్థాపనాచార్యబిరుదమును వహించె నని తిక్కనసోమయాజి యీక్రింది పద్యములో వర్ణించియున్నాఁడు

మ. కమలాప్తప్రతిమానమూర్తి యగు నాకర్ణాటసోమేశు దు
ర్దమదోర్గర్వము రూపు మాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిన్ జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్య నా
మము దక్కం గొని తిక్కభూవిభుఁడు సామర్థ్యంబు చెల్లింపఁడే.

ఈతిక్కరాజునుఁగూర్చి మూలఘటికకేతనకవి తన దశకుమార చరిత్రమున రచించినపద్యముల నిటనుదాహరించి యీకర్ణాట సోమేశ్వరుఁ డెవ్వఁడో వ్రాసెదను.

ఉ. శ్రీవిభుఁడైన యామనుమసిద్ధికిఁ బుణ్యచరిత్రయైనత
ద్దేవికిఁ బుట్టెఁ దిక్కజగతీతలనాథుఁ డశేషలోకసం

భావితుఁ డై ధరాధరము వావఁగ నావసుదేవదేవకీ
దేవుల కుద్భవించి వినుతిం జెలువొందిన కృష్ణుఁడో యనన్.

వ. ఇట్లుదయించి రాజ్యాభిషిక్తుం డైనయనంతరంబు.

సీ. బలిమిఁ జేఁ బృథ్వీశవసుధేశు తల ద్రుంచె
గటకసామంతుల గర్వ మడఁచె
గాళవవిభు నహంకారంబు మాన్పించెఁ
బాండ్యునిచేతఁ గప్పంబుఁ గొనియె
ద్రవిడమండలికు లందఱ దక్కఁ గెలిచి చో
డని నిజరాజ్యపీఠమున నిలిపె
నెఱుక మన్నీల నివ్వెర పుట్టఁగా నేలె
వైరివీరుల నామములూరు నోర్చె
యోధహరిరాయ పెండరుఁ డుభయకటక
వీరుఁ డభినవభోజుఁ డాకారమదనుఁ
డవనిభారధారేయుఁడు మహాత్మ్యవిజిత
దిక్కరీంద్రుఁడు ఘనచోళతిక్కనృపతి.

ఈపద్యము శ్రీ వీరేశలింగము పంతులుగారు ముద్రింపించిన దశకుమారచరిత్రమునుండి గైకొంటిని. తాళపత్రప్రతిలో నున్న పాఠమును సరిగా నర్థము చేసికొనక పెక్కుతావుల శ్రీపంతులుగారు తమయిష్టము వచ్చినట్లు దిద్దివేసి రని వ్రాయుచు శ్రీ మా. రామకృష్ణకవిగారు తాళపత్రప్రతిలోనిదని యీక్రిందిపద్యమును భారతిలో నిచ్చియున్నారు.

సీ. బలిమిచేఁ బృథ్వీశుతలఁ ద్రుంచి సేవణ
కటకసామంతుల గర్వ మడఁచి
ద్రవిడమండలికులందఱఁ దక్కనేలెఁ జో
డని నిజరాజ్యపీఠమున నిలిపెఁ
గర్ణాటవిభు నహంకారంబు మాన్పించెఁ
బాండ్యునిచేతఁ గప్పంబు గొనియె
నేఱువమన్నీల నెఱపుట్టఁగా నేలె
వైరివీరుల నామములూర నోర్చె

త్రిభువనరాయ పెండారుఁ డుభయకటక
ప్రియుఁ డభినవభోజుఁ డాకారమదనుఁ
డవనిభారధౌరేయు మహాత్మవిజిత
దిక్కరీంద్రుండు చోళతిక్కనృపతి.

సేవణకటక మనఁగా యాదవులరాజధాని యగు దేవగిరి యనియు యాదవసామంతుల నీతఁడు జయించె ననియు ద్రవిడమండలికు లండఱుఁ దక్క నేలె ననుటలో నర్థాశయము లేకుండఁ దానొక్కఁడే ద్రవిడమండలాధీశ్వరుల నందఱ నేలె ననియు నర్థమని శ్రీరామకృష్ణ కవిగారు వ్రాసియున్నారు. అది నిశ్చయము. కర్ణాటవిభుఁ డనఁగా హొయిసలవంశజుఁ డగునాల్గవ సోమేశ్వరుఁ డని తలంపక పంతులుగారు కాడవపతి యని నవరించియుందురు. "ఈజయింపఁబడిన సోమేశుఁడు పశ్చిమచాళుక్యుఁ డయిననాలవసోమేశుఁ డయియుండును." అని బ్రం. వీరేశలింగముపంతులుగా రాంధ్రకవులచరిత్రలో వ్రాసియున్నారు. కాని యది సరియైనట్లు కన్పట్టదు. ఈ పశ్చిమచాళుక్యుఁడగు నాలవ సోమేశుఁడు, శా. శ. ౧౧౦౪-౧౧౧౧వఱకు రాజ్యము చేసినవాఁడు. ఈకాలములో తిక్కరాజు లేఁడు. ఉన్నను పదేండ్లలోపు వయసుకల వాఁడై యుండును. ఏమనిన వెలనాటిపృథ్వీశ్వరుని, ఈతిక్కరాజు తన శైశవముననే చంపియుండె ననియు, నది శా. శ. ౧౧౩౮కు తరువాతనై యుండుననియుఁ బైన వ్రాసియుంటిని. అప్పటికి తిక్కరాజునకు బదునెనిమిది సంవత్సరములవయసుండెనని తలంచితిమేని, ఆతనిజననము శా. శ. ౧౧౧౦ ప్రాంతమయి యుండును. అట్లయినచో చాళుక్య నాలవసోమేశుని రాజ్యాంతకాలమునకుఁ దిక్కరాజు పదిసంవత్సరముల వయసు కలవాఁడై యుండును. కావున నీతఁ డాసోమేశునిదోర్గర్వమును రూపుమాపుటకుఁ దగినవాఁడై యుండఁడు. ఇంతేకాదు. చాళుక్య నాలవసోమేశ్వరునికాలములో, చోళరాజ్యమునుఁ బరిపాలించుచున్న వాఁడు మూఁడవకులోత్తుంగచోళుఁడు. ఇతఁడు మిగులపరాక్రమశాలి. చోళదేశమే కాకుండ, ఆంధ్రదేశము కూఁడ నీతనియేలుబడిక్రింద నుండెను. అట్టివాని నీనాలవసోమేశుఁడు చోళసింహాసనమునుండి తఱిమివేయుట తటస్థింపదు. కావున పైపద్యమునఁ జెప్పఁబడిన సో-

శ్వరుఁడే నాలవసోమేశుఁడు కాఁ దగుట నిశ్చయము.

హొయ్సలులను నొకతెగవారు, ప్రస్తుతము సేలము, కోయంబుత్తూరు మండలములని పిలువఁబడుచున్న ప్రదేశమును మైసూరు రాష్ట్రములోనిఁ గొంతప్రదేశమును గొంతకాలము పరిపాలించుచు వచ్చిరి. వీరి పరిపాలనకు లోఁబడిన ప్రదేశములో విశేషభాగమున కర్ణాటభాషయే యుండుటచే వీరు కర్ణాటాధీశ్వరులనియే పిలువఁబడుచుండిరి. ఈహొయ్సలులు యాదవరాజుల సంతతి వారనియు వీరి వంశకర్త హొయ్సల నామధేయుఁడగుటచే, నాతని వంశీయులు హొయ్సలులైరనియు చరిత్రకారు లనుచున్నారు. వీరి వంశవృక్షము నీక్రింద నిచ్చుచున్నాఁడను. వీరి రాజధాని నగరము ద్వారసముద్రము.

హొయసల
|
కరి
|
వినయాదిత్య
|
ఎరియంగ
|
మొదటి బల్లాలుఁడు — విష్ణువర్ధనుఁడు — ఉదయాదిత్యుఁడు

విష్ణువర్ధనుఁడు
|
మొదటి నరసింహరాయలు
|
రెండవ బల్లాలరాయలు
|
రెండవ నరసింహరాయలు
|
సోమేశ్వరుఁడు
|
మూఁడవ నరసింహరాయలు
|
వీరబల్లాలదేవుఁడు

వీని పరిపాలనాకాలమును నిర్ణయించు శాసనములు కలవు కాని గ్రంథవిస్తరభీతిచే నిందుదాహరింపలేదు. ఇందు చూపఁబడిన సోమేశ్వరుఁడు కర్ణాటదేశమును శా. శ. ౧౧౫౬ మొదలు ౧౧౭౮ వఱకును పాలించినట్లు శాసనాధారములవలనఁ గన్పించుచున్నది. బెంగుళూరు, సిగ్గుండశాసనములు (A. R. 366 of 1919) (చోళరాజుల పట్టికనను చోడుని చారిత్రమున నిచ్చియున్నాఁడను.) ఈకాలములో చోళ రాజ్యమునుఁ బరిపాలించుచున్నవాఁడు మూఁడవరాజేంద్ర చోళుఁడు. ఇతఁడు బలహీనుఁడై రాజ్యసంరక్షణము నందసమర్థుఁడై యుండెననియు, నీసమయమున నీవీరసోమేశ్వరుఁడు బలవంతుఁడై యాతనిని జయించి చోళ సింహాసనము నాక్రమింపగా, మనతిక్కరాజు వీరసోమేశ్వరు నెదుర్కొని పోరాడి చోళసింహాసనమున మూఁడవ రాజేంద్రుని నిలిపె ననియుఁ జరిత్రకారులు తలంచుచున్నారు. ఇది సత్యమనుటకు సంశయింపనక్కఱలేదు. ఈమూఁడవ రాజేంద్రచోళుఁడు శా. శ. ౧౧౬౮ మొదలు ౧౧౮౯ వఱకును చోళసింహాసనము నందున్నవాఁడు. కావున తిక్కరాజు శా. శ. ౧౧౬౮ సంవత్సరమునకుఁ బిమ్మట ననఁగా శా. శ. ౧౧౭౦ ప్రాంతమున సోమేశ్వరుని జయించి యుండవచ్చునని తలంపవలసియున్నది. ఈసోమేశ్వరునిచే జయింపఁబడినవాఁడు మూఁడవ రాజేంద్రచోళుఁడు గాక మూఁడవ రాజరాజని తలంచితిమేని యాతని పరిపాలనాకాలము శా. శ. ౧౧౩౮ మొదలు ౧౧౭౦ వఱకునునై యున్నది. కావున తిక్కరాజు సోమేశ్వరుని జయించినది శా.శ.౧౧౬౦ ప్రాంతమై యుండును. ఇదియే సత్యమని నాయభిప్రాయము.

ఈతిక్కరాజును వర్ణించుచుఁ దిక్కన వ్రాసిన మూఁడవ పద్య మిది.

సీ. లకుమయ గురుములూరికి నెత్తివచ్చినఁ
గొనఁడె యాహవమున ఘోటకముల
దర్పదుర్జయు లగుదాయాదనృపతుల
ననిలోనఁ బఱవఁడే యాగ్రహమున

శ్వరుఁడే నాలవసోమేశుఁడు కాఁ దగుట నిశ్చయము.

హొయ్సళులను నొక తెగవారు, ప్రస్తుతము సేలము, కోయంబుత్తూరు మండలములని పిలువఁబడుచున్న ప్రదేశమును మైసూరు రాష్ట్రములోని కొంతప్రదేశమును కొంతకాలము పరిపాలించుచు వచ్చిరి. వీరి పరిపాలనకు లోఁబడిన ప్రదేశములో విశేషభాగమున కర్ణాటభాషయే యుండుటచే వీరు కర్ణాటాధీశ్వరులనియే పిలువఁబడు చుండిరి. ఈహొయ్సళులు యాదవరాజుల సంతతి వారనియు వీరి వంశకర్త హొయ్సళ నామధేయుఁడగుటచే, నాతని వంశీయులు హొయ్సళులైరనియు చరిత్రకారు లనుచున్నారు. వీరి వంశవృక్షము క్రింద నిచ్చుచున్నాఁడను. వీరి రాజధాని నగరము ద్వారసముద్రము.

హొయసల
|
కరి
|
వినయాదిత్య
|
ఎరియగంగ
|
మొదటి బల్లాలుఁడు — విష్ణువర్ధనుఁడు — ఉదయాదిత్యుఁడు

విష్ణువర్ధనుఁడు
|
మొదటి నరసింహరాయలు
|
రెండవ బల్లాలరాయలు
|
రెండవ నరసింహరాయలు
|
సోమేశ్వరుఁడు
|
మూఁడవ నరసింహరాయలు
|
వీరబల్లాలదేవుఁడు

వీని పరిపాలనాకాలమును నిర్ణయించు శాసనములు గలవు కాని గ్రంథవిస్తరభీతిచే నిందుదాహరింపలేదు. ఇందు చూపఁబడిన సోమేశ్వరుఁడు కర్ణాటదేశమును శా. శ. ౧౧౫౬ మొదలు ౧౧౮౯ వఱకును పాలించినట్లు శాసనాధారములవలనఁ గన్పించుచున్నది. బెంగుళూరు, సిర్గుండ శాసనములు (A. R. 366 of 1919) (చోళరాజుల పట్టిక నన్నెచోడుని చారిత్రమున నిచ్చియున్నాఁడను.) ఈకాలములో చోళరాజ్యమునుఁ బరిపాలించుచున్నవాఁడు మూఁడవరాజేంద్ర చోళుఁడు. ఇతఁడు బలహీనుఁడై రాజ్యసంరక్షణము నందసమర్థుఁడై యుండెననియు, నీసమయమున నీవీరసోమేశ్వరుఁడు బలవంతుఁడై యాతనిని జయించి చోళ సింహాసనము నాక్రమింపగా, మనతిక్కరాజు వీరసోమేశ్వరు నెదుర్కొని పోరాడి చోళసింహాసనమున మూఁడవ రాజేంద్రుని నిలిపెననియుఁ జరిత్రకారులు తలంచుచున్నారు. ఇది సత్యమనుటకు సంశయింపనక్కరలేదు. ఈమూఁడవ రాజేంద్రచోళుఁడు శా. శ. ౧౧౬౮ మొదలు ౧౧౯౯ వఱకును చోళసింహాసనము నందున్నవాఁడు. కావున తిక్కరాజు శా. శ. ౧౧౬౮ సంవత్సరమునకుఁ బిమ్మట ననఁగా శా. శ. ౧౧౮౦ ప్రాంతమున సోమేశ్వరుని జయించి యుండవచ్చునని తలంపవలసియున్నది. ఈసోమేశ్వరునిచే జయింపఁబడినవాఁడు మూఁడవ రాజేంద్రచోళుఁడు గాక మూఁడవ రాజరాజని తలంచితిమేని యాతని పరిపాలనాకాలము శా. శ. ౧౧౩౯ మొదలు ౧౧౮౦ వఱకునునై యున్నది. కావున తిక్కరాజు సోమేశ్వరుని జయించినది శా.శ. ౧౧౬౦ ప్రాంతమై యుండును. ఇదయే సత్యమని నాయభిప్రాయము.

ఈతిక్కరాజును వర్ణించుచుఁ దిక్కన వ్రాసిన మూఁడవ పద్య మిది.

సీ. లకుమయ గురుములూరికి నెత్తివచ్చినఁ
గొనఁడె యాహవమున ఘోటకముల
దర్పదుర్జయు లగుదాయాదనృపతుల
ననిలోనఁ బఱవఁడే యాగ్రహమున

శంభురాజాది ప్రశస్తారిమండలి
క్రమముఁ జెర్చి యేలఁడె కంచిపురము
చేదిమండలముఁ గొసిగఁ జేసి కాడవ
పతి నియ్యకొలుపఁడే పలచమునకు
రాయగండగోపాలు నరాతిభయద
రాయపెండార బిరుదాభిరాము నభయ
రాయగండాంకు

ఈపద్యమందలి దాయాది నృపతులీతని పినతండ్రులైన కల్లసిద్ధి, తమ్ముసిద్ధులో లేక వారి కుమారులో నైయుందురు.

తిక్కరాజు జయించిన కాడవపతి యెవరు?

పై సీసపద్యములోని నాల్గవ పాదమునఁ జెప్పిన కాడవపతి యెవ్వరో తెలిసికొనవలసియున్నది. ఉత్తరార్కాడు, దక్షిణార్కాడు మండలములలోని కొంతప్రదేశమునకా కాలమునఁ జేది దేశమని పేరు. ఇది యాకాలమునఁ బల్లవరాజుల పాలనములో నుండెడిది. పల్లవుల లోని యొక శాఖకు "కాడవు" లని పేరు. పల్లవరాజగు హిరణ్య వర్మ కాడవ కులమునకుఁ జెందినవాఁడని యొక శాసనమునఁ గలదు. (ద. హిం. శా. సం. ౪ సంఖ్య ౧౩౬౫.)

అప్పటినుండియు, నీ చేదిదేశమునుఁ బాలించుచున్న రాజులకు కాడవశబ్ద ముపయోగింపఁబడుచున్నది. మనతిక్కరాజుకాలములో నీ చేదిదేశమునుఁ బరిపాలించిన కాడవరాజు లిరువురు. వీరిరువురును తండ్రి కుమారులు. ఇరువురును "కొప్పెరున్‌జింగు" అనునామముతో పిలువఁ బడిరి. కొప్పెరున్‌జింగు అనఁగా మహారాజసింహ యనియర్థము. మొదటి కొప్పెరున్‌జింగదేవుఁడు, శా. శ. ౧౧౩౮ మొదలు ౧౧౬౫ వఱకును, రెండవకొప్పెరున్‌జింగు శా. శ. ౧౧౬౫ మొదలు ౧౨౦౧ వఱకును రాజ్యము చేసినట్లు కనుపట్టుచున్నది. చెంగల్పట్టు మండలము లోనిచెంగల్పట్టుతాలూకా యందలి అత్తూరు గ్రామమున ముక్తేశ్వ

రాలయముయొక్క గోడపైఁ గల యొకశాసనము (ద. హిం. శా. సం.౧౩ సంఖ్య౧౩౦) నందీ మొదటి కొప్పెరున్‌జింగని బిరుదము లిట్లున్నవి. "పల్లవకులపారిజాత - కాడవకులచూడామణి - అవనిపాలన జాత - గండపెండారలుంటాక - శ్రీరాపగాదక్షిణనాయక - కావేరీ కాముక - పెన్నదీనాథఖడ్గమల్ల - భారతీమల్ల - మల్లాపురీవల్లభ - కాంచీపురకాంత - ఇత్యాది - ఈబిరుదావళిలోని 'గండపెండార లుంటాక' అను బిరుదమువలన నీతఁడు గండపెండార బిరుదమునుఁ గలవానిని జయించి గండపెండారమునుఁ దోచుకొనినవాఁ డని తెలియు చున్నది.

చోడతిక్కరాజును "రాయగండగోపాలు నరాతిభయదరాయ పెండార బిరుదాభిరాము నుభయరాయగండాంకు" అని పైఁజెప్పిన సీసపద్యములోఁ దిక్కనసోమయాజి వర్ణించియున్నాఁడు. ఈ శాసనము నందు తిక్కరాజును కొప్పెరున్‌జింగడు జయించినట్లున్నను, నింతకు పూర్వము నవో పరమందో తిక్కరా జాతనినిజయించి తన కాతఁడు కప్పమొసంగుట కంగీకరింపఁ జేసియుండును. ఈశాసనము శక. సం. ౧౧౬౦ సంవత్సరమునాటిది. తిక్కనసోమయాజి వ్రాసినకాడవపతి యీతఁడే యైయుండును. కాదేని యీతనికుమారుఁ డైయుండును. కుమారుఁడే యైనచో కాడవపతినిజయించినకాలము శాలి. శకము ౧౧౬౧నకుఁ బిమ్మటను౧౧౭౮కు పూర్వమునయి యుండును. ఈకొప్పె రున్‌జింగను పేరున గలశాసనములు చాలఁ గలవు. వాని నన్నిటిని సమన్వయింప వలసియున్నది.

తిక్కరాజు జయించిన యితరరాజులు:

గురుమలూరియొద్ద లకుమయను తిక్కరాజు జయించినట్లు పై పద్యములో నున్నది. ఈలకుమయ యెవ్వఁడో తెలియదు. లక్ష్మణ దండనాయకుఁడను నొకఁడున్నాఁడు. కానియాతఁడీతని కాలమువాఁడు కాఁడు. శంభువరాయవంశీయు లాకాలమునఁ గంచిలో రాజ్యము చేయుచుండిరి. వీరు తెలుఁగు పల్లవరాజులకు సామంతు లయినట్లుకన్పట్టు చున్నది. తిక్కరాజు కాలమున రామరాయ శరభురాయులు రాజ్యము

నేయుచుండెనని చరిత్రకారులు వ్రాసియున్నారు. బహుశః తిక్కరాజు జయించిన దీతనినే యైయుండును. ఈవిషయమునం దింకనుఁ బరిశోధన మావశ్యకము.

తిక్కరాజు శాసనములు:

చోడ తిక్కరాజు శాసనము లనేకములు చెంగల్పట్టు మండలములోను, నెల్లూరు మండలములోను గానంబడుచున్న వనియు రాపూరు కందుకూరు తాలూకాలలోఁ బెక్కులు గలవనియు నితఁడు శాసనములలో చోడతిక్కనృపతి యనియు, తిరుకాళత్తి, దేవచోడ మహారాజనియు, భుజబలవీరతిరుకాళదేవచోడ మహారాజనియు, వ్యవహరింపఁ బడుచు వచ్చెనసియుఁ జరిత్రకారులు వ్రాసియుండిరి. మనుమసిద్ధి మహారాజు వ్రాయించిన కొలూరు శాసనములో తనతండ్రి తిరుకాళత్తిదేవ మహారాజని యుదాహరించి యుండుటచే, నీచోడ తిక్కరాజునకు తిరుకాళత్తి దేవుఁడని పేరున్నమాట నిశ్చయము. నెల్లూరు శాసనములలోఁ దిరుకాళత్తి దేవుఁడనియు, నల్లుతిరుకాళత్తి దేవుఁడనియు నిరువురు కనఁబడుచున్నారు. అల్లుతిరుకాళత్తి దేవుఁడు పల్లవుఁడనియు, నాతనికిని, చోడతిరుకాళత్తి దేవునకు నేమియు సంబంధము లేదనియు, శ్రీచిలుకూరి వీరభద్రరావుగా రాంధ్రుల చరిత్రమున వ్రాసియున్నారు. అల్లుతిరుకాళత్తిదేవుని యొక శాసనములో (నె. శా. సం) నితఁడు తన మామయైన తిరుకాళత్తి దేవునకుఁ బుణ్యమునకు గాను ధర్మమిచ్చినట్లు చెప్పఁబడియున్నది. ఈమామ తిరుకాళత్తిదేవుఁడు చోడతిక్కరాజగునో లేక యాతఁడు మఱియొక తిరుకాళత్తి దేవుఁడో తెలిసికొనవలసియున్నది.

నెల్లూరుశాసనములనుఁ బరికించిచూచినచో తిరుకాళత్తిదేవ మహారాజులు పలువురు న్నారని స్పష్టమగును. ఒకనిపేరు భుజబల చోడతిరుకాళత్తిదేవచోడమహారాజు. ఇతనిప్రశస్తి "స్వస్తిచరణ సరోరుహ విహితవిలోచన త్రిలోచనప్రముఖాఖిలపృథ్వీశ్వర కారిత కావేరీతీర కరికాలకులరత్నప్రదీపక అపరిమితప్రతాప సతతమభ్యర్చిత లక్ష్మీశ్వర ఒరయూరిపురవరాధీశ్వర కాంచీపురవరాధీశ శ్రీమన్మహా

మండలేశ్వర భుజబలచోళతిరుకాళ్తి దేవమహారాజు" అని యున్నది. ఇతనిశాసనములలో కులోత్తుంగ చోడాది చోడచక్రవర్తులనామము లుదాహరింపఁబడలేదు. ఇతనిశాసనములు నెల్లూరుమండలము లోని ఉదయగిరితాలూకాలోనున్నవి (నె. శా. సంపుటము ౧౩౭౬-౧౪౯౦) ఇవి వరుసగా శా. శ. ౧౧౬౮-౧౧౭౨ సంవత్సరములలోనివి. ఇతఁడు గాక రాపూరుతాలూకాలో (పుట౧౪౬౭) భుజబలవీరతిక్కకాలతి దేవచోడమహారాజు శాసన మొకటి శా. శ. ౧౧౩౩లో నున్నది. ఇతనిప్రశస్తి పైనవ్రాసిన ప్రశస్తియేగాకుండ దానికితోడుగా "కామినీ జనజయంత తురగరేవంత, వితరణవినోదవిక్రమాదిత్య తెంజనాదిత్య రిపువిపులమార్తాండ జగనొబ్బగండ గర్వితారాతికుమారకులకుధరకు విశధర శరణాగత వజ్రపంజరకీర్తినారాయణేత్యాది" బిరుదములు కూడ నున్నవి. కావున నీతఁడు పైనఁజెప్పిన భుజబలచోళ తిరుకాళ్తిదేవుని కంటెఁ బూర్వుఁడును నామములో నిరశబ్దముండుటచే భిన్నవ్యక్తి యునై యున్నట్లు కన్పట్టుచున్నది. ఇట్లే అల్లుతిరుకాళత్తి దేవులలో కూడ నిరువురు కనఁబడుచున్నారు. ఒకఁడు అల్లుంతిక్క మహారాజు. ఇతని శాసనములు శా. శ. ౧౧౦౭ లో నెల్లూరు, సూళూరుపేట గూడూరు, తాలూకాలలో నున్నవి. (పుట ౨౨౫-౬౩౪. ౨౨౬-౧౩౦౨). రెండవవాఁడు అల్లుతిరుకాళత్తిదేవ చోడమహారాజు. ఇతని శాసనములు, ఆత్మకూరు, రాపూరు, కావలి తాలూకాలలో శా. శ. ౧౧౬౬-౧౧౮౯ సంవత్సరములలో (పుటలు ౪౦౨-౧౪౩౪, ౨౧౯) నున్నవి. ఇందు ౪౦౨వ పుటలోని శాసనములో తమ మామ తిరుకాళత్తి దేవునకు పుణ్యముగ కని యున్నది. ఇతఁడు పైన మొదట చెప్పిన భుజబలచోడ తిరుకాళత్తిచోడ మహారాజున కల్లుఁడై యుండు నని తోఁచుచున్నది. పైనఁజెప్పిన తిరుకాళత్తి దేవులలో నెవ్వఁడును మనచోడతిక్కరాజు కాఁడు.

వీరుగాక చోడతిక్కరాజు అని చెప్పఁదగినవాఁ డింకొకఁడు కలఁడు. ఇతనిపేరు శాసనములలో మధురాంతకపొత్తపిచోళుఁ డనియు గండగోపాలుఁడనియు బిరుదులు గలిగి తిరుకాలత్తిదేవచోడ మహారాజనియు, మహామండలేశ్వర తిరుకాలత్తిదేవచోడమహారాజు అనియు

జెప్పఁబడినది. ఇతని శాసనములు నెల్లూరు మండలములో రాపూరు, కందుకూరు, కావలి, నెల్లూరు, గూడూరు తాలూకాలలో నున్నవి. (నె. శా. సం. పుటలు ౧౨౯౦, ౧౨౧౬, ౫౪౧, ౬౪౮, ౪౩౧, ౭౬౪, ౧౨౯౨). ఇవి శా. శ. ౧౧౫౩, ౧౧౬౬, ౧౧౩౨, ౧౧౫౨ సంవత్సరములలో నున్నవి. కొన్నిఁటిలో శకకాల నిర్ణయ లేదు. కొన్నిఁటిలో కులోత్తుంగచోళుని యొక్కయు గొన్నిటిలో రాజరాజదేవుని యొక్కయు రాజ్యసంవత్సరము లీయఁబడినవి. మూఁడవ కులోత్తుంగుఁడు శా. శ ౧౧౦౦ మొదలు ౧౧౩౮ వఱకును నాతని తరువాత మూఁడవ రాజరాజదేవుఁడు శా. శ. ౧౧౩౮ మొదలు ౧౧౬౦ వఱకును చోళరాజ్యమునుఁ బరిపాలించియుండిరి. మనచోడ తిక్కరాజు వారికి సామంతుఁడై యున్నవాఁడు. కనుకనే హొయ్సళ వంశీయుఁడగు సోమేశ్వరుఁడు చోళరాజును సింహాసన భ్రష్టుని చేసినప్పుడీ తిక్కరాజాతనిని జయించి మరల చోళరాజును సింహాసనముపై నిలిపి చోళసింహాసనాచార్య బిరుదమును గైగొనియుండెను. ఈచోడతిక్కరాజు శా. శ. ౧౧౧౦ ప్రాంతమున జన్మించి ౧౧౭౮ ప్రాంతమున వెలనాటి పృథ్వీశ్వరుని జంపి, శా. శ. ౧౧౬౪-౧౧౬౯ నడుమ చనిపోయి యుండును. పైనచూపిన శాసనము లన్నియు నీమధ్యకాలములో నున్నవి. కావున నీశాసనములలోఁ జెప్పినవాఁడే మన చోడతిక్కరాజనుటకు సందియము లేదు. ఈశాసనములలోఁ గొన్నిఁటిని బట్టి, యీతఁడు వైష్ణవ భక్తుఁడని తెలియుచున్నది. అయినను నితఁడు పరమత ద్వేషము కలవాఁడు కాఁడు.

తిక్కరాజు మంత్రులు :

ఈతిక్కరాజునొద్ద తిక్కనసోమయాజికిఁ బెదతండ్రి యైనసిద్ధన మంత్రిగా నున్నట్లు కేతనకవి దశకుమారచరిత్రమున నీక్రిందిపద్యములో జెప్పియున్నాఁడు.

ఉ. స్థాపితసూర్యవంశ వసుధాపతి నాఁ బరతత్త్వధూతవా
ణీపతి నా నుదాత్తనృపనీతి బృహస్పతి నా గృహస్థ గౌ
రీపతి నాఁ గృపారససరిత్పతి నాఁ బొగడొందె సిద్ధిసే
నాపతి ప్రోడ తిక్కజననాథశిఖామణి కార్యమంత్రి యై.

ఇతఁడా ప్రధానమంత్రియే కాకుండ, సేనాపతిగా కూడ నుండెనని పై పద్యములో నున్నది. తిక్కరాజునొద్ద సిద్ధయయే కాక యాతని కుమారుఁడైన తిక్కనకూడ మంత్రిగా నున్న ట్లీక్రిందిశాసనమువలనఁ దెలియుచున్నది. (నెల్లూరు శాసనములు ౧౩౯ర పుట) ఈశాసనములో నన్వయము సరిగా కుదురుట లేదు. కాని ముఖ్యవిషయములు స్పష్టము గానే యున్నవి.

"స్వస్తి సమస్తప్రశస్తిసహిత శ్రీమన్మహామండలేశ్వర (ప్రసాహిత?) తిక్కయదేవమహారాజులు సమస్తప్రశస్తిసహిత శ్రీమన్మహాప్రధానులైన సిద్ధనప్రెగడ తిక్కయనాథరిప్రెగడయుం దమతాండినంతోడు నింతవట్టునుం గూడియు వరాహాన్యతప్రముఖులైె యాశవర్గంబుతో వదోలగట్టువం దిష్టకథవినోదంములం నున్న యువసరంబున ధర్మాధర్మం విచారించి తమతండ్రి తిరుకాళేశ్వర శ్రీమహాదేవరకు నంగభోగరంగభోగములకు స్వస్తి శ్రీ సకనరుపంబులు ౧౧౭౮ నేండు శ్రీవీరరాజేంద్ర చోడచక్రవర్తి ౯ శ్రా హి. పరీధావిసంవచ్చర ఫాల్గుబహుళ ౧౩ వడవారము నాంటిసూర్యగ్రహణమునాండు తిరుకాళేశ్వరదేవర దివ్యశ్రీపాదపద్మారాధకులైన త్రిపురాంతకదేవునికిన్ని అతనితమ్ముండు గేదారదేవనికిం చిలుకపాటికంపనలములో జోగడపాడ నున్నది. ఆచంద్రార్కముగా ధారాపూర్వము సేసి ఇచ్చినవాంను. దీనిం నెవ్వండు లేదన్నవానినోర తోంక ప్రువ్వులు దొలు దీనికి విక్రీశంచేస్తే వారు గంగ్గకఱుతం గపిలం పాడిచినవారు తమపెదకొడుక కపాలానం స్వనరమాంసబక్షణంబు సేసినవారు. స్వదత్తంపరదత్తంవ్వా ఓహారేతి వసుంధరా షష్టివర్యసహస్రాణి విష్టాయాం జాయతే క్రిమి."

ఈశాసనమునుబట్టి తిక్కరాయుఁడు క్రీ. శ. ౧౨౫౬వ సంవత్సరమువఱకు జీవించియున్నాఁడనుటస్పష్టము. ఇతఁడు శా. శ. ౧౧౧౦ (అనఁగా క్రీ. శ. ౧౧౮౮) ప్రాంతమున జన్మించియుండునని వ్రాసి యుంటిమి. అది సత్యమయినచో నీశాసనకాలమునాటి కాతనికి ౬౮ సంవత్సరము లుండును. ఈతనికుమారుఁ డైనమనుమసిద్ధి శాసనము శా. శ. ౧౧౭౯లో కనఁబడుచున్నది. శా. శ. ౧౧౭౮-౧౧౭౯ నడుమఁ దిక్కరాజు గాలధర్మము నొందియుండును.

కృతిపతిమనుమసిద్ధి :

మనతిక్కనసోమయాజికిఁ బ్రభువును నిర్వచనోత్తరరామాయణ కృతిపతియు నగుమనుమసిద్ధి యీతిక్కరాజుకుమారుఁడే. ఇతనిగుణగణములను దిక్కనసోమయాజి పెక్కుపద్యములలో వర్ణించియున్నాఁడు. అందలి రెండుపద్యముల నీక్రింద నిచ్చుచున్నాఁడను.

సీ. కొండలు నఱకు నాఖండలుకైవడి
యొనయు నేనుంగులఁ దునుమునపుడు
బెబ్బులి వడి వేళ్ళపింపు హత్తినయొప్పు
గలుగు రాహుత్తులకుఁ గడఁగునప్పు
డడవులఁ గార్చిచ్చు లసరుచందము గాన
నగుఁ గాలుబలమున కలుగునపుడు
బలుగాలి మొగుళ్ళపై వీచు క్రియఁ దోఁచుఁ
దఱుచైనగొడుగులు నఱకునపుడు
తే. కసిమసంగిన మృత్యువుకరణి యంత
కాలరుద్రుని కైవడి కాలదండ
ధరునిబలువిడి యలవడుదురములోన
నసమశౌర్యుఁడు మనుమధరాధిపునకు.

సీ. అనుపమబహురత్నహయవారణముల వి
ద్విషులు గప్పములు పుత్తెంచుచోట
నెల్లి కయ్యంబని యుద్ధియేఁచియు నొక్క
కెలన శాత్రవదూత పలుకుచోటఁ
దలతల మని రెండుదడములవారేటు
న కమానము గఁ జేరనడచుచోటఁ
బరసేన వచ్చియుం బాఱియుం బయలైన
యనిలోన జయము సేకొనెడుచోట
ఆ. నొక్కరూప కాని యొక్కుడు డిగ్గును
గానరాదు ముఖవికాసమునకు
నన్యరాజు లీడె యరిరాయవేశ్యాభు
జంగుఁడైన మనుమజనవిభునకు.

ఈపద్యములవలన మనుమసిద్ధి తండ్రివలెనే గొప్పపరాక్రమవంతుఁడనియు శౌర్యధైర్యములుగలవాఁడనియుఁ దెలియుచున్నది. తండ్రివలె నీతఁడు విశేష దేశమును గలిగియుండకపోయినను, గణపతిదేవునిసాహాయ్యముతో నెల్లూరుమండలమున నొకప్రసిద్ధిగల మహారాజై యున్నాఁడనుటకు సంశయము లేదు.

మనుమసిద్ధి రాజ్యభ్రష్టుఁడగుట: తిక్కనరాజ్యమును తిరిగి సంపాదించుట:

ఈమనుమసిద్ధిని నతని దాయాదులైన అక్కన, బయ్యనలనువారు పదభ్రష్టునిఁ జేసి రాజ్యము నపహరించిరనియు, వారిని జయించుటకు సాధ్యము గాకపోఁగాఁ దిక్కనసోమయాజి కాకతీయ గణపతిదేవునొద్దకు, ఓరుగల్లునకుఁ బోయి యాతని సాహాయ్యమునుఁ గోరి తీసికొనివచ్చి మనుమసిద్ధికి రాజ్యమిప్పించెననియు నొక కథ కలదు. ఈ కథను గ్రంథస్థము చేసినవారు కాసె సర్వప్పయును, కూచిమంచి జగ్గకవియును. సర్వప్ప ౧౪౦౦ సంవత్సరప్రాంతము వాఁడు. జగ్గకవి ౧౭౨౦ సంవత్సర ప్రాంతమువాఁడు. సర్వప్ప తన సిద్ధేశ్వర చరిత్రమను ద్విపదకావ్యమున నిట్లు చెప్పియున్నాఁడు.

(౧)సిద్ధేశ్వర చరిత్రమునందలి కథ :

సారెసారెకుఁ గేరి సన్నుతుల్ చేయు
సారపారావార పరసగంభీర
సారుఁడై కీర్తివిస్తారుఁడై యలరు
నారీతి గణపతి నటు చూచు వేడ్కఁ
దిక్కనసోమయాజక్కడ కొకట.

\+ \+ \+

దిక్కుదిక్కులనుండి తెరలి విద్యార్థు
లక్కడక్కడను గావ్యముల శ్లోకార్థ
మొక్కొక్క విధమున నొగి వినిపింప
జక్కన వినుచును నొక్కయందలము
నెక్కి తిక్కనసోముఁ డక్క డేతెంచె

నాకీతిగా సోమయాజులరాక
వారక చని ఫణిహారులు దెల్ప

\+ + +

అట్టిమహాత్ముని నాసోమయాజి
నెట్టన నెదు రేఁగి నేర్పుతో రాజు
తెచ్చి యుర్వాసనస్థితునిగఁ జేసి
మెచ్చి తాంబూలాదు లెచ్చుగా నిచ్చి

\+ + +

అగుభారతాఖ్యాన మాంధ్రీకరణము
తగఁ జేసినట్టి యున్నప్రకారములు
వినియు సంతోషించెఁ గనినట్లు చెప్ప

\+ + +

అంతఁ దిక్కనసోమయాజికి మెచ్చి
యింతవస్త్రంబులు వివిధభూషణము
లత్యంతభక్తితో నప్పు డిచ్చుడును
సత్యసంధుఁడును సభ్యవర్తనుఁడు
నగు సోమయాజి తానారాజు కనియెఁ
దగుమాట విను మొక్కధర్మకార్యంబు
సూర్యవంశంబున సొబగొందునట్టి
యార్యపూజితవర్యుఁ డామనుమసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల

\+ + +

అక్కనబయ్యన లధికబలిష్ఠు
లక్కట సిద్ధిరాయునిఁ బాఱఁదోలి
దక్కినరాజ్యంబు తామె యేలుచును
నొక్కకా సైనను జక్కఁగ నీరు
వారలదండించి వారి నెల్లూరు
వారి కిప్పింపు మవారణఁ బ్రీతి
ననిన గణపతిరా జటు కాకనుచు

వెడలి గణపతియు విజయంబునకును
గుడిమెడమలసేన కొలిచి యేతేర
వెలనాఁడు చేరియు వీఁడెల్లఁ గాల్చి
వెలనాఁటిరాజును వెస గెల్చి వాని
యప్పనంబులు గొని యటఁ జని రాజు
గుప్పైన నెల్లూరు కూడ నేతెంచి
యక్కనబయ్యన నచట సాధించి

\+ \+ \+

నెల్లూరిప్రజలకు నేర్పు వాటిల్లఁ
జెల్లించె మన్మసిద్ధిరాజునకు
నెల్లూరు పట్టంబు నేర్పుతోఁ గట్టి
నల్లితాదృతి సమదుర్గములను
నఱువదెనిమిదియు నగపట్టణముల
నరుదొంద సాధించి యామన్మసిద్ధి
రాజు కిచ్చియు. దనతేజంబు దిశలఁ
బూజ లెక్కఁగ ఘనరాజితయశుఁడు
ఘనతటాకంబుఁ దాఁ గట్టించె నచటఁ
గొనకొని నెల్లూరఁ గొన్నాలలుండి
మనుమసిద్ధికి రాజ్యమహిమలు దెల్పె.

(౨) సోమదేవరాజీయ కథ :

కూచిమంచిజగ్గకవి తన సోమదేవరాజీయమునం దిట్లు చెప్పి యున్నాఁడు.

గీ. చేయఁ దక్కువ యైనదేవాయతనము
లపుడు పూర్తిగఁ గట్టించి యలరుచున్న
చోట నొకనాఁడు తిక్కనసోమయాజి
వచ్చె నెల్లూరినుండి భావమునకడకు.

సీ. వచ్చిన యయ్యార్యవర్యు నెదుర్కొని
వినయసంభ్రమభక్తి వినుమడింప
నతిథిపూజ లొనర్చి యతనిచే భారతా
ర్థమును ద్వైతాద్వైత తత్త్వములును
విస్పష్టశ చిదచిద్వివేక లక్షణములుఁ
బ్రకటధర్మాధర్మ పద్ధతులును
రాజనీతి ప్రకారంబును భారత
వీరుల మహిమంబు వినుచునుండి
యను మకొండ నివాసులైనట్టి బౌద్ధ
జనుల రావించి వారిఁ దిక్కనమనీషి
తోడ వాదింపఁజేసినఁ దొడరి వారిఁ
జులకఁగా సోమయాజులు గెలుచుటయును.

వ. అప్పుడు బౌద్ధదేవాలయంబులు నూలం ద్రోయించి గణపతిదేవరాజు సోమయాజుల పటువాక్యశక్తికి మెచ్చి యతనిని బహుప్రకారంబులఁ బూజించి యెనిమిది గ్రామంబు లొసంగి యతఁడు వచ్చిన కార్యం బడిగిన నాభూవరునకుఁ గవివరుం డిట్లనియె

గీ. ఇనకులోద్భవుఁ డైనట్టి మనుమసిద్ధి
రాజు నెల్లూరు పాలించుచోఁ జెలంగి
యతని దాయాదు లతని నుక్కడఁగఁ బట్టి
యునిచి రాజ్యంబుఁ దమ రేలుచున్నవారు.

క. కావున మీరిప్పు డచటికి
వేవేగం దరలి వచ్చి విడకుండఁగ నా
భూవరుఁ బునరభిషిక్తునిఁ
గావింపఁగవలయు ననిన గణపతి విభుఁడున్.

గీ. అట్లకాక యనుచు నాపని కొడఁబడి
యత్యుదారగుణసమగ్రుఁ డగుచుఁ
దవిలి యప్పు డొక్కనవలక్షధనమును
యజ్ఞకుండలములు నతని కిచ్చె

క. పనుచు నెడఁ దిక్కమఖి యా
జనవరుసింహాసనమున సచివాగ్రణియై
తనరెడు శివదేవయ్యన్
గనుఁగొని యారాజుతోడఁ గడఁగం బలికెన్.

గీ. వసుమతీనాథ యాతఁ డీశ్వరుఁడు గాని
మనుజమాత్రుండు గాఁడు పల్కు లితని
యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి
నేలు మని చెప్పి యాఘనుఁ డేఁగుటయును.

సీ. గణపతిదేవుఁ డాఘనుననుమతిఁ గాంచి
యతిసత్వరమునఁ బ్రయాణభేరి
వేయించి చతురంగపృతనాసమేతుఁడై
తరలి ము న్వెలనాటిధరణీపతుల
గెలిచి వారలచేత ఏలనప్పనముఁగొని
వారినందఱిఁ దనవశము చేసి
కొని చని నెల్లూరుఁ గొబ్బునఁ జొచ్చి య
క్కనయు బయ్యనయు నన్ఖిలులఁ దఱిమి
మనుమసిద్ధిరాజుఁ బునరభిషిక్తుఁగా
వించి మించి రెండువేలునైదు
నూఱుగ్రామములు మనోవృత్తి కతనికి
నిచ్చి కడమఁ దాను బుచ్చుకొనియె.

తిక్కన గణపతిదేవునికడ కేఁగునప్పటికి భారతమునే కాదు. రామాయణమునైనను రచింపలేదు. భారతమును గణపతికి జదివి వినిపించినాఁడని వ్రాసిన వ్రాఁతలనుబట్టి పైగ్రంథములను విశ్వసింపరాదని కొందఱనుచున్నారు. అప్పటికి భారతరచన మారంభింపలేదనుమాట నిశ్చయమే కాని యాతని కభిమానగ్రంథమైన భారతమును సంస్కృతభాషలో నున్నదానిని జదివి వినిపించెనని తలంపవలసియున్నది. ఈయూహకు సిద్ధేశ్వరచరిత్ర సోమదేవరాజీయములలోని వాక్యములు వ్యతిరేకముగా లేవు. సంస్కృతభారతమునుఁ జదివి వినిపించి దాయాదు

లపహరించిన రాజ్యమును పాండవుల కిప్పించుటకై శ్రీకృష్ణుఁడు తోడు పడినట్లే మనుమసిద్ధికిఁ దోడుపడుమని సోమయాజి గణపతిదేవునిఁ గోరియుండును.

గణపతిదేవుడు మనుమసిద్ధికి సాహాయ్యము సేయుట:

తిక్కనసోమయాజి గణపతిదేవునియొద్దకు వెళ్లియుండె ననుసంగతి సంశయాస్పద మని శ్రీవీరభద్రరావుగా రాంధ్రులచరిత్రమున వ్రాసియున్నారు. కాని యది సంశయింపఁదగిన విషయము కాదని నాయభిప్రాయము. చోడతిక్కరాజునకు దాయాదులు శత్రువులుగా నున్నారని తిక్కన నిర్వచనోత్తర రామాయణమునఁ జెప్పిన "దర్పదుర్జయులగు దాయాదనృపతుల ననిలోనఁ బఱపఁడే యాగ్రహమున" ననుపద్యపాదమువలన స్పష్టమగుచున్నది. తిక్కరాజు తరువాత నాదాయాదులు మనుమసిద్ధిపై దాడివెడలి పగఁదీర్చుకొనఁ బ్రయత్నించి రని నమ్ముట కవకాశ మున్నది. నిర్వచనోత్తర రామాయణమునం దీప్రసక్తి యేమియుఁ గాన్పింపదు. అక్కనబయ్యనలనామములు పై గ్రంథములలోఁదక్క శాసనప్రపంచములోఁ గాని వాఙ్మయప్రపంచములోఁ గాని యెచ్చటను గన్పడవు. నెల్లూరు మండలములోని వంగవోలుతాలూకా త్రోవగుంట యందున్న శిలాశాసనమున బయ్యనదేవ మహారాజులు, చినబయ్యనదేవమహారాజుల పేర్లు గనవచ్చుచున్నవి. (నె. శా. సం. పుట౧౧౩౫) ఆశాసనమునిట్లు వ్రాయుచున్నాఁడను.

"శ్రీమన్మహామండలేశ్వర బయ్యనదేవ మహారాజులు చిన బయ్యనదేవ మహారాజులు త్రోగుంట మూలస్థాన శ్రీమన్మహాదేవరకుం వెట్టినక్షేత్రంబు ౧౦౦౦ కన్నేశ్వర శ్రీమనమహాదేవరకు న ౧౦ పది. ఎఱ్ఱగుడిపాటి శ్రీమహాదేవరకు న ౧౦ పది వెట్టిపలిగని జూపేశ్వర శ్రీమహాదేవరకు న ౧౦ పది పడూరి వీరేశ్వర శ్రీమహాదేవరకు న ౫ కొండూరి దేవరకు న ౧౦ పది ఇచ్చెను." ఈశాసనమునఁ గాలమీయఁబడనందున, వీరెవ్వరో ఏకాలమువారో, మనుమసిద్ధికిని వీరికిని సంబంధమున్నదో లేదో చెప్పఁజాలము. వీరికి మహామండలేశ్వర బిరుదమున్నది పైనజెప్పిన రెండు గ్రంథములనుబట్టి గణపతిదేవుఁడు, వెలనాఁ

మును, నెల్లూరును ఒక్కసారియే కాల్చి జయించినట్లు కన్పట్టుచున్నది. గణపతిదేవుని కాలమున వెలనాడును బాలించుచున్న ప్రభువులెవ్వరో తెలిసికొనిన యెడల, ఏసమయమున గణపతిదేవుఁడు వెలనాడును జయించినదియుఁ దెలియుటకవకాశము గలుగవచ్చును. గణపతిదేవుని రాజ్యపరిపాలనాకాలము శా. శ. ౧౧౨౦ మొదలు ౧౧౮౨ వఱకు నైయున్నది. (క్రీ. శ. ౧౧౯౮-౧౨౬౦) వెలనాఁటి పృథ్వీశ్వరుని శాసనములు శా.శ.౧౧౨౮ కి దరువాత గన్పించుటలేదు. ఈవెలనాఁటి పృథ్వీశ్వరుని జంపినవాఁడు చోడతిక్కరాజు. పృథ్వీశ్వరుని యనంతరమున వెలనాఁడును బరిపాలించిన రాజెవ్వఁడో తెలిసికొనవలసియున్నది. పృథ్వీశ్వరుని సంహారించిన చోడతిక్కరాజు మూఁడవ కులోత్తుంగ చోడుని ద్రావిడచోడుఁడు సామంతుఁడని పైన వ్రాసియుంటిని. కావున ద్రావిడ మూఁడవ కులోత్తుంగుఁడు పృథ్వీశ్వరుని తరువాత వెలనాటిని స్వాధీనము చేసికొని పరిపాలనము చేసెనని యూహించుట సహజము. ఈ ద్రావిడ మూఁడవ కులోత్తుంగచోడుఁడు శా. శ. ౧౧౦౦ సంవత్సరమున చోళసింహాసనము నధిష్ఠించి ౧౧౪౦ వఱకును రాజ్యము చేసినవాఁడు. ఈకాలమున వెలనాఁడీచోడుని పరిపాలనమునకు లోఁబడియుండును. కాకతి గణపతిదేవుని శాసనములు శా. శ. ౧౧౪౦ మొదలు వెలనాటియందుఁ గన్పించుచుండుటచే నీద్రావిడ మూఁడవ కులోత్తుంగచోడుని యనంతరమున వెలనాఁడు కాకతి గణపతిదేవుని స్వాధీనములోనికి వచ్చియుండెననియుఁ జోడతిక్కరాజు శా. శ. ౧౧౬౮ వఱకు జీవించియున్నను నాతని యధికారము నెల్లూరి ప్రాంతముననే గాని వెలనాటిపైఁ జెల్లుటలేదనియుఁ దలంపవలసియున్నది.

ఈసందర్భమున ౧౯౪౫ సం. ఫిబ్రవరినెల భారతి సంచికలో శ్రీనేలటూరి వెంకటరమణయ్యగారిచేఁ బ్రకటింపఁబడిన గణపతిదేవుని శాసనమునుగూడ నిట నుదాహరించి, యది మనస్సిద్ధి రాజ్యభ్రష్టత్వకథ కేమయిన నుపయోగించునేమో చూడవలసియున్నది. ఆశాసనమిది. దీనిని నాయకపల్లి శాసనమందురు.

“శ స్త్రిసహితం...... హామండలేశ్వరు లైనకాకతిగణపతిదేవ మహారాజులు దిగ్విజయము నేసి పరమండళములు సాధించ్చి దక్షిణ దిగుభాగమున నెల్లురు గాల్చి తద్విరోధు లైనపడిహారిబయ్యానతిక్కనల వెరసినశాత్రవశిరంబులం గందుకక్రీడ వినోదము సలిపి దవిళమండలమున కులోత్తుంగరాజేంద్రచోడ నిచ్చిగొని నెల్లురిరాజుచేత ఏనుగులం గన్కగ గొనివచ్చి......”

గణపతిజయించిన మూఁడవకులోత్తుంగుఁడెవరు?

ఈశాసనములోని కథయును, కాసెసర్వప్ప రచించిన సిద్ధేశ్వర చరిత్రలోనికథయును, ఒకటిగానే కన్పట్టుచున్నది. కాని యీశాసనమున సిద్ధేశ్వరచరిత్రమునజెప్పిన “వెలనాఁడుచేరియు వీఁడెల్లఁ గాల్చి వెలనాటిరాజును వెస గెల్చి వానియుప్పనంబులుఁగొని” అను వెలనాఁటి కథ లేదు. అయినను “పరమండలములుసాధించి” యనువాక్యములోని కథ యిమిడియున్నదని భావింపవచ్చును. ఈశాసనమునఁ జెప్పిన కులోత్తుంగరాజేంద్రచోడునికథ సిద్ధేశ్వరచరిత్రమున లేదు. నెల్లూరును గాల్చినకథ రెండింటియందును కలదు. గణపతిదేవుఁడు నెల్లూరును రెండుసారులు గాల్చియుండఁడు. కావున నీశాసనమునందును సిద్ధేశ్వర చరిత్రమునందును జెప్పినకథ యొకటియే యనియు, నొకకాలమున జరిగినదే యనియు, నిశ్చయింపవలసియున్నది. శాసనమునఁ జెప్పఁబడిన కులోత్తుంగరాజేంద్రచోడుఁ డెవ్వఁడో తెలిసికొనఁ గలిగితి మేని మనమసిద్ధికాలనిర్ణయమునకు కొంత సాహాయ్యమగును. ఈశాసనమునఁ గాల మీయఁబడలేదో, కాలమున్నభాగము పోయినదో తెలియదు. కాలమును దెలిసియున్నచో నిందుఁ జెప్పబడినకులోత్తుంగరాజేంద్రచోడుఁ డెవ్వఁడో తెలిసికొనవీలు కలిగియుండును. ఇతఁడు మూఁడవ రాజేంద్ర (ద్రావిడ) చోడుఁడని శ్రీ డాక్టరు మారేమండరామారావుగారు వ్రాసియున్నారు. అది సరికాదనియు, నీశాసనమునం దుదాహరింపఁబడినయాతఁడు వెలనాటి చోడవంశమునకుఁ జెందిన కులోత్తుంగరాజేంద్రచోడుఁ డనియు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగా రనుచున్నారు. పై శాసనములో “కులోత్తుంగరాజేంద్రచోడ” యని

యుండుటచే సీతఁడు వెలనాఁటి వంశీయుఁడని వెంకటరమణయ్యగారి యభిప్రాయము.

ఇఁకను వెంకటరమణయ్యగారని నట్లీతఁడు వెలనాటి వంశీయుఁడగునా యని చూడవలసియున్నది. వెలనాఁటి పృథ్వీశ్వరునకుఁ బురుష సంతతి యుండెనో లేదో తెలియఁదగిన యాధారములు లభింపలేదు. కాని వెంకటరమణయ్యగారు భారతి పత్రికలో మూఁడు శాసనముల నుదహరించియున్నారు. మొదటిది గణపతిదేవుని నాయకులలో నొకఁడైన మల్యాల హేమాద్రిరడ్డిది. (ద. హిం. శా. సం. ౪ సంఖ్య ౧౩౩౩) ఇందు దాను కులోత్తుంగ రాయరాజేంద్రచోడ గొంకద శాపట్టడనని చెప్పుకొనియున్నాఁడు. ఇది శా. శ. ౧౧౫౯ నాఁటిది. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి యాలయమునం దున్నది. రెండవది శా. శ. ౧౧౭౧ నాటిది త్రిపురాంతకమునం దున్నది. చోడబోయఁడను నొకఁడు వెలనాఁటి రాజేంద్రచోడుని భృత్యుఁడని చెప్పఁబడి యున్నది. (A. R. No 249 of 1905) ఇది యీతని భార్య జయసాని వ్రాయించినది. ఇందు

"రాజేంద్రచోడ నృపకార్యవిధానతంద్రః
శ్రీబోయచోడిరతివైభవ నిర్జితేంద్రః"

అని యున్నది. మూఁడవది శా. శ. ౧౧౭౬ నాఁటిది. గుంటూరు మండలములోని యినుమెళ్ళలోనిది (ద. హిం. శా. సం ౬ సంఖ్య ౬౦౨) కాకతి గణపతిదేవుని యనుచరుఁడగు కాలవనాయఁకుడు తాను "వెలంది కులోత్తుంగరాజేంద్రచోడ విస్తారకుఁడనని చెప్పుకొని యున్నాఁడు. ఇందున్న 'వెలంది' శబ్దము వెలనాఁటి అనుదానికి బదులుగా శాసన లేఖకుఁడు తప్పు చెక్కియున్నాఁడని వెంకటరమణయ్యగారి యభిప్రాయము. ఈకాలవనాయకునిదే (ద. హిం. శా. సం ౬ సంఖ్య ౬౦౩) సంఖ్య గలది యిఁక నొకటి కలదు. అందీ శబ్దము 'వెలాది' అని యున్నది. అందు "రుద్రయదేవ అమ్మంగరికిపుణ్యము గాను" అని యున్నది. కాని అందు శాసన కాలము "౧౦..." అని సగము మాత్రమే కన్పట్టుచున్నది. ఇందులోని 'సున్న' ౧ కి బదు

లుగా పొరబాటు పడియుండవచ్చును. మొత్తముమీఁద నీశాసనము లన్నియు కాకతి గణపతిదేవుని కాలమునను, అతని కుమార్తె కాలము నందును పుట్టినవి. వారిపేరుల నుదాహరించి యుండుటచే, నిందున్న వెలనాటి రాజులు కాకతీయులకు సామంతులుగా నుండిరనియు, వారి క్రిందనుండు నాయకులు, తను సన్నిహిత ప్రభువులైన వెలనాటి వారి యొక్కయు, వారి యేలికలగు కాకతీయుల యొక్కయు నామములను తమ శాసనములలో నుదహరించియున్నారనియుఁ దలంపవలసియున్నది. ఈశాసనములలోఁ జెప్పఁబడిన వెలనాటి రాజేంద్ర చోడునకును వెల నాటి పృథ్వీశ్వరునకును ఏమయిన సంబంధమున్నదా ? యని యోచింతము. వెలనాటి పృథ్వీశ్వరునకు పురుషసంతాన మున్నట్లాధారములు దొరకలేదు. ఆతని యనంతరమున వెలనాఁడు, వేగినాఁడు దేశములలో సామంతులు పెక్కురు బయలుదేరి మహాపరాక్రమవంతుఁడైన చోడ ముమ్మడి కులోత్తుంగరాజు యొక్క యధికారమునకు లోఁబడి యా దేశములలోని భాగములనుఁ బరిపాలించినట్లును, కులోత్తుంగుని యనంత రమున నీసామంతులు ప్రభువులై స్వతంత్రముగా రాజ్యపరిపాలనము చేసియున్నట్లునుఁ గన్పట్టుచున్నది. అట్టివారిలో పైశాసనములలో నుదాహృతులైన వెలనాటి రాజులుకూడఁ జేరియుందురు. పై శాసనము లలోని రాజులకునుఁ బృథ్వీశ్వరునకును, ఎట్టి సంబంధమైన నున్నదియో లేదో స్పష్టముగాఁ జెప్పఁజాలము. కాని వెలనాటి పూర్వపురాజుల నామములును నీశాసనములలోని రాజుల నామములును నొక్కరీతిగా నుండుటచే వీ రాపృథ్వీశ్వరుని సంతతివారని యూహింపవలసియున్నది. పైనఁ జెప్పినవికాక శా. శ. ౧౧౫౧ లో నింక నొకశాసనము కన్పించు చున్నది. (A. R. 3౨౨ of 1936-37) ఈశాసనపు ప్రతికాపీకు విశేషప్రయత్న మొనర్చినను నాకు లభించినది కాదు.) ఇది వెలనాటి చోడునిది. ఇందు గొంతభాగము శిథిలమైపోయినదనియు, గాలము "సోమేషురుద్రగణితే" అని యుండుటచే శా. శ. ౧౧౫౧ అనియు పృథ్వీశ్వరునకును, నీశాసనకాలమునకును నడుమ దాదాపు 30 సంవ త్సరములుండుటచే నీకాలమున శాసనకర్తయు నాతని తండ్రియు రాజ్య పాలనము జేసియుందురనియు, తండ్రిపేరున్న భాగము శిథిలమైనదనియు,

దొరతనమువారి శాసనపరిశోధక శాఖవారు పైశాసనముపై వ్యాఖ్యానము వ్రాసియున్నారు (A. R. 1936-37 Part II Para 15 Page 65) ఈశాసనము గుంటూరు మండలములోని రేపల్లె తాలూకాయందలి పెద్దపులివఱ్ఱు గ్రామమున నరేంద్రస్వామివారి యాలయమున నంది స్తంభముమీఁద నున్నది. అందు వెలనాఁటిచోడుఁడు యుద్ధములో శత్రువులనుండి గైకొనిన సంపదను ద్రాక్షారామ భీమేశ్వరునకిచ్చినట్లు దనతండ్రి యేబదిలక్షలుగల యాంధ్రదేశముఁ బరిపాలించినట్లును, వ్రాయఁబడియున్నదనియు శాసనము తుదిభాగమున "గణపతిక్షితీశం సంసేవ్య" యని యుండెననియు శాసన పరిశోధక శాఖవారు వ్రాసియున్నారు.

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు పంతులుగారు "పులివఱ్ఱు కైఫీయత్తు"ను భారతిలోఁ (వ్యయ-శ్రావణము. పుట ౧౪౭౭) లో బ్రకటించియున్నారు. దానిచివర నొకశాసనముకూడ (కైఫీయత్తు నందలి భాగమే) నున్నది. అదియును పైనచెప్పిన (A. R. 322 of 1936-37) శాసనము నొకటియే యైనట్లు కన్పట్టుచున్నది. అందుఁబైనఁ జెప్పిన యంశములన్నియు సంస్కృత భాషలో నున్నవి. అందున్న వెలనాఁటి చోడుని తండ్రి గొంకరాజని స్పష్టముగా నున్నది.

"తద్వంశజాతో గొంకేశ శ్శరణ్య స్సేవ్యభూభృతాం...... పంచాశత్ లక్షసంయుక్త మంధ్రదేశ మపాలయన్...... తత్పుత్రో వెలనాటిచోటి (చోడయైయుండును) నృపతిః......జిత్వా వైరి నృపాన్ తదశ్వగజగోగాణిక్యరత్నాదికం దాక్షారామ పురీశ్వరాయ తుధరో శ్రీభీమనాథాయతై ......(శా)కత్యాదిశాన్వయవార్ధిచంద్రము పేతమూర్తిం గణపక్షితీశం సేవ్యతే శత్రుగ్నశ్రీ ర్వాదిత్యరాజంతి..." (గ్రంథవిస్తరభీతిచే పువ్వులుపెట్టినభాగములను నేను విడచిపెట్టితిని) శాసనకాలమును "మేఘరుద్రగణితే" అనుమాటలలోఁ దెలిపియున్నాడు కాలమునుఁగూర్చి వ్రాయుచు శ్రీ వెంకటకృష్ణారావుగారు "అన్నిటితో పాటు మిక్కిలిచిత్రమైనవిషయము శకవర్షములు ౧౧౧౪ అనగా ౧౧౯౨ క్రీస్తుశక కాలమున(?) లిఖింపబడిన శిలాశాసనమునందు

వెలనాటిరాజేంద్రచోడుడు (మొదటివాఁడు) ౧౦లక్షలపరిమాణము గల ఆంధ్రదేశమునుఁ బరిపాలించె నని తెలుపబడియున్నది. ఈశాసన ప్రతిబింబమును - లభించినచో - పరిశీలింపవలసియున్నది. ఇట్టిచరిత్రాంశము లనేకములు - విమర్శింపదగినవి. ఈకైఫీయత్తునందు గలవు" అని వ్రాసియున్నాడు. శా. శ. ౧౧౧౨వ సంవత్సరమున చోడనామధారి యెవ్వఁడును వెలనాఁడునందు లేఁడు. అదిపృథ్వీశ్వరుని రాజ్యమధ్యకాలము. ఇందలి "మేఘు" శబ్దముపొరబాటు. ఈకాలమునకు 'మేఘు' శబ్దమునిచ్చు సాంప్రదాయము బహుళముగా లేదు. "సోమేఘుర్రుద" గణితే యను పాఠమే సరియైనది. ఇందలి ప్రథమాక్షరమగు 'సో' పొరబాటున విడిచి పెట్టఁబడినది. 'ఘు'ను'ఘు'గాఁ జదివినారు. ఈశాసనము మొదటి రాజేంద్రచోడునిది కాదు. పృథ్వీశ్వరునకుఁ దరువాతది. గణపతి దేవుని శాసనములు శా. శ. ౧౧౨౦ మొదలు వెలనాఁటియందుఁ గన్పించుచుండుటచే, నీశాసన మాకాలమునకుఁ గూడఁ దరువాతది. కావున నిందుదాహరింపఁబడిన వెలనాఁటిచోడుఁడు పృథ్వీశ్వరునకుఁ బూర్వుఁడు గాఁ డనియు, గణపతిదేవుని కాలములోనివాఁ డనియు, గొంకరాజునకుఁ గుమారుఁ డనియు నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. ఈశాసనము పూర్తిగాఁ బ్రకటితమై యేవేని మార్పులు కలిగిననేతప్ప పృథివీశ్వరునితో నాతనివంశ మంతమై పోలేదనియు, నాతనికిఁ బిమ్మట నీక్రిందివిధముగా నభివృద్ధిఁ జెందిన దనియు నిశ్చయింపవచ్చును.

పృథివీశ్వరుఁడు శా. శ. ౧౧౩౭ రాజ్యాంతవత్సరము.

|

గొంకరాజు

|

రాజరాజేంద్రచోడుఁడు శా. శ. ౧౧౫౧ సంవత్సరము

|

గొంకరాజు హేమాద్రిరెడ్డి ౧౧౬౯ శాసనము

|

కులోత్తుంగరాజేంద్రచోడుఁడు (త్రిపురాంతక, ద్రాక్షారామశాసనములు శా. శ. ౧౧౮౧-౧౧౮౭)

పృథ్వీశ్వరుని మొదటిశాసనము శా. శ. ౧౧౦౮లో కలదు. అప్పటి కాతనికి నలువదిసంవత్సరములవయసుండెనని తలంచితిమేని (ఈతనిపూర్వులకాలమును బరిశీలింపఁగా నిది సరియైనదిగాఁ గన్పట్టినది.) యీతనితుదిశాసనము ౧౧౨౭లో నున్నది. కావున నప్పటి కాతని కఱువదియేండ్లవయసును, ముప్పదియైదేండ్లకుమారుఁడును, పదేండ్లు వయసుగల మనుమఁడును గలరని యూహింపవచ్చును. ఈ కుమారుఁడే గొంకరాజు. ఈ మనుమఁడే రాజరాజేంద్రచోడుఁడు. ఇతఁడు తన ముప్పదిమూఁడవయేట శా. శ. ౧౧౫౧లో ముప్పదిరెండుపుట్లభూమిని నరేంద్రస్వామికి శాసనము వ్రాయించి దాన మిచ్చె ననుటలో విరుద్ధ ముండదు. అతని కిరువదియవయేట గొంకరాజు జన్మించె ననినచో, ౧౧౫౯నాటి కాతనికి ౨౦ సంవత్సరముల వయసుండెననియు గణపతి దేవుని సేనాధిపతి యగు హేమాద్రిరెడ్డి యాతనిని దిశలకుఁ బఱవెత్తించి దిశాపట్టఁ డయ్యెననియుఁ దలంపవచ్చును. కాని కొంచెమింత యస్వాభావికము లేక పోలేదు. కొన్నితావుల నట్లుండవచ్చునని యనుకొనినను నీ గొంకరాజునకుఁ గూడ నిరువదియవసంవత్సరముననే కులోత్తుంగ రాజేంద్రచోడుఁడు గలిగెనని తలంచినను, త్రిపురాంతక శాసనము నాఁటి కాతఁడు పండ్రెండేండ్లవాఁడును, ద్రాక్షారామశాసనము నాఁటికి పదునెనిమిదేండ్లవాఁడు నైనట్లు గన్పట్టుచున్నాఁడు. కావున నిది కేవల మస్వాభావిక మనియు, నందుచే నీవంశవృక్షమునం దేదియో యొక పొరబాటుఁడి యుండవలయుననియు స్పష్టమగుచున్నది. కాని పులివఱ్ఱు కైఫీయత్తునందు "కుళోత్తుంగచోళమహారాజు శాలివాహనం ౧౦౩౦ శకమందు (ఈసంఖ్య తప్పు. సంఖ్యలలో నిట్టితప్పులు కైఫీయతుల యందుఁ దఱచుగాఁ గానవచ్చుచుండును.) పదకొండోయేట పట్టాభిషిక్తుఁడై నిత్యశివలింగప్రతిష్ఠలుచేసి రాజ్యంచేస్తూవుండగా తూర్పుదేశమునుంచి గజపతిసింహాసనస్థుఁడై గణపతిమహారాజు సేనాసమేతముగా వచ్చి చోడరాజుతాలూకు అకాలానను పలాయనం చేయించి దేశము స్వాధీనముచేసికొనెరి." అని వ్రాసియుండుటచేఁ బైనవ్రాసిన సంగతులు వాస్తవము లేయనియు వంశవృక్షము సరియైనదే యనియునుఁ దస్వాభావిక మున్నట్లుగన్పట్టినను నది సత్యమే యనియు స్ఫుటమగుచున్నది.

పృథివీశ్వరుని యనంతరమాతని కుమారుఁడు, గొంకరాజు తన తండ్రి సింహాసనమున నధిష్ఠించి చోడకులోత్తుంగుని సామంతుఁడై కొంత దేశమునైనను బరిపాలించియుండును. ఈతని శాసనములు గన్పట్టలేదు. ఈతని యనంతరము రాయరాజేంద్రచోడుఁడు, కాకతీయగణపతిదేవునికి సామంతుఁడై వెలనాటిని బాలించినట్లు కనఁబడుచున్నది. ఆతని కుమారుఁడైన గొంకరాజుమువలననో గణపతి కెదురు దిరిగినట్లును, నందుచే నాతని సేనాధిపతియైన హేమాద్రిరెడ్డి గొంకరాజు నడఁచివేసినట్లును ద్రాక్షారామ శాసనము వలనఁ దెలియుచున్నది. ఆతనికిఁ బిదపఁ గులోత్తుంగ రాజేంద్రచోడుఁడు చిన్నతనముననే తన ౧౧ వ యేటనే సింహాసనము నెక్కెను. ఈతఁడు పసివాఁడైనను, కొలపనాయకుఁడు మొదలగు సేనాధిపతులు బలవంతులై యాతని రాజ్యమును గాపాడుచు "కులోత్తుంగరాజేంద్ర చోడరాజ్య నిస్తారకులై" రని త్రిపురాంతక ద్రాక్షారామ శాసనములవలన నెఱుంగ నగుచున్నది. కులోత్తుంగుఁడు బదునెనిమిదవయేట నీసేనాధిపతులతోఁగూడ మనుమసిద్ధి దాయాదులగు నక్కన బయ్యనలకు సాహాయ్యమొనర్చి యుండును. గణపతి దేవుఁడీ కులోత్తుంగునే పట్టుకొనెననుట నిశ్చయము. నాయకపల్లి శాసనము నందలి "దవిళ మండలము" కేవలము ద్రావిడ మండలమని తలంప నక్కర లేదు. ఈకులోత్తుంగుని శాసనము త్రిపురాంతకమునఁ గన్పట్టుచున్నది. అంతవఱకు నాతని రాజ్యము వ్యాపించెనేమో! దానిని శాసనకావ్యకర్త దవిళమండలముగా భావించెనేమో! నెల్లూరును "దక్షిణదిగుభాగ" మని యాశాసనమునఁ జేర్కొన్నాఁడు.

శ్రీ వెంకటరమణయ్యగారు పైనజెప్పిన మూఁడు శాసనములొక్కనివిగనే భావించి, యాతఁడు కులోత్తుంగ రాజేంద్రచోడుఁడని నిశ్చయించి యాతనికి వెలనాటి మూఁడవ కులోత్తుంగరాజేంద్ర చోడుఁడని పేరుపెట్టి యాతని పుట్టుపూర్వోత్తరము లెవ్వియో తెలియవనిచెప్పి, యాతనినే గణపతిదేవుఁడు ద్రవిడ మండలమునఁ బట్టుకొనెనని తెల్పియున్నారు. వెలనాఁటివాఁడు ద్రవిడ మండలమున కెట్లు పోయెను? పృథ్వీశ్వరుని యనంతరమున విచ్ఛిన్నమై పోయిన వెలనాఁటి రాజ్యమునుండి ద్రవిడ మండలమునకుఁ బోయి యచ్చట రాజ్యమునుఁ

బరిపాలించుచుండ తిక్కనకెట్లు సమర్థత వచ్చినది? యను ప్రశ్నలకుఁగూడ వారే సమాధాన మిచ్చియున్నారు. వానినన్నిటిని యిటఁ జెప్పుటకుఁ దావు చాలదు. అవి యన్నియు సత్యములనియే భావించి, ప్రస్తుతాంశమును గూర్చి యాలోచింతము. కాకతిగణపతిదేవుఁ డెప్పుడీ వెలనాఁడు, నెల్లూరు ద్రవిడమండలములపై దండయాత్ర సాగించెనను విషయము ముఖ్యమైనది. పైచర్చవలన నీవిషయము తేలలేదు. పైన వ్రాసిన విషయముల నన్నిటిని సమన్వయముచేసి యాకాలమును నిర్ధారణచేయ వలసియున్నది. చోడతిక్కరాజు శాసనములు శా. శ. ౧౧౭౮ వఱకు గనుపించినవి. ఆకాలములో నీదండయాత్ర జరిగెనని తలంపరాదు. అతని కాలములో నక్కన బయ్యనల కథ లేదు. ఆకథ మనుమసిద్ధి కాలములో జరిగినదని చెప్పుచున్నారు. శా. శ. ౧౧౭౧ లో తిక్కరాజు మరణించెనను కొందము. ఆసమయమును గనిపెట్టి మనుమసిద్ధి దాయాదులాతనిపై దండెత్తి పదభ్రష్టుని గావించి యుండవలయును. ఈయక్కన బయ్యనలకు, వెలనాటి వంశములోనివాఁడైన (పైవంశవృక్షములోని తుదిపురుషుఁడు) కులోత్తుంగ రాజేంద్ర చోడుఁడు సాహాయ్య మొనర్చియుండును. నెల్లూరు చోడులకును, వెలనాటి రాజులకును పూర్వవైర మున్నది. చోడతిక్కరాజు పృథ్వీశ్వరుని జంపి యుండెను కదా! ఆపగ తీర్చుకొనుటకై, పృథ్వీశ్వరుని సంతతిలోని వాఁడైన యీవెలనాటి కులోత్తుంగరాజేంద్ర చోడుఁడు అక్కన బయ్యనలకు సాహాయ్య మొనర్చియుండునని యూహించుటలో తప్పుండదు. ఈ విషయము లన్నిటిని దిక్కనసోమయాజి గణపతి దేవునకు నివేదించియుండును. గణపతిదేవుఁడు తిక్కనసోమయాజిమాటపై గౌరవ ముంచి వెలనాటి మూఁడవకులోత్తుంగుఁడు తనకు సామంతుఁడై యున్నను, నాతనిని జయించినఁగాని మనుమసిద్ధికి నెల్లూరు రాజ్యము దక్కదని నిశ్చయించుకొని ముందుగా వెలనాఁడును స్వాధీనము చేసికొని, పిమ్మట నెల్లూరును దహించి మనుమసిద్ధికి శత్రువులయిన తిక్కన బయ్యనల(శాసనములో తిక్కనబయ్యనలనియున్నది. సిద్ధేశ్వరచారిత్రమున అక్కనబయ్యన లనియున్నది. ఇందేదియో యొకటి పొరబాటయియుండును. తిక్కన యనుపాఠమే సరియైనదిగాఁ దోఁచుచున్నది.)

శిరస్సులను ఖండించి మూఁడవకులోత్తుంగ రాజేంద్రచోడుని జయించి పట్టుకొని యాతనిచేఁ గప్పముసుగ్రహించి విడచిపెట్టి మనుమసిద్ధిజోలికిఁ బోవద్దని యాజ్ఞాపించి, మనుమసిద్ధియొద్ద యేనుగులను గానుకగాఁ గైకొని, నెల్లూరురాజ్యమునఁ గొంత యాతని కిచ్చి తనసామ్రాజ్యమునఁ గొంత కలుపుకొని (౬౮ గ్రామములైననేమి ౨౫౦౦ గ్రామములైననేమి) స్వదేశమున కేఁగియుండును. ఈదండయాత్ర శా. శ. ౧౧౭౫ (క్రీ. శ. ౧౨౫౩)లో జరిగియుండును. పెద్దపులివఱుకైఫీయత్తులో "తిరిగి కులోత్తుంగచోళరాజు యీదేశానకు వచ్చి రాజ్యం ఆక్రమించి శా. ౧౦౯౩ (౧౧౯౩ కలియుయుగమున) శకంవరకు ప్రభుత్వం చేసిరి. తదనంతరం కోటభీమరాజు యితనికొడుకు కేతమహారాజు భైరవభూపాలుడు పర్యంతరం శా ౧౨౨౦శకంవరకు ప్రభుత్వములు జరిగినవి" అని వ్రాసియుండుటనుబట్టి వెలనాటి మూఁడవకులోత్తుంగచోడుఁడు మఱికొంత కాలము రాజ్యము చేసినట్లు కన్పట్టుచున్నది. ఈవిమర్శనముతో మనకుఁ బనిలేదు. గణపతిదేవునిసాహాయ్యమున మనుమసిద్ధికి శత్రుబాధపోయి బలవంతుఁడగుమిత్రునిప్రాపకము లభించుటచే నాతని హృదయమునకు విశ్రాంతికలిగినది. తిక్కనసోమయాజిపై గౌరవము హెచ్చినది. మనుమసిద్ధి సోమయాజిని "మామయ్యా!" యనిపిలిచెడివాఁడఁట! మహారాజులును మంత్రులను వావివరుసలతోఁ బ్రవర్తించుచుండెడివారనుట కనేకనిదర్శనము లున్నవి. శ్రీకృష్ణదేవరాయలు తిమ్మరసును "అప్పాజీ" యని పిలుచుచుండెనఁట!

మనుమసిద్ధికి రాజ్యమిప్పించుటకొఱకయి తిక్కనసోమయాజి గణపతిదేవునియొద్దకు వెళ్ళెనని యనుశ్రుతముగావచ్చెడి కథ సత్యమనియే నమ్మవచ్చును. ఈదండయాత్ర పూర్తియైనపిదపనే తిక్కన నిర్వచనోత్తరరామాయణమును రచించియుండును.

తిక్కన సోమయాజి గణపతిదేవుని యాస్థానమున కేఁగినప్పుడు జైన పండితులతో వాదించి జైనమతమును ఖండించి వేద మతమును నిలువఁబెట్టెననియు నందులకు గణపతిదేవుఁడు మెచ్చి కొన్ని గ్రామములను దిక్కనకిచ్చెననియు సోమదేవరాజీయము నందున్నది. ఆకాల

మున జైనమతము నిజాము రాష్ట్రమున వ్యాపించియున్నదను మాట వాస్తవము. కాని గణపతిదేవుఁడు జైనుఁడు కాఁడు. అదివఱకే విశ్వేశ్వర దేశికుని శిష్యుఁడై శైవమతమును స్వీకరించి పరమ మహేశ్వర బిరుదమును గైకొనియుండెను. అందుచేఁ దిక్కనామాత్యునిచే జైనమత ఖండనమును జేయించియుండును.

రక్కసగంగన గంగయసాహిణులు భిన్నులా?

నిర్వచనోత్తరరామాయణమున మనుమసిద్ధి జయించిన శత్రురాజులను జెప్పు సందర్భమునఁ దిక్కనామాత్యుఁడు మూఁడు పద్యములను రచియించియున్నాఁడు. అందొక పద్య మిది.

చ. రంగదుదారకీర్తి యగురక్కసగంగనఁ బెంజలంబు మై
భంగ మొనర్చి మన్మజనపాలుఁడు బల్విడి నాఁచికొన్నరా
జ్యాంగము లెల్ల నిచ్చి తనయాశ్రితవత్సలవృత్తి యేర్పడన్
గంగయసాహిణిం బదముఁ గైకొనఁబంచెఁ బరాక్రమోన్నతిన్.

శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు తమ యాంధ్రుల చరిత్రము (మధ్యయుగము ౨౧౭-౨౧౮) నందును, కాకతీయాంధ్ర రాజయుగ చరిత్రము (పుట ౮౦౦-౮౦౧) నందును, పైపద్యములోఁ జెప్పఁబడిన రక్కసగంగనయు, గంగయసాహిణియు నొక్కవ్యక్తియే యనియు నితఁడు కాయస్థుఁ డనియు, కాకతి గణపతిదేవుని సేనాధ్యక్షుఁడనియు వ్రాసియున్నారు. రక్కసగంగని గర్వము నడంచి, ఆతని యొద్దనుండి నాఁచికొన్నరాజ్యమును, నతఁడు తన నాశ్రయింపఁగా మనుమసిద్ధిమహారాజు తిరిగి, యతనికే యిచ్చివేసె నని యీపద్యార్థ మని వారు భావించియున్నారు. మొట్టమొదట నీపద్యమును జదివినప్పుడు రక్కసగంగన వేఱనియు, గంగయసాహిణి వేఱనియు, రక్కసగంగనను జయించి గైకొనిన రాజ్యాంగములను తన కాశ్రితుఁడైన గంగయసాహిణికి, మనుమసిద్ధి యిచ్చెనని యీపద్యార్థమనియు నేనభిప్రాయ పడితిని. నాయభిప్రాయమునకు బల మొసంగెడిశాసన మొకటి లభించినది. (A. R. 231 of 1905. ఈశాసనము నకలును నేనడుగఁగనే పంపిన

ఇండియాగవర్నమెంటువారి ఎపిగ్రాఫిస్టు గారికిఁ గృతజ్ఞుఁడను) ఈశాసనము గంగయసాహిణిమంత్రియైన నామదేవపండితులు కర్నూలు మండలములోని మార్కాపురము తాలూకా త్రిపురాంతకమునందలి త్రిపురాంతకదేవునకు భూదానమొసంగి వ్రాయించినది. దీనివలన రక్కసగంగన, గంగయసాహిణులు భిన్నవ్యక్తులనియు, వారిరువురు శత్రువు లనియుఁ దెలియును. వివాదవిషయము కావున నాశాసనము నిట నిచ్చుచున్నాఁడను.

"స్వస్తి సమస్తప్రశస్తిసహితం శ్రీమన్మహామండలేశ్వర కాకతియ్యగణపతిదేవమహారాజులు ఒరుగల్లు నిజరాజధానిగాను సుఖసంకథావినోదంబుల రాజ్యంబు సేయుచుండగాను తత్పాదపద్మారాధకుండైన స్వస్తి యనేకనామావళి విరాజమానమానోన్నత అతివిశమహాయారూఢ ప్రౌఢరేఖారేవంత విజయలక్ష్మీకాంత దశదిగుభరిత కీర్తికామినీవల్లభ భయలోభదుర్లభ పశ్చిమరాయదామోదర సైన్యదిశాపట్ట వైరిఘరట్ట రక్కసగంగరస దిశాపట్ట మూర్ఖరాయ జగద్దళ గణపతిదేవదివ్య శ్రీపాదపద్మారాధక పరబలసాధక నామాది సమస్తప్రశస్తిసహితం శ్రీమన్మహామండలిక అరివీరబ్రహ్మ రాహుసనాయక నారాయణ గండపెండారు గంగయ్యసాహిణి సమస్తరాజ్యసముద్ధరుండైన స్వస్తిసమస్తరాజ్యభారనిరూపిత మహామాత్య పదవీవిరాజమాన మానోన్నత ప్రభుమంత్రోత్సాహశక్తిత్రయగుణసంపన్న ఆనయాసనద్వైధీభావషాడ్గుణ్యగుణోపేత పరేంగితజ్ఞాన అష్టావధారణాధౌర్యచరిత ఉత్పన్నమతిసంపన్న సురగురుసమాన సకలశాస్త్రపారావారక మంత్రిమాణిక్య నీతిచాణక్య పతికార్యధురంధర పరిపాలకల్పలతావ్రాజ్య దీనార్తిజనసువర్ణధారానటన గంభీర...దీనాంధగాయక వైతాళిక వైభాసిక దండిముండి శిఖండి నానాపేక్షకోడశ ఆచక్రధర్మిదక్షిణండన నిత్యనేమానుష్ఠాన వాశిష్టపురోగములైన నామదేవపండితులు స్వస్తిశ్రీశకవర్షంబులు ౧౧౭౬ ఎండి ఆనందసంవత్సరమున చైత్ర శు ౧౫ శు. నాడు దేవపర్వనిమిత్యమున శ్రీత్రిపురాంతక శ్రీమనుమహాదేవరకు... దువ్వ...ంపనల'ని కెంకులకుంట చతుస్సీమయూను ఆచంద్రార్కము నిచ్చె..." రక్కసగంగన, గంగయసాహిణులు భిన్నవ్యక్తులును వైరులునై

యున్నా రని తాళ్ళప్రొద్దుటూరు శాసనమువలనఁగూడ ధృవపడుచున్నది. దానిని శ్రీ వెంకటరమణయ్యగారు భారతి (సం౧౧ భా౧ పుట ౧౪౭)లో విమర్శనాపూర్వకముగఁ బ్రకటించియున్నారు. ఈశాసనము, జగదాపుగంగయదేవచోడ మహారాజు తనతండ్రి యైనఅల్లుగంగరాజునకును తల్లి యైనగంగాదేవికిని పుణ్యలోకావాప్తికొఱకు గంగసముద్ర మనుతటాకమును ద్రవ్వించి శా. శ. ౧౨౪౪ దుందుభి సం॥ మాఘశు॥ ౧ శనివారమునాఁడు వ్రాయించెను. ఈశాసనములో నీగంగయదేవచోళ మహారాజుల ప్రశస్తిలో, ఒఱయూరి పురవరాధీశ్వర అజనయూర సింధురధ్వజ కాశ్యపగోత్ర దినకరకులకుశేశయవికాసన ప్రభాకర, గండపెండార గంగయసాహిణీ సర్వస్వబందికాఱ, ఇత్యాది బిరుదములున్నవి. ఈబిరుదమును బట్టి గంగయసాహిణియొక్క సర్వస్వమును, ఈజగతాపుగంగయదేవచోళ మహారాజు లపహరించినట్లు, గన్పట్టుచున్నది. ఇందువలన గంగయసాహిణి రాజ్యమును గైకొనివాఁడింకొకఁ డున్నాఁడని స్పష్టమగుచున్నది. కాని యాతఁడీ గంగయదేవచోళమహారాజుమాత్రము కాఁజాలఁడు. ఏమనిన నీగంగయదేవచోళుఁడు శా. శ. ౧౨౪౪ (క్రీ. శ. ౧౩౨౨) కాలమునందున్నవాఁడు. గంగయసాహిణియు మనుమసిద్ధియు క్రీ. శ. ౧౨౬౦ ప్రాంతమునందున్నవారు. కావున గంగయసాహిణిని జయించినవాఁడీ జగతాపుగంగయదేవచోళుఁడు కాక యాతని పూర్వుఁడై యుండుననియు, “గంగయసాహిణీ సర్వస్వబందికాఱ” యనునది వంశానుగతమైన బిరుదమనియు, శ్రీ వెంకటరమణయ్యగారూహించినట్లు తలంచుటయే సమంజసము. కాని యాపూర్వుఁ డెవ్వఁడో తెలియదు. నిర్వచనోత్తరరామాయణ పద్యమునుబట్టి “గంగయసాహిణీ సర్వస్వబందికాఱ” బిరుదము వహింపఁ దగినవాఁడు “రక్కసగంగన”యై యుండవలయును. అవశ్యములో, చిలుకూరి వీరభద్రరావుగారనినట్లు, రక్కసగంగనయు, గంగయసాహిణియు నొక్కరనుట పొసఁగదు. ఇద్దరు నొక్కరే యగుదురేని, యీబిరుదము మనుమసిద్ధికిఁ జెందవలయును. పైనచెప్పిన శాసనకర్త యగు జగతాపుగంగయ దేవచోడుఁడు మనుమసిద్ధివంశీయుఁడనుట కాధారములు లేవు. మనుమసిద్ధి ప్రశస్తిలో నట్టి బిరుదములు

లేవు. కావున నేవిధమునఁ జూచినను, రక్కసగంగనకే యాబిరుదము వర్తించుననుటయే సమంజసము.

రక్కసగంగనకును, ప్రస్తుతశాసనకర్త యగు జగతాపుగంగయదేవచోళునకును గలసంబంధము తెలియుటలేదు. జగతాపుదండిచోళ మహాదేవరాజను నాతని శాసనమొకటి క్రీ. శ. ౧౨౧౯ నాటిది గన్పట్టుచున్నదనియు "జగతాపు" శబ్దమును బట్టి యాతఁడు గంగయదేవచోళునిపూర్వుఁడై యుండుననియు శ్రీవెంకటరమణయ్యగారు వ్రాసియున్నారు. అది సత్యమనియే తలంపవలసియున్నది.

'రక్కసగంగ' నామములు పాశ్చాత్యగంగరాజులలోఁ దఱచుగాఁ గానవచ్చుచున్నవనియు, నందుచే గంగయసాహిణిని జయించినరక్కసగంగఁడు పాశ్చాత్యగాంగవంశములోనివాఁడై యుండుననియు పాశ్చాత్యగాంగవంశీయులు సింధురధ్వజము కలవారనియు, దాళ్ళప్రొద్దుటూరుశాసనకర్త యగు గంగయదేవచోళమహారాజు అజమయూరసింధురధ్వజుఁ డనుబిరుదువహించినవాఁ డనియు, రక్కసగంగన సింధురధ్వజ మీతనికి సంక్రమించిన దనియు, రక్కసగంగన యీగంగయదేవచోళునకు మాతామహుఁడై యుండు ననియు, మాతామహుని సింధురధ్వజమును గంగయసాహిణిసర్వస్వబందికాఱ బిరుదమును గంగయదేవచోళునకు వచ్చియుండుననియు శ్రీవెంకటరమణయ్యగా రభిప్రాయపడియున్నారు.

ఈరక్కసగంగన పాశ్చాత్యగాంగవంశములోనివాఁ డనుట కాధారములు నాకు లభింపలేదు. ఇతఁడుమిగులఁ బరాక్రమవంతుఁ డనియుఁ గీర్తివంతుఁ డనియు "రంగదుదారకీర్తియగు రక్కసగఁగని" యనువాక్యమువలనఁ దెలియుచున్నది. పాశ్చాతగాంగవంశములోని యెవని నైనను జయించి యాతని సింధురధ్వజమును లాగికొని దాని నీరక్కసగంగన వహించె నేమో! శత్రుధ్వజమును ధరించుట సాంప్రదాయవిరుద్ధ మందు రేని, యీరక్కసగంగన పాశ్చాత్యగాంగుని దౌహిత్రుడై యుండవచ్చును. పశ్చిమగాంగులలో కాళుపగంగని

శాసన మొకటి కనఁబడుచున్నది. కాని యది యీరక్కసగంగనిది కాదు. (A. R. 235 of 1931) ఇట్టివింకను గలవు. క్రీ శ. పదియవ శతాబ్దిలో నాగవర్మయనుకర్ణాటక కవినిబోషించిన రక్కసగంగన యొకఁడున్నాఁడు. నామసామ్యమునుబట్టి వీరందఱు పశ్చిమగాంగులన లేము. మనరక్కసగంగన క్రీ. శ. ౧౨౧౫సంవత్సరమునాఁటిశాసన కర్తయగు జగతాపుదండిదేవచోళరాజునకుఁ బుత్రుఁడై యుండు నని నాయూహ రక్కసగంగనికి, అల్లుగంగరాజుపుత్త్రుఁడును గంగయదేవ చోళరాజు పౌత్రుఁడు నై యుండు రనితలంచుచున్నాఁడను. తాత పేరునందలిగంగశబ్దమును, ముత్తాతపేరునందలి "జగతాపు" 'దేవచోళ' శబ్దములను గైకొని యీతఁడు జగతాపుగంగయదేవచోళరా జయ్యెనని తోఁచుచున్నది. నాయూహ సత్య మయ్యెనేని వీరివంశవృక్ష మీ క్రిందివిధమున నుండును. ఇందలిసత్యాసత్యములను గూర్చి యింకను బరిశోధనము కావలసియున్నది. భావిపరిశోధనమువలన మార్పు వచ్చు నంతవఱకును దీని నంగీకరింతము.

మధురాంతక దేవచోళుఁడు.

|

జగతాపుదండిదేవచోళరాజు. (క్రి. శ. ౧౨౧౫)

|

రక్కసగంగన. (క్రి. శ. ౧౨౪౦)

|

అల్లుగంగరాజు=గంగాంబిక. (క్రి. శ. ౧౨౭౫)

|

జగతాపుగంగయదేవచోళరాజు (క్రి. శ. ౧౩౨౨.)

ఈవంశీయులు మధురాంతకపొత్తపిచోళులలోని యొకశాఖకుఁ జెందినవా రనిచెప్పవచ్చును. రక్కసగంగన కలుకడ పురాధీశ్వరుఁ డగురాయదేవమహారాజునకు సామంతుఁడుగనుండి సిద్ధవటప్రాంతమును బరిపాలింపుచుండె ననియు, సిద్ధవటసమీపమునకున్న జోతిగ్రామమునఁ గన్పట్టినశాసన (A. R. ౫౩౩ of ౧౯౧౫) మీతనిదే యనియుఁ

గంగయసాహిణి కడప సమీపముననున్న వల్లూరు రాజధానిగా రాజ్యమేలినవాఁడనియు సరిహద్దురాష్ట్రాధిపతులగుటచే వీరిరువురును శత్రువులై యుండురనియు శ్రీ వెంకటరమణయ్యగారు వ్రాసియున్నారు. ఈజోతిశాసనము గంగయసాహిణి దని, వీరభద్రరావుగారు కాకతీయాంధ్రరాజయుగమున వ్రాసిరి. కాని నిజము కాదు. అది రక్కసగంగనదే.

పైన వ్రాసిననామదేవపండితుని త్రిపురాంతకశాసనము (శా. శ. ౧౧౭౬)లో రక్కసగంగనను, గంగయసాహిణిజయించినట్లున్నది. తాళ్లప్రొద్దుటూరుశాసనములో గంగయసాహిణిసర్వస్వమును, రక్కసగంగన హరించినట్లున్నది. ఈసర్వస్వబందికాణికథ శా. శ. ౧౧౭౯లో జరిగియుండును.

గంగయసాహిణికాయస్థుఁడు. గణపతిదేవుని సేనాధ్యక్షుఁడు. ఈపదవి యీతనికి, మనుమసిద్ధిసాహాయ్యమొనర్చినయనంతరము వచ్చియుండును. కాకున్నచో రక్కసగంగనిని జయించుటకై గణపతిదేవుని సైన్యములే యీతనికిఁ దోడుపడియుండును. లేదా, మనుమసిద్ధికి గణపతిదేవునితో మైత్రిసమకూర్చినపిమ్మట, గణపతికొలువునందున్న గంగయసాహిణికి రక్కసగంగనవలన నపజయము సంప్రాప్తము కాఁగాఁ దననాశ్రయించినగంగయసాహిణికి మనుమసిద్ధిసాహాయ్యము చేసియుండును. ఈసందర్భమున చిలుకూరి వీరభద్రరావుగారు గంగన, గంగయ లేకవ్యక్తియని భావించుటచే వారివ్రాఁతలు మనకేమియుఁ దోడుపడుటలేదు. గంగయసాహిణి, మనుమసిద్ధిమహారాజుతండ్రియైన తిక్కరాజునద్ద సేనాధిపతిగానుండెననియు నాతనితరువాతఁ గొంత ప్రదేశమునకుఁ బ్రభువై మనుమసిద్ధితో స్నేహము గలిగియుండెననియు నందుచేతనే మనుమసిద్ధి సాహాయ్యమొనర్చెననియుఁ గొందఱనుచున్నారు. అది సత్యమై యుండును. త్రిపురాంతకమున గంగయసాహిణిశాసనములు శా. శ. ౧౧౭౭—౧౧౭౩—౧౧౭౬ సంవత్సరములలోఁ గాన్పించుచున్నవి. ఇందుఁ గడపటిశాసనములో నీతడు రక్కసగంగను జయించినట్లు హరింపఁబడినది. (A. R. 176, 231, 283 of 1900)

పై వంశవృక్షమునందలి అల్లుగంగరాజును, యుద్ధములో నంబయదేవమహారాజును నతఁడోడించెనని చరిత్రకారులు వ్రాసియున్నారు. ఈ యంబయదేవుఁడు గంగయసాహిణికిఁ గుమారుఁడో సోదరుఁడో అయియుండు నని చిలుకూరి వీరభద్రరావుగా రాంధ్రుల చరిత్రమున వ్రాసియుండిరి. కాని యది నిజము కాదు. గంగయసాహిణికి 'చందలాంబ' యను సోదరి కలదు. అంబయదేవ మహారాజున కామె భార్య (A. R. 211 of 1936) యని శాసనమునందున్నది. ఇది శా.శ. ౧౨౧౨ నాటిది రక్కసగంగన స్థానీయులును గంగయసాహిణి స్థానీయులును గూడ పరస్పరము వైరముతో నుండుచువచ్చిరి. పైనఁ జెప్పిన రక్కసగంగెన, గంగయసాహిణుల విజయపరాజయగాథ లొక్కమారుమాత్రమే గాక, రెండుమూఁడు మారులు జరిగినను జరిగియుండవచ్చును. ఆవిషయములను బూర్తిగఁ జర్చించి వ్రాయుట యప్రస్తుత ప్రశంసయగును. తిక్కనసోమయాజి పద్యార్థ విచారణమునకై యింతదూరము వ్రాయవలసివచ్చినది.

మనుమసిద్ధి జయించిన సారంగరాజు:

మనుమసిద్ధి మహారాజు విజయమును వర్ణించుచుఁ దిక్కకవి చంద్రుఁడు వ్రాసిన రెండవ పద్యమిది.

శా. శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంకురశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁ గేద వించుకయు మాహారాష్ట్రసామంతు సా
రంగుం దోలి తురంగముం గొనినసంగ్రామంబునం దృప్తన
ప్తాంగస్ఫారయశోంకు మన్మవిభుపై చన్న సైన్యంబునన్.

ఇందలి "మాహారాష్ట్రసామంతు" అను వాక్యమునకు, మహారాష్ట్రరాజుల సామంతుఁడని చెప్పవీలులేదు. ఆకాలమున నెల్లూరు ప్రాంతముపై నధికారమును గలిగియున్న మహారాష్ట్రరాజు లెవ్వరును లేరు. కాకతీయగణపతిదేవుని యధికారము క్రింద సారంగధరుఁ డను పేరుగల సామంతుఁ డొకఁడాకాలమున నెల్లూరి మండలమునందలి

'అద్దంకి' సీమను బరిపాలించుచున్న ట్లాతఁడు వ్రాయించిన యొక తామ్రశాసనము (నె. శా. సం. పుట ౧౩౭) వలన దెలియుచున్నది. ఈసారంగధరుని తండ్రి మాధవుఁడు. తాత శౌరి. సాలంకాయన గోత్రుఁడు. ఇతఁడు మహారాష్ట్ర బ్రాహ్మణుఁడని నాయభిప్రాయము. తామ్రశాసనమునందలి గొంతవఱకు యీక్రిందిశ్లోకములలోని ద్విజ రాజశబ్దము నాయూహను బలపఱచుచున్నది.

"నరపతిగణపాలన తో నూన మసౌ గణపతిః స్వయం దేవః
తచ్చరణకమలసేవాపరాగ పరితుష్టమానసభ్రమరః
శౌరిసూరనరతనూజః కరుణాధి నో స్తి మాధవో నృపతిః॥౮॥
అద్దంకిపురేశాత్ సత్త్వనయూహ్యాజస్ప్రజే శానః
సాలంకాయనగోత్రా శ్శార్ఙ్గధరః శత్రుశాసనః సుయశాః॥౯॥
అపి సర్వలోక పాలనప్రభావసంభావః ప్రజాస్సర్వాః
ఆనందయ న్నజస్రం ద్విజరాజః కీర్త్యతే సదా తాభిః॥౧౦॥

ఈతఁడు తనపేర సారంగపుర మనునగ్రహారమును బ్రాహ్మణుల కిచ్చెను. ఈసారంగధరునకు చక్రనారాయణుఁడను బిరుదమున్నది. ఇతనిని సారంగపాణిదేవమహారాజులని శాసనములలో వ్రాసిరి. ఈగ్రామ మిప్పుడు నెల్లూరుమండలమున వంగప్రోలు తాలూకాలో సారణపుర మనిపిలువఁబడుచున్నదఁట.

ఈశాసనము శా.శ. ౧౧౭౬ ఆనందసంవత్సర ఫాల్గుణశుక్లదశమీ సోమవాసరము నాటిది. గణపతిదేవునకుఁ బుణ్యలోకావాప్తికొఱకీయగ్రహారమునిచ్చినట్లందుఁ జెప్పఁబడినది. చిలుకూరి వీరభద్రరావుగారాంధ్రులచరిత్రములో నీసారంగధరుఁడే మన్మసిద్ధిచేఁ జయింపఁబడినవాఁడనియు, గణపతిదేవునకు సామంతుఁడుగా నున్నవాఁడనియు నీతనితండ్రి మాధవనాయకుఁ డనియు, సింగళనాయకుఁ డీతనియన్నయనియు, వీరు మహారాష్ట్రదేశమునుండివచ్చిన సేవణరాజు లనియు, సేవణులు యాదవులగుటచే వీరినిగూడ యాదవులనుగానే భావింపవలసియుండు ననియు వ్రాసియున్నారు. రామాయణములోని పై పద్యమును జదువగా మనుమసిద్ధి సారంగునిమీఁదికి యుద్ధమునకుఁ బోలేదనియు, నాతఁడే మన్మ

సిద్ధిపైకి రాఁగా మన్మసిద్ధిసైన్యమాతనిని పాఱఁద్రోలి యాతనియశ్వములను స్వాధీనపఱ్చుకొనె ననియు స్ఫురించుచున్నది.

ఈసారంగపాణిదేవమహారాజుతండ్రి మాధవనాయకుఁ డనియుఁ దల్లిచూడుబాయి యనియునొక శాసనము (నె. శా. సం. ౧౦౬౮ పుట. శా. శ. ౧౧౭౫)లోనున్నది. ఇతనితండ్రియైన మాధవమహారాజునకు శాసనములలో శ్రీమన్మహామండలేశ్వర అతివిషమమహాహయారూఢ ప్రౌఢరేఖారేవంత, పరబలకృతాంత, శరణాగతవజ్రపంజర మండలీకర గాండోళిజీవరక్షచక్రనారాయణాది బిరుదములున్నవి. (నె. శా. సం. ౧౦౩౪-౧౦౫౮ పుటలు శా. శ. ౧౧౩౦-౧౧౬౧) సారంగపాణియన్నయైన సింగళదేవమహారాజు శాసనములు నెల్లూరుమండలమునందున్నవి. అవి శా. శ. ౧౧౭౦-౧౧౭౫ వఱకుఁగలవు. (నె శా. సం. ౧౧౪౮ ౧౦౮౮, ౯౬౧, ౯౩౮, ౯౦౦, ౯౪౦పుటలు). దొరతనమువారి శాసనపరిశోధకశాఖవారు శార్ఙ్గదేవమహారాజును సారంగపాణిదేవుఁడు నొక్కరే యని వ్రాసియున్నారు. (A. R.)కాని యది నిజముకాదు. వీరిరువురు భిన్ను లని తండ్రులపేరులనుబట్టి తెలియుచున్నది.

మనుమసిద్ధి జయించిన విజయక్ష్మాధీశుఁడు:

తిక్కనసోమయాజి, మనుమసిద్ధిమహారాజు విజయమును గొనియాడుచు వ్రాసిన మూఁడవ పద్యము నీక్రింద నిచ్చుచున్నాఁడను.

మ. ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌర్యం బొప్పఁ గర్ణాటద
ర్పవిఘాతంబునొనర్చి వైరిమనుజేంద్రశ్రేణికిన్ గొంగనా
నవనిం బేర్కొనియున్నయట్టి విజయక్ష్మాధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళనమన్మసిద్ధి యని వ్రాయేటం బ్రగాఢోద్ధతిన్.

ఈవిజయక్ష్మాధీశుఁ డెవ్వఁడో తెలిసికొనవలసియున్నది. ఈపద్యమందలి "ద్రవిడోర్వీపతిగర్వముందునిమి" "కర్ణాటదర్ప విఘాతంబునొనర్చి" యను విశేషణములు మన్మసిద్ధికిఁగాక విజయభూపతి కనియేయర్థము చెప్పవలయును. ఈవిజయభూపతిని మనుమసిద్ధి బాల్యముననే జయించినట్లు చెప్పియున్నాఁడు. ఈకాల మెప్పుడై

యుండునుః ఇతని తండ్రియైన తిక్కరాజు జననము శా. శ. ౧౧౧౦ ప్రాంతమై యుండునని పైన వ్రాసియుంటిమి. అతని ముప్పదియేండ్ల వయసున మనుమసిద్ధి జనన మగు తలంచితిమేని, ఇతని జననము శా. శ. ౧౧౪౦ ప్రాంతమగును. ఇతని యిరువదియేండ్ల వయసునందు విజయ భూపతిని జయించెనన్నచో నాకాలము శా. శ. ౧౧౬౦ ప్రాంతమయి యుండును. అప్పటికి తిక్కరాజు జీవించియుండెను. అయిన నాతఁడు వయసు మీఱియుండుటచేత నీమనుమసిద్ధి యువరాజుగానుండి యుద్ధము జేసి విజయరాజును గెలిచియుండ వచ్చును. ఆకాలమున, పైన జెప్పిన లక్షణములు గల విజయాధీశుఁ డెవ్వఁడని యాలోచింపవలసి యున్నది.

విజయాధీశుఁ డనఁగా విజయగండగోపాలుఁడనియుఁ బైనఁజెప్పిన లక్షణములన్నియు నాతని యందున్నవనియు నితఁడు క్రీ. శ. ౧౨౯౦ మొదలు ౧౨౯౯ వఱకును బరిపాలనము చేసినట్లుగఁ గానంబడుచున్న దనియు, నితని శాసనములు కాంచీపురమునందు మాత్రమేగాక నెల్లూరు మండలములోని గూడూరు, నెల్లూరు, సూళూరుపేట తాలూకాలలోఁ గానిపించు చున్నవనియు, శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారాంధ్రుల చరిత్రము మధ్య యుగమున వ్రాసియున్నారు. నెల్లూరు శాసన సంపుటములను బరికించి చూడఁగా విజయగండ గోపాలుని శాసనములు పదుమూఁడు గాన్పించుచున్నవి (పుటలు 231, 430, 431/2, 433/2, 445, 462, 841, 861, 1308, 2314, 1325) వీనిలో రెండిటిలో మాత్రమే శక కాల ముదాహరింపఁబడినది. తక్కిన వానిలో విజయగండ గోపాలునిరాజ్య సంవత్సరములే చెప్పియున్నవి. ౨౮౧ వ పేజీలోని శాసనమున నాతని రాజ్య సంవత్సరములు ఆఱనియు శక సంవత్సరములు ౧౨౧౭ యనియు వ్రాసియుండుటచే నీవిజయగండ గోపాలుని రాజ్యప్రారంభ సంవత్సరము శా. శ. ౧౨౧౨ (అనగా క్రీ. శ. ౧౨౯౦) అయినది. అప్పటికి మనుమసిద్ధిరాజు లేడు. కావున మనుమసిద్ధి జయించిన దీవిజయగండ గోపాలుఁడు కాఁడని తెలుచున్నది.

మనుమసిద్ధి మహారాజు శాసనము :

ఇతఁడు కోలూరను గ్రామము నగ్రహారముగా నిచ్చె నని పైన వ్రాసియుంటిని. (A. R. 580-1907) ఈశాసనమున శకసంవత్సరముల సీయలేదు. కాని వీరరాజేంద్రచోడుని పదుమూఁడవరాజ్యవత్సర మనియు, పింగళసంవత్సర మనియుఁ జెప్పఁబడినది. చోళసింహాసనము నందు మూఁడవరాజేంద్రచోడుఁడు శా. శ. ౧౧౬౮ మొదలు ౧౧౮౯ వఱకునున్నాఁడు. ఆతనిపదుమూఁడవరాజ్యవత్సరము శా. శ. ౧౧౭౯ అయినది. అది పింగళయే. కావున నందుదాహరించిన వీరరాజేంద్ర చోడుఁడు మూఁడవరాజేంద్రచోడుఁడే యనుటకు సందియము లేదు. ఈశాసనమున "కోలూరు" గ్రామమును దనతండ్రి యైనతిరుకాల దేవమహారాజునకుఁ బుణ్యముగ కొఱ కిచ్చినట్లుండుటచేఁ దిక్కరాజునకుఁ దిరుకాలదేవుఁ డనునామాంతరమున్నట్లు స్పష్టమయినది.

ఈశాసనమునందుఁ గాకతీయగణపతియొక్క సేనాహాయమును సంపా దించుటకై యీమనుమసిద్ధిమహారాజు గోదావరీతీరప్రదేశమున విజ యుఁడను రాజు నోడించె నని వ్రాసియున్నదందురు. ఆశాసనము నాకు లభింపకపోవుటచే నావివరముల నియఁజాల నైతిని. పైపద్యములోని విజయపురాధీశుఁడు నీతఁడు నొక్కఁ డగునో కాదో చెప్పఁజాలము. ఈవిజయభూపతి నెల్లూరువాఁడో కాక దక్షిణమండలములవాఁడో యై యుండును. ఇతనిని మనుమసిద్ధి గోదావరీతీరమున జయించుటెట్లు సంభవమయ్యెనో యూహింప నవుపగాకున్నది.

మనుమసిద్ధికాలమున విజయాదిత్యదేవచోడమహారాజుశాసన ములు కొన్ని కనపడుచున్నవి. (నె. శా. సం. పుట 599-1231) మనుమ సిద్ధి జయించిన దీతనినేమో! తెలుగుపల్లవులలో క్రి. శ. ౧౨౫౦ ప్రాంతమున రాజ్యమునకు వచ్చినవిజయగండగోపాలుఁడొకఁడున్నాఁడు. (తి. దే. శా. సం. ౧ పుట ౮౨-౮౩ A. R. 272 of 1905) మనుమ సిద్ధి జయించినదీతనినైనఁ గావచ్చును. నిజాము రాష్ట్రాంతర్గత గోదా వరీతీరప్రదేశమున నీయుద్ధము జరిగియుండవచ్చును. ఎట్లయినను నీవిషయ

మున నింకను బరిశోధన మావశ్యకమై యున్నది. మరియు సీకాలమునఁ జాళుక్యవంశీయుఁ డగు విజయాదిత్యాధీశుఁ డొకఁడున్నాఁడు. ఆతఁడు కళింగదేశమునందలి యొకప్రదేశమునకుఁ బ్రభువు. ఆతని శాసనము ద్రాక్షారామమునం దున్నది. మనుమసిద్ధి యీతనిని జయించియుండిన నుండవచ్చును.

మనుమసిద్ధి వ్రాయించిన యీశాసన విషయమునుగూర్చి కూడ కొంత యిట చెప్పవలసియున్నది. త్రిపురాంతక శివుని మూఁడవ నేత్రమునుండి జన్మించిన త్రిలోచనుని వంశములోని వాఁడైన ముక్కంటి కాడువెట్టియను పల్లవభూపతి శ్రీపర్వతమునకు తూర్పు భాగమున 700 అగ్రహారముల నిచ్చెనట. ఈవిషయము మరికొన్ని శాసనములలో గూడ నున్నది (నె. శా. సం పుటలు ౩౮౮-౬౨౦). అందులో పెరుంగండూరనునది యొక యగ్రహారము. అది రాజేంద్రచోళమండలమునందలి పశ్చిమపాకనాఁటిలోనిది. అది యేబదియిద్దఱు బ్రాహ్మణులకీయఁబడినది. వారా యగ్రహారమును జిరకాల మనుభవించిరి. ఇంతలో పాకలికోడూరుగ్రామ వాస్తవ్యులు కొందఱు ఏదియో కలహము కారణముగా నాగ్రామమును విడచి యీపెరుంగండూరునకు వచ్చి, యాయూరి చెఱువున కుత్తరభాగమున నిండ్లు కట్టుకొనిరి. మఱికొంత కాలమునకా గ్రామ సమీపమందున్న "ఇనుంబ్రోలు" నందలి వెలమలు కొందఱు వారిగ్రామమున మారిజ్వరము (Plague) రాఁగా నందుండలేక పెరుంగండూరునకు వచ్చి పాకలను వేసికొని కాపురముండిరి. (ప్లేగువ్యాధి వచ్చినపుడు గ్రామమును విడచివేసి, దూరముగాఁ బోయి కాపురముండు నాచార మీకాలముననేకాదు. పదివందల సంవత్సరముల క్రిందటఁ గూడ నుండెయున్నట్లీ శాసనమువలనఁ దెలియుచున్నది.) కాని వారు తామాక్రమించుకొనిన భూమికి, బ్రాహ్మణులకు, ప్రతిఫలమిచ్చెదమని వారితో నేర్పాటు గావించుకొని యట్లిచ్చుచు వచ్చిరి. కొంతకాలమునకు, శనిగ్రహము మీనరాశికి వచ్చుటచే నాగ్రామమున గఱవు సంభవించెను. అందుచే జీవనాధారము లభింపక యాబ్రాహ్మణులాగ్రామమును విడచి మఱియొకచోటకుఁ బోయిరి. దేశము సుభిక్షముగా నుండఁగనే యాబ్రాహ్మణులు మరల నాగ్రామమునకు వచ్చిరి.

ఈలోపుగా నావెలములు తమరాక్రమించుకొనిన ప్రదేశమునకు గోడూ
రని పేరిడి వ్యవహరించుకొనుచు బ్రాహ్మణుల కిచ్చెడి ప్రతిఫలము నీయ
నిరాకరించిరి. ముక్కంటికాడువెట్టి యిచ్చిన యగ్రహారము నందు
బ్రాహ్మణులకు స్వత్వము లేదనియు, నాయగ్రహార మిప్పటిరాజునకుఁ
జెందిపోయిన దనియు, వాదింప మొదలిడిరి. బ్రాహ్మణులు చేయునది లేక
మధురాంతక పొత్తపిచోళుఁడగు మనుమసిద్ధిమహారాజు కడ కేగి తమకు జరి
గిన యపకృతినిగూర్చి విన్నవించుకొనిరి. మనుమసిద్ధిమహారాజు, ఇనుం
బ్రోలున వ్యవసాయము చేయువారలను, పాకనాటియందలి మఱికొంద
ఱిని బిలిపించి విచారణచేసి నిజముఁ గనుఁగొని యాప్రదేశము బ్రాహ్మ
ణులచే యనినిశ్చయించి, యాగోడూరు నా బ్రాహ్మణుల కగ్రహారముగా
నిచ్చి యీశాసనము వ్రాయించెను. ఈగోడూరు కడపమండలమున
పుల్లంపేట తాలూకాలో నున్నది. చోళులకు రాజధాని యైన పొత్తపి
కూడ నీపుల్లంపేట తాలూకాలోనిదే. కాలనిర్ణయముకొఱకు, రాజేంద్ర
చోళుని పదుమూఁడవ సంవత్సర మని చెప్పినను శాసనాంతమున
రాజేంద్రుని పేరుదాహరింపకపోవుటచే నీపొత్తపిచోళరాజులు స్వతంత్రు
లనియూహింపఁదగియున్నది.

ఖడ్గతిక్కన వృత్తాంతము :

మనుమసిద్ధితండ్రి యైనతిక్కరాజునుగూర్చి వ్రాయుసందర్భమున
శా. శ. ౧౧౭౮ వ సంవత్సరపు శాసన మొకటి పైన నిచ్చియుంటిని.
దానినిబట్టి సిద్ధయయు, నాతనికుమారుఁ డైనతిక్కనయుఁ దిక్కరాజుకడ
మంత్రులుగా నున్నారని తెలియుచున్నది. ఈతిక్కన మనకవితిక్కన
కాఁడు. మనతిక్కన కీతఁడు పెదతండ్రికుమారుఁడు. సిద్ధనకుమారుఁ
డైనయీతిక్కన మిక్కిలిపరాక్రమవంతుఁడును, రణశూరుఁడునై ఖడ్గ
తిక్కన యనియు, రణతిక్కన యనియు, గంధవారణుఁ డనియు పేరు
గాంచినవాఁడు. ఈతఁడు తిక్కరాజు దగ్గఱనే కాకుండ మనుమసిద్ధిమహా
రాజుకడ కూడ దండనాథుఁ డై యుండి పెక్కుయుద్ధములలోఁ బాల్గొని
తుదకు రణరంగమున వీరమరణము నొంది శాశ్వతకీర్తి బడసియుండెను.
తిక్కనసోమయాజికుటుంబములోనివాఁడై యఖండయశస్సు నార్జించిన

యీాతనిని గురించి కొంచె మేనియు వ్రాయకున్నచోఁ దిక్కన సోమ యాజిచరిత్రము లోపయుక్త మగు ననుభయమున గ్రంథవిస్తార మైనను సరియే యని యాతనినిగూర్చి యెుక్కించుక వ్రాయుచున్నాఁడను.

ఈఖడ్గతిక్కనను కేతనకవి దశకుమారచరిత్రమునం దిట్లు వర్ణించి యున్నాఁడు.

సీ. వేఁడిన నర్థార్థి వృథపుచ్చ నేరని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ
నెదిరిన జమునైన బ్రదికి పోవఁగనీని
శౌర్యంబు తనకిష్టసఖుఁడు గాఁగ
శరణుచొచ్చిన శత్రువరునైన రక్షించు
కరుణయె తనకు సంగడము గాఁగఁ
బలికినఁ బాండవప్రభునైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగ
జగతి నుతి కెక్కె రాయవేశ్యాభుజంగ
రాజ్యరత్నాకరస్ఫూర్తి రాజమూర్తి
గంధవారణబిరుదవిఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయతిక్కశౌరి.

ఈతిక్కన, మనుమసిద్ధికడ సేనానిగా నున్నకాలములో "పశుల మేపుబీళ్లనిమిత్తమై కాటమరాజునకును మనుమసిద్ధిరాజునకును వివాదము పొసఁగి మహాయుద్ధము జరిగినటులఁ గాటమరాజుకథవలనఁ దెలియుచున్నది. ఈయుద్ధకథనము ద్విపదలో రామరావణయుద్ధముగ వర్ణింపఁబడినది. కాటమరాజుతండ్రి పెద్దిరాజు. పెద్దిరాజుతండ్రి వల్లురాజు. ఇతఁ డాత్రేయగోత్రోద్భవు లయినయాదవుల సంతతిలోనివాఁడుగఁ జెప్పఁబడియెను. ఇతఁడు కనిగిరి సీమలోని అలవలపాడున కధిపతిగ నుండెను. కాటమరాజు కనిగిరిసీమలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతిగ నుండెను. దేశమున వనావృష్టి సంభవింప యాదవు లనంబడుగొల్లవాం డ్రెల్లను దమతమపశులమందలను దోలుకొని దక్షిణమునకు వచ్చి

మనుమసిద్ధిరాజుయొక్క పశులబీళ్లను గొన్నిటిని పుల్లరికిఁ గైకొని పశులను మేపుకొని పుల్లరి చెల్లింపకయే వెడలిపోయిరి. అందుపై సిద్ధిరాజునకుఁ గోపము వచ్చి అన్నంభట్టను బ్రాహ్మణుని రాయబారిగా గాటమరాజుకడకు పంపించెను. కాటమరాజు పుల్లరి చెల్లింపక తగవు పెట్టెను. అంతట మనుమసిద్ధిరాజు కాటమరాజును శిక్షించుటకై బహుసైన్యములం గూర్చుకొని దండెత్తి వచ్చెను. కాటమరాజుకూడ బంధుజనులనుమిత్రులను గూర్చుకొని యుద్ధసన్నద్ధుఁ డయ్యెను.

అప్పుడు తిరునామాలతిప్పరాజు, శ్రీకంఠరాజు, పెదవేఁగి చొక్కరాజు, పెదవరదరాజు, అర్లుకొండ అచ్చిరాజు, ఆదివన్నె మారిరాజు, గయికొండ గంగరాజు, ఉర్లకొండ సోమన్న, ఉదయాద్రి అమ్మయ్య, చెన్నపట్టణము చంద్రశేఖరుఁడు, దేవముని వెంగళయ్య, పట్టుకోట బసవరాజు, కాళహస్తి పాపతిమ్మరాజు, వెలకంచి వెంగళపతిరాజు, ప్రభగిరిపట్టణము పద్మశేఖరుఁడు మొదలగు యోధులు మనుమసిద్ధికి దోడ్పడవచ్చిరి. ఈయోధులకందఱకు నాయకుఁడై ఖడ్గతిక్కన సిద్ధిరాజ సేనల నడిపించుకొనివచ్చెను.

పల్నాటి ప్రభువయిన పద్మనాయఁడును, పల్లికొండ ప్రభువయిన చల్లపిన్నమ నాయఁడు, దొనకొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, భట్టావులరాజు, కరియావులరాజు, వల్లభన్న, నాళకూళ్ళనాయఁడు, సేతి ముద్దయ్యనాయఁడు, పాచయ్యనాయఁడు, ముమ్మయ్యనాయఁడు, పుత్తమరాజు మొదలగు యాదవవీరులును, కాటమరాజునకు, దోడ్పడవచ్చిరి. ఈసైన్యముల కంతకుఁ జిన్నమనాయని మంత్రియు, నారాధ్య బ్రాహ్మణుఁడు నగు బ్రహ్మరుద్రయ్య నాయకుఁడై నడిపించెనఁట! ఉభయసైన్యములును పాలేటియొడ్డుననున్న పంచలింగాలకడ నెదుర్కొన్నవి.

అప్పు డుభయసైన్యములకును ఘోరమైన యుద్ధము జరిగెను. తుదకు తిక్కన సైన్యమంతయు హతమయ్యెను. తిక్కన యుద్ధభూమిని నొక్కఁడు మిగిలియుండుటను ప్రత్యక్షయోధుఁడైన పిన్నమనాయఁడు చూచి:

"పోరు నిలుపుమోయి భూసురోత్తముఁడ
నరిగాదు మాతోడ సమరంబుఁ జేయ
అగ్రజుల్ మీరు యాదవులము మేము
ఉగ్రము మామీఁద నుంపంగ రాదు"

అని పలికెనట. అందుపైని తిక్కన సైన్యమంతయు హతమగుటకుఁ జింతించి మఱల సైన్యమును గొనివచ్చి తలపడియెదం గాకయని గుఱ్ఱమును ద్రిప్పుకొని తిరిగి వచ్చెనఁట !

అందుపై వృద్ధుఁడైన యాతని తండ్రి "యుద్ధమున నైనం జావక యిటులేల పాఱివచ్చితివి! కడుపు చెఱుపఁబుట్టితి వని నిందించెనఁట! ఈరణతిక్కన స్నానమునకు వచ్చినప్పుడు భార్య స్త్రీలకుంచినట్లుగా రహస్య స్థలంబున నీళ్ళబిందె నుంచి దానిమీఁద బసపుముద్ద యుంచి దానికి నులకమంచమును చాటు వెట్టెనఁట! అదిచూచి యాతఁడు సిగ్గుపడి ఖేదపడుచుండఁగా భార్య

క. పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపునాయకు లందున్
ముగు రాడవార మైతిమి
వగ చేటికి జలక మాడవచ్చినచోటన్.

అని యెకసక్కెము లాడెనఁట. అన్నములో పాలు విఱిగిపోఁగా తల్లి సైతము పరిహాసముగా

క. అసదృశముగ నరివీరులఁ
బన మీఱఁగ గెలువలేక పంద్రక్రియ నీ
వసి వైచి విఱిగివచ్చినఁ
బసులు న్విఱిగినవి తిక్క! పాలు న్విఱిగెన్.

అని పలికెనఁట! ఇఁకఁ జెప్పవలసిన దేమున్నది! ఇట్టిపలుకు లెల్లనుశూలములై నాట మానాభిమానియైన యమ్మహాయోధుఁడు చేసినపనికిఁ బశ్చాత్తప్తుఁడై "ఈసారి మఱలఁ బోయి శాత్రవులను

మార్కొని జయంబు గొందు. అయ్యది సంప్రాప్తంబు గాదేని ప్రాణంబుండుదనుకఁ బోరాడి వీరస్వర్గంబు నైన జూఱఁ గొందు. మానాభిమానములు గలశూరుఁ డిట్టిరోఁతబ్రదుకు బ్రదుకఁడు" అని తలపోసి యెవ్వ రెన్నివిధముల వారించినను వినక, సిద్ధిరాజు నొడంబఱిచి, మఱల సైన్యముం గొనిపోయి శత్రుప్రజలను మార్కొని భీమసంగ్రామంబు గావించెను. చరిత్రకారుఁడు యుద్ధభూమిని నాతఁడు చేయుచున్న యుద్ధక్రమము నిట్లభివర్ణించుచున్నాఁడు.

చ. పదటున వాజి రాహుతులపై దుమికించుచుఁ దిక్కఁ డార్చినన్
బెదిరి పరిభ్రమించి కడుఁ బిమ్మిట వీరులు భీతచిత్తులై
యదె యదె వాలు వా ల్మెఱుఁగు లల్లవె యాతఁ డంచనన్
గొదుకక యాజిఁ జేసె రిపుకోటుల కందఱ కన్నిరూపులై.

ఇట్లు ప్రచండవిక్రమార్కుఁడై ఘోరసంగ్రామంబున శత్రుసేనను మార్కొని వీనుంగుపెంటలు గావించుచు రణకేళి సల్పుచుండ యాదవవీరులును వెనుదీయక మహోద్రగులై తిక్కనసైన్యముపైఁ బడి కత్తులఁ గటారుల నీఁటెలం బొడిచి చిక్కాడుచుఁ బెద్దకాలంబు పోరాడ నుభయసైన్యంబులఁ బెక్కండ్రు వీరభటులు నేలం గూలిరి. అంతటఁ జిన్నమనాయఁడు ఖడ్గతిక్కనను సమీపించి విప్రోత్తమా! యుద్ధముచేయుట బ్రాహ్మణునకుఁ బాడిగాదు. మిమ్ముం జంపిన మాకు బ్రహ్మహత్యాదోషంబు వాటిల్లు నని మనంబు తల్లడిల్లుచున్నది. తొలంగుట నీకును మాకును గూడ శ్రేయస్కరం బని యూహింతునని గొంతెత్తి గంభీరవాక్యంబులు వలుకఁ దిక్కనయు "ఓనాయఁడా! రణశూరుఁడవై యుద్ధము సేయఁజాలక పందక్రియ ధర్మపన్నంబు లేల చదివెదవు? వానిం గొన్ని నేనెఱుంగుదును గాని వీరుండ వౌదువేని కదలక నిలుచుండి యుద్ధంబుచేసి చేత నయ్యెనేని నాప్రాణంబులు గొని విజయపతాక మెత్తుము కాదేని శరణుచొచ్చి మాపుల్లరి మాకుఁ బెట్టుము." అని హెచ్చరింపఁ జిన్నమనాయఁడు బ్రహ్మహత్యాదోషమునకు వెఱచి యేమిచేయుటకును జేతులాడ గాళ్ళునాడక నిశ్చేష్టితుఁడై చూచుచుండ, వానిమంత్రి బ్రహ్మరుద్రయ యచటికి

నేతెంచి "తిక్కన సేఁదలంపడి పోకార్చెద నీపటుండు" యని తన ప్రతివీరునిపై హయంబును బఱపి యుద్ధము చేయఁగా నిరువుర గుఱ్ఱంబులు నీల్గెపోటుల నేలంగూల నిరువురును గత్తులుదూసి "హర హరా" యని యభిమన్యు లక్ష్మణకుమారులవలె ద్వంద్వ యుద్ధంబునకుఁ గలియంబడి యుభయ సైన్యంబుల వారును నివ్వెఱపడి చూచుచుండఁ బెద్దయుం బ్రొద్దు పోరాడి యిరువురును నేల కొఱంగిరి. ఆపాటుంగని తిక్కన సైనికులలో హతశేషు లయినవార లీక్రింది విధముగా జెప్పుకొని యాక్రందించిరని యొక కవి చెప్పియున్నాఁడు.

"సీ. ధైర్యంబు నీమేనఁ దగిలియుండుటఁ జేసి
చలియించి మందరాచలము తిరిగె,
గాంభీర్య మెల్ల నీకడన యుండుటఁ జేసి
కాకుత్స్థువార్ధి కట్టువడియె,
జయలక్ష్మి నీయురఃస్థలినె యుండుటఁ జేసి
హరి పోయి బలిదాన మడుగుకొనియె,
నాకార మెల్ల నీయందె యుండుటఁ జేసి
మరుఁడు చిచ్చునఁ బడి మడిసి చనియె
గీ. దిక్కదండనాథ దేవేంద్రపురికి నీ
వరుగు టెఱిఁగి నగము తిరుగు టుడుగు
నబ్ధి కట్టు విడుచు నచ్యుతుకొద మాను
మరుఁడు మరలఁ గలుగు మగలరాజ.

అని తనసైనికు లెల్ల హాహాకారంబులు సేయుచుండఁ బ్రాణంబులు దేహంబును విడిచినవిధం బాకవివర్యుఁడే మరల నిట్లు చెప్పియున్నాఁడు.

సీ. నందిని బుత్తెంచె నిందుశేఖరుఁడు నీ
వన్న యేతెమ్మని తారాద్రికడకు,
గరుడుని బుత్తెంచె నరహరి రావయ్య
వడిసిద్ధతిక్క కైవల్యమునకు,

హంసను బుత్తెంచె నజుఁడు నీకడకు ను
భయకులమిత్త్రి రా బ్రహ్మసభకు
నైరావతముఁ బంపె నమరేంద్రుఁ డిప్పుడు
దివమున కేతెమ్ము తిక్కయోధ
గీ. యనుచు వేఱువేఱ నర్ధిఁ బిలువంగ
వారు వీరు గూడ వచ్చి వచ్చి
దివ్యయోగి యైన తిక్కనామాత్యుఁడు
సూర్యమండలంబు జొచ్చి పోయె"

—ఆంధ్రుల చరిత్రము మధ్యయుగము.

రణతిక్కనభార్య భర్తృమరణమును విని సహగమనము సేయుటకై పాలికలని కేతెంచెనఁట! కాని యాశవసమూహములో భర్తశిరము కనఁబడ లేదఁట. నేను పతివ్రత నైతినేని నాభర్తశిరము పైకెగిరి నాకగుపడుఁ గాక, యని యావీరపత్ని పలుక నాతనిశిర మట్లే యెగిరె నఁట. సమస్తబంధు జనసమక్షమున నాశిరముతోఁ గూడ నామె సహగమన మొనర్చె నఁట. ఈ యంశ మీక్రిందిచాటుధారలో సూచింపఁబడినది.

ఉ. శ్రీలలరార శత్రువులఁ జెండితి వార్యులు మంత్రివర్యు లా
శ్లాఘనముల్ నుతించి రలవేల్పుదొరల్ ముదమంది మెచ్చి రో
లాలితశౌర్య ధైర్యజయలక్ష్మిప్రియంబున ని న్వరించె నీ
లీలలు హెచ్చెఁ దిక్కనికళేబరమా! యిఁక నిల్పియాడుమా!

ఈరణతిక్కనపైని చాటుధార లనేకము లున్నవి. రెండు పద్యములను మాత్ర మీక్రిందఁ బొందుపఱచుచున్నాఁడను.

ఉ. ఏమి తపంబుచేసి పరమేశ్వరు నేమిటఁ బూజ చేసిరో
రామునితల్లియుం బరశురామునితల్లియు భీముతల్లియున్
గాముని కన్నతల్లియును గంజదళాక్షునముంగుఁదల్లియున్
శ్రీమహితవ్రతావుఁ డగుసిద్ధనతిక్కనకన్నతల్లియున్.

సీ. వీరవివాదంబు వేదనినాదంబు
పాయక యేప్రొద్దు మ్రోయుచుండు
భూసురప్రకరంబు సేసలుచల్లంగఁ
బాయ కెన్నిరొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలుపోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసఁగినపత్రికలపుత్త్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు

గీ. మానఘనుఁ డైనతిక్కనమంత్రి యింట
మదనసముఁ డైనతిక్కనమంత్రి యింట
మహితయశుఁ డైనతిక్కనమంత్రి యింట
మంత్రిమణి యైనతిక్కనమంత్రి యింట.

కాటంరాజు పశువులను మేపుకొని పుల్లరి యేల యివ్వనివెనో ఆంధ్రులచరిత్రముసఁ జెప్పలేదు. ఆకారణమును గొంద ఱిట్లుచెప్పుచున్నారు. మనుమసిద్ధిమహారాజుయొక్క యొంపుడుకత్తె పెంచుచున్న చిలుక పంజరమునుండి తప్పించుకొని పోయి యాదవుల పశువులు మేయుచున్న యడవి కేగి మనుష్యభాషణములఁ బల్కుచుండ నాపశువులు చెదరిపోయి మేఁతను మానివేసిన వఁట. అందుపై నా పసుల కాపరులా చిలుకను జంపివేసిరఁట. అందుమీఁద సిద్ధిరాజుమను ష్యులాకాపరులను వారి పశువులను గొంత యల్లరి చేసిరఁట! అది కారణముగాఁ గాటంరాజు పుల్లరి సింపక రణమునకుఁ దిగెనని చెప్పుదురు.

మనుమసిద్ధి నిర్యాణము:

ఈయుద్ధము శా. శ. ౧౧౭౦ కాళయుక్తి సంవత్సర కార్తిక శుద్ధపంచమీ గురువారమునాఁడు జరిగినదని యొక శిలాశాసనమునం దున్నది. (నె. శా. సం. ౨౨౭ పుట) కాని యది నమ్మదగినదిగా నైనది కాదు. దీని నెవ్వరో కొండయ్య కొడుకు రామయ్య వ్రాయించినది. ఎప్పుడు వ్రాయించెనో తెలియదు. ఇందసందర్భములైన విషయములు

పెక్కులున్నవి. చోడతిక్కరాజు శాసనమునుబట్టి శా. శ. ౧౧౭౪ వఱకు సిద్ధయ తిక్కన జీవించియున్నట్లు కనఁబడుచున్నది. కావున నీశాసనము సరియైనదని తలంపరాదు. కాళయుక్తి శా. శ. ౧౧౭౦ కాదు ౧౧౮౦ అయినది. ఈయుద్ధము జరిగినకొలఁది దినములకే మనుమసిద్ధి చనిపోయె నందురు. శకసంవత్సరములు సరిగా లేకున్నను, ఈశాసనమును బట్టియు, తిక్కన నిర్యాణమును దెలుపు "అంబరశశిరవి" అను పద్యమునను సరించియుఁ గాళయుక్తికిని ఖడ్గతిక్కన మనుమసిద్ధుల నిర్యాణములకును సంబంధ మున్నదని తోఁచుచున్నది ఆపద్యమందలి తిక్కయజ్వ "తిక్కయోధ" యేమో! కొల్లూరు శాసనమునకు (శా. శ. ౧౧౭౯) దరువాత మనుమసిద్ధి శాసనములు గనఁబట్టుటలేదు. ఇతఁడు కాళయుక్తి సంవత్సరముననే చనిపోయెనేమో! అట్లయినచోఁ దండ్రి చనిపోయిన యయిదారు సంవత్సరములలోనే యితఁడు కాలధర్మము నొందెనని తలంపవలసియున్నది. ఆపక్షములోఁ దిక్కనామాత్యుఁడు నిర్వచనోత్తరరామాయణమును, శా. శ. ౧౧౭౫-౧౧౮౦ నడుమ రచియించి యుండునని నిశ్చయింపవలసియున్నది.

మనుమసిద్ధికిఁ దరువాత నాతనివంశమును దెలుపుశాసన మొకటి కలదు. (ఆం. సా. ప. సం. ౧౭ పుట ౨౨౩). ఆశాసన మిది.

"శుభమస్తు. శ్రీమద్వాంస్తుభలాంఛనో విజయతే దేవః పురాణో హరి స్తన్నాభే స్సరసీరుహోదరజని ర్విశ్వం విధాతా సృజత్ । తస్మిన్సూర్యసుధాంశువంశజననా భూపా శ్శశాసు ర్భువం । తేషు ఖ్యాతికథావశేషమయతాం యాతేషు మన్వాదిషు॥౧॥జాతో విక్రమసింహపట్టణపతి స్తిక్కక్షితీశ స్తతో భాస్వద్వంశపయోధిశీతకిరణో విశ్వంభరామస్వభూత్ । తత్పుత్రి స్తదనంతరం మదననిభో మన్మక్షమాపల్లభః ప్రౌఢౌదార్యవిరాజితామర మహీజాతోసిప దృష్టతలం॥౨॥తస్యాస్తనయా స్త్రయః ప్రథమజ స్తిక్కక్షమానాయకః పశ్చాదావిరభూత్పురార్థ్యజనన శ్రీ సిద్ధో నృపః । గోపీనాథ... పతి స్తదనుసంజాతస్తితిర్భ్యాభ... నిశ్శాతకృపాణఖండితరిపుర్బాహ్మ పాలదోర్మ స్తకః॥౩॥

వల్లసిద్ధిక్షమానాథో తేషాం కన్యధ్య ఇబన్మనః। పంచపుండసమానిక్యః ప్రాసూతం సుతపంచకం॥౪॥యేన దానగుణాఢ్యేని శౌర్యోత్సేకశాలినా। స్వకృతం సుభూజానాం పాదపానాం చ పంచకం॥౫॥తత్రాగ్రజన్మనో మన్మగండగోపాలభూపతిః ప్రతాపరుద్రభూపస్య ప్రసాదార్జితవైభవః॥౬॥ స్వస్తిచాణసరోరుహవిహారతపిలోచన త్రిలోచన ప్రముఖాఖిలపృథివీశ్వర కారిత నానేకతీర కరికాలకులరత్న ప్రదీప అపరిమితప్రతాప సతతసమభ్యర్చిత లక్ష్మీశ్వర ఒఱయూరిపురవరాధీశ్వర కాంచీపుర త్రిపురత్రినేత్ర సాళ్వసగోత్ర అతివిషమహాయామాఢ ప్రౌఢరేఖా రేవంత విజయలక్ష్మీకాంత అతిచతురకాలింపజనజయంత వితరణవినోదవిక్రమాదిత్య తేజసాదిత్య అరిబలతిమిరమార్తాండ జగదొబ్బగండ గర్వితారాతిమధరకుశేఖర శరణాగతవజ్రపంజర దాయాదిమండలికుధీశ పట్టకఘురిట్ట కీర్తి నారాయణ పృథివీశ్వరశిరఃకందుకక్రీడావినోద నిత్యసత్యప్రతాప సింహాసనపట వేణుకబళ్ళనదానవాపవరోపమాన గంభీరాంభోనిధాన ప్రతిబలవార్ధి శోషణ బడబానల రాయగండగోపాల విహితాశ్రితమాన భంగ రాజపుత్ర్యాభుజంగ నామాదిసమస్తప్రశస్తిసహితం శ్రీమన్మహామండలేశ్వర బుజబలవీర మనుమగండగోపాలదేవచోడమహారాజులు స్వస్తి శ్రీ శకవరుషంబులు ౧౨౧౮ అగు నేంటి హేమలంబిసంవత్సర చైత్రశు ౧౫ సో॥ నాంటి సోమగ్రహణ కాలమునందు మతల్లిదండ్రుల కసంకభోగ్యార్థముగాను కొట్యదొన శ్రీ చెన్నకేశవదేవర తిరునాళ్ళకై పరమూవంగండసింహపురములోన పెట్టిన ఇరవయి పుట్లు వెలిసేను లెఖాను ,, ...''

ఈ శాసనమందలి విషయాలా, తిక్కనసోమయాజికి ప్రభువైన మనుమసిద్ధికి దండ్రి యగు చోడతిక్కరాజు సనుటను సంశయింపనక్కరలేదు. పృథివీశ్వరశిరః కందుకక్రీడావినోదము తిక్కరాజునకే దక్క మఱియొకరికి నన్వయింపదు.

"పృథ్వీశ శిరకందుకము నశకము నేడితిఁ గందుకకేళి సల్పఁడే."
"రాయగండగోపాల"

"దర్పదుర్జయులగు దాయాదనృపతుల నఁ లోనబఱపఁ జే యాగ్ర హామున"

—నిర్వచనోత్తరరామాయణము.

"బలిమిచేఁ బృథ్వీశుతల ంద్రుంచి సేవణ। కటకసామంతులగర్వ మడఁచి, ద్రవిడమండలికులందఱఁ దక్కనేల"

—దశకుమారచరిత్రము.

చోడతిక్కరాజును వర్ణించుసందర్భమున రచించిన యీపద్యములలోని భావములనే యీశాసనమునందు "దాయాద మండలిక ... పరిఘురట్ట పృథ్వీశ్వరశిరః కందుకక్రీడావినోద, సేవణకటక వేణుక బళవ దావపావకోపమాన ద్రవిళబలవార్ధి పరిశోషణబడబానల రాయగండ గోపాల" అను వాక్యములలో నుదాహరించియున్నాఁడు. కావున నీశాసనములోని తిక్కరాజు, పైఁ జెప్పఁబడిన చోడతిక్కరాజనియు, నాతని తనయుఁడైన మనుమసిద్ధి నిర్వచనోత్తర రామాయణ కృతిపతియనియు నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. మనుమసిద్ధికిఁ దిక్కరాజు, నల్లసిద్ధి, యింకనొకఁడు (పేరున్న భాగము శిథిలమైనది.) అను మువ్వురు కుమారులు. ఈతిక్కరాజును ఇమ్మడి తిక్కరాజనియు, ఇమ్మడి తిరుకాలత్తి దేవుఁడనియు బిలచెదరు. ఈతని శాసనమొకటి శా. శ. ౧౨౦౧ (నె. శా. సం. పుట ౪౧౭) లోఁ గన్పడుచున్నది. మనుమసిద్ధి రెండవ కుమారుఁడైన నల్లసిద్ధి కైదుగురు కుమారులు. ఇందుఁ బెద్దవాఁడైన మనుమ గండగోపాలుఁడీ శాసనదాతకర్త. మనుమగండ గోపాలనామధారులు పెక్కురున్నారు (నెల్లూరు శాసనసంపుటములను జూడుఁడు.) కాని వారికిని నీతనికిని సంబంధము లేదు. ఈమనుమగండ గోపాలుఁడు కాకతీయ ద్వితీయ ప్రతాపరుద్రునకు సామంతుఁడై కొట్యదోన (కొణిదెన) ప్రాంతమునకుఁ బరిపాలకుఁడైనట్లీ శాసనమువలనఁ దెలియుచున్నది. ఈశాసనము నందలి బిరుదములు వంశానుగతముగా వచ్చినవి.

భుజబల మనుమసిద్ధరసు పేరునఁ గొన్ని శాసనములు శా. శ. ౧౧౬౧-౧౧౭౧ సంవత్సరములలో నున్నవి. కాని యీతఁడు, తిక్క-

రాజు కొడుకగు మనుమసిద్ధి కాఁడు. మొత్తముమీఁద నీ నెల్లూరు చోడుల చరిత్రమును, శాసన వాఙ్మయములను సమన్వయము చేయుచు వ్రాయవలసిన యావశ్యకత యెంతయేని గలదు. అందులకిది స్థానము కాదు. ఇదివఱకే ప్రసక్తానుప్రసక్తిగఁ గొంత గ్రంథమును వ్రాసి తిక్కన చారిత్రమును బెంచవలసివచ్చినది. ఇంతకంటె నధికముగ వ్రాయుట యప్రస్తుత మగునని యెంచి తిక్కనసోమయాజి చరిత్రమును ముగించుచున్నాఁడను.

పెక్కులున్నవి. చోడతిక్కరాజు శాసనమునుబట్టి శా. శ. ౧౧౭౪ వఱకు సిద్ధయ తిక్కన జీవించియున్నట్లు కనఁబడుచున్నది. కావున నీశాసనము సరియైనదని తలంపరాదు. కాళయుక్తి శా. శ. ౧౧౭౦ కాదు ౧౧౮౦ అయినది. ఈయుద్ధము జరిగినకొలఁది దినములకే మనుమసిద్ధి చనిపోయె నందురు. శకసంవత్సరములు సరిగాలేకున్నను, ఈశాసనమును బట్టియు, తిక్కన నిర్యాణమును దెలుపు "అంబరశశి రవి" అను పద్యమునను సరించియుఁ గాళయుక్తికిని ఖడ్గతిక్కన మనుమసిద్ధుల నిర్యాణమునకును సంబంధ మున్నదని తోఁచు చున్నది ఆపద్యమందలి తిక్కయజ్వ "తిక్కయోధ" యేమో! కొల్లూరు శాసనమునకు (శా. శ. ౧౧౭౫) దరువాత మనుమసిద్ధి శాసనములు గనపట్టుట లేదు. ఇతఁడు కాళయుక్తి సంవత్సరముననే చనిపోయెనేమో! అట్లయినచోఁ దండ్రి చనిపోయిన యయిదారు సంవత్సరములలోనే యితఁడు కాలధర్మము నొందెనని తలంపవలసి యున్నది. ఆపక్షములోఁ దిక్కనామాత్యుఁడు నిర్వచనోత్తరరామా యణమును, శా. శ. ౧౧౭౯-౧౧౮౦ నడుమ రచియించి యుండునని నిశ్చయింపవలసియున్నది.

మనుమసిద్ధికిఁ దరువాత నాతనివంశమును దెలుపుశాసన మొకటి కలదు. (ఆం. సా. ప. నం. ౧౭ పుట ౨౨౩). ఆశాసన మిది.

"శుభమస్తు. శ్రీమద్వాక్యస్తుభలాంఛనో విజయతే దేవః పురాణో ... స్తన్నాభే స్సరసీరుహోదరజని ర్విశ్వం విధాతా సృజత్। తస్మి న్నాన్యసుధాంశువంశజనతా భూపా శ్చశాసు ర్భువం। తేషు ఖ్యాతి కథాపశేషమయతాం యాతేషు మన్వాదిషు॥౧॥జాతో విక్రమసింహ పట్టణపతి స్తిక్కక్షితీశ స్తతో భాస్వద్వంశపయోధిశీతకిరణో విశ్వంభరా మస్వభూత్। తత్పుత్రి స్తదనంతరం మనునిభో మన్మత్తమాపల్లభః ప్రౌఢౌదార్యవిరాజితామర మహీజాతోసిప దూర్భూతలం॥౨॥తస్యా స్తనయా స్త్రయః ప్రథమజ స్తిక్కభూమానాయకః పశ్చా దావిరభూ త్పరార్ధ్యజనన శ్శ్రీనల్లసిద్ధో నృపః। గోపీనాథ... పతి స్త దనుసంజాత స్తితిర్భ్యాభభు... నిశ్శాతకృపాణఖండితరిపుస్తస్మా పాలవోర్మ స్తకః॥౩॥..

వల్లసిద్ధిక్షమానాథో తేషా మన్వయసంభవః। వంశేతుండన
ప్రసూతం సుతపంచకం॥౫॥ యేన నానాగుణాఢ్యేన శౌర్యౌ త్యైకశాలినా।
స్వీకృతం సుభూమానాం పాదగానాం చ పంచకం॥౬॥ తత్రాగ్రజ
న్మతో మన్మగండగోపాలభూపతిః ప్రతాపరుద్రభూపస్య ప్రసా
దార్జితవైభవః॥౭॥ స్వస్తి సమస్తసరోరుహవిహారిబిలోచన త్రిలోచన
ప్రముఖాఖిలపృథివీశ్వర కారిత వేరితీర కరికాలకులతిలక ప్రదీప అపరి
మిత పరితాప సతతసమభ్యర్చిత [illegible] ఒఱయూరిపురవరాధీశ్వర
కాంచీపుర త్రిపురత్రినేత్ర కాశ్యపగోత్ర అతివిషమమహాహవప్రౌఢ
రేఖారేవంత విజయలక్ష్మీకాంత అనేక [illegible] కామినీజనమనోరంజిత వితరణ
వినోదనిశ్రీమాదిత్య తేజో [illegible] జగదొబ్బ
గండ గర్వితారాతికుధరకులిశ [illegible] బాహాబల
మండలికమథన పట్ట [illegible] కీర్తి [illegible] పృథివీశ్వర శిరఃకందుకక్రీడా
వినోద నిత్యసత్యప్రదాత [illegible] సోమకుల [illegible] కోపమాన
గంభీరాంబోధి [illegible] రాయగండ
గోపాల విహిత [illegible] సామాదిసమస్త
ప్రశస్తిసహితం శ్రీమన్మహామండలేశ్వర [illegible] మన్మగండగోప
దేవచోడమహారాజులు స్వస్తి శ్రీ శకవర్షంబులు ౧౨౧౫ అగు
నేంటి హేమలంబిసంవత్సర వైశాఖ [illegible] కాలము
నందముతల్లిదండ్రులకు [illegible] శ్రీ చెన్నకేశవ
దేవర తిరునాళ్ళకై [illegible]
పుట్లు వెలిసేను లెఖాను ......"

ఈ శాసనములందలి [illegible] ప్రభువైన
మనుమసిద్ధికిం [illegible]
లేను. పృథివీశ్వరశిరః [illegible] దక్క
మఱియొకరికి సరిపోయినవని.

"పృథ్వీశ [illegible] కందుక కేళి సల్పు దేవ."
"రాయగండగోపాల"

"దర్పదుర్జయులగు దాయాదనృపతుల నంతలోనబట్టపడఁజే. యాగ్ర హామున"

—నిర్వచనోత్తరరామాయణము.

"బలిమిచేఁ బృథ్వీశులతలఁద్రుంచి సేవణ। కటకసామంతులగర్వ మడఁచి, ద్రవిడమండలికులందఱఁ దక్కనేలె"

—దశకుమారచరిత్రము.

చోడతిక్కరాజును వర్ణించుసందర్భమున రచించిన యీపద్యములోనిభావములనే యీశాసనమునందు "దాయాదసంకలిక ... ర్గమురట్టి పృథ్వీశ్వరశిరః కందుకక్రీడావినోద, సేవణకటక వేణుక బళస ...కోపమాన ద్రవిళబలవార్ధి పరిశోషణబడబానల రాయగండ" అను వాక్యములలో నుదాహరించియున్నాఁడు. కావున నీశాసన మేసిన తిక్కరాజు, పైన చెప్పఁబడిన చోడతిక్కరాజనియు, నాతని తనయుఁడైన మనుమసిద్ధి నిర్వచనోత్తర రామాయణ కృతిపతియనియు నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. మనుమసిద్ధికిఁ దిక్కరాజు, నల్లసిద్ధి, ...డు (పేరున్న భాగము శిథిలమైనది.) అను మువ్వురు కుమారులు. ...క్కరాజును ఇమ్మడి తిక్కరాజనియు, ఇమ్మడి తిరుకాలత్తి దేవుఁడనియు బిలచెదరు. ఈతని శాసనమొకటి శా. శ. ౧౨౧౧ (సె. శా. సం. పుట ౪౧౭) లోఁ గన్పడుచున్నది. మనుమసిద్ధి రెండవ కుమారుఁడైన నల్లసిద్ధి కైదుగురు కుమారులు. ఇందుఁ బెద్దవాఁడైన మనుమగండగోపాలుఁడే శాసనదాత. మనుమగండ గోపాలనామధారులు పెక్కురున్నారు (నెల్లూరు శాసనసంపుటమును జూడుఁడు.) కాని వారికిని నితనికిని సంబంధము లేదు. ఈమనుమగండగోపాలుఁడు కాకతీయ ద్వితీయ ప్రతాపరుద్రునకు సామంతుఁడై కొట్యదోన (కొణిదెన) ప్రాంతమునకుఁ బరిపాలకుఁడైనట్లీ శాసనమువలనఁ దెలియుచున్నది. ఈశాసనము నందలి బిరుదములు వంశానుగతముగా వచ్చినవి.

తెలుగుబల్లి మనుమసిద్ధరసు పేరునఁ గొన్ని శాసనములు శా. శ. ౧౧౬౯-౧౧౮౧ సంవత్సరములలో నున్నవి. కాని యవియెల్లను, తిక్క.

రాజు కొడుకగు మనుమసిద్ధి కాఁడు. మొత్తముమీఁద నీనెల్లూరు చోడుల చరిత్రమును, శాసనవాఙ్మయములను సమన్వయము చేయుచు వ్రాయవలసిన యావశ్యక మెంతేని కలదు. అందులకిది స్థానము కాదు. ఇదివఱకే ప్రసక్తానుప్రసక్తిగఁ గొంత గ్రంథము వ్రాసి తిక్కన చారిత్రమును పెంచవలసివచ్చినది. ఇంతకంటె నధికముగ వ్రాయుట యప్రస్తుత మగునని యెంచి తిక్కనసోమయాజి చరిత్రమును ముగించుచున్నాఁడను.